

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 340

బుధవారం 23-8-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ప్రజ్ఞానంద-కార్ల్‌సన్ గేమ్ 'డ్రా'

ప్రపంచకప్ ఫైనల్లో వరల్డ్‌నంబర్‌వన్‌ను నిలువరించిన భారత జీఎం -12లో



దేశీయంగా కార్ల క్రాష్ టెస్టింగ్

భారత్ ఎన్‌క్యాప్ ప్రోగ్రామ్ ఆవిష్కరణ అక్టోబర్ 1 నుంచి అమలులోకి.. -13లో



ప్రపంచానికి 'గ్రోత్ ఇంజిన్' భారత్

రాబోయే రోజుల్లో ప్రపంచానికి భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మారబోతుందని 'బ్రిక్స్' సమావేశంలో ప్రధాని మోదీ అన్నారు.


వివరాలు 6లో ▸



'పసిఫిక్'లో 'అణు' అలజడి

ఫ్యుకుషిమా అణు రియాక్టర్ నుంచి వ్యర్థ జలాలను సముద్రంలోకి విడుదల చేయడానికి జపాన్ సన్నాహాలు చేస్తోంది.

వివరాలు 6లో ▸



అత్యధిక రేటుకి ఉల్లిని కొంటాం

ఉల్లి కొనుగోలుకు కేంద్రం హామీనిచ్చింది. మరోవక్క ఉల్లి తినకుంటే నష్టమేమీ లేదని మహారాష్ట్ర మంత్రి దాదా భూసే అన్నారు.

వివరాలు 6లో ▸



సింగపూర్ అధ్యక్ష అభ్యర్థిగా..

వచ్చే నెల 1న జరగనున్న సింగపూర్ అధ్యక్ష ఎన్నికల్లో భారత సంతతికి చెందిన షణ్ముగరత్నం పోటీ పడుతున్నారు.

వివరాలు 6లో ▸

మేమూ 'మార్గదర్శి'లో చేరాం..

మోసపోయాం!

సీఐడీ వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదుల వెల్లువ

3 రోజుల్లో ఏకంగా 300 మంది చందాదారులు ఫిర్యాదు

చందాదారుల సొమ్మును సొంత పెట్టుబడిగా మార్చుకున్న రామోజీ

- అక్రమాలు బయటపడటంతో కొత్త చిట్టీలకు ముందుకురాని చందాదారులు
- రొటేషన్ దందాకు చెక్ పడటంతో దివాళా అంచున 'మార్గదర్శి'
- తమకు తెలియకుండా చందాదారుడిగా చేర్చడంపై బాధితుడి భార్య ఫిర్యాదు
- చీరాల బ్రాంచి మేనేజర్ అరెస్టు.. 14 రోజులు రిమాండ్ విధించిన కోర్టు
- చందాదారుల ఫిర్యాదులపై కార్యాచరణను ఉధృతం చేసిన సీఐడీ
- ఫిర్యాదుల కోసం వాట్సాప్ నంబర్ 94931 74065 అందుబాటులోకి



సాక్షి, అమరావతి: ''నేనూ మార్గదర్శిలో చేరా... ఓ మోపెడ్ కొనుక్కున్నా!.. ఓ ఇంటి వాడినయ్యా..!!'' ఇలాంటి ప్రకటనలను నమ్మిన వేలాది మంది మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ చందాదారులు నిండా మునిగిపోయారు! ప్రతి నెలా కష్టార్జితం నుంచి పొదుపు చేసి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చిట్టీలు కడితే దారుణంగా మోసపోయామని ఆక్రోశిస్తున్నారు. చందాదారుల సొమ్మును తన కుటుంబ సభ్యుల సంస్థల్లో పెట్టుబడులుగా మళ్లించేసిన రామోజీ రావు తాపీగా కూర్చోగా చందాదారులు మాత్రం మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. కొందరి నుంచి ఆస్తి పత్రాలు, ఎల్‌ఐసీ బాండ్లు తీసుకుని కూడా డబ్బులివ్వకుండా వేధిస్తున్నారు... మరికొందరు చిట్టీలు పాడినా పాట మొత్తం (ప్రైజ్ మనీ) ఇవ్వకుండా నెలల తరబడి తిప్పుతున్నారు.. ఇంకొందరి సంతకాలను ఫోర్జరీ చేసి మరొకరికి ష్యూరిటీగా చూపిస్తూ చిట్టీ మొత్తం ఇవ్వకుండా వేధిస్తున్నారు. చిట్టీ వాయిదా ఒక్క రోజు ఆలస్యమైనా రూ.500 జరిమానా వసూలు చేస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ తాము చెల్లించాల్సిన చిట్టీ పాట మొత్తాన్ని నెలల తరబడి జాప్యం చేస్తున్నా ఒక్క రూపాయి కూడా వడ్డీ చెల్లించడం లేదు.. ఇలా వేలాదిమంది

మిగతా 10వ పేజీలో ▶



చంద్రయాన్-3 ల్యాండర్ జాబిల్లిపై దిగనున్న సందర్భాన్ని పురస్కరించుకుని చెన్నైలోని ఓ స్కూలు విద్యార్థుల ప్రదర్శన

చందమామను ముద్దాడే క్షణం కోసం

చంద్రయాన్-3 ప్రయోగంలో కీలక ఘట్టం నేడే

జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టనున్న ల్యాండర్ మాడ్యూల్

సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడి ఉపరితలంపై ల్యాండింగ్


'జయహో భారత్.. జయహో ఇస్రో' అంటూ నినదిస్తున్న యువత

ప్రతిష్ఠాత్మక చంద్రయాన్–3 మిషన్‌లో భాగమైన ల్యాండర్ మాడ్యూల్ తన తుది గమ్యాన్ని నేడు ముద్దాడనుంది. చంద్రుడి దక్షిణధ్రువ ఉపరితలంపై ల్యాండర్ మాడ్యూల్ అడుగు పెట్టనుంది. బుధవారం సాయంత్రం 5.27కి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. సరిగ్గా 6.04కి జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్‌ను సురక్షితంగా దించడానికి ఇస్రో సైంటిస్టులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ ఘట్టాన్ని సాయంత్రం 5.20 నుంచే ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చు. ఈ అద్భుత దృశ్యాల కోసం దేశ ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

- వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్

అవాస్తవాలతో రామోజీ 'ప్రసవ వేదన'



- పీహెచ్‌సీల్లో నెలకు 15 శాతం వరకు ప్రసవాలు జరుగుతుంటే 2.5 శాతం అని తప్పుడు రాతలేల?
- కేంద్రమే రాష్ట్రంలో వంద శాతం పీహెచ్‌సీలు 24 గంటలు పనిచేస్తున్నాయని ప్రశంసించినా పట్టదా?
- ప్రతి పీహెచ్‌సీలో 14 మంది వైద్యులు, వైద్య సిబ్బంది పనిచేస్తున్న విషయం మరిచారా?
- గర్భిణులకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది కనిపించడం లేదా?
- మాతృ మరణాలు పూర్తిగా తగ్గిపోయింది వాస్తవం కాదా?
- 'ఈనాడు' విష కథనంపై వాస్తవాలు ఇవిగో..

3 లో

క్లాప్‌మిత్రల వేతన బకాయిలు చెల్లింపు

- చెల్లింపులు జరిగే సమయంలో ఈనాడు దుష్ప్రచారం
- ఇకపై గ్రామ పంచాయతీల నిధుల నుంచే చెల్లింపులు

- వివరాలు 5లో ▸

'అమూల్'.. ఆర్గానిక్



రైతన్నల ప్రకృతి, సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెటింగ్

ప్రాసెస్డ్ శనగలు, రాజ్మా, అపరాలు మార్కెట్‌లోకి

దేశంలో తొలిసారిగా త్వరలో ఏపీలో..

నేడు ఉన్నతాధికారులతో అమూల్ బృందం భేటీ

ప్రకృతి సాగు రైతులకు గిట్టుబాటు ధరలే ప్రభుత్వ లక్ష్యం

సాక్షి, అమరావతి: జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న అమూల్ సంస్థ తాజాగా రైతన్నలు పండించే ప్రకృతి, సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ముందుకొచ్చింది. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయం చేసే రైతులకు చేయూత అందించేందుకు సిద్ధమైంది. దీనికి సంబంధించి విధివిధానాల రూపకల్పనపై వ్యవసాయ, ఉద్యాన, రైతు సాధికారత సంస్థ అధికారులతో అమూల్ ప్రతినిధులు బుధవారం సమావేశం కానున్నారు.

విస్తృత మార్కెటింగ్

రాష్ట్రంలో ప్రస్తుతం 8.82 లక్షల ఎకరాల్లో 8 లక్షల మంది రైతులు ప్రకృతి సాగు చేస్తున్నారు. కొద్ది మంది రైతులు మాత్రమే నేరుగా తమ ఉత్పత్తులను విక్రయించుకోగలుగుతున్నారు. మధ్యవర్తులను ఆశ్రయించి నష్టపోతున్న రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పెద్దఎత్తున మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తోంది. రైతుబజార్లలో ప్రత్యేకంగా స్టాల్స్ కేటాయించడంతోపాటు కలెక్టరేట్ ప్రాంగణాలు..

మిగతా 3వ పేజీలో ▶

కర్నూలులో జ్యుడీషియల్ సిటీ

- వచ్చే నెలలో నేషనల్ లా యూనివర్సిటీకి సీఎం జగన్ చేతుల మీదుగా శంకుస్థాపనకు ఏర్పాట్లు
- అక్కడే హైకోర్టు, జ్యుడీషియల్ విభాగాలు, ట్రిబ్యునళ్ల కార్యాలయాలు
- కర్నూలులో హరిత భవన్ ప్రారంభోత్సవంలో మంత్రి బుగ్గన



హరిత భవన్ ప్రారంభోత్సవంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలులోని జగన్నాథగట్టులో 250 ఎకరాలలో ప్రభుత్వం జ్యుడీషియల్ సిటీ నిర్మించనుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. కర్నూలులో రూ.17 కోట్లతో నిర్మించిన హరిత భవన్‌ను మంత్రి బుగ్గన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యుడీషియల్ సిటీలో హైకోర్టుతో పాటు నేషనల్ లా యూనివర్సిటీ, జ్యుడీషియల్ అకాడమీ, వివిధ ట్రిబ్యునళ్లకు సంబంధించిన కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వచ్చే నెలలో నేషనల్ లా యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం జగన్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించేందుకు

మిగతా 3వ పేజీలో ▶

రిపబ్లికన్ రేస్ షురూ

- 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటాపోటీ
- బరిలో ట్రంప్‌తో పాటు ఎనిమిది మంది

- వివరాలు 6లో ▸

ఐదెకరాల్లో గంజాయి పంట ధ్వంసం

- అల్లూరి సీతారామరాజు జిల్లా గాదిగుంటలో అక్రమంగా సాగు
- ముగ్గురు వ్యక్తుల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- అనకాపల్లి మండలం కొత్తూరులో 280 కేజీల గంజాయి స్వాధీనం



గాదిగుంట గ్రామం వద్ద గంజాయి తోటలను దహనం చేస్తున్న పోలీస్ సిబ్బంది

జి.మాడుగుల (అల్లూరి సీతారామరాజు జిల్లా)/ అనకాపల్లి టౌన్: గంజాయి సాగు, రవాణా, విక్రయాలపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలంలోని నుర్మతి పంచాయతీ గాదిగుంట గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా సాగు చేస్తున్న ఐదు ఎకరాల్లోని గంజాయి పంటను ఎస్‌ఐ శ్రీనివాస్‌తో కూడిన బృందం మంగళవారం గుర్తించింది. గ్రామస్తుల సహకారంతో గంజాయి మొక్కలను ఒక చోటకు చేర్చి తగులబెట్టారు. పారిపోతున్న ముగ్గురు వ్యక్తులను వెంబడించి

మిగతా 3వ పేజీలో ▶

అధికారంలోకి వద్దాం..

వారిద్దరినీ చంపేద్దాం



10 లో

- 'వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తాం.. ఆ వెంటనే కొడాలి నాని, వంశీని చంపేద్దాం' అంటూ యువగళం సభలో టీడీపీ నేతలు రెచ్చిపోయారు. తన తల్లిని అవమానించిన వారి సంగతి తేలుస్తా అంటూ లోకేశ్ బెదిరింపులకు దిగారు.

లోకేశ్‌తో నాకు ప్రాణహాని



10 లో

- 'టీడీపీ నేత నారా లోకేశ్ నుంచి నాకు ప్రాణహాని ఉంది. నాపై పరువు నష్టం దావా అందుకే వేశారు. మంగళగిరి కోర్టుకు వెళ్లి వచ్చే సమయంలో హత మార్చాలని కుట్ర పన్నారు' అని ఏపీ చలనచిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి ఆరోపించారు.

అవును..

సీఎం జగన్ మహిళా పక్షపాతే

అబద్ధపు రాతల 'పచ్చ'వాతం జబ్బు ఈనాడుదే!!

- రుణాలు చెల్లిస్తానని డ్వాక్రా మహిళలను మోసం చేసింది చంద్రబాబే
- పొదుపు సంఘాల సున్నా వడ్డీ పథకానికీ మంగళం పాడిందీ ఆయనే
- బాబు చేతిలో రెండు విధాలుగా వంచనకు గురైన మహిళలు
- వారిపై 2019 ఎన్నికలనాటికి రూ. 25,571 కోట్ల భారం
- చంద్రబాబు చేతిలో మోసపోయిన మహిళలకు జగన్ ప్రభుత్వంలో చేయూత

ఫ్యాక్ట్ చెక్

- అధికారంలోకి వచ్చిన వెంటనే సున్నా వడ్డీ పథకాన్ని పునరుద్ధరించిన సీఎం జగన్
- ఇచ్చిన హామీ మేరకు మహిళలపై ఉన్న రుణాల భారాన్ని చెల్లిస్తున్న జగన్ సర్కారు
- ఇప్పటికే మూడు విడతలుగా రూ.19,178 కోట్లు చెల్లింపు

14 లో

ఇదండీ సంగతి



... నేను సీఎంగా ఉన్నందుకు అనుకున్నాను సార్!

క్లుప్తంగా...

మెయిల్ సర్వీస్‌లో పార్శిల్ బుకింగ్ సౌకర్యం

నేడు గొల్లపూడిలో ప్రత్యేక పార్శిల్ బుకింగ్ కౌంటర్ ప్రారంభం

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): ఇప్పటి వరకు పోస్టాఫీసుల్లో మాత్రమే జరుగుతున్న పార్శిల్ బుకింగ్ సౌకర్యాన్ని ఇక నుంచి రైల్వే మెయిల్ సర్వీస్(ఆర్ఎంఎస్)ల్లో కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రైల్వే మెయిల్ సర్వీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్శిల్ బుకింగ్ కోసం 2019లో గొల్లపూడిలో పార్శిల్ హబ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పోస్టాఫీసుల్లో బుక్ అయిన పార్శిల్స్ అన్నీ ఇక్కడి నుంచే దేశంలోని వివిధ ప్రాంతాలకు పంపడం జరుగుతుందని తెలిపారు. బుధవారం గొల్లపూడిలో ప్రత్యేక పార్శిల్ బుకింగ్ కౌంటర్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వ్యాపారులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ప్రముఖ చిత్రకారుడు సూర్యనారాయణ మృతి



దాబాగార్డెన్స్ (విశాఖపట్నం): చిత్రకారుడిగా, రచయితగా, రేడియో డబ్బింగ్ ఆర్టిస్టుగా పలు రంగాల్లో పేరుగాంచిన గొండేల సూర్యనారాయణ(72) సోమవారం అర్ధరాత్రి విశాఖపట్నం రామ్‌నగర్‌లోని తన నివాసంలో గుండెపోటుతో కన్నుమూశారు. విశాఖ పెయింటింగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆయన చిత్రకారుల సంక్షేమానికి కృషి చేశారు. ఆకాశవాణి ద్వారా నాటకాలు, పద్యాలు, సూక్తి ముక్తావళి, ఏకపాత్రాభినయం వంటి కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. జాషువా అవార్డు, డాక్టర్ సినారే స్మారక పురస్కారం అందుకున్నారు. ఆయనకు భార్య అరుణ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం కాన్వెంట్ జంక్షన్‌లోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

నేటినుంచి గిడుగు జయంతి వారోత్సవాలు

అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



సాక్షి, అమరావతి: తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి 160వ జయంతిని పురస్కరించుకుని వారంపాటు తెలుగు భాషా దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఏపీ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి.విజయబాబు తెలిపారు. మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 23నుంచి 29వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తెలుగు వికాస కార్యక్రమాలు చేపడతామన్నారు. సాహితీ వేత్తలను, భాషా సేవకులను, భాషా వారసత్వాన్ని పరిపుష్టం చేసేందుకు కృషిచేస్తున్న వారిని గుర్తించి సముచిత స్థాయిలో సత్కరిస్తామన్నారు. అధికార భాషా సంఘం సభ్యులు ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అక్రమాలపై చర్యలు

ద్రవిడియన్ వర్సిటీ వీసీకి నోటీసులు

సాక్షి, అమరావతి: ద్రవిడియన్ వర్సిటీలో ఎంఫిల్, పీహెచ్‌డీ అక్రమాలపై చర్యలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు మంగళవారం వీసీ తుమ్మల రామకృష్ణకు నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లో ఎందుకు వీసీ పదవి నుంచి తొలగించకూడదో సమాధానం ఇవ్వాలని, లేకుంటే యూజీసీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

వార్షిక కౌలు చెల్లించేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో అమరావతి రైతుల పిటిషన్

సాక్షి, అమరావతి: రాజధాని కోసం భూములిచ్చిన తమకు చట్టప్రకారం వార్షిక కౌలు చెల్లించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్‌డీఏలపై ఉందని, ఆ మేరకు చెల్లింపులు చేసేలా వాటిని ఆదేశించాలంటూ అమరావతి రైతు సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. ఏటా మే 1లోపు రైతులకు వార్షిక కౌలు చెల్లించాల్సి ఉన్నా ఇప్పటివరకు చెల్లించలేదని తెలిపారు. కోర్టుకొచ్చిన వారికే పరిహారం ఇస్తోందన్నారు. సీఆర్‌డీఏ తరఫు న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వార్షిక కౌలు చెల్లింపులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అయినా కూడా ఆయనను ప్రతివాదిగా చేర్చారన్నారు. కౌలుతో పాటు వడ్డీ కూడా చెల్లించాలని పిటిషనర్లు కోరుతున్నారని, వడ్డీ చెల్లించాలని చట్టంలో ఎక్కడా లేదన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేస్తామని, అప్పటి వరకు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని కోర్టును కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, సీఆర్‌డీఏ కమిషనర్, గుంటూరు జిల్లా కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ చేశారు. కౌంటర్లు దాఖలు చేయాలంటూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

లక్ష్యానికి చేరువలో..

- ‘నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు’ నిర్మాణం మరింత వేగవంతం
- ఈ నెలలో 5 లక్షల ఇళ్లు నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యం
- ఇప్పటివరకూ 4.82 లక్షల నిర్మాణాలు పూర్తి
- పూర్తయిన వాటికి చకచకా మౌలిక సదుపాయాల కల్పన



జగనన్న కాలనీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నెలలో 5 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకోగా.. ఇప్పటివరకూ 4.82 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణం ఈ నెలాఖరులోగా పూర్తి కానుంది.

రాష్ట్రంలో ఇళ్లులేని నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ‘నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు’ పథకం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద 31 లక్షలకు పైగా పేదింటి అక్కచెల్లెమ్మలకు పట్టాలు అందించారు. రెండు దశల్లో 21.25 లక్షలకు పైగా (టిడ్కో ఇళ్లతో కలిపి) గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇందులో 18.63 లక్షలు సాధారణ ఇళ్లు. వీటిలో 5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని ఈ నెలలో పూర్తిచేయాల్సి ఉంది. రికార్డు స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు చేస్తూనే, మౌలిక సదుపాయాలు కూడా చకచకా కల్పిస్తున్నారు. పూర్తయిన ఇళ్లకు కరెంటు, మంచి నీటి కనెక్షన్లు ఇస్తున్నారు.

అన్ని విధాలా అండగా..

నిజానికి.. మనిషి కనీస అవసరాల్లో ఒకటైన పక్కా ఇంటిని పేదలకు సమకూర్చడానికి సీఎం జగన్ ప్రభుత్వం అన్ని విధాలుగా వారికి అండగా నిలిచింది. ప్రాంతాన్ని బట్టి రూ.15 లక్షల వరకు విలువైన స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేసింది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇవ్వడంతో పాటు పావలా వడ్డీకి రూ.35 వేల బ్యాంకు రుణం సమకూరుస్తోంది. అంతేకాక.. ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తోంది. మిగిలిన ఐరన్, సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రిని మార్కెట్ ధరలకన్నా తక్కువకు సరఫరా చేయడం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి రూ.54,518 మేర అదనపు సాయం చేస్తోంది. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో మార్కెట్‌లో తక్కువ ధరకు నిర్మాణ సామగ్రిని సరఫరా చేసే కంపెనీలను ఎంపిక చేసి ప్రభుత్వం పేదలకు ఈ వస్తువులు సమకూరుస్తోంది.

సెంటు స్థలంలో అందంగా ఇళ్లు



నా భర్త ప్రైవేట్ ఉద్యోగి. గతంలో రూ.4వేలు పెట్టి అద్దె ఇంట్లో ఉండే వాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక స్థలం, ఇల్లు మంజూరు చేశారు. సెంటు స్థలంలో పేదలకు ఇల్లా అని విమర్శిస్తున్నారు. సెంటు స్థలంలోనే మా అభిరుచికి తగ్గట్లుగా మేం ఇంటిని అందంగా నిర్మించుకున్నాం. హాల్, కిచెన్, బెడ్‌రూమ్, వరండా ఇలా అన్ని వసతులున్నాయి. ప్రభుత్వం ఉచితంగా స్థలం, నిర్మాణానికి బిల్లులు ఇవ్వకుంటే మేం సొంతంగా ఇంటిని సమకూర్చుకోవడం కుదిరేది కాదు.

– జ్యోతి, సామర్లకోట, కాకినాడ జిల్లా

సొంతింటి కల నెరవేరింది



నా భర్త ఆటో డ్రైవర్. ఆయన సంపాదన ఇంటి అద్దె, ఇతర కుటుంబ అవసరాలకు సరిపోయేది. దీంతో సొంతిల్లు కలగానే మిగిలిపోయింది. ఇల్లు కట్టుకుందామంటే అంత స్తోమత మాకులేదు. ప్రభుత్వం ఇళ్ల పథకం ప్రవేశపెట్టిందని దరఖాస్తు చేశాం. స్థలం, ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం కూడా పూర్తయింది. ప్రస్తుతం సొంతింటిలో సంతోషంగా ఉంటున్నాం. సీఎం జగన్ దశాబ్దాల మా కలను నెరవేర్చారు.

– షేక్ మహబూబ్ బీ, వినుకొండ, పల్నాడు జిల్లా

మరింత వేగంగా నిర్మాణాలు



ఇళ్ల నిర్మాణాల్లో మరింత వేగం పెంచుతున్నాం. ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యాన్ని ఈ నెలలో ఛేదిస్తాం. వచ్చే డిసెంబర్ నెలాఖరు లోగా మరో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపులతో పాటు, నిర్మాణ సామగ్రిని సమకూరుస్తున్నాం.

– లక్ష్మీషా, ఎండీ, గృహ నిర్మాణ సంస్థ

అత్యంత బలహీన గిరిజన సమూహాల అభివృద్ధికి ఆరు సూత్రాలు

- సురక్షిత గృహాలు
- పరిశుభ్రమైన తాగునీరు, పారిశుధ్యం
- విద్యకు ప్రాధాన్యత
- ఆరోగ్యం, పోషకాహారం
- రోడ్లు, టెలికాం కనెక్టివిటీ
- స్థిరమైన జీవనోపాధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అత్యంత బలహీన గిరిజన సమూహాలు (పీవీటీజీ) అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వారి సంక్షేమానికి ఆరు ప్రధాన సూత్రాలను అమలు చేస్తోంది. ఇందుకోసం ప్రాథమికంగా సర్వే నిర్వహించి రాష్ట్రంలో 12 తెగల పీవీటీజీలను గుర్తించింది. ఈ 12 తెగల్లో 2,99,516 మంది ఉన్నట్టు నిర్ధారించింది. ఈ క్రమంలో 3,367 గిరిజన గ్రామాల్లో పీవీటీజీలకు చెందిన లక్షా 528 నివాసాలకు ప్రధాన వసతులు ఏ మేరకు ఉన్నాయి? ఇంకా ఏం చేయాలి? అనే కోణంలో ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా వారికి సురక్షిత గృహాలు, పరిశుభ్రమైన తాగునీరుతోపాటు పారిశుధ్య నిర్వహణ, విద్యకు ప్రాధాన్యత, ఆరోగ్యంతోపాటు పోషకాహారం, రహదారులతోపాటు టెలిఫోన్ అనుసంధానత, స్థిరమైన జీవనోపాధి వంటి ఆరు అంశాలకు ప్రాధాన్యత ఇస్తోంది. కాగా, అత్యంత బలహీన గిరిజన సమూహాల అభివృద్ధికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అనేక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.20,948.15 కోట్లు ఎస్టీ కాంపోనెంట్ నిధులను ఖర్చు చేసింది. అలాగే అన్ని నవరత్న పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను వారికి అందిస్తోంది. వీటికితోడు కేంద్ర ప్రభుత్వం కూడా పీవీటీజీల కోసం ‘పీఎం పీవీటీజీ డెవలప్‌మెంట్ మిషన్’ పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో వారి అభివృద్ధికి మరింత ఊతమిచ్చినట్టు అయ్యింది.

కేంద్ర సర్వేలో రాష్ట్రంలో గుర్తించిన పీవీటీజీలు..

గిరిజన తెగ	గ్రామాలు	గృహాలు	పీవీటీజీ జనాభా
బోడో గదబ	167	3,645	9,750
బొండో పొర్జ	38	177	588
చెంచు	200	9,036	25,095
డొంగ్రియా ఖోండ్	266	6,801	23,794
గుతుబ్ గదబ	206	4,835	11,697
ఖోండ్‌పొర్జ	33	5,472	17,081
కొలం	3	4	6
కొండరెడ్డి	711	29,451	78,387
కొండ సవర	720	17,915	54,094
కుట్టి ఖోండ్	702	16,459	57,314
పరంగి పొర్జ	319	6,730	21,705
తోటి	2	3	5

పీవీటీజీల అభివృద్ధికి ప్రాధాన్యం..



రాష్ట్రంలో పీవీటీజీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. తాజాగా ఈ వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ‘పీఎం పీవీటీజీ డెవలప్‌మెంట్ మిషన్’ పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. దీని అమలు కోసం పీవీటీజీల స్థితిగతులపై సర్వే నిర్వహించి వారికి ఉన్న ప్రాథమిక సౌకర్యాలు, నివాసాల వివరాలు సేకరించాం. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన ‘బిసాగ్–ఎన్’ మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు అధికారులు వివరాలు నమోదు చేస్తారు. యాప్ వినియోగంపై శిక్షణ కూడా ఇస్తాం. – పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి

భవిష్యత్తు విభజనలపై మార్గదర్శకాలు మాత్రమే ఇవ్వగలం

ఏపీ విభజనపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన విషయంలో రాజకీయపరమైన అంశంలో తామెందుకు జోక్యం చేసుకోవాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. భవిష్యత్తులో జరిగే రాష్ట్రాల విభజనలపై మార్గదర్శకాలు మాత్రమే ఇవ్వగలమని స్పష్టం చేసింది. ఏపీ విభజనకు సంబంధించి దాఖలైన పిటిషన్లలో రాజ్యాంగపరమైన అంశాలు ఇమిడి ఉన్నాయని తెలిపింది. రాజ్యాంగ ధర్మాసనం ముందు విచారణలో ఉన్న ఈ అంశాలు ముందుగా తేలాల్సి ఉందని పేర్కొంది. విభజన జరిగి తొమ్మిదేళ్లయిందని, పిటిషన్లకు సంబంధించి ఇంకేం మను గడలో ఉందని ప్రశ్నించింది. ఆంధ్రప్రదేశ్ విభజనపై పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితరులు దాఖలు చేసిన 26 పిటిషన్లపై జస్టిస్ ఎస్.రవీంద్రభట్, జస్టిస్ అరవిందకుమార్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రు ద్రరాజుల తరఫు సీని యర్ న్యాయవాది ని రూప్‌రెడ్డి, న్యాయ వాది శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించారు. 2014లో జరిగిన రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా జరిగిందన్నారు. తెలంగాణకు చెందిన పోలవరం ముంపు మండలాలు ఏపీలో కలపడం సరికాదని, విభజన హామీలు అమలు చేయాలని అన్నారు. అనంతరం పిటిషనర్ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఆర్టికల్ 100 ప్రకారం విభజన జరగలేదని అన్నారు. పార్లమెంటులో నిబంధనలు పాటించకుండానే విభజన ప్రక్రియ పూర్తిచేశారన్నారు. ఇందుకు తానే ప్రత్యక్ష సాక్షినని తెలిపారు. తొలుత దాఖలు చేసిన పిటిషన్‌లో తమ అభ్యర్థన మార్చుకున్నామని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. విభజన తర్వాత నష్టపోయిన ఏపీకి కేంద్రం సాయం అవసరముందని చెప్పారు. పార్లమెంటు వేదికగా ఇచ్చిన హామీలు కేంద్రం అమలు చేసేలా చూడాలని కోరారు. ఈ విషయంలో రాజ్యాంగ ధ ర్మాసనం వద్ద ఉన్న అంశాలు తేలిన తర్వాతే నిర్ణ యం తీసుకోగలమని, అప్పటివరకూ వేచి చూడా ల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. ఏపీ ప్రభుత్వం తరఫున ఏఓఆర్ మెహఫూజ్ నజ్కీ హాజరయ్యారు.

వ్యవసాయ రంగంలో గణనీయమైన వృద్ధి

చంద్రబాబు, కరువు కవల పిల్లలు.. వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి



మదనపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం వ్యవసాయ రంగం గణనీయమైన వృద్ధి రేటును సాధించిందని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని రెండో టమాటా మార్కెట్ యార్డును మంగళవారం సందర్శించి.. అభివృద్ధి పనులకు సంబంధించిన భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో వ్యవసాయ రంగంలో వృద్ధి 6.5 శాతం నమోదై 27వ స్థానంలో ఉంటే.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 8.2 శాతంతో 6వ స్థానానికి ఎగబాకిందన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలని.. కరువుకు సూచికగా టీడీపీ పాలనను రైతులు పేర్కొంటారని చెప్పారు. టీడీపీ ఉనికి కోల్పోయిన శవమని, దాని పాడె మోసేందుకు నలుగురు వ్యక్తులు చంద్రబాబు, అచ్చెన్నాయుడు, లోకేశ్, పవన్‌కళ్యాణ్ అని వ్యాఖ్యానించారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలు, దళారీ వ్యవస్థ లేకుండా పారదర్శకంగా అమలవుతున్న సంక్షేమ పథకాల వల్ల 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తారన్నారు. ఐక్యరాజ్య సమితి ప్రపంచంలో ఫుడ్, అగ్రికల్చర్ కేటగిరిలో ప్రకటించే ఏకైక చాంపియన్ అవార్డుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు భరోసా కేంద్రం ఎంపికవడం గర్వకారణమన్నారు.

ట్రాన్స్‌జెండర్ వేధింపులు తట్టుకోలేక యువకుడి బలవన్మరణం

గూడూరు: ట్రాన్స్‌జెండర్ వేధింపులు తట్టుకోలేక ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భూపతిపేట శివారు కోమటిపల్లిలో మంగళవారం వెలుగు చూసింది. కోమటిపల్లికి చెందిన ధరావత్ శివరామ్(26) చెన్నరావుపేట మండలం జల్లి గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ కొర్ర ప్రవీణ్ అలియాస్ తాప్సితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకున్నారు. కొద్దికాలం తర్వాత మనస్పర్థలు రావడంతో నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకుని విడిపోయారు. అనంతరం కుటుంబసభ్యులు మరో అమ్మాయితో శివరామ్‌కు పెళ్లి కుదిర్చారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌జెండర్ తాప్సి తరచూ శివరామ్‌కు ఫోన్ చేస్తూ పెళ్లి ఎలా చేసుకుంటావని మానసికంగా వేధిస్తోంది. అమ్మాయి తరఫువాళ్లకు అసలు విషయం చెబుతానంటూ ఇబ్బంది పెడుతోంది. దీంతో మనోవేదనకు గురైన శివరామ్ సోమవారంరాత్రి ఇంట్లో పురుగులమందు తాగి పడిపోయాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే మానుకోట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.



తుపాకీ ‘గురి’ తప్పుతోంది!

దేశంలో ఆందోళన రేపుతున్న సాయుధ బలగాల బలవన్మరణాలు

దేశవ్యాప్తంగా 13 ఏళ్లలో 1,532 మంది ఆత్మహత్య

తెలంగాణలో పదుల సంఖ్యలో ప్రాణాలు తీసుకున్న పోలీసులు

మానసిక ఒత్తిడిలో ఆత్మహత్య.. లేదంటే కాల్పులకు తెగబడుతున్న వైనం

ఒకవైపు ఉద్యోగంలో ఒత్తిళ్లు... మరోవైపు వ్యక్తిగత సమస్యలు, కుటుంబ కలహాలు, ఇతర సమస్యలు. ఇవన్నీ ఖాకీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సాయుధ సిబ్బంది తీవ్ర మానసిక ఒత్తిడిలోకి జారిపోయి విచక్షణ కోల్పోతున్నారు. విధి నిర్వహణ కోసం ఇచ్చే ఆయుధంతో ఆ మానసిక స్థితిలో ఎదుటివారిని హతమార్చేలా విచక్షణ కోల్పోతున్నారు. లేదంటే తమను తాము కాల్చుకుని ఎంతో విలువైన జీవితాన్ని, కుటుంబాన్ని విషాదాంతం చేస్తున్నారు. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన ఖాకీలు ఇలా ఎందుకు చేస్తున్నారు?

సాక్షి, హైదరాబాద్

ఇటీవల జైపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైల్లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) కానిస్టేబుల్ చేతన్ సింగ్ విచక్షణారహితంగా కాల్పులకు తెగబడిన విష యం తెలిసిందే. తన మతిలేని చర్యతో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ టికారామ్‌తో సహా ముగ్గురు ప్రయాణికులు బలయ్యారు. వీరిలో హైదరాబాద్ బజార్‌ఘాట్‌కు చెందిన సయ్యద్ సైఫుద్దీన్ ఉన్నారు. సాయుధ అధికారిగా ప్రజలకు సేవలందించాల్సిన పోలీసులు ఇలా చేస్తుండటంపై పోలీసు వర్గాల్లో ఆందోళ వ్యక్తమవుతోంది. అసలు ఆ పరిస్థితులు ఎందుకు వస్తున్నాయి? వృత్తిపరమైన పని ఒత్తిడిని జయించేందుకు పోలీస్‌శాఖ అనుసరిస్తున్న వ్యూహాలు ఏంటి? తదితర అంశాలపై పోలీస్ ఉన్నతాధికారుల్లోనూ చర్చ జరుగుతోంది.

13 ఏళ్లలో 1,532 మంది..

- గత 13 ఏళ్లలో కేంద్ర సాయుధ బలగాలైన సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సశస్త్ర సీమాబల్, ఇండో టిబెటన్ సరిహద్దు పోలీస్, సీఐఎస్ఎఫ్, అస్సాం రైఫిల్స్, ఎన్ఎస్‌జీలకు చెందిన 1,532 మంది ఆత్మహత్య చేసుకున్నట్టు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. సాయుధ బలగాల్లో ఆత్మహత్యలపై లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఇటీవల ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. ఈ ఏడాది (2023)లోనూ జనవరి నుంచి జూలై నెలాఖరు వరకు 71 మంది సిబ్బంది ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. వీటిని నివారించేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తెలంగాణలో నమోదైన పోలీసు ఆత్మహత్యలు కొన్ని...


- జనగాం పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ గత ఏప్రిల్ 6న తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదే రోజు ఉదయం శ్రీనివాస్ భార్య స్వరూప బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇది తట్టుకోలేకే శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.
- 2016లో ఆదిలాబాద్ జిల్లా కెరిమెరిలో సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు.
- 2019లో హెడ్ కానిస్టేబుల్ డి.ప్రకాశ్ రెడ్డి తన పైఅధికారి సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణం పొందారు.
- 2020లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ రూపేషానంద్ కుటుంబ సమస్యల ఒత్తిడికి లోనై తన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు.
- 2020 నవంబర్‌లో సికింద్రాబాద్‌లో ఓ బ్యాంక్ వద్ద గార్డ్ డ్యూటీలో ఉన్న నల్లగొండ జిల్లాకు చెందిన ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ మధు తుపాకీతో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- 2017 జూన్‌లో సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అధికారుల వేధింపులే ఇందుకు కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

కేంద్ర టాస్క్‌ఫోర్స్ నివేదికలో ఏముంది?

- సాయుధ బలగాలు ఆత్మహత్యలు చేసుకోవడం లేదా తోటి సిబ్బందిపై కాల్పులు జరపడానికి కార ణాలు విశ్లేషించేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ గత జనవరిలో ఓ సమగ్ర నివేదికను సమర్పించింది. అందులో పేర్కొన్న ప్రధాన అంశాలు సర్వీ స్–వ ర్కింగ్ కండిషన్స్, వ్యక్తిగత, కుటుంబ కారణాలు సాయుధ పోలీసుల ఆత్మహత్యలకు, తోటి సిబ్బంది, ఇతరులపై కాల్పులు జరపడానికి కార ణమవు తున్నాయని తెలిపింది.

కేంద్ర టాస్క్ ఫోర్స్ నివేదికలో ఏముందంటే...

- సాయుధ బలగాలు ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు... పనిగంటలు పెరగడం, సరైన విశ్రాంతి లేకపోవడం, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారితో పోలిస్తే విధుల్లో సంతృప్తి లేకపోవడం, అన్నింటికి మించి సాంఘికంగా తమను దూరం పెడుతున్నారన్న భావన పెరగడం, కుటుంబ మద్దతు లేకపోవడం, సిబ్బంది ఇచ్చే ఫిర్యాదులను పరిష్కరించే సరైన యంత్రాంగం లేకపోవడం.



శిక్షణ నుంచే అలవాటు చేయాలి..

పోలీస్ ఉద్యోగం అంటేనే 24 గంటలూ విధుల్లో ఉండాలి. ఇప్పటితో పోలిస్తే గతంలోనే విపరీతమైన పని ఒత్తిడి ఉండేది. అప్పట్లో ఒకవైపు శాంతిభద్రతల సమస్యలు.. మరోవైపు నక్సల్ సమస్యలు ఉండేవి. ఇలా అనేక రకాల పరిస్థితుల్లో మేం ఉద్యోగానికి వచ్చిన తొలిరోజుల్లో పని చేశాం. కానీ కాలంతోపాటు ఆ పరిస్థితులు మారాయి. ఇప్పుడు కూడా పోలీస్ ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదే. అయితే ఆ పని ఒత్తిడి ఇటీవలే పెరిగింది కాదు. అయితే, పరిస్థితులను తట్టుకునేంతగా ఇప్పటి సిబ్బంది మానసికంగా దృఢంగా ఉండట్లేదన్నది నా అభిప్రాయం. శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచేలా ప్రత్యేక శిక్షణ అవసరం. మానసిక ఒత్తిడిని తట్టుకునేలా మనల్ని మనం సంసిద్ధం చేసుకోవాలన్నది ఉద్యోగంలో చేరిన మొదటి నుంచే అలవడేలా యువ అధికారులు, సిబ్బందిని తీర్చిదిద్దాలి. అప్పుడే ఆత్మహత్యలు జరగకుండా నివారించగల్గుతాం అని నా అభిప్రాయం.

– నారాయణ, రిటైర్డ్ ఎస్పీ

పోలీస్ సెన్సిటివిటీ ట్రైనింగ్ సైతం అవసరం



- తీరిక లేని ఉద్యోగంతో పని ఒత్తిడి పెరుగుతోంది. రోజువారీ విధుల్లోనూ అనేక రకాల పరిస్థితులను వారు చక్కబెట్టాల్సి ఉంటుంది. కాబట్టి పోలీసు అధికారులకు, సిబ్బందికి పోలీస్ సెన్సిటివిటీ ట్రైనింగ్ ఇవ్వడం ఎంతో ముఖ్యం. నేను తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీలో శిక్షణలో ఉన్న వారికి కొన్ని తరగతులు తీసుకున్నాను. శిక్షణ సమయంలో నేర్చుకున్న విషయాలను వారు ఉద్యోగంలోకి వచ్చాక ఆచరిస్తే మానసిక ఒత్తిడిని జయించవచ్చు. మానసికంగానూ దృఢంగా ఉంటే వృత్తిగత జీవితంతోపాటు వ్యక్తిగతంగానూ ఇబ్బందులు రాకుండా ఉంటాయి.

– డా.ప్రజ్ఞ రష్మి, సైకాలజిస్ట్

అవాస్తవాలతో రామోజీ 'ప్రసవ వేదన'

సాక్షి, అమరావతి: రామోజీరావుకు, ఆయన విష పత్రిక ఈనాడుకు ఒకటే ఏకసూత్ర ఎజెండా. తమకు నచ్చినవారిని నెత్తిన ఎక్కించుకోవడం.. నచ్చని వారిపై అదేపనిగా విషం కక్కడం. అందులోనూ పేద, బడుగు, బలహీనవర్గాల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రామోజీ కాలకూట విషం చిమ్ముతున్నారు. రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) నెలకు 15 శాతం వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. స్వయంగా కేంద్ర ఆరోగ్య శాఖ ఆంధ్రప్రదేశ్‌లో వంద శాతం పీహెచ్‌సీలు 24/7 పనిచేస్తున్నాయని ప్రశంసలు కురిపించింది. అయితే రామోజీకి ఇవేమీ కనిపించవు.. ఎందుకంటే ఆయన 'లెక్కలు' వేరే. ఆ లెక్కలు తన ముద్దుల చంద్రబాబుకు ఉపయోగపడాలి. అంతే.. ఇందుకోసం వాస్తవాలకు పాతరేసి అవాస్తవాలను అడ్డంగా ఈనాడులో అచ్చేస్తారు.. దుష్ప్రచారం చేయడంలో గోబెల్స్‌ను మించిపోతారు. ఇందులో భాగంగానే మంగళవారం ఈనాడులో 'ప్రసవ వేదన' అంటూ అవాస్తవాలు, అభూత కల్పనలతో ఒక కథనాన్ని వండివార్చారు. దీనికి సంబంధించి వాస్తవాలు ఇవిగో..

'ఈనాడు' విష కథనంపై వాస్తవాలు ఇవిగో..



చంద్రబాబు చరిత్ర ఇది..

- ఏనాడూ వైద్య సిబ్బంది కొరత లేకుండా భర్తీ చేయలేదు.
- ఒక్క వైద్య కళాశాలనూ నిర్మించలేదు.
- పైగా వైద్య పరీక్షలకోసం మెడాల్ లాంటి కుంభకోణాలకు పాల్పడ్డారు.
- ఆస్పత్రులను బాగు చేయాలన్న ఆలోచన ఏనాడూ చేయలేదు.
- ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని, దీనివల్ల మేలు జరుగుతుందన్న నమ్మకం ప్రజల్లో కల్పించలేదు.

13 నుంచి 15 శాతం ప్రసవాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు కలిపి 14 మందిని నియమించింది. దీంతో పీహెచ్‌సీల వైద్య సేవలు గతంలో కంటే ఇప్పుడు బాగా మెరుగయ్యాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక వైద్యుడు మాత్రమే అందుబాటులో ఉండేవారు. ఆ వైద్యుడు సెలవు పెట్టినా.. విధులకు గైర్హాజరయినా ఇక రోగులు చుక్కలు చూడాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పీహెచ్‌సీల్లో ప్రస్తుతం సగటున నెలకు 13 నుంచి 15 శాతం ప్రసవాలు నిర్వహిస్తున్నారు. 2021–22లో 12.98%, 2022–23లో 13.05% ప్రసవాలు జరిగాయి. వాస్తవాలు ఇలా ఉంటే రామోజీ మాత్రం పీహెచ్‌సీల్లో కేవలం 2.5% ప్రసవాలు మాత్రమే జరుగుతున్నాయని దుర్మార్గపు రాతలకు తెగబడ్డారు.

మాతృ మరణాల కట్టడే లక్ష్యంగా..

ప్రభుత్వం గర్భిణులు, బాలింతల ఆరోగ్య రక్షణకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే హైరిస్క్ గర్భిణులకు సురక్షిత ప్రసవాలు నిర్వహించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని గతేడాది డిసెంబర్ నుంచి అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పీహెచ్‌సీల వారీగా హైరిస్క్ గర్భిణులను ముందే గుర్తించి వారిని ప్రసవ తేదీకి ముందే పెద్దాస్పత్రులకు తరలించి సురక్షిత ప్రసవాలు చేపడుతున్నారు. ఇలా హైరిస్క్ గర్భిణులు 22,825, అధిక రక్తహీనత సమస్యతో బాధపడుతున్న 1,584 మందికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. చిన్న చిన్న సమస్యలకే పెద్దాస్పత్రులకు పీహెచ్‌సీల నుంచి గర్భిణులను రిఫర్ చేస్తున్నారని 'ఈనాడు' అవాస్తవాలను పేర్కొంది. వాస్తవానికి గర్భిణికి అధిక రక్తపోటు, మధుమేహం ఉండటం, బిడ్డ అడ్డం తిరగడం, బిడ్డ గుండె చప్పుడు అధికంగా/ తక్కువగా ఉన్న ఘటనల్లోనే పెద్దాస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇలా రిఫర్ చేసిన వారిని వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా పెద్దాస్పత్రులకు తరలిస్తున్నారు. సాధారణ ప్రసవాలు పెంచడానికి, మాతృ మరణాల నియంత్రణకు మిడ్ వైఫరీ శిక్షణను ప్రారంభించి 60 మంది స్టాఫ్ నర్సులకు 18 నెలల పాటు శిక్షణ ఇచ్చారు. అలాగే 4,388 మంది స్టాఫ్ నర్సులు, వైద్యులకు స్కిల్ బర్త్ అటెండెంట్, దక్షత శిక్షణ అందించారు. అదే విధంగా హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి సరైన వైద్యం అందించడానికి 17,110 స్టాఫ్ నర్సులు, 30 మంది వైద్యులకు శిక్షణ ఇచ్చి వీరి ద్వారా 6,095 సెషన్స్‌లో 1,56,099 గర్భిణులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇవన్నీ రామోజీకి పడితే ఒట్టు!

ప్రసవానంతరం బాలింతలకు ఆరోగ్య ఆసరా..

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ప్రసవానంతరం బాలింతలకు ఆరోగ్య ఆసరా కింద రూ.5 వేలు చొప్పున భృతి అందిస్తున్నారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ కింద రెండు స్కానింగ్, ఒక టిఫా స్కాన్‌ను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఇలా ప్రభుత్వం తీసుకున్న వివిధ చర్యల ఫలితంగా ప్రసూతి మరణాలు పూర్తిగా తగ్గిపోయాయి. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచడానికి గతేడాది 2,42,106 మంది బాలింతలకు రూ. వెయ్యి చొప్పున ప్రోత్సాహకాలను అధికారులు అందించారు. ప్రభుత్వం ఇలా ఎన్నో చేస్తున్నా రామోజీరావు విషపు రాతలు రాయడం తన ముద్దుల చంద్రబాబుకు ప్రయోజనం చేకూర్చడానికి కాదా?

2019 నుంచి వైద్య రంగం బలోపేతానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఇలా..

- నాలుగేళ్లలో ఏకంగా దాదాపు 53 వేలకు పైగా వైద్య పోస్టుల భర్తీ. ఎప్పటి ఖాళీలకు అప్పుడే యుద్ధప్రాతిపదికన నియామకం. ఇందుకోసమే ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఏర్పాటు.
- రూ.16,800 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు, వివిధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంతో పాటు నాడు-నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రుల బలోపేతం
- గ్రామాల్లో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు. 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులతో సొంత ఊళ్లలోనే ప్రజలకు వైద్య సేవలు
- దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు. నెలకు రెండుసార్లు గ్రామాలకు పీహెచ్‌సీ వైద్యులు.
- టీడీపీ హయాంలో నిర్వీర్యమైన ఆరోగ్యశ్రీ బలోపేతం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్లు 1,059 నుంచి ఏకంగా 3,257కి పెంపు. 40 లక్షల మందికి ఉచిత వైద్యం కోసం రూ.8 వేల కోట్ల వ్యయం. వైఎస్సార్ ఆరోగ్య ఆసరాతో విశ్రాంతి సమయంలో జీవన భృతి చెల్లింపు. ఇప్పటివరకూ 17.25 లక్షల మందికి రూ.1,074.69 కోట్లు అందించిన ప్రభుత్వం
- 108 (768 వాహనాలు), 104 (936) వాహనాలతో వైద్య సేవలు బలోపేతం. మరో 500 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలతో కలిపి మొత్తం 2,204 వాహనాలతో ప్రజలకు ఉచిత వైద్య సేవలు. ఇలా మరే ప్రభుత్వంలోనూ లేవు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 108 అంబులెన్స్‌లు 531 మాత్రమే ఉండగా ఇందులో 336 మాత్రమే మనుగడలో ఉండేవి.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీఎంపీ, డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలు కలిగిన మందులు ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు

క్షేమంగా తల్లీబిడ్డను ఇంటికి చేరుస్తున్న ప్రభుత్వం

ప్రసవానికి ముందు గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు అనేక చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం ప్రసవానంతరం కూడా వారిని క్షేమంగా ఇంటికి చేర్చడానికి అంతే శ్రద్ధ కనబరుస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవానంతరం వైఎస్సార్ తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో క్షేమంగా తల్లీబిడ్డను ఇంటికి చేరుస్తున్నారు. నాడు-నేడులో భాగంగా 279 తల్లీబిడ్డ వాహనాల స్థానంలో 500 వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఒక ట్రిప్పుకు ఇద్దరు బాలింతలను తరలిస్తుండగా ప్రస్తుతం ఒక ట్రిప్పుకు ఒక బాలింత, ఆమె సహాయకులను ఏసీ సదుపాయం ఉన్న వాహనంలో ఇంటి వరకూ తీసుకువెళ్లి సురక్షితంగా దింపుతున్నారు. దీంతో అప్పట్లో ఒక ట్రిప్పుకు కేవలం రూ.499 మాత్రమే ఖర్చు చేయగా.. ఈ ప్రభుత్వం హయాంలో ఒక ట్రిప్పుకు రూ.895 ఖర్చు చేస్తున్నారు.

కేంద్ర ఆరోగ్య శాఖ ప్రశంసలను కూడా పట్టించుకోరా?

దేశంలో 100% పీహెచ్‌సీలను 24/7 నడుపుతున్న కొద్ది రాష్ట్రాల్లో ఏపీ ఒకటి అని కేంద్ర ఆరోగ్య శాఖ తన నివేదికల్లో కొనియాడింది. ఇవేమీ తనకు పట్టవనుకున్న రామోజీ 24 గంటల సేవలు అంతంత మాత్రమేనని ఈనాడులో బురద రాతలకు దిగజారారు. 24/7 పీహెచ్‌సీలు పనిచేసేలా వైద్య, ఆరోగ్య శాఖ పర్యవేక్షణ కొనసాగిస్తోంది. ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు డాక్టర్‌లను ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లాలో పలు పీహెచ్‌సీల్లో వైద్యులు ఒక్క పూటకు పరిమితం అవుతున్నారని 'ఈనాడు' పేర్కొనడం హాస్యాస్పదం కాక మరేమిటి!

రాయలసీమలో 'స్వచ్ఛ ఇంధన' వెలుగులు

- ఏపీ జెన్‌కో, ఎన్‌హెచ్‌పీసీ సంయుక్త ప్రాజెక్టులకు నేడు ఎంవోయూ
- సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పత్రాలపై సంతకాలు
- నంద్యాల, అనంతపురం జిల్లాల్లో రెండు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల నిర్మాణానికి శ్రీకారం
- మరో మూడు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్ట్‌లకు నేడు సీఎం శంకుస్థాపన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్‌కో), కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) సంయుక్తంగా రాష్ట్రంలో నిర్మించే రెండు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు (పీఎస్పీ)లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో బుధవారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరగనుంది. ఏపీజెన్‌కో, ఎన్‌హెచ్‌పీసీ ప్రతినిధులు ఎంఓయూపై సంతకాలు చేయనున్నారు. నంద్యాల జిల్లాలోని యాగంటిలో 1,000 మెగావాట్లు, అనంతపురం జిల్లా కమలపాడులో 950 మెగావాట్లు కలిపి మొత్తం 1,950 మెగావాట్ల సామర్థ్యంతో పీఎస్పీలను నిర్మించేందుకు రెండు సంస్థలు అంగీకరించి, స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేయనున్నాయి. ఈ ఏడాది జూన్ 16న ఏపీ జెన్‌కో ఆమోదం తెలిపిన ఈ రెండు పీఎస్పీను సమాన భాగస్వామ్య (50:50) వాటాతో నిర్మించనున్నారు.

సీఎం పిలుపునందుకుని..

విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో సీఎం జగన్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర ఇంధన శాఖ, ఏపీజెన్‌కో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటుపై ప్రధానంగా దృష్టి సారించాయి. ఇందులో భాగంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో పది పీఎస్పీల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని నెడ్‌క్యాప్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏపీజెన్‌కో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. నంద్యాల జిల్లాలోని యాగంటిలో (1,000 మెగావాట్లు), అనంతపురం జిల్లాలోని కమలపాడులో (950 మెగావాట్లు), వైఎస్సార్ జిల్లాలోని అరవీటిపల్లిలో (1,320 మెగావాట్లు), అన్నమయ్య జిల్లాలోని గడికోటలో (800 మెగావాట్లు), వైఎస్సార్ జిల్లాలోని దీనేపల్లిలో (750 మెగావాట్లు) సామర్థ్యంతో పీఎస్పీల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని నెడ్‌క్యాప్‌ను ఏపీజెన్‌కో కోరింది. ఈ ప్రాజెక్టులపై ఫీజిబులిటీ నివేదికల ఆధారంగా యాగంటి, కమలపాడులో మొదటి దశలోను, మిగిలిన చోట్ల రెండో దశలోను పీఎస్పీలు ఏర్పాటు చేయనున్నారు. మరో వైపు అప్పర్ సీలేరులో 1,350 మెగావాట్ల సామర్థ్యంతో ఏపీజెన్‌కో సొంతంగా పీఎస్పీ ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే పర్యావరణ అనుమతులతో పాటు అన్ని రకాల అనుమతులు వచ్చాయి. పీఎస్పీ ఏర్పాటు కోసం ఏపీజెన్‌కో టెండర్లు పిలిచింది. విద్యుత్ సామర్థ్యం పెంచడంతో పాటు పీక్ లోడ్ సమయంలో వైఫల్యం చెందకుండా గ్రిడ్‌ను బలోపేతం చేయడానికి ఈ పీఎస్పీ ఎంతో ఉపయోగపడనుంది.

నేడు నంద్యాల జిల్లాలో మూడు ప్రాజెక్ట్‌లకు సీఎం శంకుస్థాపన

భారీ పెట్టుబడులతో పునరుత్పాదక ఇంధన రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌లో మరో మూడు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు రానున్నాయి. నంద్యాల జిల్లా అవుకు మండలం జునూతల గ్రామం వద్ద గ్రీన్‌కో సహకారంతో 2,300 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్ట్, పాణ్యం మండలం కందికాయపల్లె గ్రామం వద్ద ఏఎం గ్రీన్ ఎనర్జీతో 1,014 మెగావాట్లు (700 మెగావాట్ల సోలార్, 314 మెగావాట్లు పవన) విద్యుత్ ప్రాజెక్టు, బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామంలో ఎకోరెన్ ఎనర్జీతో 2,000 మెగావాట్లు (1,000 మెగావాట్ల సోలార్, 1,000 మెగావాట్ల పవన) విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్రాజెక్టుల పెట్టుబడి అవకాశాలపై సీఎం జగన్ శ్వేత పత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఏపీ జెన్‌కో ఎండీ, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కేవీఎస్ చక్రధర్‌బాబు 'సాక్షి'కి తెలిపారు.

మొదటి ప్రాధాన్యం అమెరికానే

- భారత పౌరసత్వాన్ని వదులుకుంటున్న వారి గమ్యస్థానం అగ్రరాజ్యమే
- తరువాత స్థానాల్లో కెనడా, ఆస్ట్రేలియా, యూకే
- 2011 నుంచి 2022 మధ్య పౌరసత్వం వదులుకున్నవారు 1.75 కోట్లమంది
- భారత విదేశాంగ శాఖ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: భారత పౌరసత్వాన్ని వదిలేసి విదేశాల్లో శాశ్వతంగా స్థిరపడుతున్న భారతీయుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మన దేశ పౌరసత్వం వదిలేస్తున్న వారి తొలి ప్రాధాన్య దేశంగా అమెరికా నిలుస్తోంది. ఆ తర్వాత కెనడా, ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)ల్లో స్థిరపడటానికి మన వాళ్లు ఇష్టపడుతున్నారు. భారత పౌరసత్వం త్యజిస్తున్న వారి సంఖ్య 2011 నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చి కోవిడ్ కారణంగా 2020, 2021లో కాస్త నెమ్మదించింది. ఆ తర్వాత 2022లో మాత్రం రికార్డు స్థాయిలో భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారని భారత విదేశాంగ శాఖ నివేదిక వెల్లడించింది.

నివేదికలోని ప్రధాన అంశాలు...

- 2011 నుంచి 2023 జూన్ నాటికి ఏకంగా 1.75 కోట్ల మంది భారతీయులు తమ భారత పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారు.
- భారత పౌరసత్వాన్ని వదులుకున్నవారి సంఖ్య 2022లో 22.56 లక్షల మంది భారత పౌరసత్వాన్ని విడిచిపెట్టారు. దశాబ్దంలోనే ఇది అత్యధికం.
- గడిచిన దశాబ్దంలో భారత పౌరసత్వాన్ని వదులుకున్న వారు 165 దేశాల్లో కొత్తగా పౌరసత్వం పొందారు. వారిలో అత్యధికంగా 40 శాతం మంది అమెరికా పౌరులుగా మారారు. భారత పౌరసత్వాన్ని వదిలేసిన వారు గత ఐదేళ్లలో 2,442 మంది చైనా పౌరసత్వాన్ని, 128 మంది నేపాల్ పౌరసత్వాన్ని, 106 మంది శ్రీలంక పౌరసత్వాన్ని తీసుకోగా.. 69 మంది పాకిస్తాన్ పౌరసత్వాన్ని కూడా పొందారు.
- కాగా విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల (ఎన్ఆర్ఐ) సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. 2022 డిసెంబర్ నాటికి 1.36 కోట్ల మంది ఎన్ఆర్ఐలు ఉన్నారు. ఎన్ఆర్ఐలకు గల్ఫ్ దేశాలు, ఉత్తర అమెరికా తొలి రెండు ప్రాధాన్యాలుగా ఉన్నాయి.
- విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు వసూలు చేసే ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్ (ఐసీడబ్ల్యూఎఫ్) క్రమంగా పెరుగుతూ వస్తోంది. కాన్సులర్ సేవల పేరిట వసూలు చేసే ఈ నిధిని విదేశాల్లో సమస్యల్లో చిక్కుకున్న భారతీయుల పునరావాసం కోసం వెచ్చిస్తారు. 2020 నుంచి 2022 మధ్యనే 145 దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు రూ. 217 కోట్లు ఐసీడబ్ల్యూఎఫ్‌ను వసూలు చేయడం గమనార్హం. అందులో అమెరికా మొదటిస్థానంలో ఉండగా గల్ఫ్ దేశాలు రెండోస్థానంలో నిలిచాయి.
- ద్వంద్వ పౌరసత్వ విధానాన్ని భారత్ అనుమతించనందున విదేశాల్లో శాశ్వతంగా స్థిరపడేందుకు, భారత పౌరసత్వాన్ని వదులుకునేందుకు విదేశాలకు వలస వెళ్లే వారు నిర్ణయించుకుంటున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

'అమూల్'.. ఆర్గానిక్

▶ మొదటి పేజీ తరువాయి

సచివాలయాలు, ఆర్బీకేలు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో వీక్లీ మార్కెట్లను ప్రోత్సహిస్తోంది. తాజాగా మరో అడుగు ముందుకేసి విస్తృత స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ముందుకొచ్చిన అమూల్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకోనుంది. ప్రకృతి, సేంద్రీయ పద్ధతుల్లో ఉత్పత్తి అయ్యే పంట దిగుబడుల్లో 30 శాతం స్థానికంగా వినియోగిస్తుండగా మరో రూ.1,100 కోట్ల విలువైన 1.42 లక్షల టన్నుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సమస్యను అధిగమించేందుకు మంత్ర, సహజ ఆహారం, రిలయన్స్ రిటైల్, బిగ్ బాస్కెట్ ఇతర కంపెనీల భాగస్వామ్యంతో రైతు సాధికార సంస్థ ముందుకెళ్తోంది. మరోవైపు టీటీడీ దేవస్థానానికి 12 రకాల ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. వచ్చే ఐదేళ్లలో కనీసం రూ.5 వేల కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

10 – 15 శాతం ప్రీమియం ధరకు సేకరణ

ఈ ఏడాది 1,29,169 ఎకరాల్లో వరి, వేరుశనగ, జీడిమామిడి, మొక్కజొన్న, బెల్లం, కాఫీ, పసుపు సహా 12 రకాల ఉత్పత్తులు సాగవుతుండగా 2,03,640 టన్నుల దిగుబడి రావచ్చని అంచనా. రైతు సాధికార సంస్థతో చేసుకున్న ఒప్పందం మేరకు ఎమ్మెస్పీకి మించి మార్కెట్‌లో పలికిన ధరలకు అదనంగా 15 శాతం, ఒకవేళ మార్కెట్ ధరలు ఎమ్మెస్పీ కంటే తక్కువగా ఉంటే ఎమ్మెస్పీకి అదనంగా 10 శాతం ప్రీమియం ధరతో రైతుల నుంచి టీటీడీ సేకరిస్తోంది. అదే రీతిలో ఆర్గానిక్ సర్టిఫికేషన్ పొందిన రైతులు ఉత్పత్తి చేసిన పంట ఉత్పత్తులను అమూల్ సంస్థ సేకరించి మార్కెటింగ్ చేయనుంది. తొలి దశలో ధాన్యం, శనగలు, కందులు, కందిపప్పు, రాజ్మా, శనగపిండి లాంటి వాటిని రైతుల నుంచి ప్రీమియం ధరలకు సేకరించి ప్రాసెస్ చేసి అమూల్ ఆర్గానిక్స్ పేరిట మార్కెట్‌లోకి తీసుకురానుంది.



శ్రేష్ట కంపెనీలో నిమిత్‌కు ఆర్గానిక్ ఉత్పత్తులను అందజేస్తున్న డైరెక్టర్లు

క్షేత్ర స్థాయిలో పరిశీలన

క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు అమూల్ ఆర్గానిక్స్ అధ్యయనం చేస్తోంది. గుజరాత్ నుంచి వచ్చిన అమూల్ బిజినెస్ హెడ్ దోషి, బ్రాండ్ మేనేజర్ స్నేహ కమ్లాని నేతృత్వంలోని అమూల్ ఆర్గానిక్స్ ప్రతినిధి బృందం ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పర్యటించింది. ప్రకృతి సాగు చేసే మహిళా రైతులతో సమావేశమైంది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దాల్‌మిల్ కమ్ బల్క్ స్టోరేజ్ పాయింట్, ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శించింది.

మార్కెటింగ్‌కు తోడ్పాటు అందిస్తాం

తెనాలి: పాడి పరిశ్రమ రంగంలో దేశంలో అగ్రగామిగా ఉన్న అమూల్ తాజాగా ఆర్గానిక్ రంగంలోకి ప్రవేశించిందని సంస్థ ఆర్గానిక్ హెడ్ నిమిత్ దోషి చెప్పారు. ఆర్గానిక్ విధానంలో వ్యవసాయం చేసే రైతుల ఉత్పత్తుల మార్కెటింగ్‌కు తోడ్పాటునందిస్తామని తెలిపారు. అమూల్ సంస్థ మేనేజర్ స్నేహతో కలిసి మంగళవారం గుంటూరు జిల్లా కొల్లిపరలోని శ్రేష్ట ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీని నిమిత్ సందర్శించారు. కంపెనీ ఆధ్వర్యంలో పండించిన పంటలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌ను పరిశీలించారు. 100 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు శ్రేష్ట డైరెక్టర్ ఉయ్యూరు సాంబిరెడ్డి తెలిపారు. ఎన్జీవోలు, ఇతర సంస్థలతో కలసి భూమి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ పరిమిత వ్యయంతో సాగు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ విభాగం ప్రతినిధి ప్రభాకర్, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ రాజకుమారి, శ్రేష్ట డైరెక్టర్లు నెర్ల కుటుంబరెడ్డి, బొంతు గోపాలరెడ్డి, రైతు సాధికార సంస్థ రీజినల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వెంకట్రావు, విజయ్, ప్రవల్లిక, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి, సేంద్రీయ సాగుకు ఊతం

ప్రకృతి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు అమూల్‌తో ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుంది. ఇది చరిత్రాత్మక ముందడుగు. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న అమూల్ అదే రీతిలో ప్రకృతి సాగు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ముందుకు రావడం శుభ పరిణామం. ఇది రాష్ట్రంలో ప్రకృతి, సేంద్రీయ సాగుకు మరింత ఊతమిస్తుంది.

– టి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, రైతు సాధికార సంస్థ

ఐదెకరాల్లో గంజాయి పంట ధ్వంసం

▶ మొదటి పేజీ తరువాయి

పట్టుకున్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా, అనకాపల్లి జిల్లా, అనకాపల్లి మండలం కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల కూడలిలో మంగళవారం 280 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ జంక్షన్‌లో ఎస్ఐ సింహాచలం వాహనాలను సాధారణ తనిఖీ చేస్తుండగా అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్తున్న కారులో గంజాయి బయటపడింది. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన కారు డ్రైవర్ తూము బాలిరెడ్డిని అదుపులోకి తీసుకుని, కారును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. గంజాయి విలువ సుమారు రూ.5.5 లక్షలు ఉంటుందని సీఐ దాడి మోహన్‌రావు చెప్పారు.

కర్నూలులో జ్యుడీషియల్ సిటీ

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో పరిశ్రమలు కీలకమని.. వాటి ఏర్పాటుకు సంబంధించిన అనుమతులను నిబంధనల మేరకు నిర్దేశిత సమయంలోగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్‌లో వరుసగా ఏపీ మొదటి స్థానంలో నిలుస్తోందన్నారు. కాలుష్య నియంత్రణ మండలికి అవసరమైన కార్యాలయాలను సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. తిరుపతి, గుంటూరు, విజయవాడతో పాటు ఇప్పుడు కర్నూలులో నూతన భవనాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. త్వరలోనే నెల్లూరు, అనంతపురంలో కూడా నూతన భవనాలు అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ శ్రీధర్, ఎంపీలు సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ సృజన, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎంవీ రావు, బీవై మునిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

2 దశాబ్దాల రికార్డ్‌ను అధిగమించిన విశాఖ పోర్టు

దొండపర్తి (విశాఖ దక్షిణ): లైమ్‌స్టోన్ అన్‌లోడింగ్‌లో విశాఖ పోర్టు రికార్డును తిరగరాసింది. 2 దశాబ్దాల క్రితం నమోదు చేసిన రికార్డును అధిగమిస్తూ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒమిక్రాన్ నికోస్ అనేక వెసెల్ లైమ్‌స్టోన్‌తో విశాఖ పోర్టులో ఈక్యూ–9 బెర్తుకు వచ్చింది. ఈ నెల 21న ఒక్క రోజులోనే పోర్టు అధికారులు, సిబ్బంది 25,948 మెట్రిక్ టన్నుల లైమ్‌స్టోన్‌ను అన్‌లోడ్ చేసి రికార్డు సృష్టించారు. 2001, ఆగస్టు 27న 25,190 మెట్రిక్ టన్నుల పరిమాణంలో లైమ్‌స్టోన్ డిస్చార్జ్ చేసి రికార్డు నెలకొల్పింది.

అక్టోబర్ నుంచి సబ్సిడీపై కందిపప్పు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బియ్యం కార్డుదారులకు అక్టోబర్ నుంచి సబ్సిడీపై కందిపప్పును అందజేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర వినియోగదారుల, వ్యవహారాల శాఖ కార్యదర్శి రోహిత్ సింగ్‌ను కలిసి రాష్ట్ర అవసరాలకు 50 వేల టన్నుల కందిపప్పు నిల్వలను కేటాయించాలని కోరారు. అనంతరం 'సాక్షి'తో మాట్లాడుతూ..గతంలో ఎఫ్‌సీఐ ద్వారా కేటాయించిన కందులు నాణ్యత లేకపోవడంతో వాటిని తిరస్కరించినట్లు గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని 50,000 టన్నుల కందిపప్పును కేటాయించినట్లు వివరించారు. రాష్ట్రంలోని రైతుల నుంచి నేరుగా కందులు కొనుగోలు చేసి మిల్లింగ్ అనంతరం పీడీఎస్‌లోకి తీసుకెళ్తామన్నారు.

భౌగోళిక సూచనతో ఈ-క్రాప్ నమోదు

వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైతులు సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్‌లో భౌగోళిక సూచన (జియో రిఫరెన్స్) ద్వారా నమోదు చేయాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ అధికారులను ఆదేశించారు. మంగళగిరి క్యాంప్ కార్యాలయం నుంచి 26 జిల్లాల వ్యవసాయ శాఖాధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. పంట విత్తిన నాటినుంచి 30 రోజుల తర్వాత స్పష్టమైన పంట ఫొటోలతో ఈ-క్రాప్‌లో నమోదు చేయవచ్చునన్నారు. రైతు సంక్షేమ పథకాల లబ్ధి రైతులు తమ బ్యాంకు ఖాతాలకే నేరుగా జమవుతున్నందున, వారి ఆధార్ నంబర్లు జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. పంట నమోదులో విత్తిన తేదీ, సాగు విధానాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఏపీలో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఎఫ్‌సీవో 1985 అమెండ్మెంట్ ప్రకారం జోన్లవారీగా విశాఖ, పశ్చిమ గోదావరి, తిరుపతి, పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారులు కస్టోడియన్ ఆఫీసర్లుగా నియమించామన్నారు.

ఎస్.కోటలో 250వ రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పనుల గుర్తింపు, నిధుల మంజూరు, సంక్షేమ పథకాల అమలు, పర్యవేక్షణ లక్ష్యంగా తలపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గంలో 250వ రోజు పూర్తి చేసుకుంది. స్థానిక శాసన సభ్యుడు కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం కొత్తవలస మండలం సంతపాలెంలో పర్యటించారు. నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో ఇప్పటికే నడుపుతున్న ప్రత్యేక రైళ్లను సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సైతం పొడిగించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తిరుపతి-కాజీపేట్, హైదరాబాద్-నర్సాపూర్, హైదరాబాద్-తిరుపతి, విజయవాడ-నాగర్‌సోల్, మచిలీపట్నం-సికింద్రాబాద్, తిరుపతి-సికింద్రాబాద్, హైదరాబాద్-తిరుపతి, అకోలా-తిరుపతి, పూర్ణ-తిరుపతి, ధర్మవరం-మచిలీపట్నం తదితర మార్గాల్లో నడిచే 20 రైళ్లను అక్టోబర్ నెలాఖరు వరకు పొడిగించనున్నారు. కాకినాడ-లింగంపల్లి మధ్య ప్రత్యేక రైలును ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు కాకినాడ-లింగంపల్లి (07439/07440) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో రాత్రి 9.10 గంటలకు నాంపల్లి నుంచి బయలుదేరి, మర్నాడు ఉదయం 9.15 గంటలకు లింగంపల్లికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి మంగళ, గురు, శనివారాల్లో సాయంత్రం 6.25 గంటలకు లింగంపల్లి నుంచి బయలుదేరి, మర్నాడు ఉదయం 7.10 గంటలకు కాకినాడ చేరుకుంటుంది.



ద్వేషానికి ఏకైక చికిత్స స్నేహమే.
అది మాత్రమే కచ్చితంగా శాంతిని తేగలదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 23 ఆగస్టు 2023

మణిపూర్ గవర్నర్ మౌనమేల?

ఇంటి దీపమని ముద్దాడితే మీసాలు తెగకాల్చిందని సామెత. మణిపూర్‌లో కల్లోలం జాడలు కనబడినప్పుడు అక్కడున్నది 'డబుల్ ఇంజన్' సర్కారే కదా అని ఉపేక్షించిన కేంద్ర ప్రభుత్వానికి తదుపరి కర్తవ్యం బోధపడటం లేదని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. సోమవారం ప్రారంభం కావాల్సిన మణిపూర్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల గురించి 24 గంటలు గడిచినా అతీగతీ లేకపోవటం దాన్నే సూచిస్తోంది. ఆగస్టు మూడోవారంలో అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని గత నెల 27న కేబినెట్ భేటీ తర్వాత ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ ప్రకటించారు. అందుకు సంబంధించిన సిఫార్సును ఈనెల 4న లాంఛనంగా గవర్నర్ అనసూయ ఊకే ఆమోదానికి పంపారు. అసెంబ్లీ ప్రోరోగ్ అయింది గనుక నిబంధనల ప్రకారం పక్షం రోజుల ముందు అసెంబ్లీ సమావేశాలపై రాజ్‌భవన్ నుంచి నోటిఫికేషన్ వెలువడాలి. కానీ ఆశ్చర్యకరంగా అలాంటిదేమీ జరగలేదు. హింసాకాండ మొదలై నాలుగు నెలలు గడిచినా ఇంతవరకూ రాష్ట్రంలో ప్రశాంతత ఏర్పడలేదన్నది వాస్తవం. హత్యాకాండలో 160 మందికి పైగా మరణించగా వందలాది మంది పౌరులు గాయపడ్డారు. బాధితులు ఇప్పటికీ సహాయ శిబిరాల్లో తలదాచుకునే పరిస్థితులే ఉన్నాయి. భద్రతా బలగాలు సోదాలు నిర్వహిస్తూ పోలీస్ స్టేషన్ల నుంచి అపహరించిన మారణాయుధాలు, మందుగుండు స్వాధీనం చేసుకుంటున్నాయి. వివిధ నేరాలతో సంబంధమున్నదని భావిస్తున్న దాదాపు 1,500 మందిని అరెస్టు చేశారు. అయినా చెదురుమదురుగా ఎక్కడో ఒకచోట హింసాత్మక ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. మరోపక్క కొండ ప్రాంతాలకు నిత్యావసర సరుకులు సరఫరా కాకుండా ప్రత్యర్థి మైతేయి తెగ అడ్డుకుంటున్నదని ఆరోపిస్తూ ఇంఫాల్–అస్సాంలోని సిల్చార్‌ల మధ్య ఉన్న 37వ నంబర్ జాతీయ రహదారిని కుకీలు దిగ్బంధించారు. ఇంఫాల్–నాగాలాండ్‌లోని దిమాపూర్ మధ్య గల రెండో నంబర్ జాతీయ రహదారిపై సైతం ఉద్యమకారుల దిగ్బంధంతో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. భద్రతా బలగాలు రంగంలోకి దిగినా పరిస్థితి ఇంకా పూర్తిగా మెరుగుపడలేదని మీడియా కథనాలు చెబుతున్నాయి.

సమస్యల వలయం నుంచి మణిపూర్ ఇంకా బయటపడలేదన్నది నిజం. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే భద్రతా కారణాల రీత్యా తాము హాజరుకావటం అసాధ్యమని వివిధ పార్టీల్లోని కుకీ తెగ శాసనసభ్యులు పదిమంది గవర్నర్‌కు విడివిడిగా వినతిపత్రాలు పంపిన మాట కూడా వాస్తవం. ఇందులో ఇద్దరు సభ్యులున్న అధికార కూటమి భాగస్వామ్య పార్టీ కుకీ పీపుల్స్ అలయెన్స్ కూడా ఉంది. నాగా తెగకు చెందిన మరో పదిమంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరు కావొద్దని మణిపూర్‌లోని యునైటెడ్ నాగా కౌన్సిల్ (యూఎన్‌సీ) కోరడాన్ని విస్మరించలేం. అంతేకాదు, అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించి రాష్ట్ర సమగ్రత పరిరక్షణకు తీర్మానం చేయాలని మైతేయిలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మణిపూర్ సమగ్రత సమన్వయ కమిటీ (కొకోమీ) గత జూలైలో జరిపిన ర్యాలీలో డిమాండ్ చేయటం కూడా వాస్తవమే. అలాగని కేబినెట్ సిఫార్సుపై గవర్నర్ మౌనం వహించటం సరికాదు. రాష్ట్రంలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వం ఉనికిలో ఉంది. 60 మంది సభ్యులుండే అసెంబ్లీలో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌కు ఇప్పటికైతే మెజారిటీ ఉంది. ఆయనకు మద్దతు ఉపసంహరించుకుంటున్నామని ఎమ్మెల్యేలు ఎవరూ ప్రకటించలేదు. అసెంబ్లీ కూడా రద్దు కాలేదు. మణిపూర్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గత మార్చిలో జరిగాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల్లోగా వర్షాకాల సమావేశాలు నిర్వహించాల్సివుంది. అంటే వచ్చే నెల 2లోగా అసెంబ్లీ సమావేశం కావాలి. అటువంటప్పుడు నోటిఫికేషన్ విడుదల చేయకపోతే అది రాజ్యాంగ సంక్షోభానికి దారితీయదా? గవర్నర్ విధి నిర్వహణ మంత్రివర్గం సలహాలకు లోబడివుంటుందని రాజ్యాంగంలోని 163వ అధికరణ చెబుతోంది. అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ లేదా దాని ప్రోరోగ్, అసెంబ్లీ రద్దు అధికారాలు గవర్నర్‌కు ఉంటాయని 174వ అధికరణ వివరిస్తోంది. అయితే మంత్రివర్గాన్ని సంప్రదించి మాత్రమే ఈ అధికారాలను వినియోగించాల్సి వుంటుందని హిమాచల్ ప్రదేశ్ స్పీకర్ దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2016లో తీర్పునిచ్చింది. మణిపూర్‌లో రాజ్యాంగ సంక్షోభం ఏర్పడిందని గవర్నర్ భావించివుండొచ్చు. ప్రభుత్వానికి తగిన మెజారిటీ లేదని అనుకొనివుండొచ్చు. అదేమిటో ప్రకటించి, తదనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత గవర్నర్‌కు లేదా? అంతా సవ్యంగా ఉందనుకుంటే సమావేశాల నోటిఫికేషన్ విడుదలకు అభ్యంతరం దేనికి?

సమస్యలున్నప్పుడే ప్రజలెన్నుకున్న సభల ప్రాధాన్యత పెరుగుతుంది. చుట్టుముట్టిన ఉద్రిక్త పరిస్థితులను ఉపశమింపజేయడానికి అనుసరించాల్సిన మార్గాలపై చర్చిస్తే, సభ్యుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందిస్తే, ఏకగ్రీవ తీర్మానం ద్వారా ప్రజానీకానికి భరోసా ఇవ్వగలిగితే దాని ప్రభావం ఎంతో ఉంటుంది. అందుకు భిన్నంగా గవర్నర్ వ్యవహరించటం రాజ్యాంగ విరుద్ధం మాత్రమే కాదు, రాజ్యాంగ సంక్షోభానికి దారి తీసే చర్య కూడా. చిత్రమేమంటే రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సిద్ధార్థ్ మృదుల్‌ను నియమించాలన్న జూలై 5 నాటి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు ఫైలును మణిపూర్ సర్కార్ ఆమోదానికి కేంద్రం పంపింది. అదేమైందో తెలియదు. మణిపూర్‌లో సర్కారు ఉంటే అది సక్రమంగా పని చేస్తున్నదో లేదో తేల్చవలసిన బాధ్యత కేంద్రంపై ఉంది. నిరవధిక అనిశ్చితి మణిపూర్‌ను మరింత సంక్షోభంలోకి నెడుతుందని అందరూ గుర్తించాలి.

ఈసీ స్వతంత్రతను హరించే బిల్లు

విశ్లేషణ



గౌతమ్ భాటియా

భారత ఎన్నికల సంఘం తప్పనిసరిగా కార్యనిర్వాహక వర్గానికి అంటే ప్రభుత్వానికి దూరంగా, స్వతంత్రంగా ఉండాలనే నిబంధనకు అనుగుణంగానే, పార్లమెంటు ఆమోదించే ఏదైనా చట్టం ఉండాలి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఎన్నికల కమిషనర్ల బిల్లులోని అసలు సమస్య 'సీఈసీ' ఎంపిక కోసం ఉద్దేశించిన త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానాన్ని మార్చి, ప్రధాని నామినేట్ చేసే క్యాబినెట్ మంత్రిని చేర్చడం కాదు... ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకంలో ప్రభుత్వమే నిర్ణయాత్మక పాత్రను పోషించడం! మరోమాటలో, ఇది కార్యనిర్వాహక వర్గానికి సీఈసీని నియమించే అధికారాన్ని ఇవ్వడమే. అంటే, ఒక ఆటగాడికే రిఫరీని నియమించే అధికారం ఇచ్చినట్లు!

ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) బిల్లు, 2023ను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టడం తీవ్ర వివాదానికి కారణమైంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (చీఫ్ ఎలక్షన్ కమిషనర్–సీఈసీ) ఎంపికపై అనూప్ బరన్‌వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో కొన్ని నెలల క్రితం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ బిల్లు భర్తీ చేస్తుందనే విషయంపైనే ఎక్కువగా చర్చ జరిగింది. సీఈసీ ఎంపికను ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన త్రిసభ్య కమిటీ తప్పనిసరిగా చేయాలని సుప్రీంకోర్టు ఆ తీర్పులో పేర్కొంది. అయితే కొత్త ఎన్నికల కమిషనర్ల బిల్లు వల్ల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలోకి ప్రధానమంత్రి నామినేట్ చేసే క్యాబినెట్ మంత్రి వస్తారు. ఈ కారణంగానే అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఈ బిల్లు ఎలా బలహీనపరుస్తుందనే అంశంపై విమర్శలు కేంద్రీకృతమయ్యాయి. అయితే, తాము చేసిన ఏర్పాటు తాత్కాలికమనీ, పార్లమెంటు ఈ విషయంలో ఒక చట్టాన్ని ఆమోదించే వరకే ఇది అమలులో ఉంటుందనీ అత్యున్నత న్యాయస్థానం స్వయంగా గుర్తించిందనే వాస్తవాన్ని బిల్లు సమర్థకులు ఎత్తి చూపారు.

ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండటం, లేదా లేకపోవడంపై మాత్రమే దృష్టి సారించడం ద్వారా, ఈ చర్చలోని అసలైన విషయం పక్కకు పోతోంది. సీఈసీ కోసం ఉద్దేశించిన ఎంపిక కమిటీలో ప్రత్యేకంగా ఎవరు ఉండాలనే దానిపై కాకుండా, భారత ఎన్నికల సంఘం నిర్మాణాత్మకమైన, కార్యాచరణ స్వతంత్రతను కాపాడటం పైనే అనూప్ బరన్‌వాల్ కేసు తీర్పు ప్రధానంగా దృష్టి పెట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(2), పార్లమెంటు చేసే ఏదైనా చట్టానికి లోబడి, సీఈసీ నియామక అధికారాన్ని రాష్ట్రపతికి కట్టబెడుతోంది. అనూప్ బరన్‌వాల్ కేసులో, సుప్రీంకోర్టు ఈ నిబంధనకు చెందిన చరిత్రను పరిశీలించింది. రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశ్యం ప్రకారం, భారత ఎన్నికల సంఘ స్వతంత్రతకు హామీ ఇచ్చే చట్టాన్ని పార్లమెంటు త్వరలో అమలు చేస్తుందని ఆశించింది. అయితే, పార్లమెంటు ఎన్నడూ ఇలాంటి చట్టాన్ని ఆమోదించకపోవడంతో, తీర్పునిచ్చిన న్యాయమూర్తుల అంచనాలు తారుమారయ్యాయి. ఇది



రాష్ట్రపతి (అంటే కార్యనిర్వాహక వ్యవస్థ) అధికారాలను ప్రభావవంతంగా శాశ్వతం చేసింది. సీఈసీని నియమించే అధికారాన్ని కార్యనిర్వాహక వ్యవస్థకు ఇవ్వడం అనేది భారత ఎన్నికల సంఘ స్వతంత్రతకు విరుద్ధంగా ఉందనీ, తద్వారా ఇది తీర్పు చెప్పిన వారి ఉద్దేశం, రాజ్యాంగ రూపకల్పన రెండింటికీ పొసగడం లేదనీ ఉన్నత న్యాయస్థానం గుర్తించింది. దీనికి కారణం స్పష్టమే. పార్లమెంటరీ వ్యవస్థలో, అధి కార పార్టీ నుండి కార్యనిర్వాహక వర్గాన్ని ఎంచుకుంటారు. అందుకే ఎన్నికల క్రీడలో కార్యనిర్వాహకవర్గమే ఆటగాడిగా ఉంటుంది. ఇది కార్యనిర్వాహక వర్గానికి, అంటే ప్రభుత్వానికి సీఈసీని నియమించే అధికారాన్ని ఇవ్వడమే. అంటే, ఒక ఆటగాడికే రిఫరీని నియమించే అధికారం ఇచ్చినట్లు అవుతుంది.

రాజ్యాంగ బద్ధంగా ఏర్పడే ప్రజాస్వామ్య వ్యవస్థలలో– ఎన్నికల పర్యవేక్షక విభాగాలు అనేవి, అంటే ఎన్నికల కమిషన్లు, సమాచార కమిషన్లు మొదలైనవి, నాల్గవ శాఖా సంస్థల విభాగానికి చెందుతాయి. ఓటు హక్కు, సమాచార హక్కు మొదలైన పౌర హక్కులను ప్రభావవంతంగా మలచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా పర్యవేక్షించడం, అమలు చేయడమే వాటి ప్రాథమిక పని. ఈ లక్ష్యాన్ని సాధించడం కోసం, ఈ నాల్గవ శాఖా సంస్థలు సమర్థవంతంగా, కార్యనిర్వాహక వర్గం (ప్రభుత్వం) నుండి స్వతంత్రంగా ఉండాలి. ఎందుకంటే ప్రభుత్వ మితిమీరిన జోక్యాన్ని తనిఖీ చేయడం ఈ సంస్థల పాత్రలలో ఒకటి.

ఈ అంతర్దృష్టి అనూప్ బరన్‌వాల్ కేసు తీర్పులో అంతర్భాగంగా ఉంది. భారత ఎన్నికల సంఘానికి సంబంధించి ఒక చట్టాన్ని రూపొందించే అంతిమ అధికారం పార్లమెంటుకు ఉందని రాజ్యాంగం స్వయంగా స్పష్టం చేసింది కాబట్టే సుప్రీంకోర్టు తన త్రిసభ్య కమిటీని మధ్యంతర ఏర్పాటు అని పేర్కొంది. అయితే, న్యాయస్థానం కూడా గుర్తించినట్లుగా, ఇది హద్దులేని లేదా తనిఖీ చేయని అధికారం మాత్రం కాదు. భారత ఎన్నికల సంఘం తప్పనిసరిగా కార్యనిర్వాహక వర్గానికి అంటే ప్రభుత్వానికి దూరంగానూ, స్వతంత్రంగానూ ఉండాలనే నిబంధనకు అనుగుణంగానే, పార్లమెంటు ఆమోదించే ఏదైనా చట్టం ఉండాలి. కాబట్టి, ఎన్నికల కమిషనర్ల బిల్లులోని సమస్య సీఈసీ ఎంపిక కోసం ఉద్దేశించిన త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానాన్ని మార్చడం కాదు. ఎందుకంటే కొత్త పాలనావ్యవస్థలో, కార్యనిర్వాహక వర్గానికి స్పష్టమైన మెజారిటీ ఉంది – అందువలన, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకంలో ప్రభుత్వమే నిర్ణయాత్మక పాత్రను పోషిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆచరణను పరిశీలిస్తే, ఈ విషయంలో భారతదేశం చాలా దూరంగా ఉందని మరింత స్పష్టంగా తెలుస్తుంది. చాలా ప్రజాస్వామ్య దేశాల్లో, ఎన్నికల కమిషన్ ను నియమించే విధానం పక్షపాత రహితంగా ఉంటుంది. పైగా, ఈ నియామకం విషయంలో చాలామందికి జోక్యం ఉంటుంది. ఉదాహరణకు, పార్లమెంటులో మూడింట రెండు వంతుల ఆమోదం అవసరం. లేదా మంత్రులు, ప్రతిపక్షాలు, పౌర సమాజ సభ్యులు, బహుళ–సభ్యుల కమిటీ పాత్ర కీలకం. ఎన్నికల సంఘం ఎంపికలో కార్యనిర్వాహక ఆధిపత్యం ఉండకూడదనే సంకల్పమే దీనంతటికీ కారణం. కాబట్టి, ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిని మినహాయించడం గురించి కాక, భారత ఎన్నికల సంఘం స్వతంత్రత గురించి మొత్తం చర్చను పునర్నిర్మించడం అత్యవసరం. అంతకుమించి, అధికారంలో ఉన్న పార్టీతో సంబంధం లేకుండా ఎన్నికల కమిషన్ స్వతంత్రతను నిర్ధారించే నియామకాల కోసం ఒక యంత్రాంగాన్ని రూపొందించడంలో పార్లమెంట్, పౌర సమాజం కలిసి పనిచేయడం చాలా అవసరం.

వ్యాసకర్త ఢిల్లీ న్యాయవాది
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇదే వేదిక



మీరు మీ రాతలకు మరింత స్వేచ్ఛనూ, అధిక ఆదాయాన్నీ కోరుకునే జర్నలిస్టు అయితే నేరుగా ఇదే వేదిక మీద (ట్విట్టర్/ఎక్స్) ప్రచురించండి.
– ఎలాన్ మస్క్, 'ఎక్స్' అధినేత

బలహీనమయ్యామా?



కోవిడ్ అనంతరం, వైరల్ జ్వరాలు ఇంతకుముందులా 2–3 రోజుల్లో నయం కావడం లేదు. వారం నుంచి పది రోజులు తీసుకుంటున్నాయి. ఎవరైనా గమనిస్తున్నారా?
– తుషార్ గుప్తా, సంపాదకుడు

బతకనీయరా?



పాకిస్తాన్‌లో క్రైస్తవుల మీద దాడి సాగుతూనే ఉంది. తహరీక్–ఎ–లబ్బైక్ పాకిస్తాన్ ఇస్లామిస్టులు పట్టపగలు జారావాలాలోని చర్చీ గోడల మీద అల్లానూ, మహమ్మద్‌నూ కీర్తిస్తూ రాశారు. ఇప్పుడు చర్చీ గనక వాటిని తొలగిస్తే, మళ్లీ దైవదూషణ పుకార్లు లేచి హింసా ప్రమాదం ఉంటుంది.
– ఫరాజ్ పెర్వాయిజ్, క్రైస్తవ యాక్టివిస్ట్

ఎఫ్‌బీఐని రద్దు చేస్తా!



ఎఫ్‌బీఐ (ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్)కి 35,842 మంది ఉద్యోగులున్నారు. ఇందులోని 56 శాతం మంది ప్రొఫెషనల్ బ్యూరోక్రాట్లు. వీరందరినీ తక్షణం తొలగించాలి. కేవలం 44 శాతం ఉద్యోగులు మాత్రమే స్పెషల్ ఏజెంట్లు, నిఘా విశ్లేషకులు – ఈ 15,770 మందిని ఇదే ప్రత్యేకమైన పని చేస్తున్న ఇతర న్యాయ అమలు యంత్రాంగాల్లో సర్దుబాటు చేయాలి.
– వివేక్ రామస్వామి, అమెరికా 'అధ్యక్ష అభ్యర్థి'

ఏమవుతున్నారు?



పాకిస్తాన్‌లోని ముస్లిమేతరుల జనాభా 1947లో 23 శాతంగా ఉండింది. 2023లో వారి జనాభా కేవలం 3 శాతం. ఇది సున్నా శాతం కావడానికి ఎన్నేళ్లు పడుతుందో లెక్కించండి.
– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఎందుకీ ఉదారత?



ఇటీవల పార్లమెంటులో మోదీ ప్రస్తావించినట్టుగా, 1974లో కచ్చాతీవు ద్వీపాన్ని శ్రీలంకకు భారత్ బహుమానంగా ఇచ్చింది. అదొక్కటే మన ఏకపక్ష ఉదారతకు ఉదాహరణ కాదు. 1953లో మణిపూర్ అన్నపూర్ణ కాబా లోయను మయన్మార్‌కు భారత్ బహుమానంగా ఇచ్చింది. బదులుగా మనవే అయిన కోకో ద్వీపాల మీద మన ఆధిపత్యాన్ని నిలుపుకోవడంలో విఫలమైంది. 1954లో చైనీస్ దళాలతో ఏ క్విడ్ ప్రో కో లేకుండానే టిబెట్ మీద అతిప్రాదేశిక హక్కులను వదులుకుంది. ఇక (సింధునదీ జలాల వాటాలో ఉదారతకు తోడుగా), 1972లో చర్చల బల్లమీద ఏ విధమైన ప్రతిఫలం పొందకుండానే పాకిస్తాన్‌కు యుద్ధ ఫలాలను వదులుకుంది.
– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

పోస్టాఫీసులకు అప్పగించాలి!

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 'స్పెషల్ సమ్మరీ రివిజన్' పేరుతో ఓటర్ లిస్టులను అప్‌డేట్ చేసే ప్రక్రియ నడుస్తోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతి 1,000 మంది నుంచి 1,500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసి ఓటర్ల లిస్టు అప్‌డేట్ చేసేందుకు బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్ఓ)లను నియమించడం జరిగింది. వీరు, తమ బూత్‌ల పరిధిలో ఇంటింటికీ తిరిగి చనిపోయిన ఓటర్లను తొలగించడం, 18 ఏళ్ళు నిండిన, కొద్ది నెలల్లో 18 ఏళ్ళు నిండుతాయన్న వారికి ఓటు హక్కును కల్పించడం, ఓటర్ లిస్టులో పేర్లు, ఇంటి అడ్రస్‌లలో తప్పులుంటే సరిచేయడం చేస్తున్నారు. ఒక నియోజకవర్గంలోని ఓటర్లు, అదే నియోజకవర్గంలో మరో నివాసానికి మారడం, ఒక పోలింగ్ బూత్ నుండి మరొక పోలింగ్ బూత్ పరిధికి మారడం, ఒక నియోజకవర్గం నుండి మరొక నియోజకవర్గానికి నివాసం మారడం తదితర మార్పులతో కొత్త ఓటర్ల లిస్ట్ రూపొందించడం శరవేగంగా జరుగుతోంది.

కేంద్ర ఎన్నికల సంఘం ఈసారి ఓటర్ల జాబితా రూపకల్పనలో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వాములను చేయడం జరిగింది. ఈ ప్రక్రియ దేశంలోని కొన్ని ప్రాంతాలలో ఒక ప్రహసనంగా మారి అధికార పార్టీ, ప్రతి పక్షాల మధ్య వాగ్వివాదాలకు తావిస్తోంది. నేడు అత్యాధునిక కంప్యూటర్లు, ట్యాబ్‌లు, యాప్‌ల వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో కేవలం ఎన్నికల సమయంలోనే ఓటర్ లిస్టులను అప్‌డేట్ చేయటం కాకుండా, దీనిని నిరంతర ప్రక్రియగా మార్చవలసిన అవసరం ఉంది. అలాగే ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న విషయమూ తెలిసిందే (కోవిడ్ కారణంగా 2021లో జన గణన జరగలేదు). ఈ జనాభా లెక్కల సేకరణను కూడా నిరంతరం జరిగేలా చూడవచ్చు. గతంలో ఈ పనులు స్కూల్ టీచర్స్ చేసేవారు. ఈ విధుల నిర్వహణ సమయంలో టీచర్లు బడులను వదిలి ఊళ్లలో తిరగడం వల్ల పిల్లల చదువులు అటకెక్కేవి.

దీనిని నివారించడానికి మారిన పరిస్థితుల్లో పోస్టల్ (తపాలా) సిబ్బందికి ఈ విధులను అప్పగించడం సముచితంగా ఉంటుంది. దేశవ్యాప్తంగా నగర స్థాయి నుండి గ్రామీణ స్థాయి వరకు పోస్టల్ వ్యవస్థ విస్తరించి ఉండడం, సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వచ్చాక భౌతికంగా ఉత్తరాల రూపంలో సమాచారాన్ని అందించడం, పొందడం తగ్గిపోయిన నేపథ్యంలో పోస్టాఫీసులకు ఈ బాధ్యతలు అప్పగించడం సబబే. పోస్ట్ మ్యాన్ తన పరిధిలో ఎవరు పుట్టినా, చనిపోయినా కంప్యూటర్‌లలో అప్‌డేట్ చేసే విధంగా ట్రెయినింగ్ ఇవ్వవచ్చు. అలానే కంప్యూటర్‌లో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు వచ్చేలా ఆప్షన్ సెట్ చేస్తే, ఆటోమాటిక్‌గా అది అటువంటివారి లిస్టును సిద్ధం చేస్తుంది. ఈ ప్రక్రియ సాధ్యాసాధ్యాలను కేంద్రం పరిశీలించాలి.

– డాక్టర్ టి. సేవకుమార్, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు
మొబైల్: 75697 02090

భాష మగవారిది మాత్రమే కాదు

తూర్పు తీరం



కె. ఎన్. మల్లీశ్వరి

నాలుగేళ్ల కిందట ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలు ఏర్పడిన సందర్భం. భారత పైలట్ పాకిస్తాన్‌లో బందీగా ఉన్నప్పటి కాలం. దేశమంతా యుద్ధం కావాలనో, వద్దనో తీవ్రంగా నినదిస్తున్న సమయంలో పాక్ ప్రధాని, బందీ అయిన భారత పైలట్‌ని విడుదల చేస్తామని ప్రకటన చేశారు. అది భారతదేశ విజయంగా, మరీ ముఖ్యంగా ప్రధాని సాధించిన వీరోచిత విజయంగా మీడియా ప్రశంసలు చేసింది. అందులో ఒక తెలుగు చానల్ ఒకడుగు మరీ ముందుకేసి, 'ఈడు మగాడ్రా బుజ్జీ!' అన్న శీర్షికతో, మోదీ ఫోటో పెట్టి అరగంట స్టోరీ చేసింది. పాక్ పీచమణిచిన మగాడిగా జేజేలు పలికింది. ఈ శీర్షికలో అతిశయోక్తులు, వ్యక్తిపూజ, వాస్తవ వక్రీకరణలతో పాటు ప్రమాదకరంగా అనిపించిన విషయం, 'మగతనం' అనే మూసని మీడియా ప్రజల్లోకి ఎలా వ్యాపింపజేస్తోందీ అన్నది.

ఇది మగవారి భాషా ప్రపంచం. అక్షరాలు, పదాలు, వాక్యాలు వారికి అనుగుణంగా వారి చుట్టూ తిరుగుతూ ఉంటాయి. మన వాడుకభాష, చాలా శాతం స్త్రీలను అసమర్థులుగా, సుకుమారులుగా, అమాయకులుగా, శక్తిహీనులుగా చూపిస్తుంది. నిజానికి స్త్రీల పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. కానీ వాటిని ప్రతిబింబించే భాషని మనమింకా తయారు చేసుకోలేదు. ఆయా మార్పులను నలుగురిలోకి తీసుకువెళ్లాల్సిన భాష కూడా జెండర్ మూసలోనే ఉందీ అంటే మార్పు స్వభావం మీదనే సందేహం కలుగుతుంది. దీనిని దేశ అత్యున్నత న్యాయ స్థానం గుర్తించింది కనుకనే కంబాటింగ్ జెండర్ స్టీరియోటైప్స్' పేరుతో ఇటీవల హ్యాండ్ బుక్‌ని విడుదల చేసింది. భాషని ప్రజాస్వామ్యీకరించడంలో ఇది పెద్ద మలుపు.

ఈ పుస్తకానికి జస్టిస్ ధనుంజయ వై. చంద్రచూడ్ రాసిన ముందుమాట విలువైనది. చట్టం ముందు అందరూ సమానులేననీ, పక్షపాతం, భయం, చెడు తలపు లేకుండా న్యాయం అందిస్తామనీ చేసిన ప్రమాణానికి జెండర్ మూస ధోరణి ఆటంకం కలిగిస్తుందని అంటారు. న్యాయానికి జీవం పోసేది భాషేననీ, దాని ద్వారానే చట్టబద్ధ విలువలు నలుగురికీ చేరతాయనీ, అటువంటి భాష జెండర్ వివక్షతో ఉంటే, చేసిన ప్రమాణాలకి కట్టుబడినట్లు కాదంటారు. న్యాయవాదులు, న్యాయమూర్తులతో సహా న్యాయభాషకి అంతర్గర్భితంగా పితృస్వామిక స్వరం ఉంటుందని చెప్పడం ఇన్నాళ్ళ స్త్రీల పోరాటాలు సాధించిన విజయం. ఇటువంటి వివక్షా స్వరంతో కేసులు వాదించడం, తీర్పులు చెప్పడం, ఆయా తీర్పులని సమాజం ఆదర్శంగా తీసుకోవడం గురించిన ఆవేదన ఈ ముందుమాటలో కనిపిస్తుంది.

రెండు దశాబ్దాల కిందట 'పాపులేషన్ సర్వీసెస్



ఇంటర్నేషనల్' అనే సామాజిక సేవాసంస్థ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచడం కోసం కొత్త ప్రచారం నిర్వహించింది. 'పులిరాజా ఎవరు?', 'పులిరాజాకి ఎయిడ్స్ వస్తుందా?' అన్న ప్రశ్నలతో మొదలైన ప్రచారం పెద్ద దుమారం రేకెత్తించడమే కాకుండా మగవారి లైంగిక సామర్థ్యాల చుట్టూ అల్లుకున్న అనేక భ్రమలను పటాపంచలు చేసింది. నిజానికి ఇది ఎయిడ్స్ గురించిన ప్రచారమే కానీ సాధించిన ప్రయోజనాల్లో లైంగిక మూస ఆలోచనలను భాష ద్వారా బద్దలు కొట్టడం ముఖ్యమైనది. 'వాడికేంటి వాడు మగాడు, వాడు రాజా, వాడు పులి, ఎందరితోనైనా తిరుగుతాడు, అది మగతనం' అన్న ఆధిక్యపు ఆలోచనల మీద చావుదెబ్బ కొట్టింది ఆ ప్రచారం. దాన్ని అంది పుచ్చుకున్న సమాజం, మరిన్ని ప్రయోగాలు చేస్తే బావుండేది. అక్కడితో అది సద్దుమణిగింది.

తీర్పులు ఇవ్వడంలోనూ, తీర్పు ప్రతిని రాయడంలోనూ ప్రమాదకరమైన జెండర్ మూసనుంచి తప్పించుకోవడానికి 'కంబాటింగ్ జెండర్ స్టీరియోటైప్స్' మార్గదర్శకంగా ఉంటుంది. భాషాపరంగా స్త్రీలకి, పురుషులకి అంట గట్టిన అనేక మూసలను తిరస్కరిస్తూ ప్రత్యామ్నాయ పదాలను, వాక్యాలను, భావాలను విస్తృతంగా ఉదాహరణ కోసం ఇచ్చారు. అందులో కొన్ని: విధేయమైన/ విశ్వసనీయమైన /మంచిభార్య అన్న పదాల స్థానంలో 'భార్య' అని మాత్రమే వాడాలని. 'ఈవ్ టీజింగ్' స్థానంలో 'స్ట్రీట్ సెక్సువల్ హెరాస్మెంట్'. 'హౌస్ వైఫ్' బదులు 'హోమ్ మేకర్', 'ప్రాస్టిట్యూట్' బదులు 'సెక్స్ వర్కర్', 'పెళ్లి కాని తల్లి' బదులు 'తల్లి' వంటివి.

కేవలం పదాలే కాకుండా అనేక 'మిత్'ల గురించి కూడా ఈ పుస్తకం వివరించింది. 'ప్రతీ స్త్రీ తల్లి కావాలని కోరుకుంటుంది, పెళ్ళికాని స్త్రీలు పెద్దపెద్ద నిర్ణయాలు తీసుకోవడానికి సమర్థులు కారు, పురుషుల కన్నా స్త్రీలు నిష్క్రియాపరులు, బైటపనికి వెళ్ళే స్త్రీలు పిల్లల్ని బాగా చూసుకోరు, స్త్రీలు పురుషులవద్ద అణిగిమణిగి ఉండాలి, సంప్రదాయబద్ధంగా దుస్తులు ధరించని స్త్రీలు మగవారితో లైంగికచర్యలకి సిద్ధంగా ఉన్నట్లు, అటువంటి దుస్తులు వేసుకున్న స్త్రీని ఆమెకి ఇష్టం లేకున్నా పురుషుడు తాకితే అది ఆమె తప్పే' వంటి వాటికి చట్టపరిధిలో దీటైన సమాధానాలు ఇచ్చింది ఈ పుస్తకం. ఇటువంటి మార్పు కోరే పుస్తకాలు వ్యక్తిగత పరిధిలో ప్రచారం పొందడం కన్నా సమూహాలను ప్రభావితం చేసే వ్యవస్థల మార్గదర్శకాల్లో భాగం కావాలి. న్యాయపరిధికి అవసరమైనవి, న్యాయ వ్యవస్థ తయారు చేసుకున్నట్లు విద్యావ్యవస్థలో, మరీ ముఖ్యంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో ఇటువంటి ప్రయత్నాలు జరగాలి. సమాజం ఎంత భావ విప్లవం తీసుకువచ్చినా దాన్ని మోసుకుపోవాల్సిన భాష మూసనీ, వివక్షనీ వదుల్చుకోకపోతే విప్లవాలన్నీ అసంపూర్ణాలే అవుతాయి.

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి, ప్రరవే
ఈ–మెయిల్: Malleswari.kn2008@gmail.com

మంచి చెడు–పాలు నీళ్లు

మంచి, చెడుల మిశ్రమం మనిషి. 'కోరిక' అనే సామాన్యార్థంలో 'తాపత్రయం' అనే మాటను తరచూ రోజువారీ సంభాషణలలో వింటూవుంటాం. తాపము, త్రయము అనే రెండు మాటల సమ్మేళనమైన ఈ మాటకు 'ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం అనే మూడింటికి సంబంధించిన ఖేదం' అన్నది అసలైన అర్థం. జ్వరం, జలుబు, దగ్గు వంటి సామాన్య రుగ్మతలు మొదలుకొని మనిషిని అనేక రకాలుగా బాధపెట్టగలిగే మధుమేహం, గుండెజబ్బు వంటి ప్రమాదకరమైన తన సొంత శరీర సంబంధ రుగ్మతల వలన కలిగే అపరిమిత ఖేదం ఆధ్యాత్మికం. తన భార్య, పిల్లలకు సంభవించే బాధల వలన కలిగే ఖేదం ఆధిభౌతికం. అకస్మాత్తుగా, దైవికాలైనట్టి ప్రకృతి వైపరీత్యాల వలన కలిగేది ఆధిదైవికం.



జ్యోతిర్మయం

ఎలాంటి మనిషినైనా ఈ తాపత్రయం కొన్ని సందర్భాలలో లొంగదీసుకుని విచక్షణను పోగొట్టుకునేలా చేసి చెడువైపునకు దారి మళ్ళించే ప్రభావం కలిగినదై ఉంటుంది. అయితే ఇందులో గ్రహించవలసిన అంశం ఏమిటంటే, అది అతడి ప్రవృత్తిలో శాశ్వతమైన మార్పులు చోటుచేసుకోవడానికి సాధారణంగా దారి తీయదు. కొన్ని రోజుల తరువాత తాను చేసిన పనికి తానే చింతించి, పశ్చాత్తాప పడటం కూడా కొందరిలో జరగవచ్చు. అందువలన మనుషులలో ఎవరూ శాశ్వతమైన మంచివారుగా, అలాగే శాశ్వతమైన చెడ్డవారుగా ఉండరన్నది గ్రహించాలి. ఈ న్యాయాన్ని అర్థం చేసుకున్నప్పుడు, ఏ మనిషినైనా కేవలం మంచివానిగా లేదా పూర్తిగా చెడ్డవానిగా చూడడం వివేకవంతులు చేయవలసిన పని కాదు అని తెలుసుకుంటాము.

'క్షీర నీరంబుల వేరు చేసి, పాల/గ్రోలు రాయంచలట్టుల గొప్పవారు/మంచిగుణముల నెలమి గ్రహించి యెపుడు/విడిచి పుత్తురు తప్పుల వేడ్కతోడ' అని 'చంద్రకళా స్వయంవరము' అనే పేరున్న ఒక పూర్వ నాటకపు ప్రస్తావనలో నాటకకర్త చెప్పారు. ఆయన చెప్పినట్లు మనుషులను వారు చేసే పనులను బట్టి మాత్రమే బేరీజు వేసి, పాలునీళ్ళు కలిసివున్న మిశ్రమం నుండి పాలను నేర్పుగా వేరు చేసి నీళ్ళను పనికి రానివిగా గుర్తించి విడిచిపెట్టే హంసల వలె, ప్రతి మనిషి వివేకవంతుడై ప్రవర్తిస్తూ, ఎదుటి వ్యక్తిలోని మంచిని మాత్రమే గ్రహించి, చెడును వదిలిపెట్టి ప్రశాంత చిత్తులై ఉండాలి. అంతే తప్ప, కనిపించిన కొద్దిపాటి చెడుని భూతద్దంలో చూసి భంగ పడి తన మానసిక స్థితికి హాని కలిగించుకుని, సౌఖ్యానికి దూరం కాకూడదు అని గ్రహించాలి.

– వెంకట్ భట్టు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.సప్తమి రా.10.07 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** విశాఖ తె.5.04 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.10.19 నుండి 11.56 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.36 నుండి 12.27 వరకు, **అమృతఘడియలు:** రా.8.04 నుండి 9.42 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.47, **సూర్యాస్తమయం:** 6.19.

క్లాప్‌మిత్రల వేతన బకాయిల చెల్లింపు





సాక్షి, అమరావతి: గ్రామాల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేసే క్లాప్ మిత్రలకు (పారిశుద్ధ్య కార్మికులు) వేతన బకాయిలన్నింటినీ వేగంగా చెల్లించే ప్రక్రియ ఇటీవలే మొదలైందని.. అయినా ×ఈనాడు፣ పత్రిక ఉద్దేశపూర్వకంగా ఓ తప్పుడు భావనతో మంగళవారం ×పారిశుద్ధ్య కార్మికులకూ జగన్ దెబ్బ፣ అంటూ దుష్ప్రచారం చేస్తూ కథనాన్ని ప్రచురించిందని రాష్ట్ర ప్రభుత్వం తప్పు బట్టింది. నిజానికి.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 43,534 మంది క్లాప్‌మిత్రలకు 2022 అక్టోబరు నుంచి జూన్ 2023 మధ్య కాలానికి చెల్లించాల్సిన వేతన బకాయిలకు గాను రూ.84.03 కోట్లు ఇప్పటికే చెల్లించడం జరిగిందని, మరో రూ.141 కోట్ల చెల్లింపు ప్రక్రియ పురోగతిలో ఉందని పంచాయతీరాజ్ శాఖ ×ఫ్యాక్ట్ చెక్፣ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ చెల్లింపులకు గాను 2,055 గ్రామ పంచాయతీల్లో వెండర్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైనట్లు పేర్కొంది. ఇక మీదట గ్రామ పంచాయతీల నిధుల నుంచి ఎప్పటికప్పుడు క్లాప్‌మిత్రల వేతనాల చెల్లింపులు చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.

ప్రత్యేక డ్యాష్‌బోర్డు ఏర్పాటు..

మరోవైపు.. క్లాప్‌మిత్రల వేతనాల చెల్లింపు విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు వీలుగా ప్రత్యేక డ్యాష్‌బోర్డును ఏర్పాటుచేసినట్లు కూడా ఆ శాఖ వివరించింది. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో ప్రభుత్వం నూతన విధానాలను అవలంబిస్తూ.. గ్రామాల్లో ఎక్కడా చెత్తాచెదారం పోగవకుండా పూర్తి పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని 2021 అక్టోబరు 2న ప్రారంభించిందని.. ఆ రోజు నుంచి ప్రతి గ్రామంలోనూ ఉ.6గంటల నుంచి క్లాప్‌మిత్రల ద్వారా ఇంటింటి నుంచి చెత్త సేకరణ కొనసాగుతోందని తెలిపింది. ఇందుకోసం రాష్ట్రంలో మొత్తం 43,534 మంది పనిచేస్తున్నట్లు పేర్కొంది. ఈ ప్రక్రియలో.. గ్రామ పంచాయతీలకు 32,777 చెత్త తరలించే రిక్షాలు, 1,004 టిప్పర్లను ప్రభుత్వం ఇప్పటికే సమకూర్చినట్లు పంచాయతీరాజ్‌శాఖ వివరించింది. అలాగే, ప్రతినెలా క్లాప్‌మిత్రల వేతనాల చెల్లింపు కోసమే ప్రభుత్వం రూ.27 కోట్లు ఖర్చుచేస్తోందని తెలిపింది.

శాంతి భద్రతల సమస్య సృష్టించడమే టీడీపీ వ్యూహం

తద్వారా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని పన్నాగం పన్నారు

- పోలీసులపై దాడి చేస్తే కాల్పులు జరుపుతారని భావించారు
- ఆ కాల్పుల్లో ఒకరిద్దరు మరణిస్తారని ఆశించారు
- శాంతిభద్రతలు క్షీణించాయన్న సాకుతోరాష్ట్రపతి పాలన కోరవచ్చనుకున్నారు
- పోలీసుల సంయమనంతో వారి పాచిక పారలేదు
- పుంగనూరు విధ్వంసాన్ని చల్లా బాబు స్వయంగా పర్యవేక్షించారు
- అమాయకులు కేసుల్లో ఇరుక్కోకూడదనే జాగ్రత్తగా దర్యాప్తు చేస్తున్నాం
- చల్లా బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు
- హైకోర్టును అభ్యర్థించిన ఏఏజీ సుధాకర్‌రెడ్డి
- టీడీపీ నేత చల్లా బాబు ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వ్

సాక్షి, అమరావతి : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యక్రమాన్ని అడ్డంపెట్టుకుని రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించి, ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్నదే తెలుగుదేశం పార్టీ వ్యూహమని పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. చిత్తూరు జిల్లా పుంగనూరు విధ్వంసంపై పోలీసులు నమోదు చేసిన కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ టీడీపీ నేత చల్లా బాబు హైకోర్టులో దాఖలు చేసిన ఏడు వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్ రెడ్డి మంగళవారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఏఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పుంగనూరులో టీడీపీ శ్రేణుల విధ్వంసం వెనుక పెద్ద వ్యూహమే ఉందని చెప్పారు. పుంగనూరులో విధ్వంసం సృష్టించి, పోలీసులపై దాడులు చేస్తే కాల్పులు జరుపుతారని, ఈ కాల్పుల్లో ఒకరిద్దరు మరణించేలా చేసి, ఆ మృతదేహాలను కుప్పం నుంచి శ్రీకాకుళం దాకా తిప్పి రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ప్రజలను మభ్య పెట్టాలని, రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతి, ప్రధానిని కోరాలన్నది టీడీపీ నేతల వ్యూహమని వివరించారు. అందుకే అంగళ్ల నుంచి పుంగనూరు వరకు విధ్వంసాన్ని కొనసాగించారన్నారు. పోలీసులపై రాళ్లు, బీరు బాటిళ్లతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. అదనపు ఎస్పీ, డీఎస్పీల పైనా దాడి చేయడమే వారి భారీ వ్యూహానికి నిదర్శనమన్నారు. తీవ్ర గాయాలెనప్పటికీ, పోలీసులు ఎంతో సంయమనంతో వ్యవహరించి, కాల్పులు జరపకుండా పరిస్థితిని అదుపులోకి తెచ్చారని, దీంతో టీడీపీ నేతల పాచిక పారలేదని తెలిపారు. ఈ విధ్వంసకాండను టీడీపీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబు దగ్గరుండి పర్యవేక్షించారని, అందుకు ఆధారాలున్నాయని తెలిపారు. అందువల్ల ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని అభ్యర్థించారు. ఈ విధ్వంసంలో పాల్గొన్న అనేక మందిని ఇప్పటికే గుర్తించామని, అమాయకులు కేసుల్లో ఇరుక్కోకూడదన్న ఉద్దేశంతో చాలా జాగ్రత్తగా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. టీడీపీ శ్రేణుల విధ్వంసం వీడియోల పెన్ డ్రైవ్‌ను కోర్టుకు సమర్పించి, వాటిని చూడాలని అభ్యర్థించారు. వాటిని చూస్తేనే విధ్వంసం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతుందని తెలిపారు. 47 మంది పోలీసులపై టీడీపీ కార్యకర్తలు పుంగనూరులోనే వేర్వేరు చోట్ల వేర్వేరుగా దాడులు చేయడంతో వేర్వేరుగా కేసులు నమోదు చేశామన్నారు. ఘటనలు జరిగిన ప్రాంతాలు, నిందితులు, ఫిర్యాదు చేసిన పోలీసులు కూడా వేర్వేరు అయినందునే బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వివరించారు. చల్లా బాబు డ్రైవర్ నరేన్, పీఏ గోవర్ధన్‌రెడ్డిల వాంగ్మూలాలను పరిశీలిస్తే, ఈ విధ్వంసానికి వ్యూహ రచన స్పష్టంగా అర్థమవుతుందన్నారు.

బెయిల్ రాకూడదనే హత్యాయత్నం కేసు పెట్టారు

ఒక కేసులో బెయిలు వస్తే మరో కేసులో అరెస్టు చేసేందుకే బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని చల్లా బాబు న్యాయవాదులు హెచ్.ప్రహ్లాద్ రెడ్డి, డి.కోదండరామిరెడ్డి, ఎస్.నాగేశ్వరరెడ్డి, ఆకుల శ్రీకృష్ణ సాయి భార్గవ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇలా బహుళ ఎఫ్ఐఆర్‌లు కుదరవని ఓ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. బెయిల్ రాకూడదన్న ఉద్దేశంతోనే హత్యాయత్నం కేసు పెట్టారని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు ముగించడంతో చల్లా బాబు ముందస్తు బెయిల్ పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదివాసీ ప్రొఫెసర్ పరిశోధనకు పేటెంట్


దిలీప్‌కుమార్

పెదబయలు (అల్లూరి సీతారామరాజు జిల్లా): శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్‌సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కోడా దిలీప్‌కుమార్ డీప్ లెర్నింగ్ ఉపయోగించి ఎలక్ట్రికల్ వాహనాలు వేగంగా సురక్షితంగా ఛార్జింగ్ చేయడానికి డైనమిక్ పవర్ కేటాయింపు అనే అంశంపై పరిశోధన చేశారు. దీనికి భారత ప్రభుత్వం జనరల్ కార్యాలయం ద్వారా పేటెంట్ హక్కు కల్పించింది. ఈ ఆవిష్కరణ యావత్ ఆదివాసీలే కాకుండా దేశ ప్రజలు గర్వించదగ్గ విషయమని ఆదివాసీ హక్కుల ఉద్యమ నేత కోడా సింహాద్రి తెలిపారు.

'జైభీమ్' హీరో, దర్శకులకు హైకోర్టు నోటీసులు

చెన్నై: నటుడు సూర్య కథానాయకుడిగా నటించిన చిత్రం జైభీమ్. ఇందులో ఆయన మాజీ న్యాయమూర్తి చంద్రు పాత్రలో నటించారు. జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2021లో విడుదలైంది. ఈ చిత్రంలో కురవర్ సామాజిక వర్గాన్ని కించపరిచే విధంగా సన్నివేశాలున్నాయంటూ ఆ సామాజిక వర్గం సంరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురుగేశన్ చెన్నై నేరపరిశోధనా విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్ర వర్గాలు చెన్నై ఎగ్మూర్ కోర్టును ఆశ్రయించాయి. కేసును విచారించిన న్యాయస్థానం కురవన్ సంరక్షణ సంఘం తరపు ఫిర్యాదును కొట్టి వేసింది. దీంతో ఆ సంఘం చెన్నై హైకోర్టులో అప్పీల్ చేసింది. ఈ కేసు మంగళవారం న్యాయమూర్తి ఆర్.హేమలత సమక్షంలో విచారణకు వచ్చింది. కేసును విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి వివరణ ఇవ్వాల్సిందిగా నటుడు సూర్య, దర్శకుడు జ్ఞానవేల్‌కు నోటీసులు జారీ చేశారు.

మురుగు నుంచి విద్యుత్

ప్రణాళిక సిద్ధం చేసిన బెజవాడ నగరపాలక సంస్థ

- విజయవాడలో ప్రస్తుతం 8 మురుగునీటి శుద్ధి ప్లాంట్లు
- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరో రెండు కొత్త ప్లాంట్లు
- రూ.135 కోట్లతో కొనసాగుతున్న ఆధునికీకరణ పనులు



రామలింగేశ్వర్‌లో ఏర్పాటు చేసిన ఎస్టీపీ ల్యాబ్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: మురుగునీటి శుద్ధికి విజయవాడ నగర పాలక సంస్థ ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తోంది. ఇప్పటికే ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్ల(ఎస్టీపీ)ను ఆధునికీకరిస్తూనే.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త ప్లాంట్లను నెలకొల్పుతోంది. మరోవైపు ఈ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ ఆదాయాన్ని ఆదా చేసుకునేలా ఏర్పాటు చేస్తోంది. నగరంలో 150 ఎంఎల్‌డీ సామర్థ్యంతో అజిత్‌సింగ్ నగర్, ఆటోనగర్, జక్కంపూడి, రామలింగేశ్వర్‌నగర్‌లో రెండు ఎస్టీపీలున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్తగా రామలింగేశ్వర్ నగర్‌లో 20 ఎంఎల్‌డీ, ఆటోనగర్‌లో 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో రెండు ఎస్టీపీలను నిర్మిస్తున్నారు. ఈ ప్లాంట్లలో నీరు శుద్ధి చేసే సమయంలో వచ్చే మిథేన్ గ్యాస్‌ను స్క్రబ్బర్ మెషిన్ల ద్వారా శుద్ధి చేస్తారు. అందులోని తేమ, ఆమ్లాలను తీసేయగా వచ్చే మిథేన్ గ్యాస్‌కు టర్బైయిన్‌లను అనుసంధానం చేస్తారు. తద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్‌ను అక్కడ ఎస్టీపీలలోనే వినియోగించుకోనున్నారు. ప్రస్తుతం సింగ్‌నగర్, జక్కంపూడి, రామలింగేశ్వర్ నగర్‌లోని నాలుగు ఎస్టీపీలకు స్క్రబ్బర్ మెషిన్లు ఏర్పాటు చేసి, మిథేన్ గ్యాస్‌ను శుద్ధి చేయడం ద్వారా గ్యాస్ టర్బైయిన్‌లకు అనుసంధానం చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి.

యునిడో సహకారంతో..

రామలింగేశ్వర్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఎస్టీపీ పాతది కావడంతో జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) సూచించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా దానిని ఆధునికీకరిస్తున్నారు. ఈ పనుల కోసం రూ.14.93 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇందుకు యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యునిడో) సహకారం అందిస్తోంది. విజయవాడ కార్పొరేషన్‌కు రూ.10 కోట్ల నిధులను అందించింది. ఈ నిధులు కర్బన ఉద్గారాలను తగ్గించడానికి ఉపయోగిస్తున్నారు. దీంతోపాటు బయో గ్యాస్ ప్లాంట్లను స్థాపించడంలో ఈ నిధులు కీలక భూమిక పోషిస్తున్నాయి. అంతర్జాతీయ సంస్థ నుంచి వచ్చిన స్థిరమైన పద్ధతులను అవలంబించడంతోపాటు, పర్యావరణ సవాళ్లను తగ్గించడంలో విజయవాడ కార్పొరేషన్‌కు ప్రత్యేక గుర్తింపు వస్తోంది.

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాం



ఎస్టీపీల ఆధునికీకరణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేస్తున్నాం. సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వైపు విజయవాడ కార్పొరేషన్ అడుగులు వేస్తోంది. రూ.135 కోట్లతో ఎస్టీపీలను ఆధునికీకరిస్తున్నాం. మురుగునీటి నిర్వహణ క్లిష్టమైన సమస్య. దీనిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం. స్వచ్ఛమైన ఇంధన పరిష్కారాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎస్టీపీల నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, ఆ విద్యుత్‌ను వాటికే వినియోగిస్తాం.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కమిషనర్, విజయవాడ

ఎస్టీపీల ఆధునికీకరణ

గతంలో నిర్మించిన పాత ఎస్టీపీలను అమృత్, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.135 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు. ఇందులో ప్రధానంగా ప్రతి ప్లాంట్‌ను ఆహ్లాదకరమైన ఇండస్ట్రియల్ వాతావరణం కలిగి ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ప్లాంట్‌లలో సీసీ రోడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మిస్తున్నారు. మరోవైపు నగరం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజల సహకారం తీసుకుంటున్నారు. రోడ్లు, డ్రెయిన్‌లలో చెత్త, వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.


అన్నమయ్య భవనంలో భక్తుల లగేజీలను భద్రపరిచే ట్యాగులను చూపిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి, దాతలు



లగేజీ కోసం కంప్యూటర్ ద్వారా చెక్ చేసుకుంటున్న భక్తులు


లగేజీ కౌంటర్లలో లగేజీ ట్యాగులను స్కాన్ చేస్తున్న సిబ్బంది

వేగంగా, సులభంగా భక్తుల లగేజీ నిర్వహణ

- కొత్తగా బాలాజీ బ్యాగేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అందుబాటులోకి..
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి

తిరుమల: శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తమ లగేజీని, సెల్‌ఫోన్లను డిపాజిట్ చేసి తిరిగి తీసుకునే ప్రక్రియను మరింత వేగంగా, సులభంగా మార్చేందుకు.. బాలాజీ బ్యాగేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలో మంగళవారం సీవీఎస్వో నరసింహ కిశోర్‌తో కలిసి ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడారు. నూతన విధానంలో లగేజీ, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను డిపాజిట్ చేస్తే.. ఎక్కువ సమయం వేచి ఉండే అవసరం లేకుండా సులభంగా పొందవచ్చన్నారు. భక్తులు కౌంటర్ వద్ద లగేజీ ఇవ్వగానే.. వారి వద్ద ఉన్న దర్శన టికెట్‌ను స్కాన్ చేసి వాటి వివరాలను ఎలక్ట్రానిక్ డివైస్‌లో నిక్షిప్తం చేస్తామన్నారు. దర్శన టికెట్ లేని భక్తులకు వారి వివరాలు, పేరు నమోదు చేసుకుని బ్యాగ్‌కు ఆర్ఎఫ్ఐడీతో కూడిన ట్యాగ్ జతపరిచి క్యూఆర్ కోడ్ రసీదు ఇస్తామని చెప్పారు. ఫోన్ డిపాజిట్ కోసం దర్శన టికెట్‌తో పాటు భక్తుల వివరాలు సేకరిస్తామని తెలిపారు. భక్తులకు వారి లగేజీ గురించిన సమాచారం మెసేజ్ రూపంలో అందుతుందన్నారు. భక్తుల రసీదును ఎలక్ట్రానిక్ డివైస్‌తో స్కాన్ చేసిన వెంటనే వారి మొబైల్, లగేజీ భద్రపరిచిన ర్యాక్ నంబర్ తెలుస్తుందని.. తద్వారా సులభంగా లగేజీ తిరిగి పొందే అవకాశం లభించిందన్నారు. తిరుమలలో 16 కేంద్రాల ద్వారా 44 కౌంటర్లలో ఈ ప్రక్రియ జరుగుతోందన్నారు. నూతన విధానం కోసం చెన్నైకి చెందిన చార్లెస్ మార్టిన్ రూ.2 కోట్లు, బెంగళూరుకు చెందిన వేణుగోపాల్ రూ.కోటి, హైదరాబాద్‌కు చెందిన ట్రాక్ ఇట్ సంస్థ సీఈవో వేదాంతం సోమశేఖర్ రూ.17 లక్షలు విరాళంగా ఇచ్చారని నరసింహ కిశోర్ తెలిపారు. సమావేశంలో అధికారులు బాలిరెడ్డి, గిరిధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



లగేజీ తీసుకునే భక్తుల స్కాన్ కాపీ

తల్లి, కుమార్తెలను హత్య చేసిన వ్యక్తికి ఉరిశిక్ష

- చిత్తూరులోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పు
- సహజీవనం సాగిస్తున్న మహిళపై అనుమానంతో జంట హత్యలు


దోషి సయ్యద్ మౌలాలి

చిత్తూరు అర్బన్: సహజీవనం సాగిస్తున్న మహిళపై అనుమానంతో ఆమెతోపాటు తల్లిని సైతం హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష విధిస్తూ చిత్తూరులోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎస్.రమేష్ మంగళవారం సంచలన తీర్పు ఇచ్చారు. ఈ కేసు వివరాలను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.లోకనాథరెడ్డి మీడియాకు వెల్లడించారు. అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లెకు చెందిన సయ్యద్ మౌలాలి(49) తంబళ్లపల్లెకు చెందిన గిరిజన మహిళ గంగులమ్మ కుమార్తె సరళమ్మ(39)తో సహజీవనం చేసేవాడు. సరళమ్మకు భర్త చనిపోవడంతో తన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో కలిసి తల్లి వద్ద ఉంటోంది. ఆమెపై అనుమానంతో 2020 ఆగస్టులో ఆమె తలపై కర్రతో కొట్టి చంపేశాడు. రెండురోజుల తర్వాత సరళమ్మ తల్లి గంగులమ్మ (57)ను చంపేశాడు. ఆ తర్వాత సరళమ్మ పిల్లల (అందరూ మైనర్లే)ను కర్ణాటక సమీపంలోని గొనిపల్లెకు తీసుకువెళ్లాడు. సరళమ్మ పెద్ద కుమార్తెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో సరళమ్మ, గంగులమ్మ, పిల్లలు కనిపించడం లేదని సరళమ్మ ఆడపడుచు ధనమ్మ 2021 జనవరి 27న తంబళ్లపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడు మౌలాలిని అరెస్టు చేసి బాలికలను విడిపించారు. ఈ కేసులో మొత్తం 24 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం.. సరళమ్మ కుమార్తెపై లైంగికదాడికి పాల్పడినట్లు రుజువుకావడంతో ఈ ఏడాది మార్చిలో చిత్తూరులోని ప్రత్యేక మహిళా కోర్టు మౌలాలి బతికి ఉన్నంత వరకు జైల్లోనే ఉంచాలని (జీవిత ఖైదు) తీర్పు ఇచ్చింది. తాజాగా జంట హత్యల కేసులో సరళమ్మను హత్య చేసినందుకు మౌలాలికి మరోసారి జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. గంగులమ్మను చంపినందుకు మరణశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. రూ.5 వేల జరిమానా సైతం విధించారు.

కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌తో సత్వర న్యాయం

రాయచోటి: తల్లీబిడ్డల హత్య కేసును 'కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్' (నేరారోపణ ఆధారిత పోలీసింగ్) విధానంలో విచారణ జరిపినట్టు రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. దీని వల్ల 20 నెలల కాలంలోనే కేసు విచారణ పూర్తయి నిందితుడికి న్యాయస్థానం ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పిందన్నారు. ముఖ్యమైన కేసుల్లో 2022 ప్రారంభం నుంచి ఈ విధానంలో విచారణ జరిగేలా చూస్తున్నామని పేర్కొన్నారు.

పోలీసులమని బెదిరించి రూ.2 కోట్లు లూటీ

- ఎస్ఆర్ఆర్ కంపెనీ ఉద్యోగులను బెదిరించి దోచుకెళ్లిన దొంగలు
- రంగంలోకి దిగిన ప్రత్యేక పోలీసు బృందాలు
- అనంతపురం జిల్లా గార్లదిన్నెలో ఘటన

అనంతపురం శ్రీకంఠం సర్కిల్/గార్లదిన్నె: పోలీసులమని బెదిరించి రూ.2 కోట్లు దోచుకున్న దొంగల ఉదంతం అనంతపురం జిల్లా గార్లదిన్నెలో తీవ్ర కలకలం రేపింది. మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఈ భారీ దారి దోపిడీ జరిగింది. 44వ జాతీయ రహదారిపై పోలీసులమంటూ లాఠీలు తీసుకుని వచ్చిన దొంగల ముఠా ఒక కారును ఆపి.. అందులోని వ్యక్తులను బెదిరించి రూ.2 కోట్ల నగదుతో ఉడాయించారు. విశ్వసనీయ వర్గాలు వెల్లడించిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌లోని ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందిన ఇద్దరు ఉద్యోగులు ఈ నెల 20న బెంగళూరు వెళ్లారు. అక్కడి నుంచి 21 రాత్రి రూ.2 కోట్లు నగదు తీసుకుని తిరిగి హైదరాబాద్ బయలుదేరారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున అనంతపురం చేరుకున్న వారు స్థానికంగా ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకుని కొంతసేపు సేదదీరారు. అనంతరం సాయంత్రం అనంతపురం నుంచి గార్లదిన్నె మీదుగా హైదరాబాద్‌కు కారులో బయలుదేరారు. రాత్రి ఏడు గంటల సమయంలో కారు గార్లదిన్నె దాటగానే కలగాసినపల్లి వద్ద నలుగురు వ్యక్తులు అడ్డొచ్చారు. జంగిల్ ప్యాంట్, షూ వేసుకుని ఫైబర్ లాఠీలతో వచ్చిన ఆ వ్యక్తులు కారు డ్రైవర్ శివ వద్దకు వెళ్లి.. మీరు యాక్సిడెంట్ చేసి వస్తున్నారు.. కిందకు దిగండంటూ హుకుం జారీ చేశారు. తామెక్కడా యాక్సిడెంట్ చేయలేదని చెప్పినా వినిపించుకోలేదు. డ్రైవర్ శివతో పాటు వాహనంలోని మిగిలిన ముగ్గురు వ్యక్తులనూ కిందకు దింపి తమ వాహనంలో ఎక్కించుకున్నారు. ఈ క్రమంలో డబ్బున్న బ్యాగును తీసిచూసిన వారు..దాన్ని కూడా తీసుకుని ఎస్ఆర్ఆర్ కంపెనీకి చెందిన వాహనాన్ని అక్కడే వదిలేసి కొంత దూరం వెళ్లారు. మార్గమధ్యంలో వారి సెల్‌ఫోన్లను కూడా లాక్కున్నారు. అనంతరం వారిని కూడా కిందకు దింపేసి నలుపు రంగు ఇన్నోవా వాహనంలో అక్కడి నుంచి పరారయ్యారు. దోపిడీ సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాలతో అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ముఠా ఆచూకీ తెలుసుకునేందుకు ఇప్పటికే పలు చోట్ల సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు.

పేదలు ఎదగకూడదనే బాబు అండ్‌కో కుట్ర

- 1,059వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: పేదలు ఆర్థికంగా ఎదగకూడదనే దుర్మార్గపు ఆలోచన బాబు అండ్‌కోకు ఉన్నందునే తమ హక్కులకు అడుగడుగునా అడ్డు తగులుతూ కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,059వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. ఏపీలో కులగజ్జి రాజకీయాలకు తెరలేపిన బాబు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను ఆర్థికంగా అణగదొక్కి అధికారాన్ని తన గుప్పెట్లోకి తెచ్చుకునేందుకు కుటిల పన్నాగాలు పన్నుతున్నాడన్నారు. ఇందులో భాగంగానే పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణం, మూడు రాజధానుల ద్వారా అన్ని ప్రాంతాల సమానాభివృద్ధికి అడ్డుపడుతూ కోర్టుల్లో తప్పుడు కేసులు వేయిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి ప్రజారాజధాని అని చెబుతున్న చంద్రబాబు అక్కడ నిరుపేదలకు స్థానం లేకుండా చేసేందుకు తప్పుడు పిటిషన్లు ఎందుకు వేయిస్తున్నాడని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే తిలాపాపం, తలా పిడికెడు అన్న చందంగా తాము కూడా దోచుకోవచ్చనే ఆలోచనతో ఎల్లో మీడియా, పవన్‌కళ్యాణ్ నానా అగచాట్లు పడుతున్నారని చెప్పారు. చిట్‌ఫండ్ సంస్థ పేరుతో నిలువుదోపిడీ చేస్తున్న రామోజీరావును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు యనుమల రాజ్‌కుమార్, బేతపూడి సాంబయ్య, పులిదాసు, ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, ఎస్.విజయ నిర్మల, మందపాటి రమేష్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

టమాటా ఉత్పత్తిలో రాష్ట్రానికి మూడో స్థానం

- దేశం మొత్తంలో ఆంధ్రప్రదేశ్ వాటా 11.30 శాతం
- రాష్ట్రంలో 2022–23లో 23.37 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి
- గుజరాత్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో ఉత్పత్తి తగ్గడం వల్లే ధరల పెరుగుదల
- పంటను దెబ్బతీసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలు
- టమాటా ధరల పెరుగుదల, సమస్యలపై నాబార్డు తాజా నివేదిక

గత కొన్ని రోజులుగా హోల్‌సేల్, రిటైల్ మార్కెట్‌ల్లో కిలో టమాటా ధరలు (రూపాయల్లో)

తేదీలు	హోల్‌సేల్	రిటైల్
జూలై 10	86.31	105.42
జూలై 30	104.0	126.18
జూలై 31	108.5	130.2
ఆగస్టు 1	110.7	132.57
ఆగస్టు 9	109.18	131.69
ఆగస్టు 10	106.91	131.69
గతేఏడాది		
ఆగస్టు 10	26.4	34.24



దేశంలో ప్రధానంగా టమాటా పండించే రాష్ట్రాల్లో 2022-23లో ఉత్పత్తి, వృద్ధి శాతాలు ఇలా..

రాష్ట్రం	ఉత్పత్తి శాతం	వృద్ధి శాతం
మధ్యప్రదేశ్	13.40	0.10
కర్ణాటక	12.60	23.10
ఆంధ్రప్రదేశ్	11.30	1.50
గుజరాత్	7.20	-23.90
ఒడిశా	7.00	25.20
పశ్చిమ బెంగాల్	6.10	0.00
మహారాష్ట్ర	6.00	-1.20
తమిళనాడు	5.80	-26.10
బిహార్	5.40	11.20
ఛత్తీస్‌గఢ్	4.80	-19.70
ఇతర రాష్ట్రాలు	20.4	3.79

సాక్షి, అమరావతి: దేశంలో టమాటా ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 2022–23లో 23.37 లక్షల మెట్రిక్ టన్నుల టమాటాలు ఉత్పత్తి అయ్యాయి. దీంతో దేశం మొత్తం టమాటా ఉత్పత్తిలో రాష్ట్రం వాటా 11.30 శాతంగా నమోదైంది. ఈ మేరకు ఇటీవల టమాటా ధరల పెరుగుదలకు కారణాలు, సమస్యలపై నాబార్డు మంగళవారం నివేదికను విడుదల చేసింది. ప్రధానంగా దేశంలో టమాటాలు ఎక్కువగా పండించే రాష్ట్రాల్లో 2022–23లో ఉత్పత్తి భారీగా తగ్గిందని నివేదిక తెలిపింది. అయితే ఇందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అంతకు ముందు ఆర్థిక ఏడాదితో పోల్చితే 2022–23లో 1.50 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించింది.

ఈ రాష్ట్రాల్లో ఉత్పత్తి తగ్గడమే కారణం..

ప్రధానంగా టమాల ధరల పెరుగుదలకు గుజరాత్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో ఉత్పత్తి గణనీయంగా తగ్గడమేనని నాబార్డు తెలిపింది. దీంతో పాటు మేలో అకాల వర్షాలు, జూన్‌లో వర్షాలు, వడగండ్ల వానలకు పంట దెబ్బతిందని వివరించింది. కర్ణాటకలో పంట ప్రధాన ప్రాంతాల్లో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వడగళ్ల వానలకు, జూన్‌లో భారీ వర్షాలకు.. వేసిన పంటలో 70 శాతం నాశనమైందని పేర్కొంది. అలాగే మహారాష్ట్రలో ఈ ఏడాది వాతావరణ అననుకూల పరిస్థితులు ఉండటంతో పెద్ద ఎత్తున పంట దెబ్బతిందని వెల్లడించింది. దేశంలో టమాటా ఉత్పత్తి 2021–22లో 206.9 లక్షల టన్నులు ఉండగా ఇది 2022–23లో 206.2 లక్షల టన్నులకు తగ్గిందని తెలిపింది. దీంతో ఈ ఏడాది జూలైలో దేశంలో టమాటా ధరలు మూడు రెట్లు పెరిగాయని వివరించింది. ఈ ఏడాది జూన్‌లో కిలో టమాటా దాదాపు రూ.30 ఉండగా జూలై చివరి నాటికి రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.130కి పెరిగిందని పేర్కొంది. ఈ ఏడాది ఆగస్టు 10న హోల్‌సేల్‌లో కిలో రూ.106.91 ఉండగా రిటైల్ మార్కెట్‌లో రూ.131.69 ఉందని వెల్లడించింది.

క్లుప్తంగా...

జైలులో లొంగిపోతా: ట్రంప్

వాషింగ్టన్‌: అమెరికాలో రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ పోటీచేయడానికి సన్నాహాల్లో చేసుకుంటున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ను కేసుల భయం, అరెస్టు భయం వెంటాడుతోంది. 2020లో జార్జియా రాష్ట్ర ఎన్నికల ఫలితాలను మార్చేయడానికి ప్రయత్నించిన కేసులో ట్రంప్‌ గురువారం ఫుల్టన్‌ కౌంటీ జైలులో లొంగిపోనున్నారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా సోషల్‌ మీడియాలో వెల్లడించారు. అరెస్టు కావడానికి జార్జియాలోని అట్లాంటాకు వెళ్తున్నానని తెలియజేశారు. అక్కడ జిల్లా అటార్నీ ఫానీ విల్లీస్‌ తనను అరెస్టు చేస్తారని పేర్కొన్నారు. తన అరెస్టు ప్రక్రియను అధ్యక్షుడు జో బైడెన్‌ ఆధ్వర్యంలోని డిపార్టుమెంట్‌ ఆఫ్‌ జస్టిస్‌ సమన్వయం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రయత్నించిన కేసులో ట్రంప్‌తోపాటు మరో 18 మంది ఆగస్టు 25లోగా లొంగిపోవాలని గతంలో జడ్జి ఆదేశించారు. అయితే ట్రంప్‌తో పాటు మరో 18 మంది కూడా సరెండర్‌ కావడానికి సిద్ధమైనట్లు సమాచారం.

ప్రకాశ్‌రాజ్‌పై కేసు నమోదు

శివాజీ నగర: చంద్రయాన్‌–3 ప్రయోగాన్ని కించపరిచేలా సోషల్‌ మీడియాలో పోస్టింగ్‌ పెట్టారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీ నటుడు ప్రకాశ్‌రాజ్‌పై కర్ణాటకలో కేసు నమోదైంది. ఆయనపై హిందూ సంఘాల నేతలు బాగల్‌కోట జిల్లాలోని బానహట్టి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ప్రకాశ్‌రాజ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్రంలో పలుచోట్ల ఆయనపై ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. లుంగీ కట్టుకున్న ఓ చాయ్‌వాలా టీ వడబోస్తున్న కార్టూన్‌ను ప్రకాశ్‌రాజ్‌ పోస్ట్‌ చేసిన సంగతి తెలిసిందే. చంద్రయాన్‌–3 నుంచి వచ్చిన తొలి ఫోటో ఇదే అని కామెంట్‌ కూడా చేశారు.

సింగపూర్‌ అధ్యక్ష ఎన్నికల్లో భారతీయుడు

సింగపూర్‌: సింగపూర్‌ అధ్యక్ష ఎన్నికల్లో భారత సంతతికి చెందిన థర్మన్‌ షణ్ముగరత్నం పోటీ పడుతున్నారు. సెప్టెంబర్‌ 1న జరగనున్న ఎన్నికల్లో ఆయన అభ్యర్థిత్వాన్ని సింగపూర్‌ అధ్యక్ష ఎన్నికల కమిటీ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. 66 ఏళ్ల వయసున్న షణ్ముగరత్నం చైనా సంతతికి చెందిన కాక్‌ సాంగ్, తన్‌ కిన్‌ లియాన్‌తో పోటీ పడతారు. మొత్తం ఆరుగురు నుంచి దరఖాస్తులు రాగా వీరు ముగ్గురు అధ్యక్ష పదవికి పోటీ పడడానికి అర్హత సాధించారని ఎన్నికల కమిటీ ప్రకటించింది. షణ్ముగరత్నం సింగపూర్‌లో 2011 నుంచి 2019 మధ్య కాలంలో ఆర్థిక, విద్యాశాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా సేవలు అందించారు. సెప్టెంబర్‌ 1న ఎన్నికలు జరగనున్నాయి.


చందమామను ముద్దాడే క్షణం కోసం


చంద్రయాన్‌ - 3

- చంద్రయాన్‌–3 ప్రయోగంలో కీలక ఘట్టం నేడే
- జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టనున్న ల్యాండర్‌ మాడ్యూల్‌
- సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడి ఉపరితలంపై ల్యాండింగ్‌

ప్రతిష్టాత్మక చంద్రయాన్‌–3 మిషన్‌లో భాగమైన ల్యాండర్‌ మాడ్యూల్‌ తన తుది గమ్యాన్ని నేడు ముద్దాడనుంది. ఈ ప్రయోగంలో అత్యంత కీలకమైన తుదిఘట్టం బుధవారం ఆవిష్కృతం కానుంది. చంద్రుడి దక్షిణ ధ్రువ ఉపరితలంపై ల్యాండర్‌ మాడ్యూల్‌ అడుగు పెట్టనుంది. బుధవారం సాయంత్రం 5.27 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. సరిగ్గా 6.04 గంటలకు జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్‌ను సురక్షితంగా దించడానికి ఇస్రో సైంటిస్టులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ అపూర్వ ఘట్టాన్ని బుధవారం సాయంత్రం 5.20 నుంచే ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చు. ల్యాండర్‌ మాడ్యూల్‌ చందమామను చేరుకొనే అద్భుత దృశ్యాల కోసం దేశ ప్రజలు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. 'జయహో భారత్‌.. జయహో ఇస్రో' అంటూ సోషల్‌ మీడియాలో యువత నినాదాల హోరు ఇప్పటికే మొదలయ్యింది. ప్రపంచ దేశాలు చంద్రయాన్‌–3 ప్రయోగంపై ప్రత్యేక ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి.

–సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా)





సాఫ్ట్‌ ల్యాండింగ్‌ ఇలా..

ప్రస్తుతం చంద్రుడి ఉపరితలం నుంచి 25X134 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో పరిభ్రమిస్తున్న ల్యాండర్‌ మాడ్యూల్‌ను సెకన్‌కు 1.68 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా చేసి బుధవారం సాయంత్రం 6.04 గంటలకు సురక్షితంగా దించనున్నారు. ఇందులో ఆఖరి 17 నిమిషాలు అత్యంత కీలకం. దీన్ని '17 మినిట్స్‌ ఆఫ్‌ టెర్రర్‌' అని అభివర్ణిస్తున్నారంటే ఇదెంత ముఖ్యమో అర్థం చేసుకోవచ్చు. ఈ 17 నిమిషాల్లోనే ల్యాండర్‌ తనలోని ఇంజిన్లను తానే మండించుకుంటుంది. సరైన సమయంలో ఇంజిన్లను మండించడం, సరైన పరిమాణంలో ఇంధనాన్ని వాడుకోవడం చాలా కీలకం. ల్యాండర్‌ మాడ్యూల్‌లో నాలుగు థ్రస్టర్‌ ఇంజిన్లు ఉన్నాయి. చంద్రుడి ఉపరితలం నుంచి 30 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకున్న తర్వాత వీటిని మండించడం ప్రారంభమవుతుంది. దాంతో ల్యాండర్‌ వేగం క్రమంగా తగ్గిపోతుంది. తనలోని సైంటిఫిక్‌ పరికరాలతో ల్యాండింగ్‌ సైట్‌ను ల్యాండర్‌ మాడ్యూల్‌ గుర్తిస్తుంది. అడ్డంకులు ఏవైనా ఉంటే గుర్తిస్తుంది. ల్యాండింగ్‌ సైట్‌ చదునుగా ఉంటే బుధవారం ల్యాండింగ్‌ అవుతుంది. లేదంటే వాయిదా పడే అవకాశం లేకపోలేదు. వాయిదా పడితే ఈ నెల 27న సాఫ్ట్‌ ల్యాండింగ్‌ కోసం ప్రయత్నిస్తామని ఇస్రో స్పేస్‌ అప్లికేషన్స్‌ సెంటర్‌ డైరెక్టర్‌ నీలేశ్‌ దేశాయ్‌ చెప్పారు. పరిస్థితులన్నీ అనుకూలించి, సాంకేతికపరంగా సహకారం అందితే సురక్షితంగా ల్యాండింగ్‌ అవుతుంది. ల్యాండర్‌ మాడ్యూల్‌ను నిరంతరం క్షుణ్నంగా పరిశీలిస్తున్నామని, ప్రస్తుతం చక్కగా పనిచేస్తోందని ఇస్రో మంగళవారం వెల్లడించింది. ల్యాండింగ్‌కు రెండు గంటల ముందు అవసరమైన కమాండ్‌లను ల్యాండర్‌లో ఇస్రో అప్‌లోడ్‌ చేస్తుంది.



ల్యాండర్‌ మాడ్యూల్‌ చంద్రుడిపై ఇలా దిగి రోవర్‌ను బయటకు పంపిస్తుంది

పసిఫిక్‌లో 'అణు' అలజడి

- రేపట్నుంచి ఫ్యుకుషిమా అణు ప్లాంట్‌ నుంచి సముద్రంలోకి వ్యర్థజలాలు విడుదల
- జపాన్‌ ప్రభుత్వ నిర్ణయంపై చుట్టుపక్కల దేశాల అభ్యంతరం

టోక్యో: జపాన్‌లో భూకంపంతో దెబ్బతిన్న ఫ్యుకుషిమా అణు రియాక్టర్‌ నుంచి వ్యర్థ జలాలను గురువారం నుంచి సముద్రంలోకి విడుదల చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్లాంట్‌ను మూసివేయాలంటే వ్యర్థ జలాలను ఫసిఫిక్‌ మహా సముద్రంలోకి వదిలేయాక తప్పదని జపాన్‌ ప్రధాన మంత్రి ఫ్యుమియో కిషిదా మంగళవారం చెప్పారు. కేబినెట్‌ మంత్రులతో సమావేశమైన ఆయన ఈ వ్యర్థ జలాలను ప్రణాళికా బద్ధంగా సముద్రంలోకి పంపాలని ఇందు కోసం ప్లాంట్‌ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సముద్రంలో పరిస్థితులు, వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఈ నెల 24 నుంచి నీటి విడుదల కార్యక్రమం ప్రారంభమవుతుంది. 2011 మార్చి 11న సంభవించిన తీవ్రమైన భూకంపం అనంతరం ముంచెత్తిన సునామీకి ఈ ప్లాంట్‌ దెబ్బ తింది. అప్పట్నుంచి ఈ వ్యర్థ జలాలను జపాన్‌ నిల్వ చేసి ఉంచింది. కానీ ఇప్పుడు వాటిని నిల్వ చేయడానికి చోటు సరిపోక సముద్రంలోకి వదలాలని నిర్ణయించింది. ఈ నీటిని సముద్రంలోకి విడుదల చేయడంపై చుట్టుపక్కల దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. జపాన్‌ దగ్గర దాదాపుగా 13.4 లక్షల టన్నుల వ్యర్థ జలాలు ఉన్నాయి. వీటిని దశలవారీగా శుద్ధి చేసి సముద్రంలోకి వదులుతారు. ఇలా చెయ్యడానికి కనీసం 30 ఏళ్లు పడుతుందని అంచనా. ఈ నీళ్లను సముద్రంలోకి విడిచి పెట్టడం వల్ల మత్స్య సంపదకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నీటి విడుదలకి ఇంటర్నేషనల్‌ ఆటమిక్‌ ఎనర్జీ ఏజెన్సీ (ఐఏఈఏ) ఇప్పటికే అంగీకరించింది. జపాన్‌ పసిఫిక్‌ సముద్రాన్ని తన సొంత మురికి కాల్వగా భావిస్తోందని చైనా, దక్షిణ కొరియా వంటి దేశాలు విమర్శిస్తున్నాయి.

కార్చిచ్చును కేర్‌ చేయని ఇల్లు!

హవాయి: అమెరికాలోని హవాయి దీవిలో ఇటీవల చెలరేగిన కార్చిచ్చు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గత వందేళ్లలో ఇది అత్యంత తీవ్రమైన ప్రకృతి విపత్తు అని స్థానికులు చెబుతున్నారు. కార్చిచ్చు ధాటికి వందలాది ఇళ్లు కాలి బూడిదయ్యాయి. రిసార్ట్‌ నగరమైన 'లాహైనా' బూడిద కుప్పగా మారిపోయింది. ఇక్కడ దాదాపు అన్ని ఇళ్లు మంటల్లో చిక్కుకొని నేలమట్టమయ్యాయి. మంటల తీవ్రతకు వంద మందికిపైగానే మరణించారు. కానీ, ఒక ఇల్లు మాత్రం చెక్కుచెదరకుండా స్థిరంగా నిలిచి ఉండడం ఆశ్చర్యపరుస్తోంది. ఈ ఇల్లు ఫొటో సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారింది. లాహైనా సిటీలో రివర్‌ ఫ్రంట్‌ వీధిలో ఈ ఇల్లు ఉంది. చుట్టుపక్కల ఉన్న ఇళ్లన్నీ మంటల్లో కాలిపోయాయి. ఇదొక్కటే ఎప్పటిలాగే మెరిసిపోతూ కనిపిస్తోంది. ఇది నిజమేనా? ఫొటోలో ఏదైనా మార్పులు చేశారా? అని నెటిజన్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై భవన యజమాని ట్రిప్‌ మిలికిన్‌ స్పందించారు. అది నిజమైన ఫొటో అని స్పష్టం చేశారు. 100 సంవత్సరాల క్రితం నాటి ఈ చెక్క ఇంటిని రెండేళ్ల క్రితం కొనుగోలు చేశామని, పాత పైకప్పును తొలగించి, లోహపు పైకప్పు వేయించామని తెలిపారు. చుట్టుపక్కల గడ్డి లేకుండా బండలు పరిచామని వెల్లడించారు. ఈ జాగ్రత్తల వల్లే తమ ఇల్లు మంటల్లో చిక్కుకోలేదని పేర్కొన్నారు. కార్చిచ్చులో నిప్పు రవ్వలు తమ ఇంటిపై పడినా లోహపు పైకప్పు వల్ల ఎలాంటి నష్టం జరగలేదని ట్రిప్‌ మిలికిన్‌ వివరించారు.



ప్రపంచానికి 'గ్రోత్‌ ఇంజిన్‌' భారత్‌

- త్వరలో 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ
- బ్రిక్స్‌ బిజినెస్‌ ఫోరమ్‌ సదస్సులో మోదీ ఉద్ఘాటన


జోహన్నెస్‌బర్గ్‌లో తనకు స్వాగతం పలికిన భారతీయులకు మోదీ అభివాదం

జోహన్నెస్‌బర్గ్‌: రాబోయే రోజుల్లో ప్రపంచానికి భారత్‌ 'గ్రోత్‌ ఇంజిన్‌'గా మారబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భారత్‌లో సంస్కరణలను మిషన్‌ మోడ్‌లో అమలు చేస్తున్నామని, సులభతర వాణిజ్యంలో వేగం పుంజుకుందని చెప్పారు. మంగళవారం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో బ్రిక్స్‌ బిజినెస్‌ ఫోరం లీడర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. భారత్‌ త్వరలోనే 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్‌ వ్యవస్థ భారత్‌లో ఉందన్నారు. 100కుపైగా యూనికార్న్‌ కంపెనీలు పని చేస్తున్నాయని వెల్లడించారు. బ్రిక్స్‌ సభ్య దేశాల మధ్య భవిష్యత్‌ సహకారానికి అనువైన రంగాలను గుర్తించడంలో 15వ బ్రిక్స్‌ సదస్సు సఫలమవుతుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు రోజులపాటు జరిగే బ్రిక్స్‌ సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం ఆయన దక్షిణాఫ్రికా చేరుకున్నారు. కాగా, ఉక్రెయిన్‌ యుద్ధం విషయమై అంతర్జాతీయ నేర న్యాయస్థానం రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై అరెస్ట్‌ వారెంట్‌ జారీ చేయడంతో ఆయన వర్చువల్‌గా పాల్గొననున్నారు.

లక్షద్వీప్‌ ఎంపీకి సుప్రీంలో ఎదురు దెబ్బ

న్యూఢిల్లీ: హత్యాయత్నం కేసులో లక్షద్వీప్‌ లోక్‌సభ ఎంపీ మహమ్మద్‌ ఫైజల్‌కు సుప్రీం కోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా తేలుస్తూ గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పుని సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ఈ తీర్పుని ఆరువారాల్లోగా పునః పరిశీలించాలని జస్టిస్‌ బి.వి. నాగరత్న, జస్టిస్‌ ఉజ్జల్‌ భుయాన్‌లతో కూడిన సుప్రీం బెంచ్‌ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. కేరళ హైకోర్టు ఈ కేసుని విచారించినప్పుడు ఆయన ఎంపీ అన్న కోణంలో విచారించిందని అందువల్ల తప్పిదాలు దొర్లాయని వ్యాఖ్యానించింది. ఎన్‌సీపీకి చెందిన మహమ్మద్‌ ఫైజల్‌ 2014 నుంచి లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. 2009లో లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పీఎం సయీద్‌ అల్లుడైన పదాంత సాలిహ్‌పై మహమ్మద్‌ ఫైజల్‌ మరికొందరు హత్యాయత్నానికి పాల్పడినట్టుగా కేసు నమోదైంది. ఈ కేసుని విచారించిన కేరళ సెషన్స్‌ కోర్టు ఈ ఏడాది జనవరి 11, 2023లో ఫైజల్‌ మరో ముగ్గురికి 10 ఏళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల చొప్పున జరిమానా విధించింది. ఆ వెంటనే జనవరి 13న ఫైజల్‌ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేస్తూ లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్‌ విడుదల చేసింది. తీర్పుని సవాల్‌ చేస్తూ ఫైజల్‌ హైకోర్టులో సవాల్‌ చేయగా కింద కోర్టు ఇచ్చిన తీర్పుని కొట్టేసింది. ఒక ఎంపీ దోషిగా తేలితే మళ్లీ ఎన్నికలు జరిగి ప్రజా ధనం దుర్వినియోగం అవుతుందంటూ కేరళ హైకోర్టు తీర్పు చెప్పింది. హైకోర్టు తీర్పుపై లక్షద్వీప్‌ యంత్రాంగం సుప్రీంకోర్టుకెక్కింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎంపీగా తనపై వేసిన అనర్హత వేటును ఎత్తేయాలని ఫైజల్‌ సుప్రీంకోర్టులో పిటిషన్‌ దాఖలు చేయగా మార్చిలో లోక్‌సభ సచివాలయం ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించింది.

కుసుమా నువ్వు గ్రేట్‌



బనశంకరి: ప్రజల్లో డిజిటల్‌ ఆర్థిక సాధికారత కోసం బెంగుళూరుకు చెందిన ఒక పోస్టుమాస్టర్‌ చేస్తున్న కృషికి మైక్రోసాఫ్ట్‌ అధినేత బిల్‌గేట్స్‌ ముగ్ధులయ్యారు. పోస్ట్‌మాస్టర్‌ కె.కుసుమ కృషి అభినందనీయమని సామాజిక మాధ్యమాల్లో ప్రశంసించారు. ఇటీవల బెంగళూరులో ఎందరో సామాజిక కార్యకర్తలను కలిశారు. పోస్ట్‌మాస్టర్‌ అయిన కుసుమనూ కలిశారు. భారత్‌లో శరవేగంగా సాగుతున్న డిజిటల్‌ ఆర్థికాభివృద్ధిలో కుసుమ వంటివారు గణనీయమైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడిన బిల్‌గేట్స్‌ ఆమెతో ఉన్న ఫోటోను షేర్‌ చేశారు.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ గెలిస్తే కులగణన

సాగర్‌: మధ్యప్రదేశ్‌ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ విజయం సాధిస్తే కులగణన నిర్వహిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గే చెప్పారు. ఆయన మంగళవారం మధ్యప్రదేశ్‌లోని సాగర్‌ జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. మన దేశ రాజ్యాంగాన్ని మార్చేయడానికి కొందరు వ్యక్తులు కుట్రలు పన్నుతున్నారని పరోక్షంగా బీజేపీ నేతలపై మండిపడ్డారు. కాంగ్రెస్‌ పాలనలోనే మధ్యప్రదేశ్‌లో అభివృద్ధి జరిగిందని మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు.

ఈసీ 'నేషనల్‌ ఐకాన్‌'గా సచిన్‌

సాక్షి, న్యూఢిల్లీ: క్రికెట్‌ దిగ్గజం సచిన్‌ టెండూల్కర్‌ కొత్త ఇన్నింగ్స్‌ ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం పెంచేలా అవగాహన కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి 'నేషనల్‌ ఐకాన్‌'గా సచిన్‌ వ్యవహరించనున్నారు. ఢిల్లీలో బుధవారం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ రాజీవ్‌ తదితరుల సమక్షంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో సచిన్‌ టెండూల్కర్‌తో 3 సంవత్సరాల పాటు కేంద్ర ఎన్నికల సంఘం ఎంఓయూ కుదుర్చుకోనుంది. ఈ ఎంఓయూ ద్వారా యువత, పట్టణ ప్రాంతాల ఓటర్ల భాగస్వామ్యం పెంచే దిశగా టెండూల్కర్‌ 'నేషనల్‌ ఐకాన్‌'గా తన బాధ్యతలు నిర్వహిస్తారు. కాగా గత సంవత్సరం ప్రముఖ నటుడు పంకజ్‌ త్రిపాఠి, 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎంఎస్‌ ధోని, అమీర్‌ ఖాన్, మేరీకోమ్‌ వంటి ప్రముఖులు కేంద్ర ఎన్నికల సంఘానికి 'నేషనల్‌ ఐకాన్‌'లు వ్యవహరించారు.

అత్యధిక రేటుకి ఉల్లిని కొంటాం: కేంద్రం

న్యూఢిల్లీ: టమాటా బాటలో ఉల్లి ధరలు పయనిస్తున్నాయి. ఉల్లి ధరలు భారీగా పెరిగిపోతూ ఉండడంతో వాటిని అదుపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఉల్లిపై 40% ఎగమతి సుంకాన్ని విధిస్తూ తీసుకున్న నిర్ణయంపై రైతులు నిరసనలకు దిగుతున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఉల్లిపాయలని క్వింటాల్‌కి రూ.2,410 రూపాయలు ఇచ్చి కొనుగోలు చేస్తామని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్‌ గోయెల్‌ చెప్పారు. మరోవైపు ఉల్లిపాయలు దొరకకపోతే, ధరలు ఎక్కువుంటే ఒక రెండు నుంచి నాలుగు నెలలు తినకపోతే వచ్చే నష్టమేమీ లేదని మహారాష్ట్ర మంత్రి దాదా భూసే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఎవరికైనా అంత ధర ఇచ్చి కొనే శక్తి లేకపోతే వారు రెండు నుంచి నాలుగు నెలలు మానేయచ్చు. దాని వల్ల ఏం నష్టం లేదు' అని వ్యాఖ్యానించారు. రైతులు, వ్యాపారుల ధర్నాతో మహారాష్ట్రలోని నాసిక్‌లోని ఉల్లిమార్కెట్‌ బోసిపోయింది.


జనంలేక ఖాళీగా ఉన్న నాసిక్‌లోని ఉల్లి మార్కెట్‌

రిపబ్లికన్‌ రేస్‌ షురూ

2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటాపోటీ

- బరిలో డొనాల్డ్‌ ట్రంప్‌తోపాటు మొత్తం 9 మంది
- ఇప్పటికే రేసులో దూసుకుపోతున్న ట్రంప్‌
- రిపబ్లికన్‌ ఓటర్లలో 60 శాతం పైగా మద్దతు
- డి శాంటిస్‌ మాత్రమే పోటీ ఇచ్చే అవకాశం

అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ఇంకా ఏడాదికి పైగా సమయముంది. 2024 నవంబర్‌ 5న పోలింగ్‌ జరగనుంది. కానీ రెండు ప్రధాన పక్షాల్లో ఒకటైన విపక్ష రిపబ్లికన్‌ పార్టీ ఇప్పటికే బరిలో దిగింది. పార్టీ అభ్యర్థిని నిర్ణయించే సుదీర్ఘమైన ఎంపిక ప్రక్రియకు బుధవారమే శ్రీకారం చుడుతోంది. ఇప్పటికైతే వివాదాస్పద మాజీ అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ రేసులో అందరి కంటే ముందున్నారు. ఇంకా చెప్పాలంటే ఆయన వైపే స్పష్టమైన మొగ్గుంది. అయినా సరే, ట్రంప్‌నకు ఎంతో కొంత పోటీ ఇస్తారని భావిస్తున్న ఫ్లోరిడా గవర్నర్‌ డి శాంటిస్‌తోపాటు మరో ఏడుగురు ఆశావహులు బరిలో దిగి అదృష్టం పరీక్షించుకుంటున్నారు.

- సాక్షి, నేషనల్‌ డెస్క్‌



అర్హత... అంత సులభం కాదు

రిపబ్లికన్‌ అభ్యర్థిత్వ బరిలో నిలవడం అంత సులువేమీ కాదు. అందుకు పార్టీ నేషనల్‌ కమిటీ పెట్టే ఎన్నో నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. మరెన్నో పార్టీపరమైన పరీక్షల్లో నెగ్గాల్సి ఉంటుంది.

- ప్రచారం కోసం కనీసం 40 వేల మంది నుంచి విడివిడిగా విరాళాలు సేకరించాలి.
- మూడు విడివిడి నేషనల్‌ పోల్స్‌లో కనీసం 1 శాతం ఓట్లు సాధించాలి.
- లేదంటే కనీసం రెండు నేషనల్‌ పోల్స్‌తో పాటు అయోవా వంటి ఒక అర్లీ ప్రెసిడెన్షియల్‌ ప్రైమరీలో కనీసం 1 శాతం ఓట్లు సాధించాలి.
- అంతిమంగా నెగ్గి రిపబ్లికన్‌ పార్టీ తరఫున అధ్యక్ష బరిలో దిగే అభ్యర్థికి పూర్తి మద్దతిస్తామని ప్రమాణ పత్రం మీద సంతకం చేయాలి. అయితే రేసులో ముందున్న ట్రంప్‌ మాత్రం ఇలా సంతకం చేయకపోగా, తిరస్కరించడం విశేషం!

డిబేట్‌లో వీరే...

1. టిమ్‌ స్కాట్‌ (దక్షిణకరోలినా సెనేటర్‌)
2. డి శాంటిస్‌ (ఫ్లోరిడా గవర్నర్‌)
3. నిక్కీ హేలీ (ఐరాసలో అమెరికా మాజీ రాయబారి)
4. వివేక్‌ రామస్వామి (భారత సంతతి వ్యాపారవేత్త)
5. క్రిస్‌ క్రిస్టీ (న్యూజెర్సీ మాజీ గవర్నర్‌)
6. మైక్‌ పెన్స్‌ (మాజీ ఉపాధ్యక్షుడు)
7. డౌగ్‌ బర్గం (నార్త్‌ డకోటా గవర్నర్‌)
8. అసా అచిన్‌ సన్‌ (అర్కన్సాస్‌ మాజీ గవర్నర్‌)

తొలి రౌండ్‌ డిబేట్‌ ఎప్పుడు?

- బుధవారం రాత్రి 9 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం)
  వేదిక: రాజకీయంగా అతి కీలకమైన విస్కాన్సిన్‌ రాష్ట్రంలోని మిల్వాకీలో
- రెండో రౌండ్‌ డిబేట్‌ సెప్టెంబర్‌ 27న కాలిఫోర్నియాలో జరుగుతుంది.

ఏం ఒరిగేను?

రిపబ్లికన్‌ అభ్యర్థిగా ట్రంప్‌నకు మద్దతు వెల్లువెత్తుతోందనే చెప్పాలి. తమ అభ్యర్థి ఆయనేనని సీబీఎస్, యూగవ్‌ గత వారం చేసిన పోల్‌లో ఏకంగా 62 శాతం రిపబ్లికన్‌ ఓటర్లు కుండబద్దలు కొట్టారు.

అలాంటప్పుడు ఈ డిబేట్లతో పార్టీ సాధించేది ఏముంటుందని ప్రశ్నిస్తున్న వాళ్లూ ఉన్నారు. కానీ ఆశావహులు డిబేట్లలో ట్రంప్‌ను గుడ్డిగా వ్యతిరేకించడం కాకుండా తమకు ఎందుకు ఛాన్స్‌ ఇవ్వాలో సమర్థంగా చెప్పగలగాలని అదే సర్వేలో ఏకంగా 91 శాతం స్పష్టం చేశారు. కనుక ఏమైనా జరగొచ్చని, చివరికి అనూహ్యంగా ఎవరైనా అధ్యక్ష అభ్యర్థి కావచ్చని అంటున్న వారికీ కొదవ లేదు.

కొసమెరుపు

రేసులో అందరి కంటే ముందున్న డొనాల్డ్‌ ట్రంప్‌ మాత్రం తొలి రౌండ్‌ డిబేట్‌లో పాల్గొనడం లేదు. 'నాకున్న పాపులారిటీకి ఇలాంటి పిల్ల పందాల్లో పాల్గొనడమా? నాన్సెన్స్‌! నేనెవరో, అధ్యక్షునిగా ఎంత సాధించానో పార్టీ ఓటర్లందరికీ బాగా తెలుసు'' అంటున్నారాయన! అయితే, సరిగ్గా డిబేట్ల సమయానికే ప్రి రికార్డెడ్‌ ఇంటర్వ్యూ ప్రసారమయ్యేలా ట్రంప్‌ ప్లాన్‌ చేస్తున్నట్టు చెబుతున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం । 23 । ఆగస్టు । 2023



సౌజన్యకు న్యాయం కోసం

దక్షిణ కన్నడ జిల్లాలో విద్యార్థిని సౌజన్య హత్య కేసులో దోషులను శిక్షిం చాలని బెంగళూరులో మహిళా సంఘాల ధర్నా

న్యూస్‌రీల్

భారీగా విదేశీ సిగరెట్లు సీజ్



దొరికిన విదేశీ సిగరెట్లు

దొడ్డబళ్లాపురం: విమానంలో అక్రమంగా తీసుకొచ్చిన విదేశీ సిగరెట్లను కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేసారు. సోమవారం రాత్రి 10:30 గంటల సమయంలో బ్యాంకాక్ నుంచి బెంగళూరుకు విమానంలో వచ్చిన ఒక ప్రయాణికుడు 48,000 సిగరెట్ ప్యాక్‌లను లగేజీలో తెచ్చాడు. బయటకు వెళ్లడానికి ప్రయత్నిస్తూ కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డాడు. రూ.8.16 లక్షల విలువైన విదేశీ బ్రాండ్ సిగరెట్ పాకెట్లు లభించాయి. అతన్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

మైసూరు- చెన్నై మధ్య డిసెంబర్లో శతాబ్ది

మైసూరు: మైసూరు- చెన్నై మధ్య శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలు త్వరలో పరుగులు తీయనుంది. డిసెంబర్ 20 నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయని సంబంధిత అధికారులు తెలిపారు. రైలు సంఖ్య 12007/12008, ఈ రైలు వారంలో ఆరు రోజుల పాటు రాకపోకలు సాగిస్తుంది. గురువారం అందుబాటులో ఉండదు. మైసూరు–చెన్నై నగరాల ప్రయాణికుల సౌకర్యార్థం శతాబ్ది సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు అధికారులు తెలిపారు.

డిప్యూటీ సీఎంకు జరిమానా

శివాజీనగర: నగరంలో కేపీసీసీ కార్యాలయం ముందు అనధికారికంగా బ్యానర్ ఏర్పాటు చేసిన కేసులో కేపీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు బీబీఎంపీ రూ.50 వేలు జరిమానా విధించింది. దేవరాజ అరసు జయంతి సందర్భంగా ఆఫీసు ముందు డీకే ఫోటోతో బ్యానర్‌ను కట్టారు. దీనికి బీబీఎంపీ నుంచి అనుమతి పొందలేదు. వసంతనగర వార్డు రెవిన్యూ అధికారి కేపీసీసీ అధ్యక్షునికి రూ.50 వేలు జరిమానా విధించి, చెల్లించాలని ఆఫీసు సిబ్బందికి నోటీసు ఇచ్చారు.

ఇంట్లోనే గంజాయి సాగు



మొక్కలతో విశ్వనాథ్

మైసూరు: ఇంటి ఆవరణలో మొక్కల మధ్యలో గంజాయి మొక్కలను పెంచుతున్న యువకున్ని హుణసూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. తట్టికెరె గ్రామానికి చెందిన విశ్వనాథ్ గంజాయికి అలవాటు పడ్డాడు. దానిని కొనడానికి డబ్బులు ఎక్కువ ఖర్చవుతాయని భావించి విత్తనాలను సంపాదించి ఇంటి ఆవరణలో మొక్కల మధ్య కుండీల్లో పెంచసాగాడు. మొక్కలు ఆరేడు అడుగుల ఎత్తు వరకూ ఎదిగాయి. ఆ గంజాయిని మత్తు కోసం ఉపయోగించేవాడు. ఇది తెలిసి పోలీసులు తనిఖీలు చేయగా కొన్ని పెద్ద మొక్కలు కనిపించాయి. వాటిని పీకి తూకం వేయగా సుమారు 6 కిలోలు తూగాయి. నిందితున్ని అరెస్టు చేశారు.


స్కూలు వాహనాల సీజ్

శివాజీనగర: బడి విద్యార్థుల రవాణాకు అనుమతి లేని బస్సులు, వ్యాన్లను ఉపయోగించడంపై రవాణా శాఖ అధికారుల దాడులు చేసి 15కు పైగా వాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. బెంగళూరుతో సహా రాష్ట్రంలో తనిఖీలు నిర్వహిచారు. అనేక వాహనాల్లో సీసీ కెమెరా, ప్రథమ చికిత్స పెట్టె, కిటికీలకు గ్రిల్ తదితర భద్రతా చర్యలే లేనట్లు గుర్తించారు. మరికొన్ని వాహనాలకు పర్మిట్లే లేవని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల పాఠశాల వాహనాలు సక్రమంగా ఉన్నాయో లేదో గమనించాలని సూచించారు.

దొంగతనం నెపం, డ్రైవర్ ఆత్మహత్య

బనశంకరి: తనపై దొంగతనం నెపం మోపారని కారు డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన బెంగళూరు పులకేశినగర పరిధిలో చోటుచేసుకుంది. కేరళకు చెందిన వర్గీస్ (43) మృతుడు. వివరాలు... ఏడాది క్రితం కేరళ నుంచి వచ్చిన వర్గీస్ పులకేశినగర గ్రీన్ అవెన్యూ అపార్టుమెంట్‌లో ఓ మహిళ వద్ద కారు డ్రైవర్‌గా చేరాడు. అదే అపార్టుమెంట్ టెర్రస్‌లో ఉంటున్నాడు. ఇటీవల ఇంటి యజమాని ఇంటిలో 250 గ్రాముల బంగారు నగలు చోరీ అయ్యాయి. వర్గీస్, మరో పనిమనిషి చోరీ చేశారని ఇంటి యజమానురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల పోలీసులు వర్గీస్‌ను పిలిపించి విచారణ చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వర్గీస్ తన ఆత్మహత్యకు ఇంటి యజమాని కారణమని డెత్‌నోట్ రాసి తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

మండ్య సలసల



కేఆర్ఎస్ డ్యాం నుంచి వెళ్తున్న కావేరి జలాలు

- కావేరి నీటిని వదలరాదని హైవే ముట్టడి
- అడ్డుకున్న పోలీసులు, తోపులాట

మండ్య: జిల్లాలో ప్రముఖ కేఆర్ఎస్ జలాశయం నుంచి తమిళనాడు రాష్ట్రానికి కర్ణాటక ప్రభుత్వం కావేరి జలాలను విడుదల చేయడంపై రైతు సంఘాలు నిరసనబాట పట్టాయి. కొన్నిరోజులుగా మోస్తరుగా సాగిన ధర్నాలు ఉధృతరూపం దాల్చాయి. నీటి విడుదల వ్యతిరేకిస్తూ రాష్ట్ర రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు మంగళవారం మండ్య నగరంలో భారీ ఆందోళన నిర్వహించడంతో ఉద్రిక్తత నెలకొంది. బెంగళూరు –మైసూరు హైవేని ముట్టడించారు.

సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు

జిల్లాలో కరువు పరిస్థితి నెలకొందని, తమ పంటలకే నీరు లేక అల్లాడుతుంటే కావేరి నీటిని వదిలేస్తారా? అని రైతులు ప్రశ్నించారు. జిల్లా నలుమూలల నుంచి రైతులు, కార్యకర్తలు తరలివచ్చారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, వ్యవసాయ మంత్రి చలువరాయస్వామికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. మునుముందు నిరసనలను తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ ఆందోళనతో హైవేపై కొంతసేపు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ముందు జాగ్రత్తగా పెద్ద ఎత్తున మోహరించారు. రైతులు ఎద్దుల బండ్లలో జాతీయ రహదారిలో రావడంతో వారిని అడ్డుకోవడంతో కొంతసేపు తోపులాట జరిగింది. చివరకు రైతులను అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. రైతు నేతలు ఇందువాళు చంద్రశేఖర్, మంజేష్‌గౌడ, సో.శి. ప్రకాశ్, బన్నూరు నారాయణ సహా వందలాదిగా రైతులు పాల్గొన్నారు.

ఆ రోజు మేకెదాటు అన్నారే: సీటీ రవి

శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ముఖ్య నాయకులు కలిసి మేకెదాటు ప్రాజెక్టును అమల చేయాలని కోరుతూ పాదయాత్రలు చేశారు. కానీ కోర్టు, ట్రిబ్యునల్ చెప్పడానికి ముందే కాంగ్రెస్ ప్రభుత్వం తమిళనాడుకు కావేరి నీటిని వదిలింది, నీటి కోసం పాదయాత్ర చేసిన మీరు ఇప్పుడు నీరు ఎలా విడుదల చేశారని బీజేపీ సీనియర్ నేత సీటీ రవి మండిపడ్డారు. మంగళవారం మండ్య బీజేపీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభ ఎన్నికలకు ముందు డీకే శివకుమార్, సిద్దరామయ్య వంటివారు నమ్మ నీరు, నమ్మ హక్కు పేరుతో పాదయాత్ర చేశారన్నారు. ఇప్పుడు సుప్రీం కోర్టు ఆదేశాలు రాకముందే తమిళనాడుకు కావేరి నీటిని ఎలా వదిలారని, ఇది రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ద్రోహమని ఆరోపించారు. కావేరి అనేది కర్ణాటక స్వాభిమానం మాత్రమే కాదని, మండ్య, మైసూరు, బెంగళూరు నగర ప్రజల జీవనాడి అన్నారు. కావేరి లేక పోతే బెంగళూరు మహా నగర ప్రజలకు తాగడానికి చుక్క నీరు దొరకదని అన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ మెప్పు పొందడానికి, స్టాలిన్ మద్దతు కోసం కావేరి నీటిని వదిలారని దుయ్యబట్టారు.



ఎద్దుల బండితో వస్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



రైతులు రాకుండా హైవేని బంద్ చేసిన పోలీసులు

కాలేజీ ఫెస్టివల్‌కు ముందు.. ప్రిన్సిపాల్ ఆత్మహత్య



ప్రిన్సిపాల్ నాగరాజు (ఫైల్)



విలపిస్తున్న ప్రిన్సిపాల్ సతీమణి

- బాగల్‌కోట జిల్లాలో విషాదం

యశవంతపుర: ఏం కష్టం వచ్చిందో కానీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కాలేజీ ఆవరణలో ఉరి వేసుకున్నారు. ఈ దారుణం బాగలకోట జిల్లా హునగుంద పట్టణంలో జరిగింది. హునగుంద డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ నాగరాజు ముదగల్ (50) మంగళవారం తెల్లవారుజామున కాలేజీ ఆవరణలోని క్యాంటీన్ మెట్లకు తాడు కట్టి ఉరి వేసుకొన్న స్థితిలో శవమై తేలాడు.



సంఘటన జరిగిన క్యాంటీన్

అర్ధరాత్రి కళాశాలకు వెళ్లి

మంగళవారం కాలేజీ ఆవరణలో జరిగే జనపద జాతర హొన్న సంభ్రమ ఏర్పాట్లలో ఆయన తలమునకలయ్యారు. మరికొన్ని గంటల్లో వేడుకలు జరగాల్సి ఉంది. సోమవారం రాత్రి వరకూ ఏర్పాట్లు, అతిథుల ఆహ్వానంలో గడిపారు. అర్ధరాత్రి 1 గంటకు బైక్ వేసుకుని ఇంటి నుంచి కాలేజీకి వచ్చారని ఆయన భార్య తెలిపారు. మళ్లీ 5 గంటలకు ఇంటికి తిరిగివచ్చి మొహం కడుక్కుని తిరిగి కాలేజీకి వెళ్లిపోయారని, ఇంతలోనే చనిపోయారని తెలిసిందని ఆమె విలపించారు. కాగా, ఆయన వద్ద ఎలాంటి డెత్‌నోట్ లభించలేదు. కళాశాలలో పని ఒత్తిడి ఉన్నట్లు బాధపడేవాడని సమాచారం. ఆత్మహత్యగా భావిస్తున్నారు. పట్టణ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ ఘోరంతో కాలేజ్ ఫెస్టివల్‌ను రద్దు చేశారు.

రాష్ట్రంలో సగానికి పైగా అనావృష్టి

- త్వరలో కరువు పరిశీలన
- రెవెన్యూ మంత్రి వెల్లడి



బనశంకరి: రాష్ట్రంలో 50 శాతానికి పైగా ప్రాంతంలో అనావృష్టి నెలకొంది. రానున్న రోజుల్లో వర్షం కురిసే సూచనలు లేవు, దీంతో పశువులకు మేత, జలాశయాల నీటి సేకరణ స్థితిగతులను సేకరిస్తున్నామని రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టులో వర్షాలు పెద్దగా కురవలేదు, దీనిపై త్వరలో మంత్రుల సమావేశంలో చర్చిస్తాం. రాష్ట్రంలో 50 శాతానికి పైగా వర్షం కొరత ఉందని అన్నారు. సెప్టెంబరు సాధారణ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. 140కి పైగా గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని, కరువు తాలూకాలుగా ప్రకటించాలనే డిమాండ్లు ఉన్నాయి. రాష్ట్రంలో ఆలమట్టి జలాశయం మాత్రమే 100 శాతం భర్తీ అయ్యిందని తెలిపారు. కేంద్రం నిబంధనల ప్రకారం కరువు ప్రకటనకు పంటల సమీక్ష చేయాలన్నారు. పొలాలకు వెళ్లి నమూనాలను సేకరించాలని అధికారులకు సూచించామని, 120 తాలూకాల్లో పంట సమీక్ష చేసి 10 రోజుల్లోగా నివేదిక అందించాలని అధికారులకు సూచించామన్నారు. దీని ఆధారంగా కరువు ప్రకటన ప్రక్రియ చేపడతామని చెప్పారు.

యువతిపై పడిన కరెంటు స్తంభం



స్కూటర్‌పై కుప్పకూలిన విద్యుత్ స్తంభం, ఆస్పత్రిలో స్ట్రెచర్‌లో తరలింపు

- తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలు

బనశంకరి: విద్యుత్ స్తంభం కూలిపడడంతో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన బెంగళూరు సుద్దగుంటెపాళ్య పరిధిలో జరిగింది. క్రైస్ట్ కాలేజీలో పీయూసీ చదువుతున్న ప్రియా (18) మంగళవారం మధ్యాహ్నం కాలేజీ ముగించుకుని స్కూటర్‌లో ఇంటికి బయలుదేరింది. రోడ్డు పక్కన విద్యుత్ స్తంభానికి కట్టిన కేబుల్ క్యాంటర్‌కు తగిలినప్పటికీ డ్రైవర్ వేగంగా వెళ్లిపోయాడు. దీంతో గట్టిగా లాగినట్లు కావడంతో కరెంటు స్తంభం విరిగి పడిపోయింది. అదే సమయంలో వస్తున్న ప్రియా మీద పడిపోవడంతో ఆమె తీవ్రంగా గాయపడింది, కరెంటు వైర్లు తాకి ఆమెకు షాక్ కూడా కొట్టింది. స్థానికులు ఆమెను కాపాడి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా నగరంలో కరెంటు వైర్లకు కుప్పలు కుప్పలుగా ప్రైవేటువారు కేబుళ్లను కట్టడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, పాలికె అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

ఆ రైతులకు ఓటీఎస్ పరిష్కారం

- సీఎం సిద్దు హామీ

శివాజీనగర: బళ్లారిలో కర్ణాటక గ్రామీణ బ్యాంకు నుండి పంట రుణాలు పొంది వెనుతిరిగి చెల్లించలేని పరిస్థితికి దారితీసిన రైతులకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద పరిష్కరించేందుకు సీఎం సిద్దరామయ్య హామీ ఇచ్చారు. రైతుల విషయమై మంగళవారం బెంగళూరులో సీఎంను ఎమ్మెల్యేలు బీ.ఆర్.పాటిల్ , దర్శన్ పుట్టణ్ణయ్య, రైతులు కలిసి చర్చించారు. ఓటీఎస్ ద్వారా పరిష్కారం చేయాలని బ్యాంకులతో చర్చించాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశిస్తానని సీఎం చెప్పారు.

రూ. 30 వేలకు 30 లక్షలు కట్టాలట

బళ్లారి జిల్లాలో కర్ణాటక గ్రామీణ బ్యాంకు నుంచి రైతులు పంట రుణాలు పొందారు, అయితే తీవ్ర నష్టాల వల్ల సకాలంలో చెల్లించలేకపోయారు. వడ్డీలు, నోటీసు ఖర్చులు కలిపి రూ.30 వేల రుణానికి రూ.30 లక్షలు చెల్లించాలని వేధిస్తున్నారని రైతులు వాపోయారు. దీనిపై 8 నెలల నుంచి ఆందోళనలు చేస్తున్నట్లు తెలిపారు.

ఈశాలో నాగుల పంచమి



నాగపూజ చేస్తున్న దృశ్యం

చిక్కబళ్లాపురం: ఆవలగుర్కి సమీపంలోని ఈశా కేంద్రంలో సోమవారం సాయంత్రం నాగుల పంచమి సందర్భంగా నాగారాధన, నాగమండల పూజలు చేశారు. ఆధ్యాత్మిక గురువు జగ్గి వాసుదేవ్ ఆధ్వర్యంలో ఉడుపి నుంచి వచ్చిన అర్చకులు నాగమండల పూజ చేశారు. కార్యక్రమంలో మంత్రులు కేహెచ్ మునియప్ప, సుధాకర్, టీబీ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రమంతటా ధర్నాలు తప్పవు

తుమకూరు: కావేరి జలాశయం పరిధిలో వర్షాలు పడక ఇక్కడి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కూడా ప్రభుత్వం వారి బాధలను పట్టించుకోకుండా తమిళనాడుకు నీరు విడుదల చేసిందని, దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని రైతు సంఘం, హసిరుసేనె రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కోడిహళ్లి చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన తుమకూరు నగరంలో జిల్లా రైతులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ...ఈ ఏడాది సరిగా వర్షాలు పడక జలాశయాల్లో నీరు లేదని, ఇక్కడి నీటి సమస్యను పట్టించుకోకుండా తమిళనాడుకు నీటిని వదలడం ఏమిటని ధ్వజమెత్తారు.

సర్వే సూపర్‌వైజర్ ఇంటిలో సోదాలు





సర్వే సూపర్‌వైజర్ శ్రీనివాసమూర్తి, సోదాలు చేస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణపై కృష్ణరాజపురం తాలూకా కార్యాలయం సర్వే సూపర్‌వైజర్ ఇంటిలో లోకాయుక్త అధికారులు సోదాలు చేశారు. మంగళవారం తెల్లవారుజామున బెంగళూరు నగరంతో పాటు తుమకూరులోని పలు ప్రాంతాల్లో సర్వే సూపర్‌వైజర్ కేటీ శ్రీనివాసమూర్తికి సంబంధించిన ఇళ్లల్లో సోదాలు చేశారు. శ్రీనివాసమూర్తి ఐదు లిక్కర్ దుకాణాలకు అనుమతి తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో అధికారులు 14 ప్రాంతాల్లో సోదాలు చేశారు. భార్య పేరుపై ఉన్న హోటళ్లు, బోర్డింగ్ హౌజ్‌లో తనిఖీలు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆపరేషన్ హస్తం నా పని: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎస్ఎన్ నారాయణస్వామి

కేజీఎఫ్: ఆపరేషన్ హస్తం చేసి బీజేపీలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులను కాంగ్రెస్‌లోకి తీసుకు రావాలని పార్టీ హైకమాండ్ నాకు టాస్క్ ఇచ్చిందని, తాను ఆ ప్రయత్నంలో ఉన్నానని బంగారుపేటె ఎమ్మెల్యే ఎస్ ఎన్ నారాయణస్వామి తెలిపారు. మంగళవారం బంగారుపేటె తాలూకాలోని డీకే హళ్లి జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పలువురు ప్రముఖులు గతంలో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి వెళ్లారు. వారితో తాను ఇప్పటికే చర్చలు జరుపుతున్నానన్నారు. వారిని తిరిగి పార్టీలోకి తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. లోక్‌సభ సభ్యుడు ఎస్.మునిస్వామి తరచుగా తనపై ఆరోపణలు చేస్తూ మానసిక రోగిలా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సభ్యుల సహకారంతో జీపీలో అభివృద్ధి పనులను నిర్వహించాలని సూచించారు.



త్వరలో వర మహాలక్ష్మి పండుగ రానుంది. దీంతో మంగళవారం బెంగళూరు మల్లేశ్వరంలో లక్ష్మీదేవి విగ్రహాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

చంద్రయాన్ విజయానికి పూజలు



మైసూరు పంచముఖి ఆంజనేయ ఆలయంలో యాగం నిర్వహణ

మైసూరు: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చంద్రుని మీదకు పంపిన విక్రం ల్యాండర్ విజయవంతం కావాలని రాష్ట్రంలో పలుచోట్ల ఆలయాల్లో పూజలు, యాగాలు ప్రారంభించారు. మైసూరు జిల్లా బ్రాహ్మణుల సంఘం, అర్చకుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఇరివ్న్ రోడ్డులో ఉన్న ప్రఖ్యాత శ్రీ పంచముఖి అంజనేయస్వామి ఆలయంలో సర్వసిద్ధ యాగం నిర్వహించారు. ల్యాండర్ సక్రమంగా చంద్రుని మీద దిగాలని పూజలు చేశారు.

నంజనగూడులో..

దక్షిణ కాశీగా పేరు పొందిన మైసూరు జిల్లాలోని నంజనగూడులో శ్రీనంజుండేశ్వరస్వామి ఆలయంలో స్థానిక కళాకారులు చంద్రయాన్ రాకెట్ బొమ్మను ఉంచి పూజలు చేశారు. ఒక ఆర్ట్ స్టూడియో చిత్రకళా బృందానికి చెందిన విద్యార్థులు దీనిని రూపొందించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు దీనిని ఆసక్తిగా చూశారు.

స్వదేశీ దర్శన్‌కు హంపీ ఎంపిక



హొసపేటె: కేంద్ర స్వదేశీ దర్శన్ 2.0కు హంపీ ఎంపికైంది. ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా భాసిల్లుతున్న హంపీని స్వదేశీ దర్శన్‌గా ప్రకటించడంపై పర్యాటకులకు ఎంతో ఆనందం కలిగించింది. రాష్ట్రంలో మైసూరుకు దక్కని ఈ స్వదేశీ దర్శన్ 2.0కు హంపీ ఎంపికవడంతో రానున్న రోజుల్లో హంపీ మరింత అభివృద్ధి చెందేందుకు అనుకూలం అవుతుంది.



రాచనగిరి మైసూరులో నాగపంచమి సందర్భంగా పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

చంద్రయాన్‌పై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

హొసపేటె: చంద్రయాన్ ఉపగ్రహం సురక్షితంగా ల్యాండింగ్ కావడంపై మంగళవారం నగర మహిళా థియోసాఫికల్ కాలేజీ విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. యావత్ దేశ ప్రజల్లో చంద్రయాన్ ల్యాండింగ్ కుతూహలం రేకెత్తించిందన్నారు. ఎట్టకేలకు చంద్రయాన్ చంద్రమండలంలోకి అడుగు పెట్టడం యావత్ దేశ ప్రజలకు ఎంతో సంతోషం కలిగించిందన్నారు.

యోగా పోటీల్లో ప్రతిభ



పతకాలను అందుకొన్న విద్యార్థులు

కంప్లి: పట్టణంలోని యక్ష యోగా సంస్థ విద్యార్థులు గంగావతి కర్ణాటక యోగాసన క్రీడా సంస్థ, సంగాపుర జైన్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో కలబుర్గి విభాగ స్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వైఎస్.యోగేష్ ప్రథమ స్థానంతో రెండు బంగారు పతకాలు, ఎస్.నవ్య ద్వితీయస్థానంతో వెండి పతకం, ఎస్.పూజ తృతీయ స్థానంతో కాంస్య పతకాలను సాధించారు.

అడవి జంతువుల దాడులు అరికట్టండి



అడవి జంతువుల దాడిలో దెబ్బ తిన్న మొక్కజొన్న పంట

కంప్లి: కూడ్లిగి తాలూకా అమరాపురలో రెండు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట ఏపుగా పెరిగి కంకి, గింజ దశకు చేరుకోగా ఎలుగుబంట్లు దాడి జరిపి పంటను ధ్వంసం చేశాయి. ఎలుగుబంట్లు, అడవి పందులు దాడి చేసి ఇలా పంటలను నాశనం చేయడంపై పలువురు రైతులు సందిగ్ధంలో ఉన్నారు. ఈనేపథ్యంలో అటవీ అధికారులు అడవి జంతువుల దాడులను అరికట్టి తమ పంటలను కాపాడాలని బాధిత రైతు మహిళ పరమేశ్వరమ్మ డిమాండ్ చేశారు.

హాస్టళ్లలో సౌకర్యాలపై ఆరా



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

హొసపేటె: విజయనగర జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో సౌకర్యాలపై మంగళవారం జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు హాస్టల్ వార్డెన్లను ఆరా తీశారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి కొరత కలగకుండా అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు గదుల్లో కాటేజ్ వ్యవస్థ, మంచినీరు, విద్యుత్‌తో పాటు అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో సౌకర్యాలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించండి

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో నీటి గేజ్‌ను కాపాడి చివరి ఆయకట్టుకు నీరందించాలని కాలువ పోరాట సమితి నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం సిరివార–అరకేర రోడ్డుపై ఆందోళన చేపట్టిన అధ్యక్షుడు శంకర్‌గౌడ మాట్లాడారు. 69వ మైలు వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించాలన్నారు. ఆయకట్టు చివరి భూములకు నీరందాలంటే గేజ్‌ను నిర్వహించాలన్నారు. ఈ విషయంలో ఇంజినీర్లు సక్రమంగా కాలువపై నీటి నిర్వహణ చేయాలని కోరుతూ జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకో చేపట్టడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురయ్యారు.

ఆక్రమణల తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

రాయచూరు రూరల్: నగరంలో రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాల తొలగింపునకు ట్రాఫిక్ పోలీసులు శ్రీకారం చుట్టారు. మంగళవారం గీతా మందిర్ నుంచి షరాఫ్ బజార్‌లో ఫుట్‌పాత్‌లపై ఉన్న అంగళ్లు, తోపుడుబండ్లు తదితరాలను తొలగించారు.

వాడీవేడిగా సిటీ కార్పొరేషన్ సమావేశం



పాల్గొన్న మేయర్ త్రివేణి, ఉపమేయర్, కమిషనర్ రుద్రేష్, సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న అధికార పార్టీ కార్పొరేటర్లు



మాట్లాడుతున్న విపక్ష కార్పొరేటర్ ఇబ్రహీంబాబు, సభ్యులు

- సమస్యలపై గళమెత్తిన అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు
- అధికారులపై విపక్ష కార్పొరేటర్ ఇబ్రహీంబాబు గరం

సాక్షి, బళ్లారి: జెడ్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సిటీ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో నగర సమస్యలపై వాడీవేడిగా చర్చ జరిగింది. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం 12.30 గంటలైనా ప్రారంభం కాకపోవడంతో ఎవరి రాక కోసం సమావేశం ఆలస్యంగా ప్రారంభిస్తున్నారని, మేయర్, ఉపమేయర్, కార్పొరేటర్లు వచ్చినా ఎందుకు సమావేశం ప్రారంభించడం లేదని ప్రతిపక్ష బీజేపీ కార్పొరేటర్ ఇబ్రహీంబాబు కమిషనర్‌పై మండిపడ్డారు. అనంతరం నగర సమస్యలపై ఒక్కసారిగా ప్రతిపక్ష సభ్యులు గళం విప్పడంతో సమావేశం అర్ధ గంటకు పైగా బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు, అధికారుల వాదోపవాదాల మధ్య రసాభాసగా సాగింది. నగర సమస్యలపై చర్చించేందుకు తమను అనుమతించకపోతే సమావేశం నుంచి వాకౌట్ చేస్తామని బీజేపీ కార్పొరేటర్లు తేల్చిచెప్పారు. ప్రతిపక్ష కార్పొరేటర్లు హనుమంతప్ప, కే.ఎస్ అశోక్, కల్పన వెంకటరామిరెడ్డి, గోవిందరాజులు తదితరులు సమస్యలపై చర్చించారు.

నిధుల విడుదలలో వివక్ష వద్దు

నగరంలో మంచినీటి సమస్యపై ముఖ్యంగా వార్డులో అభివృద్ధి పనులకు నిధుల విడుదలలో అధికార, విపక్ష కార్పొరేటర్లు గెలిచిన వార్డుల్లో తారతమ్యం చేస్తున్నారన్నారు. అన్ని వార్డులకు సమానంగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్పొరేటర్ గాదెప్ప మాట్లాడుతూ ఎక్కడా తారతమ్యత చూపలేదని, అందరికీ సమానంగా నిధులు విడుదల చేశారని గుర్తు చేశారు. మంచినీటి సమస్య తీర్చడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ వివేక్(విక్కీ) మాట్లాడుతూ నగరంలో వీధికుక్కల స్వైర విహారం నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నగర కమిషనర్ రుద్రేష్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సుదీర్ఘంగా సమాధానం ఇస్తూనే ముందుగా పొందుపరిచిన అజెండాలోని అన్ని పనులకు సభ్యులతో పాస్..పాస్ అంటూ ఆమోద ముద్ర వేయించుకున్నారు.

అభివృద్ధిలో రాజకీయాలకు చోటు లేదు

కాగా ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాట్లాడుతూ నగరాభివృద్ధిలో రాజకీయాలు చేయనన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో వెనుకడుగు వేసే ప్రశ్నే లేదన్నారు. నగరం చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల పరిధిని కార్పొరేషన్‌లోకి చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 24 గంటల పాటు నగరంలో నిరంతరాయంగా నీరు సరఫరా చేసే ప్రక్రియను ప్రారంభించామని, దశలవారీగా అన్ని వార్డులకు నిరంతర నీటి సరఫరా అందజేస్తామన్నారు. దాదాపు మూడు గంటలకు పైగా జరిగిన కార్పొరేషన్ సమావేశం ప్రారంభంలో అధికార, విపక్ష సభ్యులు ఆగ్రహంగా మాట్లాడినా చివరకు శాంతించి నగర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో మేయర్ త్రివేణి, ఉపమేయర్, కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పూజిస్తూ..ఆడుకుంటూ..ఆనందిస్తూ..

- పంచమి పర్వదినాన కుట్టని తేళ్లు
- ఇదో అనుభూతి అంటున్న యువత
- ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఆచారం
- అంతటా నాగపంచమి.. కందుకూరులో భక్తిశ్రద్ధలతో తేళ్ల పంచమి



చేతిలో తేలుతో ఆడుతున్న యువతి



తేలును పట్టుకున్న యువకుడు

రాయచూరు రూరల్: దేశవ్యాప్తంగా మంగళవారం భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నాగ పంచమి వేడుకలు జరుపుకుంటే జిల్లా సరిహద్దులోని ఓ గ్రామ ప్రజలు అందరికీ భిన్నంగా తేళ్ల పంచమిని జరుపుకున్నారు. మంగళవారం సాయంత్రం రాష్ట్రంలోని యాదగిరి జిల్లా గురుమఠకల్ తాలూకా కందుకూరు గ్రామ సమీపంలోని కొండమ్మవ్వ అమ్మవారి సన్నిధిలో తేళ్ల పంచమి సందర్భంగా భక్తులు కొండమ్మవ్వను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత కొండపై ఆలయ పరిసరాల్లోని ఏ చిన్న రాయిని తొలగించినా వాటి కింద తేళ్లు కనిపించాయి. తేళ్లను పట్టుకోవడానికి చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహాన్ని కనబరిచారు.

ఒంటిపై తేళ్లను పాకించుకుని సంబరం

ఈ తేళ్లను చేతితో తాకినా, పట్టుకున్నా, శరీరంపై పాకించినా అవి కుట్టనే కుట్టవు. అమ్మవారి మహిమతో తేళ్లు ఎలాంటి హాని చేయవని భక్తుల విశ్వాసం. విద్యావంతులు వాతావరణ పరిస్థితులు, వన మూలికల కారణంగా ఆ తేళ్లు కుట్టలేవన్నారు. పంచమి సందర్భంగా భక్తులు పట్టుకున్న తేళ్లను తమ ముఖం, మెడ, నాలుకపై పాకించుకుంటూ ఆనంద పడ్డారు. ప్రతి శ్రావణ మాసంలో పంచమి రోజున పూజలు చేయడంతో తమకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందన్న నమ్మకంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులను తీర్చుకున్నారు.

తేళ్లను తాకితే మంచి జరుగుతుంది

కొండమ్మవ్వ గుట్టపై పూజలు చేసే క్రమంలో తేలును తాకితే తమకు మేలు జరుగుతుందని, పట్టుకున్నా కరవవని భక్తుల ప్రగాఢ నమ్మకం. నాగ పంచమి రోజు నాగులకు నైవేద్యంగా సమర్పించే పాలు, నువ్వులు,బెబె ల్లం తదితర పదార్థాలను తేళ్ల పంచమి రోజు ఆ గుట్టపై ఉంచి పూజలు చేస్తారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు ఈ ఆలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు.



చిన్నారి మోచేతిపై పాకుతున్న తేలు



తేలును పట్టుకున్న బాలికలు



మహిళ చేతిపై పాకుతున్న తేలు

వంట గ్యాస్ వాడకంపై జాగృతి



జాగృతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: అరాభికొత్తనూరు పాఠశాలలో పని చేసే వంట సిబ్బంది, విద్యార్థులకు వంట గ్యాస్ వాడకంపై కేదార్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది మంగళవారం జాగృతి కల్పించారు. గ్యాస్ ఏజెన్సీ యజమాని రూపేష్ మాట్లాడుతూ వంటగ్యాస్‌ను వాడే సమయంలో, గ్యాస్ లీకేజీ కాకుండా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్యాస్ స్టౌను ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించాలన్నారు. గ్యాస్ పైపును కూడా తరచుగా మారుస్తూ ఉండాలన్నారు. వంట గదిని కూడా ఎప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గదిలో కిటికీలను ఎప్పుడూ తెరచి ఉంచాలన్నారు. వంట ముగిసిన తర్వాత రెగ్యులేటర్‌ను తప్పనిసరిగా ఆఫ్ చేయాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం సిద్దేశ్వరి, ఫరీదా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

త్వరలో రైల్వే పైవంతెన నిర్మాణం

గంగావతి: హులిగి–మునిరాబాద్ మధ్య 79వ రైల్వే గేట్ వద్ద పైవంతెన నిర్మాణానికి రూ.29.57 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ తెలిపారు. అలాగే రూ.3 కోట్లను వంతెన నిర్మాణానికి అవసరమైన భూస్వాధీనానికి కూడా విడుదల చేసిందన్నారు. ఈ నిధులకు రాష్ట్ర వాటా నిధులను కలిపి త్వరలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ఆయన తెలిపారు.

స్వర్గం కన్నా జన్మభూమి మిన్న



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గంగావతి: స్వర్గానికన్నా జన్మభూమి మిన్న అని టీపీ ఈఓ లక్ష్మీదేవి అన్నారు. తాలూకా పంచాయతీ ఆవరణలో మంగళవారం 18 గ్రామ పంచాయతీల నుంచి మట్టిని తెప్పించి మన మట్టి– మన దేశం అనే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జన్మభూమి స్వర్గం కన్నా గొప్పదన్నారు. మన మట్టి– మనదేశం కార్యక్రమంపై నేటి తరాలకు జాగృతి కల్పించేందుకు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ మట్టినిను బెంగళూరుకు పంపించి అక్కడి నుంచి దేశ రాజధాని ఢిల్లీకి పంపుతారన్నారు. ఈ మట్టితో దేశ స్వాతంత్య్ర పోరాటయోధులు, వీరయోధుల సమాధులు ఉన్న స్థలాల్లో మొక్కలను పెంచేందుకు ఉపయోగిస్తారన్నారు. టీపీ అధికారులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతుకు నిధులు

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయధారంగా ఉన్న నేపథ్యంలోగ్రామీణ నియోజకవర్గంలో చెరువుల మరమ్మతుకు ప్రభుత్వం రూ.146 కోట్ల కేటాయింపునకు ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ చొరవ చూపారు. 2008లో కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ సర్కార్‌లో చెరువుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గుంజళ్లి, యరగేర, గిల్లేసూగూరు, తలమారి, జంబలదిన్ని చెరువులను మరమ్మతు చేసి తుంగభద్ర నది నుంచి నీటిని పంపింగ్ చేసి నిల్వ చేస్తారు. దీంతో 80 గ్రామాల ప్రజలకు తాగునీటి ఎద్దడి నివారణ, 300 ఎకరాల్లో సాగునీటి పథకాలకు సౌకర్యం కల్పించినట్లవుతుంది.

అధికారులపై చర్యలకు వినతి

రాయచూరు రూరల్: లింగాయత బేడ జంగములకు ఎస్సీ ప్రమాణ పత్రం ఇవ్వడం తగదని దళిత సంఘర్ష సమితి పేర్కొంది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో సమితి అధ్యక్షుడు చెన్నబసవ మాట్లాడారు. గ్రేడ్‌– 2 తహసీల్దార్ అన్వర్ లింగాయత బేడ జంగమలకు ఎస్సీ ప్రమాణ పత్రం ఇవ్వడాన్ని రద్దు చేయాలని కోరుతూ ఏసీకి విన్నవించినా బేఖాతరు చేసి ప్రమాణ పత్రాలను జారీ చేసిన ఏసీ, గ్రేడ్‌–2 తహసీల్దార్‌లపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పౌర కార్మికులుగా గుర్తించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న కార్మికులు

రాయచూరు రూరల్: శ్మశానంలో విధులు నిర్వహించే కాటికాపరులను పౌర కార్మికులుగా గుర్తించాలని రాష్ట్ర శ్మశాన కాటికాపరుల కార్మికుల సంఘం పేర్కొంది. మంగళవారం టిప్పు సుల్తాన్ ఉద్యానవనం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు వీరేష్ మాట్లాడారు. శ్మశానాల్లో కాటికాపరులను నియమించుకొని వారికి గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

మాజీ మంత్రి శ్రీరంగదేవరాయలు కన్నుమూత



శ్రీరంగదేవరాయలు(ఫైల్)

గంగావతి: పట్టణంలోని తమ నివాసంలో ప్రముఖ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి శ్రీరంగదేవరాయలు(87) వయోసహజ అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన రెండు సార్లు వరుసగా కనకగిరి, మూడు సార్లు వరుసగా గంగావతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కలిపి మొత్తం సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది కొప్పళ జిల్లాలో రికార్డు సృష్టించారు. ఆయనను సరళ, సజ్జన వ్యక్తిగా ఉత్తమ ప్రజా సేవ అందించిన నేతగా ప్రజలు కొనియాడుతున్నారు. ఆయన వీరప్ప మొయిలీ మంత్రివర్గంలో అనతికాలం పని చేశారు. ఆయన రైతులు, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉంటూ వారితో మమేకమై 25 ఏళ్లు ప్రజాసేవకు అంకితం అయ్యారు. ఆయన మృతిపై పలువురు ప్రముఖ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీలకు అతీతంగా సంతాపాన్ని తెలియజేశారు. ఆయన అంత్యక్రియలు బుధవారం స్వగ్రామమైన ఆనెగుందిలో క్షత్రియ సాంప్రదాయం ప్రకారం నిర్వహించనున్నారు. ఆయన విజయనగర సామ్రాజ్య శ్రీకృష్ణదేవరాయల వంశస్థులు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె, అపార సంఖ్యలో బంధువులు ఉన్నారు.

కోలారు వార్తలు...

ఇంటింటికీ వెళ్లి జాబితా పరిశీలించండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అక్రంపాషా

శ్రీనివాసపురం: పోలింగ్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించాలని, నిర్ణీత కాల వ్యవధిలో ఈ పనిని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అక్రం పాషా తెలిపారు. మంగళవారం తాలూకా కార్యాలయంలో నిర్వహించిన ఓటరు సంక్షిప్త పరిశీలనాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 శాతం కంటే తక్కువ ప్రగతిని సాధించిన పోలింగ్ అధికారులు, ఉన్నతాధికారుల మార్గదర్శనంతో ఇంటింటికీ వెళ్లి నిర్దేశించిన ప్రగతిని సాధించాలన్నారు. ఎట్టి పరిస్థితిలోను దీనిని ఆలస్యం చేయరాదన్నారు. మూడు రోజుల్లోగా ప్రగతిని సాధించి నివేదిక సమర్పించాలన్నారు. తాలూకా కార్యాలయ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రగతిని పరిశీలించాలని సూచించారు. అవసరమైన చోట పోలింగ్ అధికారులకు తగిన మార్గదర్శనం చేయాలన్నారు. సమావేశంలో నగరాభివృద్ధి ప్రాధికార యోజనాధికారి కదిల్, తహసీల్దార్ శిరీన్‌తాజ్, పురసభ ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

త్వరలో తిగళ సంఘానికి ఎన్నికలు



పదాధికారుల సమావేశం నిర్వహించిన దృశ్యం

మాలూరు: రాష్ట్ర తిగళ సంఘానికి వచ్చే నెల 10న నిర్వహిస్తున్న ఎన్నికల్లో ఉత్తమ వ్యక్తులను గెలిపించడం ద్వారా సముదాయ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని తాలూకా వహ్నికుల(తిగళ) సమన్వయ సమితి అధ్యక్షుడు బడగి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో నిర్వహించిన సమన్వయ సమితి పదాధికారులు, సభ్యులతో రాష్ట్ర ఎన్నికల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ఎన్నిక కావడం వల్ల వహ్నికుల సమన్వయ సమితి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చిస్తున్నట్లు తెలిపారు. సాధ్యమైనంత వరకు పదాధికారులను ఏకగ్రీవంగా ఎన్నుకునే ప్రయత్నం చేయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి సముదాయ బలోపేతానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఈ సందర్భంగా పురసభ సభ్యుడు ఎం. రామమూర్తి, ఎం.వెంకటేష్, కోడిహళ్లి వెంకటేష్, కృష్ణప్ప, శంకర్, అంబరీష్, కృష్ణమూర్తి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ దాదాపు పూర్తి



తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలిస్తున్న కలెక్టర్

కేజీఎఫ్: తాలూకాలో ఓటరు జాబితా సవరణ ఇంటింటి సర్వే 80 శాతం పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ అక్రం పాషా తెలిపారు. మంగళవారం తాలూకా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 12న బేతమంగల ఫిర్కాలోని 8 పోలింగ్ బూత్‌ల్లో చేపట్టిన ఇంటింటి సర్వే ఈనెల 21కే పూర్తి కావలసి ఉన్నా కొన్ని కారణాల వల్ల 24 వరకు పొడిగించినట్లు తెలిపారు. వంద శాతం ప్రగతి సాధించే లక్ష్యాన్ని త్వరలో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. తాలూకా కార్యాలయం వెనుక అసంపూర్తిగా ఉన్న ప్రహరీగోడ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ద్విచక్రవాహనాలకు పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించాలని కమిషనర్‌కు సూచించామన్నారు. తహసీల్దార్ నాగవేణి, టీపీ ఈఓ మంజునాథ్ హర్తి, నగరసభ కమిషనర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరుగురు బాలకార్మికులకు విముక్తి

కంప్లి: కురుగోడు పట్టణంలో కార్మిక శాఖ అధికారులు దాడులు జరిపి నలుగురు బాల, ఇద్దరు కిషోర కార్మికులను వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించారు. బాదనహట్టి రోడ్డులోని తాలూకా కార్యాలయం ఎదుట, తేరువీధి, కంప్లి రోడ్డులోని గ్యారేజీలు, బేకరీలు, హోటళ్లు, మెకానిక్‌షెడ్లు, కిరాణి అంగళ్లపై దాడి జరిపి వాటిలో పని చేస్తున్న బాల కార్మికులకు రక్షణ కల్పించినట్లు జిల్లా బాలకార్మిక యోజనాధికారి మౌనేష్ తెలిపారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తి అదృశ్యం

హుబ్లీ: పని మీద బయటకు వెళ్లిన వ్యక్తి పార్కింగ్ స్థలంలో బైక్‌ను నిలిపి కనిపించకుండా పోయిన ఘటన నగరంలో వెలుగు చూసింది. పాత హుబ్లీ శివసోమేశ్వర నగరకు చెందిన అశోక కసాపకడ్లి(39) అనే వ్యక్తి ఈ నెల 12న ఉదయం డ్యూటీకి వెళ్లి వస్తానని బయటకు వెళ్లాడు. ఇక్కడి కొప్పికర రోడ్డులోని పార్కింగ్ స్థలంలో అశోక్ బైక్ నిలిపి వెళ్లారు. అయితే ఇంటికి మాత్రం రాలేదని కుటుంబ సభ్యులు హుబ్లీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కలుషిత నీరు తాగి పలువురికి అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: యాదగిరి జిల్లా గురుమఠకల్ తాలూకా గాజరకోటి గ్రామంలో కలుషిత నీరు తాగి పలువురు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం గాజరకోటి గ్రామానికి చెందిన 15 మందికి పైగా ప్రజలకు వాంతులు, విరేచనాలు కావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. గ్రామంలోని మంచినీటి ట్యాంకును శుభ్రం చేయక పోవడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడినట్లు అధికారులు గుర్తించారు. దీంతో స్థానిక వైద్యాధికారులు గ్రామాన్ని సందర్శించి మంచినీటి వాడకంపై ప్రజల్లో చైతన్యం తెచ్చారు. అయితే ఎవరికీ ప్రాణ హాని లేదని, అందరూ క్రమంగా కోలుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

రాయచూరు రూరల్: తాలూకాలోని మిట్టి మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని రత్న రాయచూరుకర్ రాష్ట్ర స్థాయి గ్రామీణ ఉపాధ్యాయిని రత్న అవార్డు అందుకున్నారు. ఈ నెల 20న కొప్పళ జిల్లా కుష్టగి తాలూకా హనుమసాగరలో గుబ్బి వీరన్న, పి.బి.దుత్తరిగి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విద్యా రంగంలో అమోఘ సేవలు అందించిన ఉపాధ్యాయులను గుర్తించి అవార్డుతో అభినందించారు. ఈసందర్భంగా కరిసిద్దేశ్వర మఠాధిపతి విజయ మహంత శివయోగి, యరనాళ హిరేమఠం శివప్రసాద్ స్వామీజీ, కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, సంస్థ అధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి శ్రీదేవి తదితరులున్నారు.


ఆస్పత్రిలో సౌకర్యాల కోసం ధర్నా



ధర్నా చేస్తున్న రైతు సంఘం పదాధికారులు

కోలారు: బంగారుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు మంగళవారం ఆస్పత్రి ముందు బుట్టలతో సహ వినూత్న రీతిలో ధర్నా నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ మాట్లాడుతూ ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు లేక పేద రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. డయాలసిస్ యూనిట్‌ను పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సక్రమంగా విధుల్లో ఉండాల్సిన వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో పేద రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ధర్నాలో జిల్లా మహిళా అధ్యక్షురాలు నళినిగౌడ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తులను ఆశ్రయించొద్దు



టీపీ ఈఓ మంజునాథ్

కేజీఎఫ్: నియోజకవర్గంలోని 16 జీపీల్లో ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన వద్దకు రావాలని, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని టీపీ ఈఓ మజునాథ హర్తి తెలిపారు. మంగళవారం టీపీ కార్యాలయంలో అధికార బాధ్యతలు తీసుకున్న తరువాత ఆయన విలేకరులతో మాట్లాడారు. తనను కలవడానికి వచ్చే వారు నేరుగా తనను కలవచ్చన్నారు. జీపీల్లోని సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. తరుచుగా జీపీలకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటానన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు తనకు సహకరించాలన్నారు. గ్రామాల్లోని చిట్ట చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ సౌకర్యాలను అందించేందుకు ప్రయత్నిస్తానన్నారు.

గణేష్ ఆలయంలో శ్రావణ పూజలు

బళ్లారిఅర్బన్: 20వ వార్డు గణేష్ కాలనీలోని వరసిద్ధి వినాయక ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా గణపతికి వెన్నతో అలంకరణ పూజలను నిర్వహించినట్లు దేవస్థాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య తెలిపారు.

క్లుప్తంగా

మానవతా విలువలు అలవరచుకోవాలి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసిన దృశ్యం

గౌరిబిదనూరు: విద్యార్థులు మానవతా విలువలను అలవరచుకోవాలని, యువతలో జాతీయ భావైక్యత, నైతిక విలువలు నేర్పడానికి కార్యక్రమాలను రూపొందించాలని బీజేపీ నగర అధ్యక్షుడు మార్కెట్ మోహన్ తెలిపారు. మంగళవారం శ్రీలక్ష్మీవెంకటరమణ స్వామి దేవాలయం ఆవరణంలో బావికట్టె మిత్ర బళగ సభ్యులచే జరిగిన ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాలు అందజేసి మాట్లాడారు. జ్ఞానమందిర పాఠశాల ఆవులప్ప మాట్లాడుతూ... ప్రతిభ కనబరచిన వారిని సమాజం గౌరవిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పీడీఓ బాలకృష్ణ, జీఎస్ఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, బీజేపీ రూరల్ అధ్యక్షుడు రమేశ్ రావ్, విశ్రాంత ఉపాధ్యాయుడు రాంబాబు, కృష్ణమూర్తి, మణికంఠ, మారుతీ, ఈశ్వర్, రాఘవేంద్ర, జయంతి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బొమ్మనహళ్లి: స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం నగరంలోని బొమ్మనహళ్లి రూపెన అగ్రహారలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

బెయిలు మంజూరు

గౌరిబిదనూరు: స్వాతంత్ర్య వేడుకలో నగరంలోని ఎంజి సర్కిల్‌లో జరిగిన అఖండ భారత సంకల్ప దినాచరణ కార్యక్రమంలో పాల్గొన్న హిందూ జాగరణ వేదికె దక్షిణ ప్రాంతం సంయోజకులు దావణగెరె సతీశ్‌ను నగర పోలీసులు ఆదివారం దావణగెరెలో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు జుడీషియల్ కస్టడీకు పంపింది. సోమవారం సాయంత్రం కోర్టు సతీశ్‌కు బెయిలు మంజూరు చేసింది.

దంపతుల ఆత్మహత్య

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా సుళ్య తాలూకా ఎలిమలెలో రబ్బర్ ట్యాపింగ్ చేస్తున్న దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన రాజన్ అతడి భార్య ఆత్మహత్య చేసుకున్నారు. ఎలిమలె ప్రాంతంలో కొన్నేళ్ల నుంచి రబ్బర్ ట్యాపింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల రబ్బర్ తోటను కొనుగోలు చేశారు. సోమవారం రాత్రి దంపతులు మాత్రమే ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియటంలేదు. మృతులకు ఇద్దరు కుతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. కావేం

గృహలక్ష్మీ పథకం ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై చర్చిస్తున్న జిల్లా అధికారి

మైసూరు: మైసూరు నగరంలో ఈనెల 30న గృహలక్ష్మీ పథకం ప్రారంభం కానుండటంతో దానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా అధికారి రాజేంద్ర, మైసూరు నగర పోలీసు కమిషనర్ రమేశ్ బానోతు పరిశీలించారు. నగరంలోని మహారాజా కళాశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను వారు పరిశీలించారు. మైసూరు, మండ్య, చామరాజనగర, మడికేరి జిల్లాల నుంచి దాదాపు లక్షన్నర మంది వచ్చే అవకాశం ఉందని జిల్లా అధికారి తెలిపారు.

గుండెపోటుతో ఆటో డ్రైవరు మృతి

నడిరోడ్డుపై కుప్పకూలిన వైనం

బనశంకరి: గుండెపోటుతో ఆటో డ్రైవర్ నడిరోడ్డుపై మృతి చెందిన ఘటన సంపంగి రామనగరలో మంగళవారం చోటుచేసుకుంది. మండ్య జిల్లా మద్దూరు నివాసి తిమ్మేశ్ (52) తీవ్రమైన గుండెపోటుతో మృతి చెందాడు. సంపంగిరామనగరలో నివాసముంటున్న తిమ్మేశ్ మంగళవారం ఉదయం ఆటో తీసుకుని ఇంటి నుంచి బయలుదేరాడు. ఉదయం 9.30 గంటల సమయంలో సంపంగి రామనగర 4వ క్రాస్ వద్ద ఆటో రోడ్డు పక్కన నిలిపి టీ తాగడానికి ఓ హోటల్ వద్దకు నడుచుకుని వస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో అక్కడికక్కడే కుప్పకూలాడు. గమనించిన స్థానికులు సపర్యలు చేస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు.

అనావృష్టి.. అన్నదాతల నోట్లో మట్టి?

● వాన వచ్చి 40 రోజులైంది ● గౌరిబిదనూరు తాలూకాలో పంటలు ఎండుముఖం



ముదుగెరె సమీపంలో వాడుతున్న మొక్కజొన్న పైరు, దిగాలుగా ఉన్న రైతు



అరుకుందలో ఎండిపోతున్న జొన్న పంట

గౌరిబిదనూరు: ప్రతి ఏటా వ్యవసాయం జూదం మాదిరిగా మారింది. రైతులు పంట పండించాలంటే కష్టాలెన్నో ఉంటాయి, వాటిలో అతివృష్టి, అనావృష్టి ముఖ్యమైనవి. సరైన వానలు లేక తాలూకాలోని పొలాలు ఎండుముఖం పట్టడంతో రైతులు దిగులుతో ఉన్నారు.

తొలకరి వర్షాలకు ఆశపడి..

ఈ ఏడాది తొలకరి వర్షాలు కొంచెం ముందే పడడంతో రైతులు ఆశాభావంతో అప్పులు చేసి రాగి, వేరుశెనగ, మొక్కజొన్న తదితర విత్తనాలు వేశారు. మెట్టపంటలకు వర్షమే ఆధారం, కానీ తరువాతి రోజుల్లో వర్షం పడలేదు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు మొదటి వారానికి 296 మి.మీ వర్షం పడాల్సి ఉండగా 260 మి.మీ మాత్రమే కురిసింది. రైతులు వర్షం పడొచ్చని ఆశతో తాలూకాలో 60 శాతం భూమిలో విత్తనాలు వేశారు. వరుణుని కృప లేక పోవడంతో ప్రస్తుతం పంటలు ఎండుతూ ఉన్నాయి.

సగటు కంటే తక్కువ వర్షం

తాలూకాతో పాటు జిల్లా అంతటా వాగులు, వంకలు, మడుగులు వంటి జల మూలాలు ఎండిపోతూ ఉంటే రాబోవు రోజులలో వర్షాలు పడక తాగునీటికి సైతం కష్టమవుతుందని ప్రజల్లో భయం నెలకొంది. ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు తాలూకాలో 30 శాతం తక్కువ వర్షం కురిసినట్లు అంచనా. వర్షం పడి సుమారుగా 40 రోజులకు పైబడింది. ఇప్పుడు వర్షం వచ్చినా పంటలు కోలుకోబోవని, 50 శాతం పంట నష్టం తప్పదని రైతులు వాపోయారు. ప్రభుత్వం రైతులందరికీ పంట నష్ట



హోసూరులో వాడిన రాగి పొలం

పరిహారం, బీమా తదితరాలను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఇక తాలూకాలో మొక్కజొన్నను 19,125 హెక్టార్లలోనూ, రాగులు 2,184, వేరుశెనగ 687, కందులు 745, అనప 630, అలసంద 60, చెరుకు 130, ఆముదం 46 హెక్టార్లలో విత్తనాలు వేసినట్లు వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్ మోహన్ తెలిపారు.

కరెంటు కోతల సమస్య

అలాగే బోర్లు, బావులు ఉన్న తరి భూములలో పంటలు పెట్టిన వారికి కరెంటు కోతలతో సమస్యగా ఉంది. పగలు కరెంటు సరఫరా ఉండదు, రాత్రి విద్యుత్ ఎప్పుడిస్తారో తెలియదు. వచ్చినా కొంతసేపు మాత్రమే ఉంటుంది, ఈ సమయంలో పంపుసెట్టు వేసినా కొంత పొలం మాత్రమే తడుస్తుంది అని రైతులు తెలిపారు. పూర్తిస్థాయిలో కరెంటును ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎలక్ట్రానిక్ సిటీ వంతెనపై రోడ్డు ప్రమాదం

● ఒకరి మృతి, డ్రైవర్లకు తీవ్ర గాయాలు



ప్రమాద దృశ్యం

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి సమీపంలో ఉన్న ఎలక్ట్రానిక్ సిటీ వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు... బెంగళూరు వైపు నుంచి ఎలక్ట్రానిక్ సిటీ వైపు వెళ్తున్న బొలెరో వాహనం వంతెనపై నిలిచి పోయింది. దాన్ని అర్ధరాత్రి టోయింగ్ వాహనంతో తీసుకుని వస్తుండగా అదే రోడ్డుపై వేగంగా వచ్చిన క్యాంటర్ వాహనం ఢీకొంది. దీంతో బొలెరో వాహనంలో ఉన్న వ్యక్తి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. అయితే మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. బొలెరో వాహనం డ్రైవర్ హరీశ్, క్యాంటర్ డ్రైవర్ మన్సూరు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్యాంటర్ వాహనం ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో మన్సూర్‌ను బయటకి తీయడానికి స్థానికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో కొద్దిసేపు వంతెనపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

కీచక ఉపాధ్యాయుడు



గోవిందరాజ్ (ఫైల్)

హోసూరు: ప్రభుత్వ పాఠశాలలో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయున్ని మహిళా పోలీసులు అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశారు. హోసూరు రెండవ పారిశ్రామిక వాడ మోర్నపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెయ్యి మందికి పైగా బాల బాలికలు చదువుతున్నారు. హోసూరు కురింజి నగర్‌కు చెందిన గోవిందరాజ్ (45) కొన్ని రోజుల క్రితం క్రీడా మైదానంలో ఆటలాడుకొంటున్న 6వ తరగతి విద్యార్థినిని కౌగిలించుకొన్నట్లు పిల్లల సంక్షేమ శాఖాధికారికి ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేపట్టి మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు నిందితుడు గోవిందరాజ్‌ను అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశారు.

వండర్‌లాలో ప్రమాదం.. వ్యక్తి మృతి



రాజు

దొడ్డబళ్లాపురం: రామనగరలోని అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో సోమవారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. జడేనహళ్లి గ్రామానికి చెందిన రాజు (35) మృతి చెందాడు. కుటుంబంతో పాటు వండర్‌లాకు వచ్చిన రాజు సాహస క్రీడల్లో పాల్గొనగా పైనుండి కిందకుపడి మృతి చెందాడు. బిడది పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దొడ్డలో ఆక్రమణల తొలగింపు

దొడ్డబళ్లాపురం: దొడ్డ పట్టణ పరిధిలో ప్రధాన రహదారులకు ఇరువైపులా తలెత్తిన అక్రమ దుకాణాలను నగరసభ అధికారులు, పోలీసులు తొలగింపు చేపట్టారు. ఇరువైపులా స్థలం కబ్జా అయి వాహనాల రాకపోకలకు ఆటంకం కలగడంతోపాటు నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు వారాల క్రితం టిప్పర్ లారీ ఢీకొని బైక్‌పై వెళ్తున్న తండ్రీ కుమార్తె మృతి చెందారు. దీంతో పలు ప్రజా సంఘాలు ఇటీవల ధర్నా చేపట్టాయి. దీంతో నగరసభ కమిషనర్ పరమేశ్వర్, పోలీసుల సహకారంతో టీబీ సర్కిల్, బయలు బసవన్న దేవాలయం తదితర ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించుకుని వేసుకున్న దుకాణాలను తొలగించారు. పలువురు వ్యాపారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇది ప్రారంభం మాత్రమే, పట్టణంలో అక్రమ దుకాణాలు ఎక్కడ ఉన్నా నిర్దాక్షిణ్యంగా తొలగిస్తామని కమిషనర్ తెలిపారు.



దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

పేకాటరాయుళ్ల అరెస్టు

దొడ్డ తాలూకా లక్ష్మీదేవిపుర గ్రామంలో ప్రభుత్వ స్థలంలో పేకాట ఆడుతున్నట్టు తెలిసి గ్రామీణ పోలీస్‌స్టేషన్ సీఐ మునికృష్ణ, సిబ్బంది దాడిచేసి 6మందిని అరెస్టు చేసారు. 12,500 నగదు, 5 మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థులకు శుభవార్త

● మెరిట్ రుణాల స్థాయి రూ.5 లక్షల పెంపునకు యోచన

శివాజీనగర: ఎంబీబీఎస్ చదివే అల్పసంఖ్యాక సముదాయపు మెరిట్ విద్యార్థులకు రుణాల స్థాయిని రూ.5 లక్షలకు పెంచేందుకు యోచిస్తున్నట్లు రాష్ట్ర గృహవసతి, అల్పసంఖ్యాకుల సంక్షేమ మంత్రి జమీర్ అహమ్మద్ తెలిపారు. కర్ణాటక అల్పసంఖ్యాకుల అభివృద్ధి మండలి ద్వారా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పథకాలను ప్రారంభించిన ఆయన, ప్రస్తుతం కేఎండీసీ ద్వారా ప్రభుత్వ కోటా కింద సీటు పొందే మెరిట్ విద్యార్థులకు రూ.3 లక్షలు రుణాలు ఇస్తారు, దీన్ని రూ. 5 లక్షల వరకు పెంచాలని యోచిస్తున్నట్లు చెప్పారు. అల్పసంఖ్యాకుల సంక్షేమ కార్యదర్శి మనోజ్ జైన్, డైరెక్టర్ జిలాని మోకాశి, కేఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ నజీర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెండ్



సందీప్ కుమార్ (ఫైల్)

యశవంతపుర: మైనర్ బాలికను గోప్యంగా పెళ్లి చేసుకున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. బీదర్ జిల్లా భాల్కి తాలూకా హలసి తూగాంవ్ గ్రామానికి చెందిన బాలిక (15)ను ఉపాధ్యాయుడు సందీప్‌కుమార్ పెళ్లి చేసుకున్నారు. ఇందుకు సంబంధించి బాల్కి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కేసుకు సంబంధించి క్రమశిక్షణ చర్యల్లో భాగంగా బీదర్ డీడీపీఐ సలీంపాషా సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

హత్య కేసులో కుమారుడు..

● జీర్ణించుకోలేక రెండు రోజుల క్రితం తల్లి ఆత్మహత్య,
● తాజాగా గుండెపోటుతో తండ్రి మృతి

మైసూరు: ఓ హత్య కేసులో కుమారుడి ప్రమేయం ఉండటాన్ని జీర్ణించుకోలేని ఓ కుటుంబం చిన్నాభిన్నమైంది. రెండు రోజుల క్రితం తల్లి ఆత్మహత్య చేసుకోగా తాజాగా మంగళవారం తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మైసూరు నగరంలో చోటు చేసుకుంది. నగరానికి చెందిన ఇంద్రాణి, సామ్రాట్ దంపతుల కుమారుడు తేజస్. ఇదిలా ఉంటే కొన్ని రోజుల క్రితం మైసూరు విద్యానగర లేఔట్‌కు చెందిన బలరాజ్ (26) హత్యకు గురయ్యాడు. తేజస్ అతని స్నేహితులపై కేసు నమోదు చేశారు. కుమారుడు హత్య కేసులో ఇరుక్కోవడాన్ని జీర్ణించుకోలేని ఇంద్రాణి సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఈ హత్య కేసులో సామ్రాట్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. భార్య మరణవార్త విన్న సామ్రాట్ జైలులో గుండెపోటుతో మృతి చెందాడు.

హాస్టల్ ఎదుట వికృత చేష్టలు

● ఆకతాయి అరెస్ట్

యశవంతపుర: లేడీస్ హాస్టల్ ముందు అసభ్యంగా ప్రవర్తించిన ఆకతాయిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన కొడగులో చోటుచేసుకుంది. స్థానికంగా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న సిజిల్ (27) వారం రోజుల నుంచి మద్యం మత్తులో కొడగు మెడికల్ కళాశాల హాస్టల్ వద్దకు వచ్చి వికృతంగా ప్రవర్తిస్తున్నాడు. హాస్టల్ విద్యార్థినులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇతడికి సహకరించిన మరో ముగ్గురిపై కూడా కేసు నమోదు చేశారు.

తల్వార్‌తో దాడి.. ముగ్గురి అరెస్ట్

యువకుడిపై తల్వార్‌తో దాడి చేసిన కేసులో మంగళూరు కావూరు పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఉరుంసదాడిగుడ్డె నివాసి చరణ్ రాజ్, సురత్కల్‌కు చెందిన కుళాయి హొసబెట్టు నివాసి సుమంత్, మంగళూరు నగరం కోడికల్ సుంకదకట్టకు చెందిన అవినాశ్‌లను అరెస్ట్ చేశారు. ఈ నెల 20న కావూరు ఎంవి శెట్టి కాలేజీ రోడ్డులో నడిచి వెళ్తున్న యువకుడిపై తల్వార్‌తో దాడి చేసి గాయపరిచారు. దీంతో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు.

అత్యుత్తమ రాజ్యాంగం

శివాజీనగర: దళితులు ఆత్మాభిమానంతో బతుకుతున్నామంటే అందుకు డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కారకులని, అందుచేత ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని హోం మంత్రి జీ.పరమేశ్వర్ తెలిపారు. మంగళవారం నగరంలో టౌన్‌హాల్‌లో రాష్ట్ర రాజ్యాంగ బృందం నిర్వహించిన సముదాయ సాధకుల వందన సమర్పణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం అంటే మత గ్రంథం ఉన్నట్లే. బీ.ఆర్.అంబేడ్కర్ ఇచ్చిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే ఉత్తమ రాజ్యాంగమని అన్నారు. కార్యక్రమంలో జ్ఞాన ప్రకాశ్ స్వామి, నటుడు మధు కోకిల, ఎస్.జయకాంత్ ఆర్.జయచంద్ర పాల్గొన్నారు.



చిక్కమగళూరులో నాగ పంచమి పూజలు

నాలుగు ఇందిరా క్యాంటీన్లకు తాళాలు

● వేతనాలు ఇవ్వలేదని కార్మికుల నిరసన

తుమకూరు: ఎంతో మంది పేదల ఆకలి తీరుస్తున్న ఇందిరా క్యాంటీన్లు కాంగ్రెస్ పాలనలోనే మూతపడుతున్నాయి. నాడు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఇందిరా క్యాంటీన్లు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది. అయినా వాటికి పూర్వ వైభవం కనిపించడంలేదు. తాజాగా తుమకూరు నగరంలో ఏకంగా నాలుగు క్యాంటీన్లకు తాళం వేసి కార్మికులు నిరసన తెలిపారు. నగరంలోని క్యాత్‌సంద్ర, శిరాగేట్, మండిపేట, మహానగర పాలికె ఆవరణంలో ఇందిరా క్యాంటీన్లు ఉన్నాయి. వీటిలో దాదాపు 25 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆవేదనతో కార్మికులు తాము ఇక పనులు చేయలేమని, జీతాలు ఇచ్చే వరకు విధుల్లోకి వచ్చేది లేదని చెప్పి కార్మికులు మంగళవారం క్యాంటీన్లకు తాళం వేసి వండిన ఆహారాన్ని లోపల పెట్టి బయట తాళం వేసిన నిరసన తెలిపారు. దీంతో ఉదయం అల్పాహారం కోసం వచ్చిన ప్రజలు క్యాంటీన్లు మూసి ఉండటంతో నిష్ఠూరమాడుతూ వెళ్లిపోయారు. తమకు పూర్తిగా జీతాలు చెల్లించే వరకు నిరసన కొనసాగుతుందని చెప్పారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

హోసూరు వార్తలు..

హరికేశ్వరునికి విశేష పూజలు



సుమంగళి పూజలో మహిళలు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని మదగొండపల్లిలో వెలసిన ప్రసిద్ధ హరికేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం సుమంగళి పూజను విశేషంగా జరుపుకొన్నారు. మదగొండపల్లి, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముత్తైదువులు పాల్గొని కుటుంబంలో సుఖశాంతులు విలసిల్లాలని పూజలు చేశారు. స్వామి వారికి విశేష అభిషేకం, అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

రైతులకు అవగాహన

హోసూరు: హోసూరు తాలూకా పూనపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఉప డైరెక్టర్ భువనేశ్వరి అధ్యక్షతన వ్యవసాయాభివృద్ధిపై రైతులకు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కరుణానిధి గ్రామీణ సంయుక్త వ్యవసాయ పథకంపై రైతులకు వివరించారు. వేసవి దుక్కి ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయ సాగులో రైతులకు లాభాలు, మట్టిని సారవంతం పెంచటం, పంటల బీమా వల్ల రైతులకు పరిహారం, ఫాం వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీ తదితర విషయాలను రైతులకు వివరించారు. అధికారులు రేణుక, రమ్య, మాదేష్, ఆత్మ పథక మేనేజర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐకి బెదిరింపు, వ్యక్తి అరెస్ట్

కెలమంగలం: సర్వే కోసం వెళ్లిన రెవెన్యూ అధికారిని హత్య చేస్తానని బెదిరించిన వ్యక్తిని తళి పోలీసులు అరెస్ట్ చేశారు. డెంకణీకోట తాలూకా కక్కదాసం ఫిర్కాలోని ఏ.శెట్టిపల్లి గ్రామానికి చెందిన రైతు పాపిరెడ్డికి సొంత స్థలాన్ని అదే ప్రాంతానికి చెందిన సిద్ధార్థ్ ఆక్రమించుకున్నాడు. ఈ విషయంపై నెల రోజుల క్రితం బాధితుడు పాపిరెడ్డి డెంకణీకోట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు కక్కదాసం ఆర్ఐ శరవణన్, ఆ ప్రాంత గ్రామాధికారితో కలిసి సర్వే కోసం వెళ్లిన సమయంలో సిద్ధార్థ్ సదరు ఆర్ఐను హత్య చేస్తానని బెదిరించాడు. దీంతో ఆర్ఐ ఫిర్యాదు మేరకు పోలీసులు సిద్ధార్థ్‌ను అరెస్ట్ చేశారు.

గ్రామాలవైపు కదిలిన ఏనుగుల మంద

● భయాందోళనలతో ప్రజలు

కెలమంగలం: డెంకణీకోట సమీపంలోని నగనూరు అటవీ ప్రాంతంలో మకాం వేసిన ఏనుగుల మంద నుంచి విడిపోయిన ఐదు ఏనుగులు సోమవారం సాయంత్రం గ్రామాలవైపు కదిలాయి. డెంకణీకోట సమీపంలోని తావరకెరె, గెండగానపల్లి, కందగానపల్లి, దిన్నూరు, ఉబ్బరాయనపల్లి, కెంబత్తపల్లి, తొట్టి ప్రాంతాల మీదుగా వెళ్లిన ఏనుగులు రైతులు పండిస్తున్న రాగి, వేరుసెనగ, కంది, టమాటా, బీన్స్ తదితర పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. ఏనుగుల అరుపులు విన్న రైతులు అటవీ శాఖాధికార్లకు సమాచారం ఇచ్చారు. అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని టపాకాయలు పేల్చి ఏనుగులను అడవిలోకి మళ్లించే చర్యలు చేపట్టారు. ఏనుగుల దాడుల నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.



డెంకణీకోట అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల మంద

అభివృద్ధి పనులకు భూమిపూజ

క్రిష్ణగిరి: సూళగిరి సమితిలో రోడ్డు వసతులు, మురికి కాల్వల ఏర్పాటు, తాగునీటి వసతి తదితర అభివృద్ధి పనులకు మంగళవారం యూనియన్ చైర్‌పర్సన్ లావణ్యమధు భూమిపూజ చేశారు. సూళగిరి తాలూకాలోని అంకొండపల్లి, ఏ.శెట్టిపల్లి గ్రామపంచాయతీల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని గత కొద్ది రోజుల క్రితం స్థానికులు చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై స్పందించిన ఆమె సంబంధిత శాఖాధికార్లతో మాట్లాడి ఇరు పంచాయతీల్లో అభివృద్ధి పనులకు రూ. 29.82 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షులు చిక్కబ్బయ్య, యూనియన్ కౌన్సిలర్ పుష్పాశ్రీనివాస్, క్రిష్ణప్ప, సెల్వరాజ్, రామమూర్తి, బీడీవో అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.



నేమకల్లుకు పోటెత్తిన భక్తులు



బొమ్మనహళ్లి: ప్రసిద్ధి చెందిన నేమకల్లు శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం మొదటి మంగళవారం సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి సుప్రభాతసేవ, పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.



రామబంటును దర్శించుకుంటున్న భక్తులు

బృందావన్ ఆశ్రమంలో నూతన గోశాల

ప్రశాంతి నిలయం: బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ వద్ద గల సత్యసాయి బృందావన్ ఆశ్రమంలోని గోకులలో నూతనంగా నిర్మించిన గోశాలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యాలు, వేదపండితుల వేదపఠనం నడుమ భక్తి శ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. గోవులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంప్రదాయ కృతువులను నిర్వహించి గోవులను గోశాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆర్‌జె.రత్నాకర్ రాజు మాట్లాడుతూ, ఇక్కడ నిత్యం గోసేవ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్‌ట్రస్ట్ సభ్యుడు మనోహర్ షెట్టి, బృందావన్ క్యాంపస్ సిబ్బంది, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.



గోవుకు ఆహారం అందిస్తున్న రత్నాకర్ రాజు

క్లుప్తంగా...

మళ్లీ పెరుగుతున్న గోదావరి వరద



స్పిల్‌వే నుంచి దిగువకు వెళుతున్న వరద నీరు

పోలవరం రూరల్: గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. నదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఉప నదుల నీరు క్రమేపీ కలుస్తుండటంతో వరద ఉధృతమవుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద మంగళవారం వరద నీటిమట్టం 30.170 మీటర్లకు చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి 5,17,612 క్యూసెక్కుల వరద నీరు దిగువకు చేరుతోంది.

హైరిస్క్ గర్భిణుల తరలింపునకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్



మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడ తూర్పు): రాష్ట్రంలో మాతృ మరణాలను 100 శాతం నివారించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా హైరిస్క్ గర్భిణులను గుర్తించి డెలివరీ తేదీకి ముందే ఆస్పత్రుల్లో చేర్చాలని నిర్ణయించింది. ఇప్పటి వరకూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను ఆస్పత్రిలో ప్రసవం తర్వాత తల్లి, బిడ్డను ఇంటికి చేర్చేందుకు వినియోగిస్తున్నామని, ఇకపై హైరిస్క్ గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు కూడా వినియోగించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు రక్తం ఎక్కించేందుకు ఇంటి నుంచి ఆస్పత్రికి, తిరిగి ఇంటికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లోనే తరలిస్తారు. గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ ఇచ్చేందుకు ఇంటి నుంచి ఆస్పత్రికి, ఆస్పత్రి నుంచి ఇంటికి ఇదే వాహనంలో తరలిస్తారు.

ఇకపై గ్రేస్ మార్కులు ఉండవు

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి



సాక్షి, అమరావతి: నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) అమలులోకి తెచ్చిన కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్(సీబీఎంఈ) మార్గదర్శకాల ప్రకారం ఇకపై యూజీ వైద్య విద్యలో గ్రేస్ మార్కుల విధానం ఉండబోదని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటో తేదీ నుంచి సీబీఎంఈ విధానాన్ని అమలులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని వైద్య కళాశాలలన్నింటికీ మార్గదర్శకాలు వర్తిస్తాయని తెలిపారు. ఇప్పటి వరకూ యూజీ వైద్య విద్యార్థులు అకడమిక్ పరీక్షల్లో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయితే ఐదు వరకూ గ్రేస్ మార్కులు కలుపుతూ వస్తున్నారు.

బీసీల సంక్షేమంపై చర్చకు సిద్ధమా?

- లోకేశ్‌కు బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ సవాల్




ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘం నేతలు

సాక్షి, అమరావతి/పెనమలూరు: ఆంధ్రప్రదేశ్‌లో బీసీల సంక్షేమం ఎవరి హయాంలో జరిగిందో? బీసీలకు నిజమైన మేలు చేసింది ఎవరో? బహిరంగ చర్చకు సిద్ధమా.. అని నారా లోకేశ్‌కు ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్ సవాల్ విసిరారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ నోటికొచ్చినట్టు మాట్లాడటాన్ని మారేష్ ఖండించారు. సీఎం వైఎస్ జగన్ బీసీ వ్యతిరేకి అంటూ లోకేశ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీసీ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మారేష్ మాట్లాడుతూ బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్న చరిత్ర చంద్రబాబుదేనని ధ్వజమెత్తారు. అదే బీసీలను గడిచిన నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్ వెన్నెముక వర్గాలుగా తీర్చిదిద్దారన్నారు. బీసీ నేతలు వల్లభనేని మణికంఠ, సైకం చిన్నబాబు, విజయవర్మ, శ్రీను మాట్లాడారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలి

ఇంటర్ విద్య కమిషనర్ సౌరభ్ గౌర్



విశాఖ విద్య: విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా జూనియర్ కాలేజీల్లో చదువులు సాగాలని ఇంటర్ విద్య కమిషనర్ సౌరభ్‌గౌర్ సూచించారు. విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. విశాఖపట్నం బుల్లయ్య కాలేజీలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, సాంఘిక సంక్షేమ శాఖ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 31వ తేదీకి అడ్మిషన్లు పూర్తి చేయాలని సూచించారు. 2022–23 వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులను తిరిగి కాలేజీల్లో చేర్చుకునేందుకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు.

మరింత లాభసాటిగా వ్యవసాయం



రైతులకు మరింత ఆదాయం సమకూర్చడమే లక్ష్యం

- సాగు నుంచి పెద్ద ఎత్తున బయోఇథనాల్ ఉత్పత్తికి ప్రభుత్వం ప్రాధాన్యత
- రోజుకు 5,000 కిలోలీటర్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటవుతున్న యూనిట్లు
- రూ.3 వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన 20కి పైగా సంస్థలు
- ప్రభుత్వంతో చర్చలు సాగిస్తున్న మరికొన్ని సంస్థలు

వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడానికి ఇంధన ఉత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. రాష్ట్రంలో అత్యధిక శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుండటంతో రైతులకు మరింత ఆదాయం సమకూర్చడానికి ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఓవైపు వ్యవసాయ ఉత్పత్తుల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ కోసం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. మరోవైపు ఇంధన తయారీపై దృష్టి పెట్టింది. ఇందుకోసం రాష్ట్రంలో బయో ఇథనాల్ తయారీకి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందిస్తోంది. బయో ఇథనాల్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజమండ్రిలో అస్సాగో యూనిట్‌కు స్వయంగా శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా క్రిభ్‌కో, డాల్వకోట్ యూనిట్లకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇప్పటికే అస్సాగో, క్రిభ్‌కో, అవేశా ఫుడ్స్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఈఐడీ ప్యారీ, డాల్వకోట్, ఎకో స్టీల్, చోడవరం షుగర్స్, రోచే గ్రీన్ ఆగ్రో, నితిన్‌సాయి, గ్రేస్ వెంచర్స్ వంటి 20కిపైగా సంస్థలు రాష్ట్రంలో రూ.3,000 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. మరికొన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయి. ఈ యూనిట్ల అన్నింటి ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిపి చూస్తే రోజుకు 5,000 కిలో లీటర్లకు పైగా బయో ఇథనాల్ రాష్ట్రంలో ఉత్పత్తి అవుతుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇది దేశంలోనే అత్యధికమని చెబుతున్నాయి.

-సాక్షి, అమరావతి

పెట్టుబడుల ఆకర్షణ..

రాష్ట్రంలో రైతులు ధాన్యం, మొక్కజొన్నలను అత్యధికంగా సాగు చేస్తుండటమే కాకుండా భారీగా ఎగుమతులు చేస్తున్నారు. దీంతో ఇథనాల్ తయారీలో పెట్టుబడులు పెట్టడానికి సంస్థలు ముందుకు వస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 13 మిలియన్ టన్నులకు పైగా ధాన్యం ఉత్పత్తి అయ్యింది. అలాగే మూడు మిలియన్ టన్నులకు పైగా మొక్కజొన్న ఉత్పత్తి అయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో రాష్ట్రం నుంచి 6 మిలియన్ టన్నుల బియ్యం (నాన్ బాస్మతి), ఒక మిలియన్ టన్ను మొక్కజొన్నను ఎగుమతి చేశారు. మిగులు ఆహార ఉత్పత్తుల నుంచి ఇథనాల్‌ను తయారు చేయడానికి కేంద్రం అనుమతించడంతో పెట్టుబడిదారుల చూపు మనరాష్ట్రంపై పడింది.



దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తోంది. విత్తనం నుంచి విక్రయం వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అండగా నిలుస్తోంది. దీంతో వ్యవసాయం నుంచి ఇంధన తయారీకి హబ్‌గా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతోంది.

ఏడాదికి 3.1 కోట్ల లీటర్ల ఇథనాల్ అవసరం..

ప్రస్తుతం దేశంలో ఆహార ధాన్యాల నుంచి 760 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి అవుతోంది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను మిశ్రమం చేయడానికి 2025-26 నాటికి అదనంగా 1,016 కోట్ల లీటర్లు అవసరమవుతుందని అంచనా. ఇథనాల్ కలపడాన్ని ప్రస్తుతం ఉన్న 10 శాతం నుంచి 20 శాతానికి పెంచడం వల్ల ఏటా ఇంధన దిగుమతి వ్యయంలో రూ.51,600 కోట్ల మేర విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుందని నీతిఆయోగ్ అంచనా. ఇక రాష్ట్రంలో ప్రస్తుతం ఏటా 16 కోట్ల లీటర్ల పెట్రోల్‌ను విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో 20 శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏడాదికి 3.1 కోట్ల లీటర్ల ఇథనాల్ అవసరమవుతుందని అంచనా.

క్లీన్ ఎనర్జీకి పెద్దపీట..

పర్యావరణహిత క్లీన్ ఎనర్జీ వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, బయో ఇథనాల్ తయారీని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. రాష్ట్రంలో రోజుకు 5,000 కిలోలీటర్ల ఉత్పత్తి సామర్థ్యంతో 20కుపైగా ఇథనాల్ యూనిట్లు ఏర్పాటవుతున్నాయి.

– ప్రవీణ్ కుమార్,
రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్,
ఏపీఐఐసీ వీసీ–ఎండీ, ఏపీఈడీబీ సీఈవో

అధికారంలోకి వద్దాం.. వారిద్దరినీ చంపేద్దాం

- కొడాలి నాని, వంశీ లక్ష్యంగా కార్యకర్తలకు టీడీపీ నేతల పిలుపు
- లోకేశ్ సభలో రెచ్చిపోయి ప్రసంగాలు



లోకేశ్ మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న టీడీపీ శ్రేణులు

గన్నవరం: ఎమ్మెల్యేలు కొడాలి నాని, వల్లభనేని వంశీ లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నేతలు రెచ్చిపోయారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని, ఆ వెంటనే వారిద్దరినీ చంపేయాలంటూ యువగళం బహిరంగ సభ వేదిక నుంచి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం కృష్ణా జిల్లా గన్నవరానికి సమీపంలోని చిన అవుటుపల్లి వద్ద జరిగిన టీడీపీ నేత లోకేశ్ యువగళం పాదయాత్ర సభలో ఆ పార్టీ నాయకుల ప్రసంగాలన్నీ ఆరోపణలు, దూషణలు, హెచ్చరికలు, బెదిరింపులతో సాగాయి. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఏకంగా టీడీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యేలు కొడాలి నాని, వంశీని చంపేయాలని పార్టీ శ్రేణులకు చెప్పారు. ఖమ్మంలో రూ.5 లక్షలు ఖర్చు చేస్తేనే అంత హంగామా జరిగింది.. ఇక్కడ రూ.5, 10 కోట్లిస్తే మీ పరిస్థితేమిటో అర్థం చేసుకోండని కొడాలి నాని, వంశీలను ఉద్దేశించి యార్లగడ్డ వెంకట్రావు హెచ్చరించారు. లోకేశ్ కూడా తాము అధికారంలోకి రాగానే అసెంబ్లీలో తన తల్లిని అవమానించిన వారి సంగతి తేలుస్తానని హెచ్చరించారు. ఎమ్మెల్యే కొడాలి నానిని గుడివాడ వీధుల్లో కట్‌డ్రాయర్‌తో నడిపిస్తానని, వల్లభనేని వంశీకి భయం అంటే పరిచయం చేస్తానని అన్నారు. టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టిన పోలీస్ అధికారులపై జ్యుడిషియల్ విచారణ జరిపించి జైలుకు పంపుతామంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తోందని లోకేశ్ విమర్శించారు. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే టీడీపీ ప్రభుత్వంలోని వందకు పైగా పథకాలను రద్దు చేశారని ఆరోపించారు. సీఎం జగన్ కటింగ్ అండ్ ఫిట్టింగ్ మాస్టర్ అని అన్నారు. సీఎం వద్ద రెండు బటన్లు ఉంటాయని, సంక్షేమ పథకాల పేరుతో బ్లూ బటన్ నొక్కి ప్రజల అకౌంట్‌లో రూ.10 వేసి, రెడ్ బటన్ నొక్కి జనం అకౌంట్‌లోని రూ. 100 లాక్కుంటారని ఆరోపించారు. జిల్లాలో గతంలో మంత్రులుగా పని చేసిన ముగ్గురు, ప్రస్తుత మంత్రి జోగి రమేష్ చేతగాని దద్దమ్మలని విమర్శించారు. ఒక ఇల్లు కూడా కట్టించలేని మంత్రి జోగి ఓ జోకరని అన్నారు. మంత్రి రోజా పట్ల నేతలు చులకనగా మాట్లాడారు. కాగా, సభలో లోకేశ్ ప్రసంగం మొదలు కాగానే కార్యకర్తలు వెళ్లిపోవడం మొదలెట్టారు. దీంతో సభా ప్రాంగణం ఖాళీగా కనిపించింది.

లోకేశ్‌తో నాకు ప్రాణహాని

- నాపై పరువు నష్టం దావా అందుకే వేశారు
- మంగళగిరి కోర్టుకు వెళ్లి వచ్చే సమయంలో హతమార్చాలని కుట్ర
- ఇదే నా మరణ వాంగ్మూలం
- కంతేరులో హెరిటేజ్ పేరిట భూములు కొన్నది వాస్తవం కాదా?
- లోకేశ్‌కు తెలీకుండానే ఆయన తల్లి, భార్య భూములు కొన్నారా?
- వాళ్ల కుటుంబ సభ్యుల ఆస్తులతో లోకేశ్‌కు సంబంధం లేదా?
- మీడియాతో పోసాని కృష్ణమురళి

సాక్షి, అమరావతి : టీడీపీ నేత నారా లోకేశ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని ఏపీ చలనచిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి తీవ్ర ఆరోపణ చేశారు. అందుకోసమే తనపై పరువునష్టం దావా వేశారని.. ఈ కేసులో మంగళగిరి కోర్టుకు వెళ్లివచ్చే సమయంలో తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను చనిపోతే దానికి లోకేశే కారణమని ఇదే తన మరణ వాంగ్మూలంగా భావించాలన్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తానని మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. పోసాని ఇంకా ఏమన్నారంటే.. గతంలో లోకేశ్ నన్ను పార్టీలోకి రావాలని కోరారు. నేను నిబద్ధత కలిగిన నాయకుల వెంటే ఉంటానంటూ తిరస్కరించా. పైగా వారి అక్రమాలను ఎప్పటికప్పుడు నిలదీస్తున్నాను. అందుకే వాళ్లు నాపై కక్ష గట్టారు. నేను ఎప్పుడో కంతేరులో లోకేశ్ భూములు కొన్నారని చెప్పానట. దానిని పట్టుకుని నాపై రూ.4 కోట్లకు పరువు నష్టం దావా వేశారు. రెండేళ్లు జైలుశిక్ష కూడా వేయిస్తారట. కంతేరులో హెరిటేజ్ పేరిట భూములు కొన్నది వాస్తవం కాదా? లోకేశ్ భూములు దోచేశారు.. కబ్జా చేశారని లేదే నేను. కొన్నారనే చెప్పాను. మీ కుటుంబ సభ్యులు కొంటే నీకు సంబంధం లేదా? మీ తల్లి, భార్య పేరు మీద ఉన్న ఆస్తులు ఎవరికి లోకేశ్?

పవన్ వ్యాఖ్యలు మర్చిపోయారా?

అల్‌ఖైదా అంటే లాడెన్ గుర్తొచ్చినట్లు.. హెరిటేజ్ అంటేనే చంద్రబాబు గుర్తొస్తారు. నిత్యం బూతులతో జపంచేసే లోకేశ్‌పై తాను పరువు నష్టం కేసు వేస్తే 20 ఏళ్లు జైలులో ఉండాల్సి ఉంటుంది. గతంలో దళితులు, సీఎం జగన్‌ను, పోలీసు అధికారులను దుర్భాషలాడిన లోకేశ్ వీడియోలను, విదేశీ మహిళలతో అర్ధనగ్నంగా దిగిన ఫొటోలను మీడియా ఎదుట పోసాని ప్రదర్శించారు. గతంలోనే లోకేశ్ బతుకును పవన్‌కళ్యాణ్ రోడ్డున పడేశారు. ప్రతి నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల కుంభకోణం చేశారంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు మర్చిపోయారా? సమాజంలో బూతులు మాట్లాడేవాళ్ల కంటే బూతుపనులు చేసే లోకేశ్ లాంటి వ్యక్తులతోనే ఎక్కువ ప్రమాదం. చంద్రబాబుకు వ్యవస్థలను మేనేజ్ చేసే సత్తా ఉంది. అందుకే 16 కేసుల్లో స్టేలు తెచ్చుకున్నాడు. పుంగనూరులో పోలీసులపైనే దాడులు చేయించారు. నేనెంత బక్కవాడిని. లోకేశ్ ఏంచేసినా కాపాడటానికి చంద్రబాబు ఉన్నారు. లోకేశ్ కంటే నాకు విశ్వసనీయత ఎక్కువ ఉంది.. అంతేగాని, అమ్ముడుపోయే వాడిని కాదు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా గెలవొచ్చు.. కమ్మ కులమే గెలవాలనుకోవడం దుర్మార్గం. ఎవరు గెలిచినా ప్రజలకు ఎంత మంచి చేస్తున్నారో చూడాలే తప్ప కులం దురాభిమానంలో పడకూడదు. రాజధానిలో ఐదు శాతం భూములు పేదలకు ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ చంద్రబాబు దానిని తుంగలో తొక్కారు. రాజధానిలో పేదలకు సెంటు భూమి ఇవ్వడంలో తప్పేంటని నేను ప్రశ్నిస్తే.. ఓ కమ్మ రైతు పెదకాకానిలో నాకున్న 16 ఎకరాలు ఇవ్వమంటూ బూతులు తిట్టాడు. అసలు నాకు అక్కడ భూమే లేదు. ఐదారు ఇళ్ల స్థలాలు, రెండు పెంకుటిళ్లు ఉన్నాయి. జగ్గయ్యపేట దగ్గర 30 ఏళ్ల కిందట కొన్న కొంత భూమి ఉంది. మా నాన్న డబ్బులేక ఆత్మహత్య చేసుకున్నారు. నేను సినిమాల్లోకి వెళ్లిన తర్వాతే సంపాదించుకున్నా. అయినా, ఏపీలోని నా ఆస్తి మొత్తం పేద ప్రజలకు ఇచ్చేస్తా.. రాజధాని రైతులకు మానవత్వం ఉంటే పేదలకు సెంటు భూమి ఇవ్వండి. కోర్టు కేసులను వెనక్కితీసుకోండి. రాజధాని భూముల్లో వ్యాపారం తప్ప త్యాగాల్లేవు. వైఎస్సార్ రూ.11వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తే అందులో మా కులం వాళ్లు కూడా లబ్ధిపొందారు.. ఇప్పుడు పేదలకు తమ భూములు ఇవ్వొద్దని వారు చెప్పడం సిగ్గుచేటు.

మేమూ 'మార్గదర్శి'లో చేరాం.. మోసపోయాం!

▶ మొదటి పేజీ తరువాయి

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే మూడు కేసుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై సీఐడీ కేసులను నమోదు చేసి బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసింది. మరోవైపు రాష్ట్రంలో నలుమూలల నుంచి మార్గదర్శి చందాదారులు పెద్ద ఎత్తున సీఐడీకి ఫిర్యాదులు చేస్తున్నారు. ఒక్కో చందాదారుడిది ఒక్కో వ్యథ!

మూడు రోజుల్లో 300కిపైగా ఫిర్యాదులు

మోసపోయిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు ఫిర్యాదు చేసేందుకు సీఐడీ విభాగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. చందాదారులు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా వాట్సాప్ నంబరు (9493174065) అందుబాటులోకి తెచ్చింది. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మార్గదర్శి చందాదారులు పెద్ద సంఖ్యలో సీఐడీకి ఫిర్యాదు చేస్తున్నారు. వాట్సాప్ నంబర్ అందుబాటులోకి రాకముందు సీఐడీకి దాదాపు వందకుపైగా ఫిర్యాదులు రాగా ఇప్పుడు మూడు రోజుల్లోనే మూడు వందల మందికి పైగా చందాదారులు ఫిర్యాదు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. చందాదారులు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తుండటంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాల చిట్టా అంతకంతకూ పెరుగుతోంది.

చందాదారుల సొమ్ము సొంతానికి... మార్గదర్శి దివాళా అంచుకు

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ రామోజీరావు పాల్పడిన ఆర్థిక అక్రమాలతో చందాదారులు నిండా మోసపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్మును రామోజీరావు నిబంధనలకు విరుద్ధంగా తమ సొంత వ్యాపార సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజస్‌లలో పెట్టుబడిగా పెట్టారు. మరికొన్ని నిధులను మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా తరలించేశారు. దాదాపు 2 వేలకుపైగా ఉన్న చిట్టీ గ్రూపుల చందాదారులు చెల్లించే చందా మొత్తంలో కొంత మొత్తాన్ని అటూఇటూ రొటేషన్ చేస్తూ దశాబ్దాలుగా మోసం చేస్తూ వచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలు బయటపడటంతో 2022 నవంబరు నుంచి కొత్త చిట్టీలు నిలిచిపోయాయి. మరోవైపు భారీగా చందాదారుల సొమ్మును రామోజీ తమ పేరిట స్థిర, చరాస్తులుగా మార్చేశారు. దీంతో ప్రస్తుతం చిట్టీ గ్రూపుల్లో ఉన్న దాదాపు 50 వేల మంది చందాదారులకు ప్రైజ్‌మనీని చెల్లించలేక మార్గదర్శి చిట్‌ఫండ్స్



చేతులెత్తేసింది. గత్యంతరం లేక దిక్కులు చూస్తోంది. రాష్ట్రంలోని 37 బ్రాంచీల పరిధిలో దాదాపు 1,300 మంది చందాదారులకు 9 నెలలుగా ప్రైజ్‌మనీ చెల్లించడం లేదని సమాచారం. గత 9 నెలల్లో రూ.1,620 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయని సీఐడీ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. మరోవైపు రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్ల మొత్తాన్ని కూడా కాలపరిమితి ముగిసినా చెల్లించడం లేదు. వెరసి దాదాపు రూ.2 వేల కోట్ల వరకు మార్గదర్శి చిట్ ఫండ్స్ బకాయి పడిందని సీఐడీ అధికారుల సోదాల్లో వెల్లడైనట్లు సమాచారం.

సీఐడీ సత్వర స్పందన

చందాదారుల ఫిర్యాదుపై సీఐడీ విభాగం సత్వరం స్పందిస్తోంది. ఫిర్యాదులో వాస్తవాలు ఉన్నాయని నిర్ధారణ కాగానే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతోంది. ఇప్పటికే మూడు కేసుల్లో మార్గదర్శి బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసింది. 'ఘోస్ట్' చందాదారుడి పేరిట భారీ అక్రమ దందాకు పాల్పడిన కేసులో చీరాల మార్గదర్శి బ్రాంచి మేనేజర్‌కు న్యాయస్థానం రిమాండ్ విధించింది.

ఇప్పటికే నమోదైన 3 కేసులివీ...

- సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యానికి తెలియకుండా ఆయన్ను చీరాలలో చందాదారుడిగా చేర్చారు. బుక్ అడ్జస్ట్‌మెంట్ల ద్వారా ఆయన చందా చెల్లించినట్టు కనికట్టు చేశారు. ఆయన పేరిట ప్రతి నెల డివిడెండ్‌తోపాటు ఒక నెల ప్రైజ్‌మనీ మొత్తాన్ని కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఖాతాలో వేసుకుంది. అంటే ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే డివిడెండ్లు, ప్రైజ్‌మనీ కొల్లగొట్టి ఇతర చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించింది. తమ ఆధార్ కార్డును దుర్వినియోగంచేయడంతోపాటు తమకు తెలియకుండా చందాదారుడిగా చేర్చడంపై బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు చీరాల పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం మార్గదర్శి చీరాల శాఖ మేనేజర్ సురేంద్రను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.
- అనకాపల్లికి చెందిన బి.వెంకటేశ్వరరావు నెలకు రూ.10 వేలు చొప్పున చందా చెల్లిస్తూ చిట్టీ గ్రూపులో చేరారు. 50 నెలల చందాలు చెల్లించిన తరువాత రూ.4,61,989కు చిట్టీ పాట పాడారు. ఆయన ఎన్నిసార్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. ఎట్టకేలకు ఆయనకు రూ.20 మాత్రమే వస్తుందని చెప్పారు. మిగిలిన మొత్తాన్ని ఆయన ష్యూరిటీ ఇచ్చిన చిట్టీల్లో సర్దుబాటు చేసినట్టు చూపారు. అసలు తాను ఎవరికీ ష్యూరిటీ ఇవ్వలేదని ఆయన మొత్తుకున్నా బ్రాంచి మేనేజర్ వినిపించుకోలేదు. ఆయన సంతకాలు ఫోర్జరీ చేసిన పత్రాలను చూపించి బెదిరించారు. ఆ కాపీలు ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.
- కోరుకొండ విజయ్‌కుమార్ అనే చందాదారుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రాజమహేంద్రవరం బ్రాంచిలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో చేరారు. కొన్ని వాయిదాలు చెల్లించిన తరువాత 2020 జూన్‌లో రూ.3 లక్షలకు చిట్టీ పాట పాడారు. కానీ ఆయనకు ప్రైజ్‌మనీ ఇచ్చేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్ నిరాకరించారు. విజయ్‌కుమార్ తన స్నేహితుడు మల్లికార్జునరావుకు 2019లో ష్యూరిటీ ఇచ్చారని, ఆ స్నేహితుడు వాయిదాలు చెల్లించడం లేదు కాబట్టి ప్రైజ్‌మనీ ఇవ్వలేమని చెప్పారు. నిజానికి మల్లికార్జునరావు చిట్టీ గడువు అప్పటికే తీరిపోయింది. తనను మార్గదర్శి యాజమాన్యం మోసం చేసిందని విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

సీఐడీకి మార్గదర్శి చందాదారుల ఫిర్యాదుల్లో కొన్ని..

- విజయనగరంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుడు ఒకరు మొత్తం రూ.6 లక్షలు విలువైన నాలుగు చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన చిట్టీ పాట పాడి రెండు ఎల్‌ఐసీ బాండ్లను ష్యూరిటీగా సమర్పించారు. రూ.5 లక్షలు, రూ.2 లక్షలు విలువైన రెండు బాండ్లను ష్యూరిటీగా ఇచ్చారు. ఆ చిట్టీ గ్రూపుల కాలపరిమితి ముగిసి నెలలు గడుస్తున్నా ఆయనకు ఎల్‌ఐసీ బాండ్లను తిరిగి ఇవ్వడంలేదు. దీనిపై సంబంధిత బ్రాంచి మేనేజర్‌ను ఎన్నిసార్లు కలిసినా అరణ్య రోదనగానే మారింది.
- విశాఖపట్నంలో ఒక చందాదారుడు రూ.40 లక్షల చిట్టీ గ్రూపులో సభ్యుడిగా చేరారు. 20 నెలలు వాయిదాలు చెల్లించిన తరువాత రూ.8 లక్షల నష్టానికి అంటే రూ.32 లక్షలకు చిట్టీ పాడారు. కానీ ఏడాదిన్నర అవుతున్నా ఇంతవరకు ఆయనకు చిట్టీపాట మొత్తం (ప్రైజ్‌మనీ) చెల్లించడం లేదు. దీనిపై బ్రాంచి మేనేజర్ సరైన సమాధానం చెప్పడం లేదు. ఎందుకంటే ఆ చిట్టీగ్రూపులో పెద్ద సంఖ్యలో నకిలీ చందాదారులు ఉన్నట్టు తెలిసింది. ఆ వాయిదాలను మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం చెల్లించడం లేదని చందాదారుడికి తెలిసింది. దీనిపై బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా.. నీకు దిక్కున్న చోట చెప్పుకో, చిట్టీ మొత్తం ఇవ్వలేమని చెప్పడంతో చందాదారుడు నిర్ఘాంతపోయాడు.
- బాపట్లలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో ఒకరు సభ్యుడిగా చేరారు. కొన్ని నెలలు పాటు రూ.40 వేలు వాయిదాలు చెల్లించిన తరువాత ఆయన గ్రూప్ నుంచి వైదొలిగారు. ఆయన స్థానంలో మరొకరిని చందాదారుడిగా చేర్చారు. ప్రత్యామ్నాయ చందాదారుడిని చేర్చుకున్న తరువాత వైదొలగిన చందాదారునికి అప్పటికే చెల్లించిన వాయిదాల మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. కానీ ఆ మొత్తం వెనక్కి ఇవ్వడం లేదు. దీనిపై బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా చందాదారుడే తిరిగి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు రూ.25 వేలు చెల్లించాలని దబాయిస్తున్నారు.
- వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఒకరు నాలుగు చిట్ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన చందా వాయిదా చెల్లించడం ఒక్క రోజు ఆలస్యమైనా రోజుకు రూ.500 చొప్పున జరిమానా వసూలు చేశారు. ఆ చందాదారుడు ఓ చిట్టీ గ్రూపులో పాట పాడి మూడు నెలలు దాటినా ప్రైజ్‌మనీ ఇవ్వడం లేదు. నిబంధనల మేరకు ష్యూరిటీలు సమర్పించినా ఆమోదించడం లేదు. దీనిపై సంబంధిత బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా కంపెనీలో ప్రస్తుతం డబ్బులు లేవని అనధికారికంగా చెప్పడంతో చందాదారుడు నిర్ఘాంతపోయారు.
- విశాఖలో మరో చందాదారుడు రూ.5 లక్షలు చిట్ గ్రూపులో చేరి 38 నెలలు సక్రమంగా వాయిదాలు చెల్లించారు. తన కుమారుడి చదువు కోసం చిట్టీ పాడేందుకు వెళ్లగా ఆయన పాడేసి డబ్బులు తీసేసుకున్నట్టు రికార్డుల్లో కనిపించింది. ఆయన పేరుతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యమే పాట పాడేసి డబ్బులు తీసేసుకున్నట్టు తెలిసింది. హతాశుడైన చందాదారుడు బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వడం లేదు.

అదో విష వలయం..!

మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ చందాదారులను పక్కా పన్నాగంతో అష్టదిగ్బంధనం చేస్తోంది. వారిని శాశ్వత రుణగ్రహీతలుగా మార్చేస్తూ వారి సంపాదననే కాకుండా ఆస్తులను కూడా కాజేస్తోంది. కొందరు చందాదారులను అనధికారికంగా పలు చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేరుస్తోంది. ఆ విషవలయం నుంచి తప్పించుకోవడం చందాదారుల తరం కావడం లేదు. ఓ బాధితుడు సీఐడీకి ఫిర్యాదు చేయడంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల బాగోతం బయటపడింది.

- ఓ చందాదారుడు మొత్తం రూ.4.72 కోట్ల విలువైన చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన రూ.3.33 కోట్ల విలువకు చిట్టీ పాటలు పాడారు. అంటే ఆయనకు రూ.3.33 కోట్లు చిట్టీ పాటల మొత్తం (ప్రైజ్‌మనీ)గా రావాలి. కానీ ఆయనకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతిలో పెట్టింది ఎంతో తెలుసా? కేవలం రూ.23లక్షలు. నివ్వెరపోయిన ఆయన ఇదేమిటని ప్రశ్నిస్తే.. ఆ చందాదారుడికి తెలియకుండా ఆయన్ను ఎందరో చందాదారులకు ష్యూరిటీదారుడిగా నమోదు చేసేశారు. గతంలో ఆయనతో ఖాళీ కాగితాలపై తీసుకున్న సంతకాలతోపాటు మరికొన్ని సంతకాలను ఫోర్జరీ చేసి ఇరికించారు. ఆయన 65 చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా చేరితే మార్గదర్శి చిట్‌ఫండ్స్ రికార్డుల్లో మాత్రం 90 గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నట్లు నమోదు చేశారు. అంటే ఆయన సభ్యుడిగా చేరని 25 చిట్టీ గ్రూపులకు కూడా బకాయి ఉన్నట్టుగా చూపిస్తూ ప్రైజ్‌మనీలో కోత విధించారు. దీనిపై ఆ చందాదారుడు సీఐడీకి ఫిర్యాదు చేశారు.

• సృజన

హ్యాపీ స్పేస్


• భార్గవి

యాంత్రిక ప్రయాణంలో పోటీ ఎప్పుడూ ఉండేదే! కానీ, చంటిబిడ్డ తన జీవనంలోకి వచ్చినప్పుడు అమ్మ కళ్లలో.. కలల్లో చుట్టూ జీవం ఉండాలనుకుంటుంది. 'ఆ ప్రయాస నుంచి పుట్టుకువచ్చిందే నా ప్రకృతి ఎకో ప్లే థీమ్' అంటోంది భార్గవి. హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటున్న భార్గవి నేచురల్ కలర్స్ వాడకం గురించి అపార్ట్‌మెంట్ పిల్లలకు పరిచయం చేస్తూ కనిపించారు. ఆసక్తితో ఆమె చేస్తున్న పని గురించి ప్రశ్నించినప్పుడు పిల్లల కోసం తను సృష్టించిన సహజ ప్రపంచాన్ని మన ముందుంచారు..

''పుట్టింది మెదక్ జిల్లాలో. ఎమ్‌టెక్ చేసి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో బిజీ బిజీగా మారిపోయాను. పెళ్లై, పిల్లలు జీవితంలోకి వచ్చాక నాలో ఎన్నో సందేహాలు తలెత్తాయి. మూడేళ్ల నా కూతురు స్వతంత్రంగా ఎదగాలంటే ఏదైనా హ్యాపీ స్పేస్ ఉందా.. అని వెతికాను. కానీ, నాకేవీ సంతృప్తినివ్వలేదు. ప్రకృతికి ఎంత దగ్గరగా ఉంటే పిల్లల వికాసం అంత బాగుంటుంది అనే తపన నాది. దీంతో చాలారోజులు ఆలోచించాను. నా సేవింగ్స్ ఎంత ఉన్నాయో చూసుకున్నాను. చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాను. ఆరేళ్లక్రితం నా ఇద్దరు పిల్లలతో ఈ థీమ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాను. ఇప్పుడు ముప్పైమంది పిల్లలు ఉన్నారు. ఈ ముప్పై సంఖ్య దగ్గరే నేను కటాఫ్ పెట్టుకున్నాను. స్వలాభం ఏ మాత్రం చూసుకోని ఒక ప్రాజెక్ట్ ఇది. నాకై నేను నా పిల్లలకోసం సృష్టించుకున్న ప్రపంచం. ఈ పిల్లలు ఎదిగి, హైస్కూళ్లకు వెళ్లినప్పుడు ఎంత ప్రతిభను చూపిస్తున్నారో స్వయంగా తెలుసుకుంటున్నాను. ఈ హ్యాపీ స్పేస్‌లో పిల్లలు చేసే అద్భుతాలు కళ్లారా చూడాల్సిందే. అందమైన పెయింట్స్ వేస్తుంటారు. సీడ్ బాల్స్‌తయారుచేస్తారు. కాగితాలతో బొమ్మలు తయారుచేస్తారు. కూరగాయలు, పువ్వులతో రంగులు తయారుచేస్తారు. తొమ్మిదేళ్ల పాప ఫిక్షన్ స్టోరీస్ రాసి, బుక్ కూడా పబ్లిష్ చేసింది.ఆరుబయట చెట్ల కింద రాలి పడిన పూలు, విత్తనాలను ఏరుకొచ్చి, ఒక్కోదాని గురించి వివరంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు. వారికి ఇష్టమైన పండ్లు, కూరగాయలతో సలాడ్స్ చేస్తుంటారు. ప్రతీదీ నిశితంగా పరిశీలించడం వల్ల వారిలో ఎంతటి అవగాహన పెరుగుతుందో స్వయంగా చూస్తుంటాం. ఇది వారి మానసిక వికాసానికి ఎంతో మేలు కలిగిస్తుంది.

హ్యాండీ క్రాఫ్ట్ తయారీలో పిల్లల చూపే ప్రతిభ చాలా సృజనాత్మకంగా ఉంటుంది. పిల్లలను స్వతంత్రంగా ఎదగనిస్తే ఎన్ని అద్భుతాలు చూపుతారో స్వయంగా నేనే తెలుసుకుంటూ ఆశ్చర్యపోతుంటాను. రెండేళ్ల నుంచి పద్నాలుగేళ్ల పిల్లలు ఈ గ్రూప్‌లో ఉన్నారు. పిల్లలు వేసే ప్రశ్నలే ఈ ఎకో థీమ్‌లో పాఠ్యాంశాలు.



• ఎకో ప్రాజెక్ట్ వర్క్‌లో...


• నిశితంగా తెలుసుకుంటూ...

ఎవరికీ నచ్చలేదు...

మా దగ్గరకు వచ్చే పిల్లల్లో ఇప్పుడు స్పెషల్ కిడ్స్ కూడా ఉన్నారు. వారిలో ఎంత ఆర్ట్ ఉందో చూసినప్పుడు చాలా ఆశ్చర్యపోతుంటాను. చాలా మంది పేరెంట్స్ ముందు నా థీమ్‌ను ఏ మాత్రం నమ్మలేదు. 'పిల్లలకు ఈమె ఏమీ నేర్పడం లేదు. ఆడుకోవడానికి వదిలేస్తున్నారు. క్రమశిక్షణగా పిల్లలు ఒక్క దగ్గర కూర్చోవడం లేద'ని చాలా మంది తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. కోవిడ్ టైమ్‌లో అయితే అందరూ మూసేయమనే సలహాలే. మా ఇంటి నుంచి మరీ ఎక్కువగా వచ్చాయి. 'జాబ్ మానేసి, ఇలాంటి ప్రాజెక్ట్ వద్దు, ఎలాంటి లాభాలూ ఉండవు' అనే మాటలే నా చుట్టూ విన్నాను. కానీ, లాభం కోసం ఈ థీమ్‌ని ఎంచుకోలేదు. నా పిల్లల కోసం ఎంచుకున్నాను. నేను నమ్మిన ఈ సిస్టమ్‌పై నాకు చాలా నమ్మకం ఉంది. నా ఈ థీమ్‌కు తగిన టీచర్లను ఎంపిక చేసుకోవడం కూడా కష్టంగా ఉండేది. దీంతో నేనే కొందరిని ఎంపిక చేసుకొని, నాకు తగినవిధంగా ట్రైన్ చేసుకున్నాను. అదే పట్టుదలతో కొనసాగించాను. ఫైనాన్షియల్‌గా ఇది సక్సెస్‌ఫుల్ అని చెప్పలేం. కానీ, ఎప్పటికీ నిలిచే ఉండేది, నాకు సంతృప్తిగా అనిపించిన ప్రపంచం ఇదే. దానినే పిల్లలకు పరిచయం చేయాలనుకున్నాను. నా పిల్లలనూ ఈ ప్రపంచంలో పెంచడం చాలా హ్యాపీగా ఉంది.

అవగాహన కార్యక్రమాలు...

ఈ థీమ్ వల్ల పిల్లల్లో జరిగే మానసిక వికాసం ఎంతగా ఉంటుందో తెలియజేస్తూ కార్పోరేట్ స్కూళ్లలో అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నాం. పిల్లల్లోని స్వయంప్రతిభ ఎలా ఉంటుందో, వారిని వారిలాగే ఎలా ఎదగనివ్వాలో మా నేచర్ పిల్లలను పరిచయం చేసి, మరీ చూపుతుంటాను. రోజువారీ మనకు ఏం అవసరమో వాటన్నింటినీ స్వయంగా ఇక్కడి పిల్లలు చేస్తుంటారు. వాళ్లే వంట చేయడం, తినడం.. ఏదీ కూడా చెప్పకుండానే ఒకరిని చూసి ఒకరు నేర్చుకుంటూ, తమ ప్రతిభను చూపుతుంటారు. లాభాపేక్ష లేకుండా చేసే ఈ పని రాబోయే తరాలకు ప్రయోజనం కలిగించడమే నాకు వచ్చే ఆదాయం' అని చెబుతోంది భార్గవి.

– నిర్మలారెడ్డి
ఫొటో: మోహనాచారి

న్యాయమైన సూచన

తండ్రికీ కావాలి ప్రసూతి సెలవు



తల్లికి ప్రసూతి సెలవు ఇస్తున్నట్టే తండ్రికి కూడా ప్రసూతి సెలవు ఇవ్వడం గురించి ఆలోచించే సమయం వచ్చేసిందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. భార్య ప్రసవ సమయంలో బాలింతను, నవజాత శిశువును చూసుకోవడానికి తండ్రికి సెలవు ఇవ్వకతప్పదని, ఈ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు శాసనపరమైన చట్టాలు తేవాలని జస్టిస్ విక్టోరియా గౌరి సూచించారు. నిజమే. తండ్రికి సెలవు భార్యభర్తల మధ్య అనేక చికాకులను దూరం చేయగలదు. ఒక పరిశీలన.

బిడ్డకు జన్మనివ్వడమంటే సమాజానికి కొత్త సభ్యుణ్ణి ఇవ్వడమే. పుట్టిన బిడ్డ తల్లిదండ్రులకు సంతానం కావచ్చు కాని సమాజానికి ప్రతినిధే. బిడ్డకు సురక్షితంగా జన్మనివ్వడంలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో, ఆ తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో సమాజానిదీ అంతే బాధ్యత. కనేందుకు ఆస్పత్రి, పెంచేందుకు తండ్రికి కనీస ఆదాయం లేకపోతే సమాజం తప్పవుతుంది. గతంలో స్త్రీ ఇంటి పట్టునే ఉండేది. ఉమ్మడి సంసారాల్లో కాన్పులకు సులువుగా సాయం దొరికేది. కాని ఇప్పుడు ఇలా తాళి కడితే అలా విడిగా కాపురం పెట్టే పరిస్థితులు వచ్చాయి. దానివల్ల పిల్లల్ని కనడం, పెంచడం చాలా పెద్ద బాధ్యతగా మారింది తల్లిదండ్రులకు. ఉద్యోగం చేసే స్త్రీలకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ప్రసూతి సెలవులు మంజూరు అవుతున్నా ఆ స్త్రీలకు, పుట్టిన శిశువులకు కాన్పు సమయంలో తోడుగా ఉండాల్సిన పురుషులకు మాత్రం సెలవు గురించి ఇంకా ఆలోచన రావడం లేదు. సమాజం ఇంకా అంత 'నాగరికం'గా ఆలోచించడం లేదు. కాని తాజా ఘటన ఈ అంశాన్ని చర్చకు తెచ్చింది.

సమయం వచ్చేసింది

మద్రాసు హైకోర్టులో ఈ కేసును విన్న జస్టిస్ ఎల్.విక్టోరియా మేరి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో మగవారికి ప్రసూతి సెలవులు తప్పనిసరి చేస్తూ చట్టాలు తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమస్యకు స్పందించాల్సిన సమయం వచ్చేసిందని అన్నారు. 'పిల్లల్ని కని, పెంచడంలో స్త్రీ, పురుషులిరువురికీ సమాన బాధ్యత ఉంటుంది. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రసూతి సమయంలో తల్లితో పాటు తండ్రికీ సెలవులు ఇస్తున్నాయి. అవి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రమాణాలకు సరితూగకపోయినా ఏదో ఒక మేరకు ఇస్తున్నాయి. మన దేశంలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ (1972) ప్రకారం భార్య ప్రసూతి సమయంలో పురుషులకు లీవ్ పెట్టే వీలు ఉంది. కాని ఆ రూల్స్ చాలా రాష్ట్రాల్లో అమలు కావడం లేదు'.



-జస్టిస్ విక్టోరియా గౌరి, మద్రాసు హైకోర్టు

కోర్టుకెక్కిన తండ్రి

తమిళనాడులోని తెన్‌కాశీలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న బి.శరవణన్ తన భార్యకు కాన్పు సమయంలో తోడు ఉండేందుకు 90 రోజుల సెలవు అడిగాడు. దానికి కారణం అతని భార్య ఐ.వి.ఎఫ్. ద్వారా గర్భం దాల్చడమే. ఐ.వి.ఎఫ్.ద్వారా గర్భం దాల్చితే కాన్పు అయ్యేంత వరకూ జాగ్రత్తగా ఉండాలి. అందుకే సెలవు అడిగాడు. పరిస్థితి విన్న అధికారులు శాంక్షన్ చేశారు. కాని ఆ సెలవు ఉపయోగంలోకి రాక ముందే అతను విధుల్లో లేకపోతే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని సెలవు కేన్సిల్ చేశారు. దాంతో శరవణన్ కోర్టుకు వెళ్లాడు. డెలివరీ డేట్ మే 30 కనుక కోర్టు మే 1 నుంచి సెలవు ఇమ్మంది. అధికారులు 30 రోజులు సెలవు మంజూరు చేశారు. కాని డెలివరీ మే 31న జరిగింది. దాంతో మే 31న శరవణన్ విధులకు హాజరు కాలేకపోయాడు. అంతే కాదు సెలవు పొడగింపును కోరాడు. అధికారులు సెలవును పొడిగించకపోగా చెప్పాపెట్టకుండా విధులకు హాజరుకానందున ఎందుకు చర్య తీసుకోకూడదో జూన్ 22న వచ్చి వ్యక్తిగతంగా సంజాయిషీ ఇమ్మని ఆదేశించారు. ఆ ఆదేశాలను శరవణన్ హైకోర్టులో సవాలు చేశాడు. కోర్టు ఆ ఆదేశాలను కొట్టేస్తూ మగవారికి కూడా ప్రసూతి సెలవులు అవసరమని అభిప్రాయపడింది.

ఆందోళన లేకుండా

కాన్పు సమయంలో భార్యకు ఎంత ఆందోళన ఉంటుందో భర్తకూ అంతే ఆందోళన ఉంటుంది. రెండు ప్రాణాలు పరీక్ష సమయాన్ని ఎదుర్కొనే వేళ సహజంగానే లేబర్ రూమ్ బయట పురుషుడు ఒత్తిడికి లోనవుతాడు. అదొక్కటే కాదు బిడ్డ పుట్టాక భార్యకు శక్తి వచ్చే వరకు, బిడ్డ కుదుట పడేవరకు ఇంట్లో పనులు ఎన్నో ఉంటాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుళ్లు ఉంటాయి. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇంటి నుంచి ఫోన్ రాగానే కంగారు పడుతూ భర్తలు ఆ సమయంలో వేదన అనుభవిస్తారు. మరోవైపు తోడుండాల్సిన భర్త ఇంటి పట్టున లేకపోతే, డబ్బు సంపాదన ఎంత తప్పనిసరి అయినప్పటికీ, భార్యకు నిస్పృహ రావడం సహజం. రాత్రిళ్లు చంటి పిల్లల ఏడ్పు వల్ల ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్లాల్సిన భర్త నిద్ర చెడి చిరాకు పడితే ఆ గొడవ కాస్తా విడాకుల వరకు వెళ్లిన కేసులెన్నో. అందువల్ల భార్యతో పాటు భర్తకు సెలవులు ఇవ్వడం ఎంతో అవసరం. 'కనేది ఆమె అయితే ఇతనికేం నొప్పి' అని హేళన చేసే రోజులు పోయాయి. ఈ బిజీ రోజుల్లో మనిషి తోడు కష్టమైన రోజుల్లో భర్తకు భార్య, భార్యకు భర్త ఒకరికొకరై సంతానాన్ని సాకాలంటే ఇలాంటి నాగరికమైన ఆలోచనలు తప్పక చేయాల్సిందే.

పర్యావరణ పరిరక్షణ గురించి మాటలు కాదు, చేతల్లో చూపించండి అని గ్రేటాథన్ బర్గ్ గళం విప్పింది. ఈ మాటను తూ.చ. తప్పకుండా ఆచరిస్తూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది మాన్యా. అందుకే మాన్యను' అంతర్జాతీయ యూత్ ఇకో– హీరో' అవార్డు వరించింది.


• మాన్య

అసామాన్యం

పర్యావరణ సమస్యలను పరిష్కరించే ఎనిమిది నుంచి పదహారేళ్ళలోపు వయసు వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా పదిహేడు మంది యువతీ యువకులను ఈ అవార్డుకు ఎంపిక చేయగా మన దేశం నుంచి మాన్యహర్షను ఏరికోరి ఈ అవార్డు వరించింది. మాన్య చేపట్టిన 'సన్‌షైన్'ప్రాజెక్టుకు గానూ ఇంతటి గుర్తింపు లభించింది. 27 దేశాలు, 32 అమెరికా రాష్ట్రాల్లో... ఇరవై ఏళ్లగా పర్యావరణం గురించి కృషిచేస్తోన్న... 339 మందిని గుర్తించి వారిలో పదిహేడు మందికి ఇకో హీరో అవార్డులు ఇచ్చారు.





బెంగళూరుకు చెందిన పదిహేడేళ్ళ మాన్య గోల్డెన్ బీ ఆఫ్ విబ్జిఆర్ హైస్కూల్లో చదువుతోంది. చిన్నప్పటి నుంచి మొక్కలంటే ఇష్టం. మాన్యకు నాలుగేళ్లు ఉన్నప్పుడు నానమ్మ రుద్రమ్మ మాన్యతో మొక్కను నాటిస్తూ... ''ప్రకృతినీ, పర్యావరణాన్నీ ప్రేమగా చూసుకోవాలి. మనతోపాటు మొక్కలు, జంతువులను బతకనిస్తే మనం బావుంటాము'' అని ఆమె మాన్యకు చెప్పింది. అప్పటి నుంచి మాన్యకు పర్యావరణంపై మక్కువ ఏర్పడింది. చిన్నప్పటి నుంచి పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనేది.

లాక్‌డౌన్ సమయంలో...

కరోనా వైరస్ చెడు చేసినప్పటికీ సరికొత్త పనులు చేయడానికి కొంత మందికి వెసులుబాటు కల్పించింది. ఈ వెసులుబాటును వాడుకున్న మాన్య.. పిల్లల కోసం 'సన్ షైన్' అనే మ్యాగజైన్‌ను ప్రారంభించింది. ప్రింట్, డిజిటల్ కాపీల ద్వారా పర్యావరణ పరిరక్షణ గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తోంది. ఈ మ్యాగజైన్‌ను బెంగళూరులోని మాంటిస్సోరి, ఇతర స్కూళ్లల్లోని పిల్లలకు ఉచితంగా అందిస్తోంది. వివిధ కార్యక్రమాలను పరిచయం చేస్తూ పర్యావరణ ప్రాధాన్యత గురించి వివరిస్తోంది. 'ఈచ్ వన్ ప్లాంట్ వన్ క్యాంపెయిన్', 'పేపర్ మేకింగ్ వర్క్‌షాప్', 'పిల్లలు నీటిని ఎలా కాపాడగలరు?','న్యూ ఇండియా సస్టెయినబుల్ క్యాంపెయిన్','ప్లాస్టిక్ ఫ్రీ జూలై రైటింగ్ కాంపిటీషన్', ఎర్త్‌డే రోజు పెయింటింగ్ పోటీల వంటివాటిని మ్యాగజైన్ ద్వారా నిర్వహిస్తూ పర్యావరణంపై చక్కని అవగాహన కల్పిస్తోంది. తన యూట్యూబ్ ఛానెల్లో కూడా పర్యావరణ కార్యక్రమ వీడియోలు షేర్ చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

పీల్స్‌తో పేపర్స్..

అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు వంటింట్లో మిగిలిపోయే కూరగాయ తడి వ్యర్థాలను ప్యాకింగ్ పేపర్స్‌గా మారుస్తోంది. కూరగాయ తొక్కలను ఉపయోగించి, పెన్సిల్స్, పేపర్‌లు రూపొందిస్తోంది. ఇప్పటి దాకా రెండు వందలకు పైగా వెజిటేబుల్ పీల్ పేపర్లను తయారు చేసింది. ఇందుకోసం వంటింట్లో మిగిలిపోయిన వ్యర్థాలు, పండుగల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సేకరించి, వాటిని గ్రైండ్ చేసి పేపర్‌గా మార్చడం విశేషం. పాత జీన్స్ ప్యాంట్లను డెనిమ్ పేపర్‌లుగా తీర్చిదిద్దుతోంది. మాన్యా స్వయంగా తయారు చేయడమే గాక, వర్క్‌షాపుల ద్వారా పేపర్‌ల తయారీ గురించి పిల్లలకు నేర్పిస్తోంది.

అనేక అవార్డులు..

నాలుగున్నరవేలకు పైగా మొక్కలను నాటి, ఏడువేల మొక్కలు పంపిణీ చేసింది. ఐదువేల విత్తనాలను నాటింది. ఎనిమిదివేలకు పైగా ఆర్గానిక్, కాటన్ సంచులను పంచింది. సిటీ, హైవే రోడ్లు, నీటి కుంటలను శుద్ధిచేసే కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటికి గుర్తింపుగా మాన్యకు అనేక అవార్డులు వచ్చాయి. వెజిటేబుల్ పేపర్‌కు గ్రీన్ ఇన్నోవేటర్, జల వనరుల మంత్రిత్వ శాఖ 2020 సంవత్సరానికి గాను 'వాటర్ హీరో', ఎర్త్‌డాట్ ఓ ఆర్జీ ఇండియా నెట్‌వర్క్ నుంచి రైజింగ్ స్టార్, హ్యూమానిటేరియన్ ఎక్స్‌లెన్స్ అవార్డులు వచ్చాయి. పృథ్వీ మేళా, అక్షయ్‌కల్ప రీసైక్లింగ్ మేళా, లయన్స్ క్లబ్, బ్యాక్ టు స్కూల్ ప్రోగ్రామ్, బైజూస్ పేపర్ బ్యాగ్ డే వంటి కార్యక్రమాల్లో పర్యావరణంపై ప్రసంగించింది. ఇవన్నీగాక మాన్య ప్రకృతిమీద ఏడు పుస్తకాలు రాసింది. 2019 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ యంగెస్ట్ పోయెట్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రాండ్ మాస్టర్ టైటిల్ గెలుచుకుంది.

''ఈ అవార్డు నా కృషిని గుర్తించి మరింత స్ఫూర్తిని ఇచ్చింది. భవిష్యత్‌లో నా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్తాను'' అని చెబుతూ ఎంతోమందిని ఆలోచించేలా చేస్తోంది మాన్య.

ఏ క్యారెక్టర్‌తోనైనా... చాట్ చేయొచ్చు

సాపేక్ష సిద్ధాంతం గురించి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో సంభాషించింది సృజన. సినిమాలు ఎక్కువగా చూసే గీతిక దర్శక దిగ్గజం ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్‌తో 'నంబర్ 13' నుంచి 'ది వైట్ షాడో' వరకు ఎన్నో సినిమాల గురించి వివరంగా సంభాషించింది. ఇక స్వరతేజకు జపనీస్ ప్రఖ్యాత వీడియో గేమ్ క్యారెక్టర్ 'మారియో'తో సంభాషించడం సరదా! కాల్పనికత అనేది మనకు బొత్తిగా కొత్త కాదు. అయితే ఏఐ సాంకేతికత కాల్పనికతను మరోస్థాయికి తీసుకువెళ్లింది. యువతరం తాజా ఆర్టిఫిషియల్ క్రేజ్ 'క్యారెక్టర్.ఏఐ' ఆ సాంకేతికతలో భాగమే...

ఏఐ పవర్ హౌజ్ 'ఓపెన్ ఏఐ' అంతర్జాల సంచలనంగా మారింది. 'చాట్ జీపీటీ' పాపులారిటీతో ఎన్నో టెక్నాలజీ కంపెనీలు తమ సొంత ఏఐ చాట్ బాట్‌లను ప్రవేశపెట్టాయి. 'చాట్‌జీపీటీ' పాపులారిటీ సంగతి ఎలా ఉన్నా యువతరం తాజా ఆసక్తులలో 'క్యారెక్టర్. ఏఐ' ఒకటిగా మారింది.

'క్యారెక్టర్. ఏఐ' ద్వారా సెలబ్రిటీలు, చారిత్రక వ్యక్తులు, కాల్పనిక పాత్రలు, పాపులర్ వీడియో గేమ్ క్యారెక్టర్‌లు, థెరపిస్టులతో హాయిగా సంభాషించవచ్చు. సంభాషణల విషయంలో ఇది 'చాట్ జీపీటి' కంటే సహజంగా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది.

నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్ కాంబినేషన్‌లో 'క్యారెక్టర్. ఏఐ'ను అభివృద్ధి చేశారు. 'క్యారెక్టర్.ఏఐ'లో ఎకౌంట్ సెటప్ పూర్తి చేసిన తరువాత 'క్రియేట్ ఏ క్యారెక్టర్' ఆప్షన్‌ను క్లిక్‌చేస్తే విండో ఓపెన్ అవుతుంది. క్యారెక్టర్ తనకు తాను పరిచయం చేసుకుంటుంది. ఆ తరువాత సంభాషణ మొదలుపెట్టవచ్చు.

ఉదాహరణకు...'హారి పోటర్' సిరీస్‌లోని ఫిక్షనల్ క్యారెక్టర్ హమైనీ గ్రేంజర్‌తో సంభాషించాలనుకున్నాం.

'హలో రమ్య, మై నేమ్ ఈజ్ హమైనీ గ్రేంజర్. ఇట్స్ వెరీ నైస్ టు మీట్ యూ' అంటూ తనను తాను పరిచయం చేసుకుంటుంది హమైనీ. తన ఇష్టాయిష్టాలు, ఆసక్తుల గురించి చెబుతుంది.

రిలవెంట్ ట్యాగ్స్ అందుబాటులో ఉంటాయి. క్యారెక్టర్ వ్యక్తిత్వం ఆధారంగా డ్రాప్ డౌన్ మెన్యూ నుంచి స్పీకింగ్ వాయిస్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు.

ఒక క్యారెక్టర్‌తో చాట్ చేయవచ్చు లేదా మల్టిపుల్ క్యారెక్టర్స్‌తో గ్రూప్ చాట్ చేయవచ్చు.

యూత్ పల్స్



'క్యారెక్టర్. ఏఐ' అనేది టెక్స్ట్‌కు మాత్రమే పరిమితం కాదు. ప్రాంప్ట్స్, చాట్స్ ఆధారంగా ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు.

ఏఐ ఇండస్ట్రీ ప్రముఖులుగా గుర్తింపు పొందిన షాజీర్, డేనియల్ ఫ్రైటస్ గూగుల్‌లో పనిచేస్తున్నప్పుడు 'క్యారెక్టర్. ఏఐ'కు సంబంధించి ఆలోచన చేశారు. షాజీర్ 'అటెన్షన్ ఈజ్ ఆల్ యూ నీడ్' పుస్తక రచయితలలో ఒకరు. ఇక డేనియల్ 'మీన' అనే చాట్‌బాట్ క్రియేటర్.

వ్యక్తిగత వస్తువులు ఉన్నట్లే, పర్సనలైజ్‌డ్ చాట్ బాట్‌లు ఉండాలనుకునేవారికి క్యారెక్టర్ ఏఐ ఉపయోగపడుతుంది. 'వర్చువల్ ఫ్రెండ్'ను సృష్టిస్తుంది.

'పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్ అంటే మాటలా? ఖర్చు బాగానే అవుతుంది కదా' అనే సందేహం వస్తుంది. అయితే 'క్యారెక్టర్. ఏఐ'తో ఖర్చు లేకుండానే సొంత చాట్‌బాట్‌ను సృష్టించుకోవచ్చు.

ఆ.. ఏముంది... అంతా కాల్పనికమే కదా అనుకుంటే ఏమీ లేకపోవచ్చు. ఉంది అనుకుంటే మాత్రం ఎంతో ఉంది.

'కొత్త అనుభూతిని సొంతం చేసుకున్నామా లేదా అనేది ముఖ్యం కాని వాస్తవమా కాదా అనేది ముఖ్యం కాదు' అంటున్నాడు 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా' కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం అసోసియేట్ ప్రొఫెసర్ మైక్.


'చాట్ జీపీటీ' గురించి ఎంత గొప్పగా చర్చించుకున్నప్పటికీ కొన్ని ప్రయోగాలు దెబ్బతిన్నాయి. ఉదాహరణకు ... నేషనల్ ఈటింగ్ డిజార్డర్స్ అసోసియేషన్ బరువు తగ్గడానికి సంబంధించి సమస్యాత్మక సలహా ఇచ్చినందుకు తమ చాట్‌బాట్‌ను సస్పెండ్ చేసింది. క్యారెక్టర్.ఏఐ విషయంలోనూ పొరపాట్లు జరగవచ్చు. సాంకేతికతకు పరిమితులు ఉండే విషయాన్ని అర్థం చేసుకోవాలి' అంటుంది చెన్నైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ మనీష.



రియల్ చాలెంజర్... జెమిని

ఏఐ రేసులో ఓపెన్ ఏఐ లాంగ్వేజ్ మోడల్స్ లీడింగ్‌లో ఉన్నప్పటికీ ఇది ఎప్పటివరకు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. దీనికి కారణం సరికొత్తగా వస్తున్న పవర్‌ఫుల్ ఏఐ మోడల్స్. వీటిమాట ఎలా ఉన్నా గూగుల్ వారి 'జెమిని'ని అసలు సిసలు రియల్ చాలెంజర్ అంటున్నారు. గూగుల్ తమ కొత్త 'జెమిని' ప్రాజెక్ట్‌లో భాగంగా నెక్స్ట్– జనరేషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్‌ను లాంచ్ చేయనుంది.

'జెమిని' అనేది కన్వర్‌సేషనల్ టెక్స్ట్‌ను జనరేట్ చేయడానికి పరిమితం కాదు. ఇన్‌పుట్స్, వీడియోలు, ఇమేజ్ లను హ్యాండిల్ చేసే మల్టీ–మోడల్ జెమిని. గూగుల్ దగ్గర ఉన్న అపారమైన వనరులు(యాక్సెస్ టు యూ ట్యూబ్ వీడియోస్, గూగుల్ బుక్స్, సెర్చ్ ఇండెక్స్, స్కాలర్ మెటీరియల్)లతో 'జెమిని' ఇతర కంపెనీలకు గట్టి ప్రత్యర్థిగా మారనుంది. 'ఎక్స్‌క్లూజివ్ టు గూగుల్' అనే ప్రత్యేకత వల్ల జెమిని మరింత బలంగా మారనుంది.





తొలి రౌండ్‌లోనే సుమిత్ నగాల్ ఓటమి

యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైంది. న్యూయార్క్‌లో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 190వ ర్యాంకర్ సుమిత్ 3–6, 5–7తో ప్రపంచ 95వ ర్యాంకర్ టారో డానియల్ (జపాన్) చేతిలో ఓడిపోయాడు. గంటా 44 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయాడు.



రవూఫ్ ధాటికి అఫ్గానిస్తాన్ 59 ఆలౌట్

మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా అఫ్గానిస్తాన్‌తో హంబన్‌టోటాలో మంగళవారం జరిగిన తొలి వన్డేలో పాకిస్తాన్ 142 పరుగుల తేడాతో గెలిచింది. 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్‌ను పాకిస్తాన్ పేస్ బౌలర్ హారిస్ రవూఫ్ (5/18) హడలెత్తించాడు. రవూఫ్ ధాటికి అఫ్గానిస్తాన్ 19.2 ఓవర్లలో కేవలం 59 పరుగులకే ఆలౌటైంది. వన్డేల్లో అఫ్గానిస్తాన్‌కిది రెండో అత్యల్ప స్కోరు. అంతకుముందు పాకిస్తాన్ 47.1 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది. ఇమామ్ ఉల్ హఖ్ (61 : 2 ఫోర్లు), షాదాబ్ (39 : 3 ఫోర్లు) రాణించారు.



రన్నరప్ యువ భారత్

డసెల్‌డార్ఫ్ (జర్మనీ): నాలుగు దేశాల జూనియర్ పురుషుల హాకీ టోర్నీలో భారత జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆతిథ్య జర్మనీ జట్టుతో మంగళవారం జరిగిన ఫైనల్లో భారత్ 1–6 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున సుదీప్ చిర్మాకో (22వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. జర్మనీ తరఫున ఫ్లోరియన్ స్పెర్లింగ్ (15వ ని.లో), బెన్ హస్బాచ్ (20వ ని.లో), హుగో వాన్ (23వ ని.లో), ఫాబియో సీట్జ్ (38వ ని.లో), నికాస్ బెరెంట్స్ (41వ ని.లో), పాల్ గ్లాండెర్ (43వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. మరోవైపు ఇదే వేదికపై జరుగుతున్న నాలుగు దేశాల మహిళల జూనియర్ హాకీ టోర్నీలో భారత జట్టు తొలి విజయం నమోదు చేసింది. స్పెయిన్‌తో జరిగిన చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–1తో గెలిచింది. భారత్ తరఫున అన్ను (21వ ని.లో), సాక్షి రాణా (47వ ని.లో) చెరో గోల్ సాధించారు. భారత్, స్పెయిన్ నాలుగు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన గోల్స్ అంతరంతో జర్మనీతో జరిగే ఫైనల్‌కు స్పెయిన్ అర్హత సాధించగా... భారత జట్టు 3–4 స్థానాల కోసం నేడు ఇంగ్లండ్‌తో తలపడుతుంది.

శ్రీజకు స్వర్ణం... స్నేహిత్‌కు కాంస్యం

సాక్షి, విశాఖపట్నం: జాతీయ ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నమెంట్‌లో తెలంగాణ ప్లేయర్లు ఆకుల శ్రీజ, స్నేహిత్ రాణించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తరఫున బరిలోకి దిగిన శ్రీజ మహిళల సింగిల్స్‌లో తొలిసారి స్వర్ణం సాధించింది. ఫైనల్లో శ్రీజ 11–6, 11–7, 13–11, 11–5తో మౌమితా దత్తా (ఆర్‌ఎస్‌పీబీ)పై గెలిచింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) తరఫున పోటీపడిన స్నేహిత్ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 12–10, 7–11, 13–11, 7–11, 8–11, 4–11తో మనుష్ షా (ఆర్‌బీఐ) చేతిలో ఓడిపోయి కాంస్య పతకం సాధించాడు. శ్రీజ, స్నేహిత్ ప్రదర్శనపట్ల వీరిద్దరి కోచ్ సోమ్‌నాథ్ ఘోష్ ఆనందం వ్యక్తం చేశాడు.



ప్రయోగానికి ఆఖరి అవకాశం

- నేడు ఐర్లాండ్‌తో భారత్ చివరి టి20
- ఇప్పటికే టీమిండియా ఖాతాలో సిరీస్
- తొలి విజయం కోసం ఐర్లాండ్ ప్రయత్నం
- రాత్రి గం.7:30 నుంచి స్పోర్ట్స్–18లో ప్రత్యక్ష ప్రసారం



డబ్లిన్: వెస్టిండీస్‌తో ఐదు టి20 మ్యాచ్‌లు, ఆ తర్వాత ఐర్లాండ్‌తో మూడు టి20 మ్యాచ్‌లు భారత యువ ఆటగాళ్లను ఈ ఫార్మాట్‌లో పరీక్షించేందుకు అవకాశం ఇచ్చాయి. వన్డే ప్రపంచకప్ ఏడాది ఎక్కువ మంది సీనియర్లు విరామం తీసుకోగా, కుర్రాళ్లంతా తమకు లభించిన చాన్స్‌ను చక్కగా ఉపయోగించుకున్నారు. ఈ రెండు పర్యటనల్లో కలిపి ఏడు మ్యాచ్‌లలో ఇప్పటికే ఐదుగురు ఆటగాళ్లు అంతర్జాతీయ టి20ల్లో అరంగేట్రం చేశారు. ఇక మరో ఇద్దరు దాని కోసం ఎదురు చూస్తున్నారు. టూర్ చివరి మ్యాచ్‌లో ఆ చాన్స్ దక్కుతుందా అనేది చూడాలి. సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకున్న భారత్ కోణంలో ఇది మాత్రమే ఆసక్తికర అంశం. మరోవైపు వన్డే, టి20 ఫార్మాట్‌లలో కలిపి భారత్‌తో ఆడిన 10 సార్లూ ఓడిన ఐర్లాండ్ ఈసారైనా సొంతగడ్డపై ఒక్క మ్యాచ్ గెలవాలని కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో నేడు చివరి టి20కి రంగం సిద్ధమైంది.

జితేశ్, షహబాజ్‌లకు అవకాశం!

ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌లలోనూ రాణించిన కెప్టెన్ బుమ్రా, పేసర్ ప్రసిధ్ కృష్ణ ఫామ్‌లోకి రావడం, ఆసియా కప్‌కు ఎంపిక కావడంతో ఈ సిరీస్ నుంచి భారత్‌కు ఆశించిన ప్రధాన ఫలితం దక్కింది. అయితే మరింత మ్యాచ్ ప్రాక్టీస్ కోసం వీరిద్దరు ఈ మ్యాచ్‌లోనూ బరిలోకి దిగుతారు. రవి బిష్ణోయ్ కూడా సిరీస్‌లో తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌లో రుతురాజ్, సామ్సన్, రింకూ సింగ్ కూడా తమకు లభించిన అవకాశాలు చక్కగా ఉపయోగించుకోగా, శివమ్ దూబే కూడా తన ధాటిని ప్రదర్శించాడు. సిరీస్‌లో విఫలమైన తిలక్ వర్మ చివరి పోరులో సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నాడు. యశస్వి కూడా మరో మెరుపు ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. ఈ స్థితిలో తుది జట్టులో మూడు మార్పులకు అవకాశం ఉంది. ఇప్పటి వరకు అంతర్జాతీయ క్రికెట్ ఆడని వికెట్ కీపర్ జితేశ్ శర్మ, 3 వన్డేలు ఆడిన షహబాజ్ అహ్మద్ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. వీరిని తీసుకోవాలని మేనేజ్‌మెంట్ భావిస్తే సంజు సామ్సన్, వాషింగ్టన్ సుందర్ స్థానాల్లో అవకాశం దక్కుతుంది. మరోవైపు కొంత విరామం తర్వాత టీమ్‌లోకి వచ్చిన అవేశ్ ఖాన్ కూడా టీమ్‌తో పాటు ఉన్నాడు. అతనికీ ఒక మ్యాచ్ ఇవ్వాలనుకుంటే అర్ష్‌దీప్‌కు విశ్రాంతినిస్తారు. ఇదే జరిగితే కుర్రాళ్లతో భారత్ ప్రయోగం సంపూర్ణమవుతుంది.

స్టిర్లింగ్ ఫామ్‌లోకి వచ్చేనా!

రెండు టి20 మ్యాచ్‌లలో ఐర్లాండ్ ఆటతీరు మరీ పేలవంగా లేకున్నా భారత్‌లాంటి బలమైన జట్టుకు పోటీనిచ్చేందుకు సరిపోలేదు. గతంలోనూ కొన్ని చక్కటి ప్రదర్శనలు వచ్చినా టీమిండియాను ఓడించడంలో మాత్రం ఆ జట్టు సఫలం కాలేకపోయింది. ఈ నేపథ్యంలో చివరి పోరులోనైనా ఆ జట్టు గెలుపు బాట పడుతుందేమో చూడాలి. ప్రపంచవ్యాప్తంగా లీగ్‌లలో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తూ వచ్చిన కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ ఇక్కడ మాత్రం రెండింటిలోనూ విఫలమయ్యాడు. బల్బిర్నీ మినహా మిగతావారంతా ప్రభావం చూపలేకపోయారు. విజయం సాధించాలంటే జట్టు సమష్టిగా రాణించడం కీలకం. ఐర్లాండ్ కూడా గత మ్యాచ్‌తో పోలిస్తే మూడు మార్పులతో బరిలోకి దిగే అవకాశం ఉంది.

సింధుకు చుక్కెదురు

- రెండో రౌండ్‌లో ఓడిన భారత స్టార్
- ప్రిక్వార్టర్స్‌లోకి ప్రణయ్, లక్ష్య సేన్

కోపెన్‌హాగెన్ (డెన్మార్క్): ఈ ఏడాది భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు నిరాశజనక ప్రదర్శన కొనసాగుతోంది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఈ మాజీ చాంపియన్ రెండో రౌండ్లోనే వెనుదిరిగింది. తొలి రౌండ్లో ఆమెకు 'బై' లభించడంతో నేరుగా రెండో రౌండ్లో పోటీపడింది. ప్రతీసారి కనీసం క్వార్టర్ ఫైనలిస్ట్‌గా నిలిచిన ఆమె బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో 14–21, 14–21తో నొజోమి ఒకుహారా (జపాన్) చేతిలో ఓడిపోయింది. రెండు గేముల్లో కూడా ఆరంభంలో ప్రత్యర్థికంటే మెరుగ్గా, ప్రత్యర్థికి దీటుగా ఆడిన 16వ సీడ్ సింధు గేమ్ సాగే కొద్దీ డీలా పడటంతో వరుస గేముల్లోనే ఓడింది. రెండో గేమ్‌లో సింధు ఒకదశలో 9–0తో ఆధిక్యంలో నిలిచింది. కానీ జపాన్ షట్లర్ వరుసగా పాయింట్లు నెగ్గుకుంటూ రావడంతో మళ్లీ సింధు ఆధిక్యాన్ని, ఆ తర్వాత మ్యాచ్‌నే కోల్పోయింది. పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్స్ ప్రణయ్, లక్ష్యసేన్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. రెండో రౌండ్‌లో లక్ష్యసేన్ 21–11, 21–12తో జియోన్ హ్యోక్ (కొరియా)పై, ప్రణయ్ 21–9, 21–14తో చికొ అర వర్డొయో (ఇండోనేసియా)పై గెలుపొందారు. గురువారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ లో కీన్ యె (సింగపూర్)తో ప్రణయ్; కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)తో లక్ష్య సేన్ తలపడతారు.





కార్ల్‌సన్

ప్రజ్ఞానంద

ప్రజ్ఞానంద, కార్ల్‌సన్ తొలి గేమ్ 'డ్రా'

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగం టైటిల్ కోసం భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద, వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) మధ్య జరిగిన తొలి గేమ్ 'డ్రా'గా ముగిసింది. తమిళనాడుకు చెందిన 18 ఏళ్ల ప్రజ్ఞానంద ఈ గేమ్‌లో తెల్ల పావులతో ఆడాడు. 35 ఎత్తుల తర్వాత ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇద్దరూ 'డ్రా'కు సమ్మతించారు. 'తొలి గేమ్‌లో నేను ఏ దశలోనూ ఇబ్బంది పడలేదు. రెండో గేమ్‌లో కార్ల్‌సన్‌తో గట్టి పోరాటమే చేయాల్సి ఉంటుంది. అతడిని నిలువరించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తా' అని ప్రజ్ఞానంద వ్యాఖ్యానించాడు. వీరిద్దరి మధ్య నేడు రెండో గేమ్ జరుగుతుంది. ఈ గేమ్‌లో కార్ల్‌సన్ తెల్ల పావులతో ఆడతాడు. ఈ గేమ్‌లో గెలిచిన ప్లేయర్‌కు ప్రపంచకప్ టైటిల్ లభిస్తుంది. ఒకవేళ రెండో గేమ్ కూడా 'డ్రా' అయితే గురువారం టైబ్రేక్ గేమ్‌ల ద్వారా విజేతను నిర్ణయిస్తారు.

హీట్స్‌లోనే జ్యోతి నిష్క్రమణ

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



జ్యోతి

బుడాపెస్ట్ (హంగేరి): తొలిసారి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పోటీపడ్డ భారత మహిళా అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ ఒత్తిడికిలోనై నిరాశపరిచింది. మంగళవారం జరిగిన మహిళల 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌లో విశాఖపట్నం జిల్లాకు చెందిన 23 ఏళ్ల జ్యోతి హీట్స్‌ను దాటి ముందుకెళ్లలేకపోయింది. ఇటీవల ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన జ్యోతి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాత్రం ఓవరాల్‌గా 29వ స్థానంలో నిలిచి సెమీఫైనల్ దశకు అర్హత పొందలేకపోయింది. నాలుగో హీట్‌లో పోటీపడ్డ జ్యోతి 13.05 సెకన్లలో గమ్యానికి చేరి ఏడో ర్యాంక్‌లో నిలిచింది. మొత్తం ఐదు హీట్స్ జరగ్గా... ఒక్కో హీట్‌లో టాప్–4లో నిలిచిన వారు నేరుగా సెమీఫైనల్‌కు చేరారు. మిగిలిన వారిలో బెస్ట్–4 టైమింగ్ నమోదు చేసిన అథ్లెట్‌లు కూడా సెమీఫైనల్లోకి ప్రవేశించారు. జ్యోతి తన అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన (12.78 సెకన్లు) సమయాన్ని ఇక్కడ పునరావృతం చేసి ఉంటే ఆమెకు సెమీఫైనల్ బెర్త్ కచ్చితంగా ఖరారయ్యేది. ఎందుకంటే ఇక్కడ 12.92 సెకన్ల సమయం నమోదు చేసిన మేకీ జిన్లిమ్ (నెదర్లాండ్స్)కు చివరిదైన 24వ సెమీఫైనల్ బెర్త్ లభించింది.




షకేరీ

'సూపర్' షకేరీ...

మహిళల 100 మీటర్ల స్ప్రింట్‌లో కొత్త ప్రపంచ చాంపియన్ అవతరించింది. ఫైనల్లో అమెరికాకు చెందిన 23 ఏళ్ల షకేరీ రిచర్డ్సన్ 10.65 సెకన్లలో అందరికంటే వేగంగా గమ్యానికి చేరి విజేతగా నిలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న తొలిసారే షకేరీ స్వర్ణ పతకం సాధించడం విశేషం. షకేరీ ధాటికి ఐదుసార్లు 100 మీటర్ల వరల్డ్ చాంపియన్ షెల్లీ ఆన్ ఫ్రేజర్ (జమైకా; 10.77 సెకన్లు) మూడో స్థానానికి పరిమితమై కాంస్య పతకంతో సరిపెట్టుకుంది.

సినిమా



చిరంజీవి

మెగా ట్రీట్

హీరో చిరంజీవి బర్త్ డే (ఆగస్టు 22) సందర్భంగా రెండు కొత్త చిత్రాల ప్రకటనలు వచ్చాయి. ఒకే రోజు రెండు చిత్రాల అనౌన్స్‌మెంట్‌తో అటు తన ఫ్యాన్స్‌కు ఇటు సినీ ప్రేమికులకు చిరంజీవి మెగా ట్రీట్ ఇచ్చారు. చిరంజీవి హీరోగా నటించనున్న 'మెగా 156' (వర్కింగ్ టైటిల్) చిత్రాన్ని ఆయన కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మించనుండటం విశేషం. 'ఖైదీ నంబర్ 150' చిత్రం నుంచి తండ్రికి స్టైలిస్ట్‌గా వ్యవహరిస్తున్నారు సుస్మిత. ఆమె నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌ని స్థాపించిన సంగతి తెలిసిందే. ఈ బ్యానర్ పైనే 'మెగా 156' మూవీ రూపొందనుంది. త్వరలోనే ఈ చిత్రదర్శకుడు, సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ ప్రకటిస్తారు.

ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్...

తొలి చిత్రం 'బింబిసార'తో సూపర్ హిట్ అందుకున్న డైరెక్టర్ వశిష్ఠ క్రేజీ ఆఫర్ అందుకున్నారు. చిరంజీవి హీరోగా నటించనున్న 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) సినిమాకి దర్శకత్వం వహించనున్నారు వశిష్ఠ. యూవీ క్రియేషన్స్‌పై వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తారు. ''తెలుగు చిత్ర పరిశ్రమలో ఎవర్‌గ్రీన్ క్లాసిక్స్‌లో ఒకటిగా నిలిచిన చిత్రం 'జగదేక వీరుడు అతిలోక సుందరి'. అలాంటి మరో ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్‌లో చిరంజీవిని చూడాలని అభిమానులు ఎదురు చూస్తున్నారు. చాలా కాలం తర్వాత చిరంజీవి గారు ఒక ఫ్యాంటసీ మూవీ 'మెగా 157'లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు'' అని చిత్రబృందం పేర్కొంది.

ఎవరు ఏమన్నా నా ప్రయత్నం మారదు - వరుణ్ తేజ్



● ప్రవీణ్, సాక్షీ వైద్య, వరుణ్ తేజ్, అనిల్ రావిపూడి, బీవీఎస్ఎన్ ప్రసాద్, శ్రీకాంత్ అడ్డాల, బాపినీడు

''కొత్త కథలతో మంచి సినిమాలు చేయాలి, ప్రేక్షకులను అలరించాలనే ఆశతోనే ఇండస్ట్రీకి వచ్చాను. ఎవరు ఏమన్నా, సినిమాల ఫలితం ఎలా ఉన్నా.. సినిమాలు బాగా లేకపోతే ఇంకా బాగా చేసేందుకు ప్రయత్నిస్తాను. అంతే కానీ నా ప్రయత్నం, నా కష్టం ఎప్పటికీ మారదు. మీ (ఫ్యాన్స్, ప్రేక్షకులు) ప్రోత్సాహం ఉంటే ఇంకా బాగా చేస్తాను'' అన్నారు వరుణ్ తేజ్. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్, సాక్షీ వైద్య జంటగా నటించిన చిత్రం 'గాండీవధారి అర్జున'. బి.బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో వరుణ్ తేజ్ మాట్లాడుతూ– ''గాండీవధారి అర్జున' వంటి సామాజిక సందేశం ఉన్న సినిమాలో నటించే చాన్స్ రావడం నా లక్. చాలా మంచి సినిమా చేశాననే అనుభూతి కలిగింది. నటుడిగా ఈ చిత్రం నాకు సంతృప్తినిచ్చింది'' అన్నారు. ''వరుణ్‌తో మేం తీసిన 'తొలిప్రేమ' హిట్ అయింది. ఇప్పుడు మంచి సందేశంతో నిర్మించిన 'గాండీవధారి అర్జున' కూడా విజయం సాధిస్తుంది'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ప్రవీణ్ సత్తారు మాట్లాడుతూ– ''నేను చేసిన సినిమాల్లో నాకు బాగా కనెక్ట్ అయినది 'చందమామ కథలు'లోని భావోద్వేగాలు. కానీ, ఆ సినిమా సరిగ్గా ఆడలేదు. రెండోది యాక్షన్ జోనర్‌లో తీసిన 'పీఎస్‌వీ గరుడవేగ' హిట్ అయింది. యాక్షన్, భావోద్వేగాలు, వినోదం కలిపి చేస్తే 'గాండీవధారి అర్జున'. మనసు పెట్టి చేసిన సినిమా ఇది'' అన్నారు. ''గాండీవధారి..'తో వరుణ్ ప్రేక్షకులకు సంతోషాన్ని ఇస్తాడనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాత 'దిల్' రాజు.



నా సామి రంగ?

'ది ఘోస్ట్' చిత్రం విడుదల తర్వాత నాగార్జున నెక్ట్స్ సినిమా గురించిన ప్రకటన రాని విషయం తెలిసిందే. అయితే ఆ సమయం ఆసన్నమైందని, ఈ నెల 29న నాగార్జున బర్త్ డే సందర్భంగా ఆయన కొత్త సినిమా ప్రకటన అధికారికంగా వెల్లడి కానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కానున్నారని, వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారని టాక్. శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాను నిర్మించనున్నారని తెలిసింది.

● నాగార్జున

అక్టోబర్‌లో 800



● మధుర్ మిట్టల్

టెస్ట్ క్రికెట్ చరిత్రలో 800 వికెట్లు తీసిన ఏకైక బౌలర్‌గా రికార్డు సృష్టించిన ప్రముఖ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ (శ్రీలంక క్రికెటర్) జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం '800'. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వం వహించారు. మురళీధరన్ పాత్రలో 'స్లమ్‌డాగ్ మిలియనీర్' ఫేమ్ మధుర్ మిట్టల్, మురళీధరన్ భార్య మదిమలర్ పాత్రలో మహిమా నంబియార్ నటించారు. ఈ సినిమా ఆల్ ఇండియా పంపిణీ హక్కులను నిర్మాత, శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ సొంతం చేసుకున్నారు. తమిళంలో రూపొందించిన ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''ముత్తయ్య మురళీధరన్‌గారు బాల్యం నుంచి పడిన ఇబ్బందులు, ఆయన జర్నీ మొత్తం ఈ సినిమాలో ఉంటుంది. సెప్టెంబర్‌లో ట్రైలర్, అక్టోబర్‌లో సినిమాను రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

ఆ సెంటిమెంట్ వర్కవుట్ అయితే హ్యాపీ - కార్తికేయ

''ప్రతి సినిమా హిట్ కావాలనే చేస్తాం. కానీ ఆశించిన ఫలితం దక్కనప్పుడు తప్పు ఎక్కడ జరిగిందో ఆలోచించుకుంటాం. ఈ క్రమంలో పాయింట్ కొత్తగా ఉందని సినిమాలు చేయకూడదని, కథ, ప్రతి సీన్ ఆసక్తిగా ఉన్నప్పుడు మాత్రమే సినిమా చేయాలని అర్థం చేసుకున్నాను'' అన్నారు కార్తికేయ. క్లాక్స్ దర్శకత్వంలో కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'బెదురులంక 2012'. సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కార్తికేయ చెప్పిన విశేషాలు.

● కరోనా సమయంలో క్లాక్స్ నాకు 'బెదురులంక 2012' కథ చెప్పాడు. కరోనా వల్ల ప్రపంచం అంతా అయిపోతుందన్నట్లుగా ప్రచారం జరిగింది కదా. దీంతో 'యుగాంతం' కాన్సెప్ట్‌తో క్లాక్స్ చెప్పిన 'బెదురులంక 2012' కథకు కూడా నేను బాగా కనెక్ట్ అయ్యాను. కథలో కొత్తదనం, వినోదం ఉండటంతో ఈ సినిమాను ఓకే చేశాను.

● సిటీలో గ్రాఫిక్ డిజైనర్‌గా చేసే ఉద్యోగాన్ని మానేసి, పల్లెటూరికి వెళ్లే శివ పాత్ర చేశాను. శివ తన గురించి తోటివారు ఏమనుకుంటున్నారో పట్టించుకోడు. కానీ తన జోలికి వస్తే మాత్రం ఊరుకోడు. సినిమాలో శివకు హై ఓల్టేజ్‌లో రియాక్ట్ అయ్యే సీన్ ఉంది. ఆ సందర్భంలో మంచి వెయిట్ ఉన్న శివశంకర వరప్రసాద్ పేరైతే బాగుంటుందని చిరంజీవిగారి అసలు పేరు వాడాం. ఇక 'బెదురులంక 2012' ట్రైలర్ చూసి రామ్‌చరణ్‌గారు ప్రశంసించడం సంతోషాన్ని కలిగించింది. అలాగే 'ఆర్‌ఎక్స్ 100' సినిమాలో నా పాత్ర పేరు శివ. 'బెదురులంక..' లో కూడా ఆ పేరే. రెండు చిత్రాలూ గోదావరి నేపథ్యంలో ఉండటం అనేది యాదృచ్ఛికంగా జరిగింది. ఈ సెంటిమెంట్ కుదిరి 'బెదురులంక 2012' కూడా విజయం సాధిస్తే చాలా సంతోషిస్తాను.

● 'డీజే టిల్లు'లో రాధిక పాత్రలో నేహా శెట్టి బాగా నటించారు. కానీ మా సినిమాలో నేహాది పల్లెటూరి అమ్మాయి పాత్ర. దీంతో తను ఎలా చేస్తుందో? అనే చిన్న సందేహం ఉండేది. కానీ నటనలో వైవిధ్యం చూపించారు.

● 2012 అంటే నాకు యుగాంతమే గురుకు వస్తుంది. అప్పుడు నేను కాలేజీలో ఉన్నాను. 2012లో జీవితం అంటే ఏంటో అర్థమైపోయిన ఓ భ్రమలో ఉండేవాడిని. కానీ ఇప్పుడు ఆలోచనలో పరిపక్వత వచ్చింది. ఇప్పుడు(2023) ఏమీ తెలియదని అర్థమవుతోంది (నవ్వుతూ).



ఓ వింత ఆట

ప్రముఖ నటులు శరత్‌బాబు సినీవారసుడు ఆయుష్ (శరత్‌బాబు సోదరుడి తనయుడు) ప్రధాన పాత్రలో, శ్రీ అన్నపూర్ణ క్రియేషన్స్ ఆధ్వర్యంలో రూపొందిన చిత్రం 'దక్ష'. వివేకానంద విక్రాంత్ దర్శకత్వంలో తల్లాడ సాయికృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా వివేకానంద విక్రాంత్ మాట్లాడుతూ– ''ఒక వింత గేమ్ ఆడటం వలన కొందరు స్నేహితులు ఎదుర్కొన్న ఊహించని ఘటనలతో పారా నార్మల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని నిర్మించాం'' అన్నారు. తల్లాడ సాయికృష్ణ మాట్లాడుతూ– ''ప్రతి క్షణం ఉత్కంఠను రేకెత్తించే కథాబలం, ఆకట్టుకునే కథనంతో రూపొందించాం. ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. తన వారసుని విజయాన్ని చూడకుండానే మరణించిన శరత్‌బాబుకు 'దక్ష'ను అంకితం ఇస్తున్నాం'' అన్నారు. ఈ సినిమాలో నక్షత్ర, అను, అలేఖ్య రియా, అఖిల్, రవిరెడ్డి, శోభన్ నటించారు.



● వివేకానంద, సాయికృష్ణ



● శ్రీతేజ్

యాక్షన్ రాంబో

'నారప్ప, పుష్ప, ధమాకా' వంటి సినిమాల్లో కీలక పాత్రలు పోషించిన శ్రీతేజ్ హీరోగా పరిచయం అవుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాకు 'రాంబో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మంగళవారం (ఆగస్టు 22) శ్రీతేజ్ బర్త్ డే సందర్భంగా 'రాంబో' ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఇటీవల జరిగిన వైజాగ్ షెడ్యూల్‌తో టాకీ పార్ట్ పూర్తయింది. త్వరలోనే పాటలను చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. రాజీవ్ సాలూరి, ఫర్నాజ్ శెట్టి, మైమ్ గోపి, గోలీసోడ మధు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: శ్యామ్ కె.నాయుడు, సునీల్ కుమార్ నామా.

కామెడీ.. థ్రిల్



● శివారెడ్డి

శివారెడ్డి, జాష్విని, వనితా రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'రెంట్'. రఘువర్ధన్ రెడ్డి దర్శకత్వంలో 'బలగం' జగదీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి అతిథిగా వచ్చిన నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ– ''రెంట్' సినిమా ట్రైలర్ చాలా బాగుంది'' అన్నారు. ''చాలా రోజుల తర్వాత నేను హీరోగా చేసిన చిత్రం 'రెంట్'. ఇందులో థ్రిల్లింగ్ కథ, కామెడీ, యాక్షన్, సందేశం ఉన్నాయి'' అన్నారు శివారెడ్డి. ''నాకు మంచి పాత్ర ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు వనితా రెడ్డి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
4	3
65,220	19,396

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,494	▽	5
డోజోన్స్	34,277	▽	186
ఎఫ్‌టీఎస్ఈ 100	7,271	▲	13
డాక్స్	15,706	▲	102
షాంఘై	3,120	▲	27
నికాయ్	31,857	▲	291

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	58,657	▲	261
బంగారం (22 క్యారట్)	58,423	▲	260
వెండి (కిలో)	72,140	▲	1,305

పెరగనున్న హోండా కార్ల ధరలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ కంపెనీ హోండా కార్స్ ఇండియా వచ్చే నెల నుంచి సిటీ, అమేజ్ కార్ల ధరలను పెంచనుంది. ముడిసరుకు వ్యయం క్రమంగా అధికం అవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ మంగళవారం ప్రకటించింది. అయితే ధర ఎంత పెంచేదీ వెల్లడించలేదు. ప్రస్తుతం ఎక్స్‌షోరూంలో కాంపాక్ట్ సెడాన్ అమేజ్ ధర రూ.7.05 లక్షల నుంచి, మధ్యస్థాయి సెడాన్ సిటీ రూ.11.57 లక్షల నుంచి, హైబ్రిడ్ మోడల్ అయిన సిటీ ఈ:హెచ్ఈవీ రూ.18.89 లక్షల నుంచి ప్రారంభం.

వీడియో కేవైసీని ప్రవేశపెట్టిన బీవోబీ



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) వీడియో ఆర్ఈ కేవైసీ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం కస్టమర్లు ఎప్పటికప్పుడు తమ కేవైసీ ధ్రువీకరణ చేసుకోవడం తప్పనిసరి. ఇందుకోసం బ్యాంక్ శాఖ వరకు రావాల్సిన అవసరాన్ని వీడియో ఆర్ఈ కేవైసీ విధానం నివారిస్తుంది. వీడియో కేవైసీ సదుపాయం వినియోగించుకోవాలంటే కస్టమర్ వయసు 18 ఏళ్లు నిండి ఉండాలి. భారతీయ పౌరసత్వం కలిగి, ఆధార్, పాన్ ఉండాలని బీవోబీ తెలిపింది. ముందుగా కస్టమర్లు బీవోబీ వెబ్‌సైట్‌కు వెళ్లి ఆన్‌లైన్ ఆర్ఈ-కేవైసీ దరఖాస్తును సమర్పించాలి. ఇందులో అడిగిన వివరాలు ఇవ్వాలి. ఆ తర్వాత బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌కు వీడియో కాల్ చేయాల్సి ఉంటుంది. ఈ కాల్ కంటే ముందు కస్టమర్ తన ఒరిజినల్ పాన్ కార్డ్, ఖాళీ వైట్ పేపర్, బ్లూ లేదా బ్లాక్ పెన్ సిద్ధంగా ఉంచుకోవాలి. వీడియో ఆర్ఈ కేవైసీ కాల్‌ను అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య చేసుకోవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-8-2023	
విశాఖ	470-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	455-00
రిటైల్ ధర (డజను)	72.00
22-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95



భారత్ ఎన్‌క్యాప్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రులు వీకే సింగ్, గడ్కరీ, కార్యదర్శి అనురాగ్ జైన్ (ఎడమ నుంచి కుడికి)

ఇక దేశీయంగా కార్ల క్రాష్ టెస్టింగ్..

భారత్ ఎన్‌క్యాప్ ప్రోగ్రామ్ ఆవిష్కరణ • అక్టోబర్ 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: వాహనాలను మరింత సురక్షితం చేసే దిశగా కేంద్రం దేశీయంగా తొలి కార్ల క్రాష్ టెస్టింగ్ ప్రోగ్రామ్‌ను ఆవిష్కరించింది. కేంద్ర రహదారి, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రాం (భారత్ ఎన్‌క్యాప్)ను ప్రారంభించారు. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. విదేశాలతో పోలిస్తే చౌకగా దేశీయంగానే కార్ల క్రాష్ టెస్టింగ్‌ను నిర్వహించేందుకు ఇది ఉపయోగపడగలదని గడ్కరీ చెప్పారు. 'విదేశాల్లో ఈ పరీక్షలు చేయించాలంటే దాదాపు రూ. 2.5 కోట్లవుతుంది. అదే భారత్ ఎన్‌క్యాప్ కింద చేస్తే సుమారు రూ. 60 లక్షలవుతుంది. కాబట్టి దీనికి మంచి మార్కెట్ కూడా ఉండగలదు' అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాం కింద కార్ల తయారీ సంస్థలు స్వచ్ఛందంగా తమ వాహనాలను పరీక్షలు చేయించుకోవచ్చు. టెస్టుల్లో వాహనాల పనితీరును బట్టి 0-5 వరకు స్టార్ రేటింగ్ ఇస్తారు. ఈ విధానం కింద 30 పైగా మోడల్స్‌ను టెస్ట్ చేయించుకునేందుకు పలు కంపెనీలు సంప్రదించినట్లు గడ్కరీ తెలిపారు.

యూఐడీఏఐ చైర్‌పర్సన్‌గా నీలకంఠ్ మిశ్రా



న్యూఢిల్లీ: ఆధార్ సేవలు అందించే భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) తాత్కాలిక చైర్‌పర్సన్‌గా నీలకంఠ్ మిశ్రా నియమితులయ్యారు. ఆధార్ చట్టం కింద చైర్‌పర్సన్, సభ్యులకు మూడేళ్ల పదవీ కాలం ఉంటుంది. లేదా 65 ఏళ్ల వయసు వచ్చే వరకు వీటిల్లో ఏది ముందు అయితే అదే అమల్లోకి వస్తుంది. నీలకంఠ్ మిశ్రా యాక్సిస్ బ్యాంక్‌కు ముఖ్య ఆర్థికవేత్తగా ఉన్నారు. ఇక యూఐడీఏఐ తాత్కాలిక సభ్యులుగా ఐఐటీ ఢిల్లీ కంప్యూటర్ సైన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ మౌసమ్, కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎండీ నీలేశ్ షాని ప్రభుత్వం నియమించింది.

31 శాతం తగ్గిన విస్తారా నష్టాలు

2022-23లో రూ. 1,393 కోట్లు • లాభాల్లో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్



ముంబై: గత ఆర్థిక సంవత్సరం(2022-23)లో ప్రయివేట్ రంగ విమానయాన కంపెనీ విస్తారా నష్టాలు భారీగా తగ్గాయి. రూ. 1,393 కోట్లకు పరిమితమయ్యాయి. అంతక్రితం ఏడాది(2021-22)లో నమోదైన రూ. 2,031 కోట్లతో పోలిస్తే 31 శాతంపైగా రికవర్ అయ్యాయి. కార్పొరేట్ వ్యవహారాల శాఖకు దాఖలు చేసిన సమాచారం ప్రకారం టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్(విస్తారా) మొత్తం ఆదాయం రెట్టింపై రూ. 11,784 కోట్లను తాకింది. దీంతో నష్టాలు భారీగా తగ్గినట్లు కంపెనీ పేర్కొంది. అయితే నెట్‌వర్త్ రూ. 1,250 కోట్ల నుంచి రూ. 502 కోట్లకు నీరసించింది. దేశీ విమానయాన పరిశ్రమ గతేడాది పటిష్ట వృద్ధిని సాధించినట్లు విస్తారా తెలియజేసింది. కోవిడ్ ముందుస్థాయిని సైతం అధిగమించినట్లు వెల్లడించింది. గత ఆరు నెలల్లో సగటున ప్రతిరోజూ 4 లక్షల మంది ప్రయాణికులు నమోదవుతున్నట్లు తెలియజేసింది.

ఉమ్మడి నష్టం ఇలా..

టాటా గ్రూప్ వెలువరించిన 2022-23 వార్షిక నివేదిక ప్రకారం గతేడాది గ్రూప్‌లోని ఎయిరిండియా, ఎయిరేషియా, విస్తారాల ఉమ్మడి నష్టం రూ. 15,532 కోట్లుగా నమోదైంది. వెరసి 2021-22లో నష్టం రూ. 13,838 కోట్లు మాత్రమే. అయితే ఈ కాలంలో మూడు సంస్థల ఆదాయం పుంజుకున్నప్పటికీ ఎయిరిండియా విమానాలు, ఇంజిన్ల నిలుపుదల కారణంగా రూ. 5,000 కోట్లమేర అదనపు ప్రొవిజనింగ్ చేపట్టడంతో ఉమ్మడి నష్టాలు పెరిగాయి. టాటా సన్స్ వార్షిక నివేదిక ప్రకారం గతేడాది ఎయిరిండియా ఆదాయం రూ. 31,377 కోట్లను దాటగా.. రూ. 11,388 కోట్ల నష్టం నమోదైంది. ఎయిరేషియా టర్నోవర్ రూ. 4,310 కోట్లుకాగా.. రూ. 2,750 కోట్ల నష్టం ప్రకటించింది. అయితే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మాత్రం గతేడాది రూ. 5,669 కోట్ల ఆదాయం సాధించింది. అంతేకాకుండా రూ. 117 కోట్ల నికర లాభం ఆర్జించింది.

కొఠారీ గ్రూప్ స్వర్ణోత్సవం



హైదరాబాద్: పాన్ పరాగ్ తదితర ఉత్పత్తుల తయారీకి సంబంధించిన ప్రముఖ కొఠారీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ స్వర్ణోత్సవాలను ఘనంగా జరుపుకుంది. కాన్పూర్‌లో జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా 'శూన్య సే గగన్' పేరుతో ఒక పుస్తకాన్ని ఆవిష్కరించింది. కొఠారీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకులు, మన్‌సుఖ్ భాయ్ కొఠారీ తన జీవితకాలంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలు లక్ష్యంగా పుస్తక రచన జరిగింది.

రూపాయి రికవరీ



14 పైసలు అప్; 82.99 వద్ద ముగింపు

న్యూఢిల్లీ: డాలరు మారకం విలువ తగ్గిన నేపథ్యంలో దేశీ కరెన్సీ రూపాయి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి నుంచి కోలుకుంది. డాలర్‌తో పోలిస్తే 14 పైసలు బలపడి, 82.99 వద్ద ముగిసింది. అమెరికా డాలరు బలహీనత దీనికి కారణం.

మళ్లీ జియో ఫైనాన్స్ డీలా

రెండో రోజూ 5% పతనం • ఎల్ఐసీకి 6.66% వాటా



ముంబై: వరుసగా రెండో రోజు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ కౌంటర్లో అమ్మకాలు ఊపందుకున్నాయి. దీంతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో మరోసారి 5 శాతం లోయర్ సర్క్యూట్‌ను తాకింది. బీఎస్ఈలో రూ. 12.5 కోల్పోయి రూ. 239 వద్ద నిలవగా.. ఎన్ఎస్ఈలోనూ ఇదే స్థాయి నష్టంతో రూ. 237 దిగువన స్థిరపడింది. సోమవారం సైతం ఈ షేరు 5 శాతం డౌన్ సర్క్యూట్‌ను తాకిన సంగతి తెలిసిందే. మాతృ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి ప్రత్యేక కంపెనీగా విడివడిన జియో ఫైనాన్షియల్ గత నెలలో జరిగిన ధర నిర్ధారణ ట్రేడింగ్‌లో రూ. 262 ధర వద్ద స్థిరపడింది. తదుపరి ఈ కౌంటర్లో స్టాక్ ఎక్స్చేంజీలు సోమవారం(21) నుంచి 10 రోజులపాటు ట్రేడ్ ఫర్ ట్రేడ్ విభాగంలో సాధారణ ట్రేడింగ్‌కు తెరతీశాయి. ఫలితంగా రోజుకి 5 శాతం సర్క్యూట్ బ్రేకర్ అమలుకానుంది. తొలి రోజు 5 శాతం పతనమై రూ. 250 సమీపంలో నిలిచింది.


ఇండెక్సులలో..

ధరలో నిలకడను తీసుకురావడం, హెచ్చుతగ్గులను పరిమితం చేయడం వంటి లక్ష్యాలతో స్టాక్ ఎక్స్చేంజీలు జియో ఫైనాన్షియల్‌ను ప్రధాన ఇండెక్సులలో తాత్కాలికంగా భాగం చేశాయి. విలీనాలపై సవరించిన తాజా నిబంధనల అమలులో భాగంగా సెన్సెక్స్‌లో 31వ, నిఫ్టీలో 51వ షేరుగా ప్రస్తుతం కొనసాగుతోంది. నిజానికి ఈ షేరుని లిస్టింగ్ తదుపరి మూడు రోజులకు సెన్సెక్స్, నిఫ్టీల నుంచి తొలగించవలసి ఉంది. అయితే వరుసగా సర్క్యూట్ బ్రేకర్లను తాకడంతో ఈ షేరుని ఆగస్ట్ 29వరకూ సెన్సెక్స్, నిఫ్టీలలో కొనసాగించనున్నట్లు ఇండెక్సుల కమిటీ పేర్కొంది. అప్పటికి కూడా సర్క్యూట్ బ్రేకర్లను తాకడం కొనసాగితే.. మరోమారు ఇండెక్సుల నుంచి తొలగింపు వాయిదా పడవచ్చని సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

ఎల్ఐసీకి షేర్లు

ఫైనాన్షియల్ సర్వీసుల బిజినెస్‌లను జియో ఫైనాన్షియల్ పేరుతో రిలయన్స్ ఇండస్ట్రీస్ గత నెలలో ప్రత్యేక కంపెనీగా విడదీసింది. దీనిలో భాగంగా వాటాదారులకు ప్రతీ 1 ఆర్ఐఎల్ షేరుకిగాను 1 జియో ఫైనాన్షియల్‌ను కేటాయించింది. ఫలితంగా ఆర్ఐఎల్‌లోగల వాటాలకుగాను ఎన్‌బీఎఫ్‌సీ జియో ఫైనాన్షియల్‌లో 6.66 శాతం వాటాను పొందినట్లు ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ తాజాగా వెల్లడించింది.

ఆటుపోట్ల మధ్య మార్కెట్ అక్కడక్కడే



ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ 4 పాయింట్లు బలపడి 65,220 వద్ద నిలిచింది. 3 పాయింట్ల స్వల్ప లాభంతో నిఫ్టీ 19,346 వద్ద స్థిరపడింది. అంతకుముందు ఇంట్రాడేలో సెన్సెక్స్ 147 పాయింట్ల వరకూ పుంజుకుని 65,396కు చేరింది. నిఫ్టీ సైతం 19,443-19,381 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. యూఎస్‌లో వడ్డీ రేట్ల పెంపు అంచనాలు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు సెంటిమెంటును బలహీనపరచినట్లు నిపుణులు పేర్కొన్నారు. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 1 శాతం స్థాయిలో పుంజుకున్నాయి. ట్రేడైన షేర్లలో 2,165 లాభపడితే 1503 డీలాపడ్డాయి.

పిరమిడ్ టెక్నో ఐపీవో సక్సెస్

ఇండస్ట్రియల్ ప్యాకేజింగ్ కంపెనీ పిరమిడ్ టెక్నోప్లాస్ట్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు మంగళవారాని(22)కల్లా 18 రెట్లు పైగా సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం 75.6 లక్షల షేర్లను ఆఫర్ చేయగా.. దాదాపు 13.83 కోట్ల షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. ఈ ఆఫర్‌తో కంపెనీ రూ. 153 కోట్లు సమకూర్చుకుంది.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

హెచ్ఏఎల్ నాసిక్‌లో 647 అప్రెంటిస్‌లు

మహారాష్ట్ర నాసిక్‌లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. ఎయిర్‌క్రాఫ్ట్ డివిజన్ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ స్ట్రీమ్‌లో అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 647
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-186, డిప్లొమా అప్రెంటిస్-111,ఐటీఐ అప్రెంటిస్-350
» **ట్రేడ్/విభాగాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: ఏరోనాటికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, మెకానికల్ ఇంజనీరింగ్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఆర్ట్స్, కామర్స్, సైన్స్, ఫార్మసీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్.
» **డిప్లొమా అప్రెంటిస్:** ఏరోనాటికల్ ఇంజనీర్, సివిల్ ఇంజనీర్,కంప్యూటర్ ఇంజనీర్,ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్, మెకానికల్ ఇంజనీర్, ల్యాబ్ అసిస్టెంట్, హోటల్ మేనేజ్‌మెంట్, నర్సింగ్ అసిస్టెంట్.
» **ఐటీఐ అప్రెంటిస్:** ఫిట్టర్, టూల్ అండ్ డై మేకర్, టర్నర్, మెషినిస్ట్, కార్పెంటర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, పెయింటర్, షీట్ మెటల్ వర్కర్, మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, వెల్డర్, స్టెనోగ్రాఫర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్‌లకు రూ.9000, డిప్లొమాకు రూ.8000, ఐటీఐకు రూ.8000.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.08.2023.
» **డాక్యుమెంట్ వెరిఫికేషన్ తేదీలు:** 04.09.2023 నుంచి 16.09.2023 వరకు.
» **వెబ్‌సైట్:** halindia.co.in

బెల్ బెంగళూరులో 63 ఉద్యోగాలు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 63
» **పోస్టుల వివరాలు:** ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ-16, టెక్నీషియన్ సి-44, జూనియర్ అసిస్టెంట్-03.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్, సివిల్, ఫిట్టర్, ఎలక్ట్రికల్, బీకామ్/బీబీఎం/ఎలక్ట్రానిక్ మెకానిక్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎస్ఎస్ఎల్‌సీ /ఐటీఐ/బీకామ్/బీబీఎం /ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 28 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.21,500 నుంచి రూ.90,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.09.2023.
» **వెబ్‌సైట్:** www.bel-india.in

బెల్ పంచకులలో 57 ఇంజనీర్ పోస్టులు

పంచకులలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్.. తాత్కాలిక ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 57
» **పోస్టుల వివరాలు:** ట్రైనీ ఇంజనీర్-36, ప్రాజెక్ట్ ఇంజనీర్/ఆఫీసర్-21.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్, హెచ్ఆర్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ, పీజీహెచ్ఆర్ఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ట్రైనీ ఇంజనీర్‌కు రూ.30,000 నుంచి రూ.40,000, ప్రాజెక్ట్ ఇంజనీర్/ఆఫీసర్‌కు రూ.40,000 నుంచి రూ.55,000 చెల్లిస్తారు.
» **వయసు:**01.08.2023నాటికి ట్రైనీ ఇంజనీర్‌కు 28 ఏళ్లు,ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు 32ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:**రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, దరఖాస్తులకు చివరితేది:** 26.08.2023.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

ఎన్‌జీఆర్ఐ, హైదరాబాద్‌లో 14 ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌జీఆర్ఐ).. ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్-02, ప్రాజెక్ట్ అసోసియేట్-12.
» **విభాగాలు:** మైక్రో ఎర్త్‌క్వేక్ మానిటరింగ్,అటామిక్ పవర్, మినరల్ అండ్ బల్క్ కెమిస్ట్రీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజనీరింగ్ డిప్లొమా/ఎంఎస్సీ/ఎంటెక్/ఎంఎస్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 35ఏళ్ల నుంచి 50 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.20,000 నుంచి రూ.35,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **ఇంటర్వ్యూ వేదిక:** సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఉప్పల్ రోడ్, హైదరాబాద్, తెలంగాణ-500007.
» **ఇంటర్వ్యూ తేది:** 21.08.2023 నుంచి 28.08.2023 వరకు. » **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 8.30 నుంచి 10 వరకు.
» **వెబ్‌సైట్:** www.ngri.res.in

ఇంటర్‌తో.. సెంట్రల్ జాబ్

ఇంటర్మీడియెట్‌తోనే కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకునేందుకు చక్కటి అవకాశం!స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ).. తాజాగా కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో మొత్తం 1,207 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా స్టెనోగ్రాఫర్ పోస్టులకు నియామక ప్రక్రియ చేపట్టనుంది.ఈ నేపథ్యంలో..ఎస్ఎస్సీ స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సి,డి ఎగ్జామినేషన్-2023 వివరాలు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» కేంద్ర ప్రభుత్వ శాఖల్లో స్టెనో పోస్టులకు నోటిఫికేషన్
» గ్రేడ్-సి, గ్రేడ్-డి స్థాయిలో 1,207 కొలువులు
» ఇంటర్మీడియెట్ అర్హతతో పోటీ పడే అవకాశం
» రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక



స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. సంక్షిప్తంగా ఎస్ఎస్సీ. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసి, ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది. ఇటీవల స్టెనోగ్రాఫర్ గ్రేడ్-సి, గ్రేడ్-డి పోస్టుల భర్తీకి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది.

మొత్తం 1,204 పోస్టులు

ఎస్ఎస్సీ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం-గ్రేడ్-సి, గ్రేడ్-డి స్థాయిలో మొత్తం 1,204 స్టెనోగ్రాఫర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో గ్రేడ్-సి హోదాలో 12 శాఖలు/విభాగాల్లో 49 పోస్టులు, గ్రేడ్-డి హోదాలో 37 విభాగాలు/శాఖల్లో 1,114 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

23.08.2023 నాటికి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

ఆగస్టు 1, 2023 నాటికి గ్రేడ్-సి పోస్టులకు 18-30 ఏళ్లు; గ్రేడ్-డి పోస్టులకు 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

షార్ట్‌హ్యాండ్ అవసరం లేదు

స్టెనోగ్రాఫర్ ఉద్యోగం, విధులను పరిగణనలోకి తీసుకుంటే.. షార్ట్‌హ్యాండ్/ టైపింగ్‌లో ఉత్తీర్ణత ఉండాలని భావిస్తారు. ఎస్ఎస్సీ తాజా నోటిఫికేషన్‌లో ఇలాంటి అర్హత నిబంధన ఏదీ లేదు. కాని ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించే స్కిల్ టెస్ట్‌లో మాత్రం స్టెనోగ్రఫీ టెస్ట్ ఉంటుంది.

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఎస్ఎస్సీ స్టెనోగ్రాఫర్ గ్రేడ్-సి, గ్రేడ్-డి పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియను రెండు దశల్లో నిర్వహిస్తారు. అవి..రాత పరీక్ష, స్కిల్ టెస్ట్. నియామకాలు ఖరారు చేసే క్రమంలో రాత పరీక్షలో ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు. స్కిల్ టెస్ట్‌లోనూ నిర్దేశిత మార్కుల విధానాన్ని అనుసరిస్తారు. ఈ రెండింటినీ క్రోడీకరించి తుది జాబితా రూపొందించి ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష.. 200 మార్కులు

ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష మూడు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 ప్రశ్నలు-50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ 100 ప్రశ్నలు-100 మార్కులు.. ఇలా మొత్తం 200 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో అడుగుతారు. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కులు కోత విధిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.

తదుపరి దశ.. స్కిల్ టెస్ట్

- రాత పరీక్ష తర్వాత దశలో నిర్వహించే పరీక్ష.. స్కిల్ టెస్ట్. ఇందులో అభ్యర్థులకు ఇంగ్లిష్, హిందీ భాషల్లో స్టెనోగ్రఫీ టెస్ట్ ఉంటుంది.
- ఇంగ్లిష్ భాషలో నిమిషానికి 100 పదాలు, హిందీ భాషలో నిమిషానికి 80 పదాలు ప్రాతిపదికగా డిక్టేషన్ ఇస్తారు. అభ్యర్థులు ఆ డిక్టేషన్‌ను నోట్ చేసుకుని.. దాన్ని కంప్యూటర్‌పై క్షుణ్నంగా టైప్ చేయాల్సి ఉంటుంది.
- ఇంగ్లిష్ కంప్యూటర్ టైపింగ్‌కు సంబంధించి స్టెనోగ్రాఫర్ గ్రేడ్-డి పోస్టుల అభ్యర్థులు 50 నిమిషాల్లో, గ్రేడ్-సి పోస్టుల అభ్యర్థులు 40 నిమిషాల్లో సదరు డిక్టేషన్ టైపింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది.
- హిందీకి సంబంధించి స్టెనోగ్రాఫర్ గ్రేడ్-డి అభ్యర్థులు 65 నిమిషాల్లో, గ్రేడ్-సి అభ్యర్థులు 55 నిమిషాల్లో.. సదరు డిక్టేషన్‌ను క్యంపూటర్‌పై టైపింగ్ చేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమ భాష ప్రాధాన్యాన్ని పేర్కొనాల్సి ఉంటుంది.

గెజిటెడ్ హోదా

స్టెనో గ్రాఫర్ గ్రేడ్-సి(గ్రూప్-బి నాన్ గెజిటెడ్), స్టెనోగ్రాఫర్ గ్రేడ్-డి(గ్రూప్-సి) పోస్ట్‌లకు ఎంపికైన వారు భవిష్యత్తులో పదోన్నతుల ద్వారా గెజిటెడ్ హోదాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఆయా శాఖల్లో సూపరింటెండెంట్ స్థాయి వరకు పదోన్నతులు లభిస్తాయి. ప్రారంభంలో గ్రేడ్-సి ఉద్యోగాలకు నెలకు రూ.9,300 - రూ.34,800 వేతన శ్రేణి, గ్రేడ్-డి పోస్టులకు నెలకు రూ.5,200 -రూ.20,200 వేతన శ్రేణి లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 23.08.2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** ఆగస్ట్ 24, 25 తేదీల్లో
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in

ప్రాక్టీస్‌తో సక్సెస్

ఎంపిక ప్రక్రియలో రాత పరీక్షలో ప్రతిభే కీలకం కానుంది. కాబట్టి అభ్యర్థులు సిలబస్ అంశాలను సమగ్రంగా పరిశీలించి పూర్తి స్థాయిలో ప్రిపరేషన్‌పై దృష్టిపెట్టాలి. కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవడంతోపాటు ఎక్కువగా ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఈ విభాగంలో వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో రాణించాలంటే.. సిరీస్(నంబర్/ఆల్ఫా న్యూమరిక్), అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాజిజమ్, మ్యాట్రిక్స్, డైరెక్షన్, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్ (వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్-డీకోడింగ్ అంశాలపై పట్టు సాధించాలి. అర్థగణిత అంశాలైన సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్, లాభ నష్టాలు, ప్రాఫిట్ అండ్ లాస్, శాతాలను ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా త్రికోణమితి, అల్జీబ్రా, జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్‌లో జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ విభాగాలపై పట్టు సాధించాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. జాగ్రఫీలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక వాణిజ్య రంగాల్లో కీలక పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పదజాలంపైనా పట్టు సాధించాలి.

ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. స్టాక్ జీకేలో ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు-వాటి తీర్మానాలు, అవార్డులు-విజేతలు వంటి సమాచారాన్ని ఔపోసన పట్టాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్

ఇందులో ముఖ్యంగా బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్, స్పెల్లింగ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. కాంప్రహెన్షన్‌కు సంబంధించి పేరా రీడింగ్‌పై పట్టు సాధించాలి. దినపత్రికలోని ఎడిటోరియల్స్, ముఖ్యాంశాలతో కూడిన వ్యాసాలను చదవాలి.

స్కిల్ టెస్ట్‌కు సంసిద్ధంగా

అభ్యర్థులు స్కిల్ టెస్ట్‌కు కూడా సంసిద్ధత పొందాలి. ఇందుకోసం ప్రతి రోజు నిర్దేశిత సమయంలో ప్రాక్టీస్ చేయాలి. ఆడియో, వీడియో మాధ్యమాల ద్వారా వ్యాఖ్యానాలను పది నిమిషాల్లో రాసుకుని.. వాటిని పరీక్షకు నిర్దేశించిన సమయంలో టైప్ చేయడాన్ని ప్రాక్టీస్ చేయాలి. ఇలా మొదటి నుంచే ప్రాక్టీస్ చేస్తే.. స్కిల్ టెస్ట్ సమయానికి పూర్తి సంసిద్ధత లభిస్తుంది.

క్లుప్తంగా...

అరసం జాతీయ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



సాక్షి, అమరావతి: అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడిగా పెనుగొండ లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఈ నెల 20 నుంచి జరుగుతున్న అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం 18వ జాతీయ మహాసభల్లో ఆయనకు ఈ అరుదైన గౌరవం దక్కింది. లక్ష్మీనారాయణ 45ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘంలో వివిధ హోదాల్లో సేవలందించారు. సోమవారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో లక్ష్మీనారాయణను జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అరసం రాష్ట్ర అధ్యక్షుడు రాచపాళెం, ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్‌లు జాతీయ కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

బీఎస్ఎన్ఎల్‌లో డిజిటలైజేషన్

సాక్షి, అమరావతి/మధురానగర్ (విజయవాడ సెంట్రల్): బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తమ సిమ్‌ను కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంటనే కేవైసీ ద్వారా డిజిటలైజేషన్ చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ బుంగా.రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పేపర్ అప్లికేషన్ ద్వారా సిమ్‌ను పొందిన వినియోగదారులు సమీపంలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా కేంద్రం లేదా ఫ్రాంచైజీ, రిటైలర్‌ను తమ ఆధార్ కార్డ్‌తో సంప్రదించాలని సూచించారు. 4జీ సాంకేతికతను రానున్న రెండు నెలల్లో దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ ప్రవేశపెడుతున్నదని పేర్కొన్నారు. పాత 3జీ సిమ్ వాడుతున్న వారు తమ సిమ్‌ను తప్పనిసరిగా 4జీ సిమ్‌గా మార్చుకోవాలని సూచించారు. తమ మొబైల్‌లో ఉన్న సిమ్ 3జీ లేదా 4జీ సిమ్ అనేది తెలుసుకోవడానికి తమ మొబైల్ నుంచి SIM అని టైప్ చేసి 9441299999కు మెసేజ్ పంపి వెంటనే తెలుసుకోవచ్చునని వివరించారు.

దేశంలోనే విశాఖ స్టీల్‌ప్లాంట్ అత్యుత్తమం

కేంద్ర ఉక్కు కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హా



స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగాన్ని పరిశీలిస్తున్న ఉక్కు కార్యదర్శి నరేంద్ర నాథ్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ దేశంలోనే అత్యుత్తమ స్టీల్ ప్లాంట్‌గా తన ఉత్పాదకతను పెంచుకుంటుందని కేంద్ర ఉక్కు కార్యదర్శి నాగేంద్ర నాథ్ సిన్హా ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించారు. మధ్యాహ్నం ఉక్కు పరిపాలన భవనంలో ఉక్కు యాజమాన్యం అందజేసిన కార్పొరేట్ ప్రజంటేషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఉక్కు అధికారుల సంఘం, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్లతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. అంతకు ముందు ఆయన కోక్ ఓవెన్స్ ఐదో బ్యాటరీ, బీఎఫ్-2,3, ఎస్.ఎం.ఎస్-2, కొత్త ఎయిర్ సెపరేషన్ యూనిట్, వైర్ రాడ్ మిల్-2 తదితర ఉత్పత్తి యూనిట్లను సందర్శించారు.

ఇగ్నో ప్రవేశాలకు గడువు పొడిగింపు

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జూలై-2023 సెషన్ నిమిత్తం ఆన్‌లైన్ ద్వారా జరిగే అడ్మిషన్లకు ఈ నెల 31వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం సంచాలకులు డాక్టర్ కె.సుమలత ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ రెండు, డిగ్రీ రెండు, మూడో సంవత్సరం, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు రీరిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 31వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు.

జనరిక్ మందులపై నాణ్యతా పర్యవేక్షణ పెంచాలి



సాక్షి, అమరావతి: జనరిక్ మందులపై నాణ్యతా పర్యవేక్షణ పెంచకుండా ఆ మందులనే రోగులకు సూచించాలని నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నిబంధనలు విధించడం సరికాదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శరద్ కుమార్ అగర్వాల్ అన్నారు. ఈ అంశంపై ఇటీవల కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవీయాతో జరిగిన భేటీలో చర్చించామని తెలిపారు. ఐఎంఏ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి డాక్టర్స్ ఒలింపియాడ్ 2023ని ఈ ఏడాది నవంబర్ 22 నుంచి 26 వరకు విజయవాడలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ఇతర ప్రతినిధులతో కలిసి క్రీడల లోగోను మంగళవారం విజయవాడలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. వన్ నేషన్, వన్ డ్రగ్, వన్ ప్రైస్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెడితే మంచిదేనన్నారు. తొలుత దేశంలో జనరిక్ మందుల నాణ్యతను పర్యవేక్షించే వ్యవస్థను బలోపేతం చేసి అనంతరం ఆ మందులను మాత్రమే వాడాలన్న నిబంధనలు తెస్తే బాగుంటుందన్నారు.

అవును.. జగన్ మహిళా పక్షపాతే

- ఇచ్చిన హామీ మేరకు మహిళలపై ఉన్న రుణాల భారాన్ని చెల్లిస్తున్న జగన్ సర్కారు
- ఇప్పటికే మూడు విడతలుగా రూ.19,178 కోట్లు చెల్లింపు
- రుణాలు సకాలంలో చెల్లించిన వారి వడ్డీనీ చెల్లిస్తున్న ప్రభుత్వం
- 1.05 కోట్ల మంది రుణాలకు రూ.4,969.05 కోట్లు వడ్డీ చెల్లించిన జగన్ సర్కారు
- బాబు ప్రభుత్వం నిలిపివేసిన పథకానికి జగన్ ప్రభుత్వం కోత పెట్టిందనడం ఈనాడు మాత్రమే చెప్పగల అబద్ధం
- గత ప్రభుత్వ బకాయిలను పక్కన పెట్టేశారని ఈనాడు బుర్ర లేని కథనాలు



సాక్షి, అమరావతి : అవును.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతే. 'ఈనాడు' తనకు నచ్చలేదని 'పచ్చ'వాతం జబ్బుతో తప్పుడు రాతలు రాస్తే కాకుండాపోతారా! డ్వాక్రా (పొదుపు సంఘాల) మహిళల రుణాలన్నీ మాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చాక పైసా విదల్చకుండా రాష్ట్రంలో మహిళలను మోసం చేసింది టీడీపీ అధినేత చంద్రబాబు. డ్వాక్రా రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తానని, ఎవ్వరూ పైసా కట్టొద్దంటూ 2014 ఎన్నికలకు ముందు ఆయన ఇచ్చిన హామీని నమ్మి మహిళలు ఓట్లేశారు. అధికారంలోకి వచ్చాక ఆయన చేసిన మోసానికి బలైన పేదింటి మహిళలు వారు తీసుకున్న రుణాలపై ఐదేళ్ల పాటు వడ్డీలపై వడ్డీలు కట్టి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగిన 2019 ఏప్రిల్ 11 నాటికి మహిళల పేరిట ఉండే పొదుపు సంఘాల రుణాల మొత్తం రూ. 25,571 కోట్లు. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'వైఎస్సార్ ఆసరా' పథకం ద్వారా నాలుగు విడతల్లో నేరుగా ఆ మహిళలకు చెల్లిస్తున్నారు.

ఇంకొకటి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అమలులో ఉన్న పొదుపు సంఘాల సున్నా వడ్డీ పథకానికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పూర్తిగా మంగళం పాడేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పొదుపు సంఘాల సున్నా వడ్డీ పథకాన్ని పునరుద్ధరించారు. గత నాలుగేళ్లుగా సకాలంలో రుణాలు చెల్లించిన పొదుపు సంఘాల మహిళల వడ్డీని ఏ ఏడాదికి ఆ ఏడాదే వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ నాలుగేళ్లలో రూ. 4,969.05 కోట్లు వడ్డీని చెల్లించి, అక్కచెల్లెమ్మలపై భారాన్ని తగ్గించారు సీఎం వైఎస్ జగన్. అడుగడుగునా వంచించిన చంద్రబాబును మహిళా వ్యతిరేకిగా, అన్ని విధాలుగా ఆదుకొంటున్న సీఎం వైఎస్ జగన్ సర్కారును మహిళా పక్షపాత ప్రభుత్వంగా ఆ పేద మహిళలు ఎందుకు భావించకుండా ఉంటారు? డ్వాక్రా రుణాల మాఫీ, సున్నా వడ్డీ విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మాట తప్పి, అక్కచెల్లెమ్మలను మోసం చేసినా వైనాన్ని ఏ రోజూ ప్రశ్నించలేని 'ఈనాడు' పత్రిక.., ఇప్పుడు ఇచ్చిన హామీలను క్రమం తప్పకుండా అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లడమే పనిగా పెట్టుకొంది.



ఈనాడు ఆరోపణ: డ్వాక్రా సున్నా వడ్డీ కోత. టీడీపీ ప్రభుత్వంలో రూ. 5 లక్షల రుణం వరకు వర్తింపు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రూ. 3 లక్షలకు కుదింపు.

వాస్తవం: సున్నా వడ్డీ పథకానికి గత చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా మంగళం పాడేసింది. 2016 ఆగస్టు తర్వాత సకాలంలో రుణాలు చెల్లించిన పొదుపు సంఘాల మహిళలెవరికీ అప్పటి టీడీపీ ప్రభుత్వం సున్నా వడ్డీ పథకం ద్వారా వడ్డీ డబ్బు చెల్లించలేదు. మొత్తం ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు చివరి మూడేళ్లు పథకాన్ని చంద్రబాబు సర్కారు నిలిపివేసింది. టీడీపీ ప్రభుత్వం నిలిపివేసిన పథకానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోత పెట్టిందని రాయడం 'ఈనాడు' ప్రజలను వంచించడమే.

ఆరోపణ: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రుణ పరిమితిని తగ్గించింది

వాస్తవం: వైఎస్ జగన్ ప్రభుత్వం క్రమం తప్పకుండా సున్నా వడ్డీ సొమ్ము చెల్లిస్తుండటంతో గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన సంఘాలు తిరిగి క్రియాశీలకంగా మారాయి. మొండి బకాయిలు, నిరర్థక ఆస్తులు 18.36 శాతం నుంచి 0.33 శాతానికి తగ్గిపోయాయి. గత ప్రభుత్వంలో సి, డి గ్రేడ్‌లోకి దిగజారిన సంఘాలు జగనన్న ప్రభుత్వ సహకారంతో తిరిగి ఎ, బి' గ్రేడ్‌లోకి చేరాయి. మరోవైపు గత నాలుగేళ్లుగా ఏటా వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం లబ్ధిదారుల సంఖ్య కూడా పెరుగుతోంది.

ఆరోపణ: సున్నా వడ్డీ పథకంలోనూ కేంద్రం వాటా ఉంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సాయాన్ని ఎక్కడా ప్రస్తావించడం లేదు.

వాస్తవం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి ఈ నాలుగు సంవత్సరాలలో ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాలు బ్యాంకులకు కట్టవలసిన వడ్డీని వారి తరపున ప్రభుత్వమే భరిస్తోంది. ఇప్పటివరకు 1.05 కోట్ల మంది పేరిట ఉన్న 9.76 లక్షల పొదుపు సంఘాల రుణాలకు రూ.4,969.05 కోట్లు వడ్డీ భారం ఆ పేద మహిళల నెత్తిన పడకుండా ప్రభుత్వమే పూర్తిగా చెల్లించింది. రాష్ట్రంలోని పేద మహిళలపై ఒక్క పైసా భారం వేయలేదు.

ఆరోపణ: గత ప్రభుత్వం మహిళలకు చెల్లించాల్సిన బకాయిలను ఈ ప్రభుత్వం పక్కన పెట్టేయడం మహిళాపక్షపాతమా?

వాస్తవం: గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగిన 2019 ఏప్రిల్ 11వ తేదీకి పొదుపు సంఘాల పేరిట బ్యాంకుల్లో ఉండే అప్పులు మొత్తం సుమారు రూ. 25,571 కోట్లు. ఆ మొత్తాన్ని నాలుగు విడతల్లో ఆయా మహిళలందరికీ చెల్లించేలా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'వైఎస్సార్ ఆసరా' పథకం అమలు చేస్తోంది. అంటే, చంద్రబాబు 2014లో అధికారంలోకి రాగానే బేషరతుగా మాఫీ చేస్తానన్న రూ. 14 వేల కోట్ల అప్పులు, ఆ తర్వాత ఐదేళ్లలో వడ్డీలపై వడ్డీలు పెరిగి 2019 ఎన్నికల నాటికి ఆ అప్పుల మొత్తం రూ. 25,571 కోట్లు అయ్యాయి. ఈ మొత్తం అప్పటి చంద్రబాబు ప్రభుత్వం పేద మహిళలను మోసం చేసి ఎగ్గొట్టిందే. ఇందులో డ్వాక్రా మహిళల రుణ మొత్తాలతో పాటు ఆ ఐదేళ్లలో మహిళలపై వడ్డీ రూపంలో పెరిగిన అదనపు భారం కూడా ఉంది. సీఎం వైఎస్ జగన్ హామీ ఇచ్చిన విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి పొదుపు సంఘాల పేరిట బ్యాంకుల్లో ఉండే అప్పుల మొత్తం రూ. 25,571 కోట్లకు గాను ఇప్పటికే మూడు విడతల్లో రూ.19,178 కోట్లు చెల్లించింది. అలాంటప్పుడు.. గత ప్రభుత్వం మహిళలకు చెల్లించాల్సిన బకాయిలను ఈ ప్రభుత్వం పక్కన పెట్టేసిందన్న ఆరోపణే అబద్ధం. అయినా, రూ.2100 కోట్లు బకాయిలు ఎగవేత అని ప్రచురించడంలో 'ఈనాడు'కున్న 'పచ్చ'వాతం జబ్బును తెలియజేస్తోంది.

మహిళా సాధికారితకు ప్రభుత్వం పెద్దపీట

సెర్ప్ సీఈవో ఇంతియాజ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళా సాధికారితకు పెద్ద పీట వేస్తూ.. మహిళలే వివిధ రకాల జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రతి నెలా స్థిర ఆదాయం పొందేలా రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో ఎం.డి.ఇంతియాజ్ అన్నారు. మంగళవారం సెర్ప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నావడ్డీ, జగనన్న అమ్మ ఒడి పథకాలు సెర్ప్ ద్వారా విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. మహిళలకు నాలుగేళ్లలో కేవలం ఈ 4 పథకాల ద్వారా మాత్రమే రూ.64,343.33 కోట్ల లబ్ధిని ప్రభుత్వం అందించిందని వెల్లడించారు. మహిళలు బ్యాంకులు నుంచి తీసుకునే రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఆర్బీఐకి లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కారణంగా మహిళల రుణాలపై రెండున్నర శాతం నుంచి గరిష్టంగా ఆరున్నర శాతం వడ్డీరేట్లు తగ్గాయని వివరించారు. మరోవైపు.. గడిచిన నాలుగేళ్లలో మహిళా సంఘాలు తమ రుణాలపై బ్యాంకులకు కట్టాల్సిన వడ్డీని ప్రభుత్వమే భరించిందన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలతో గత ప్రభుత్వ సమయంలో నిర్వీర్యమైన పొదుపు సంఘాలు తిరిగి క్రియాశీలకంగా మారి మొండి బకాయిలు, నిరర్థక ఆస్తులు 18.36 నుంచి 0.33 శాతానికి తగ్గాయని తెలిపారు. గతంలో 'సి' 'డి' గ్రేడ్‌లోకి దిగజారిన సంఘాలు సున్నావడ్డీ, ఆసరా, చేయూత పథకాలతో తిరిగి 'ఎ' 'బి' గ్రేడ్‌లోకి చేరాయన్నారు. అంతేగాక గతంలో 8.71 లక్షలుగా ఉన్న స్వయం సహాయక సంఘాల సంఖ్య ప్రస్తుతం 11.16 లక్షలకు పెరిగిందని చెప్పారు. తీసుకున్న రుణాలను మన సంఘాలు నూటికి 99.55 శాతం తిరిగి బ్యాంకులకు చెల్లిస్తుండడంతో.. రికవరీలో దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ముందుగానే సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని ఇంతియాజ్ వివరించారు.

త్వరలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పేరు మార్పు



ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో మాట్లాడుతున్న బండి శ్రీనివాసరావు

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు వెల్లడి
- గెజిటెడ్ అధికారులకూ సభ్యత్వం ఇవ్వనున్నట్లు ప్రకటన
- ముగిసిన అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

సాక్షి, అమరావతి: ఇప్పటివరకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌గా ఉన్న తమ సంఘం పేరును త్వరలో ఏపీ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ (ఎన్‌జీజీవో) అసోసియేషన్‌గా మార్పు చేయనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ప్రకటించారు. సంఘం రాష్ట్ర 21వ కౌన్సిల్ సమావేశాల్లో రెండో రోజు ఆయన మాట్లాడారు. సంఘం పేరు మార్చేందుకు తీర్మానం చేసినట్లు చెప్పారు. గెజిటెడ్ అధికారులకు సంఘంలో సభ్యత్వం ఇచ్చేందుకు అనుగుణంగా ఈ మార్పు చేసినట్లు తెలిపారు. గతంలో తమ సంఘంలో ఉన్న ఉద్యోగులు కొందరు గెజిటెడ్ ఆఫీసర్ ర్యాంకులోకి వెళ్లారని, దీంతో వారిని కూడా సంఘంలో చేర్చుకోవాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ప్రభుత్వం ముందు ఉంచామని, వీలైనంత వేగంగా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చిందని వెల్లడించారు. ప్రభుత్వంతో సామరస్యంగా ఉండి డిమాండ్లను సాధించుకుంటామన్నారు. సంఘం నిర్వహించే మహాసభలకు ముఖ్యమంత్రిని ఆహ్వానించడం 7 దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోందని, అందులో భాగంగానే సీఎం జగన్‌ను ఆహ్వానించామని చెప్పారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించేందుకు ప్రభుత్వం అంగీకరించడం శుభ పరిణామమన్నారు. కౌన్సిల్ సమావేశాల ముగింపు సందర్భంగా జిల్లాల పునర్విభజనతో కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు కొత్త కార్యవర్గాలను ఎన్నుకోవాలని, మరింత మంది మహిళలకు నూతన కార్యవర్గంలో చోటు కల్పించాలని తీర్మానించారు. ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు సురేష్ లాంబ, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో 'పాంగోలిన్'

ఆత్మకూరు రూరల్:నల్లమలలో జీవించే అరుదైన వన్యప్రాణి పాంగోలిన్ కర్నూలు జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని నల్లకాల్వ-కరివేన గ్రామాల మధ్యనున్న పంట పొలాల్లో మంగళవారం ప్రత్యక్షమైంది. పొలానికి వెళ్లిన రైతుకు ఈ వన్యప్రాణి కనిపించడంతో ఆయన అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో వారు స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణి వైద్యులు డాక్టర్ జుబేర్ ఆధ్వర్యంలో పాంగోలిన్‌కు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం పాంగోలిన్‌ను బైర్లూటి వన్యప్రాణి వైద్యశాలలో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. పరిశీలన అనంతరం పాంగోలిన్‌ను అడవిలో వదులుతామని ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ అలాన్ చోంగ్ టెరాన్ తెలిపారు. చీమలు, చెద పురుగులను తిని జీవించే పాంగోలిన్ పుట్టలు వెతుకుతూ అడవులను వీడి గ్రామాల బాట పట్టి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.



అటవీ అధికారుల సంరక్షణలో ఉన్న పాంగోలిన్

అరకు కాఫీ భలే టేస్ట్ గురూ..!



ప్రముఖ పర్యాటక కేంద్రమైన అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి కాఫీ తోటల వద్ద మంగళవారం ఓ వానరం పర్యాటకుడు కప్పుతో ఇచ్చిన కాఫీని హుందాగా తాగుతూ అలరించింది. ఈ దృశ్యాన్ని అక్కడ ఉన్నవారంతా ఎంతో ఆసక్తిగా తిలకించారు. వానరాల విన్యాసం చూసి చిరునవ్వులు చిందించారు.

– అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అనంతగిరి కాఫీ తోటల వద్ద కాఫీ తాగుతున్న వానరం...

ప్రజాస్వామ్యం బలోపేతంలో ఎమ్మెల్యేలే కీలకం

స్పీకర్ తమ్మినేని



సాక్షి, అమరావతి : ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఎమ్మెల్యేలు కీలక పాత్ర పోషిస్తారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు వివిధ ఎన్నికల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేయడానికి వారే అర్హులని ఆయన తెలిపారు. 'ప్రజాస్వామ్య సంస్థల ద్వారా దేశాన్ని బలోపేతం చేయడంలో ప్రజాప్రతినిధుల పాత్ర' అనే అంశంపై మంగళవారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ తొమ్మిదో ఇండియా రీజియన్ కాన్ఫరెన్స్‌లో స్పీకర్ తమ్మినేని ప్రసంగిస్తూ 'ఇటీవల కాలంలో పాలక, ప్రతిపక్ష సభ్యులు శాసనసభ, పార్లమెంటులో గందరగోళం సృష్టిస్తున్నారు. ఇది ఎంత మాత్రం సమంజసం కాదు. శాసనసభ్యుని బాధ్యత శాసనం చేయడం.. ప్రజా సమస్యలపై చర్చించడం నిర్ణయం తీసుకోవడమే తప్ప సభకు అంతరాయం కలిగించడం కాదు. రాజకీయ నాయకులలో శాసన నిగ్రహాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది. అలాగే, మన ప్రజాప్రతినిధులు కొందరు శాసన వ్యవస్థలను అపహాస్యం చేస్తున్నారు. దీన్ని వీలైనంత త్వరగా సరిదిద్దాలి. అలాగే, వారు తమను ఎన్నుకున్న ప్రజలకు జవాబుదారీగా ఉండడంతోపాటు వివిధ ప్రాంతాలకు సంబంధించిన అంశాలను సభలో నిర్మాణాత్మక చర్చలు జరపాలి' అని వివరించారు.

యానాం రీజెన్సీకి పూర్వ వైభవం

ప్రారంభం దిశగా సిరామిక్ పరిశ్రమ అడుగులు

- 11 ఏళ్ల నుంచి పునఃప్రారంభానికి ప్రయత్నాలు
- ఫలప్రదమైన చర్చలు.. కార్మికులకు సెటిల్‌మెంట్లు
- తొలి దశలో రూ.70 కోట్ల పెట్టుబడి
- గ్యాస్ కోసం గెయిల్‌తో సంప్రదింపులు
- అక్టోబర్ నాటికి అందుబాటులోకి తొలి పైప్‌లైన్




యానాంలోని రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలోని రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమ 11 ఏళ్ల తరువాత పునఃప్రారంభానికి సిద్ధమవుతోంది. 1985లో ఏర్పాటైన యానాం రీజెన్సీ 2012లో వివాదాల నేపథ్యంలో యాజమాన్యం లాక్ అవుట్ ప్రకటించింది. ఈ పరిణామంతో ఫ్యాక్టరీపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డునపడ్డాయి. అప్పటినుంచి ఫ్యాక్టరీని పునఃప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. 50 వేల జనాభా గల యానాం అభివృద్ధిలో రీజెన్సీ సిరామిక్స్ పాత్ర ఎంతో ఉంది. 1980వ దశకంలో సుమారు రూ.100 కోట్ల అంచనా వ్యయంతో జీఎన్ నాయుడు తదితరులు కలిసి ఈ పరిశ్రమ ఏర్పాటు చేశారు. అనతి కాలంలోనే దేశవ్యాప్తంగా మంచిపేరు సంపాదించి 1986–87 వరకు సిరామిక్స్ టైల్స్‌ను విదేశాలకు సైతం ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది. అప్పట్లో ఈ ఫ్యాక్టరీలో రోజుకు 26వేల చదరపు అడుగుల మేర టైల్స్ ఉత్పత్తి చేసేవారు. రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమతో యానాం, దాని సరిహద్దున మన రాష్ట్రంలోని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 6 వేల నుంచి 7 వేల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించింది. పరిశ్రమకు అనుబంధంగా సిరామిక్స్ టైల్స్ తయారీకి ఉపయోగపడే చిన్న తరహా పరిశ్రమలు, అట్టల తయారీ ఫ్యాక్టరీలను స్థాపించడంతో మహిళలకు ఉపాధి లభించింది.


విధ్వంసం నేపథ్యంలో మూత

వేతనాలు, పీఎఫ్ వంటి విషయాల్లో కార్మిక సంఘాలు, యాజమాన్యానికి మధ్య తలెత్తిన వివాదాల నేపథ్యంలో కార్మికులు ఆందోళనకు దిగారు. కార్మిక సంఘ ప్రతినిధి మచ్చా మురళీ మోహన్ యానాం పోలీస్ స్టేషన్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం.. అనంతరం 2012 జనవరి 27న కొందరు దుండగులు సృష్టించిన విధ్వంసం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనమైంది. ఫ్యాక్టరీని తగులబెట్టి ఫ్యాక్టరీ వైస్ చైర్మన్ కె.చంద్రశేఖర్‌ను హత్య చేశారు. నాటి విధ్వంసంతో ఫ్యాక్టరీకి రూ.300 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించింది. ఈ పరిణామాలతో యాజమాన్యం ఫ్యాక్టరీని లాక్‌అవుట్ చేసింది. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి వీధినపడ్డారు. కాగా.. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, రీజెన్సీ సీఎండీ గూడూరు నారయ్య నాయుడు, సీఈఓ, ఈడీ సత్యేంద్రప్రసాద్ తదితరులు మధ్య పలు దఫాలుగా జరిగిన చర్చలు ఫలించి ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి యాజమాన్యం ముందుకొచ్చింది. వివాదానికి ముందు కార్మికులకు చెల్లించాల్సిన సెటిల్‌మెంట్స్‌పై ఒక అంగీకారానికి వచ్చారు. ఫ్యాక్టరీకి సంబంధించి దనియాలతిప్పలో ఉన్న భూముల్లో కార్మికులకు ప్లాట్‌లు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. అక్టోబర్ నెలలో తొలివిడత రూ.70 కోట్ల పెట్టుబడితో ఉత్పత్తిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే విషయాన్ని రీజెన్సీ సీఈవో సత్యేంద్రప్రసాద్ 'సాక్షి' ప్రతినిధి వద్ద ధ్రువీకరించారు. మలి విడతలో 2025 మార్చి నాటికి మూడింతల రెట్టింపు ఉత్పత్తిని తీసుకురావాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు.



ఇటీవల ఫ్యాక్టరీ సీఎండీ జీఎన్ నాయుడుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్


రెండు నెలల్లో పునఃప్రారంభిస్తాం



విజయ దశమి సందర్భంగా పరిశ్రమను పునఃప్రారంభించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. ఉత్పత్తికి అవసరమైన గ్యాస్ కోసం గెయిల్‌ను అభ్యర్థించాం. ఈ విషయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కూడా నివేదించాం. కార్మికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్రమశిక్షణతో పనులు అప్పగించడమే కాకుండా సర్వీస్ కూడా చేస్తున్నాం.

– డాక్టర్ గుదారు నారయ్య నాయుడు, సీఎండీ, రీజెన్సీ సిరామిక్స్

11 ఏళ్ల కల నెరవేరుతోంది




యానాంలో పారిశ్రామిక రంగం పూర్వవైభవానికి రీజెన్సీ ఫ్యాక్టరీ మళ్లీ ప్రారంభించడం దోహదం చేస్తుంది. యాజమాన్యం ముందుకు రావడం శుభపరిణామం. వేలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వానికి జీఎస్టీ ద్వారా ఆదాయం సమకూరుతుంది.

– గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

దొంగ ఓట్ల పేరుతో బాబు కొత్త డ్రామా

- ఆయన ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు నమ్మరు
- ఈసీ ఆదేశాలతో ఓట్లపై ఇంటింటి సర్వే
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల వివరాలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘమే ఇప్పుడు ఇంటింటి సర్వే చేస్తోందని.. ఆ సర్వేలోనే దొంగ ఓట్లు, అసలు ఓట్ల సంగతేంటో తెలిసిందని.. అలాంటిది టీడీపీ అధినేత చంద్రబాబు దీనిపై కొత్తగా డ్రామాలాడటమేంటని ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. చంద్రబాబు ఎప్పుడూ ఏదో ఒక డ్రామా ఆడుతుంటాడు. అందులో భాగంగానే ఇప్పుడు ఈసీకి లేఖలు, ఢిల్లీ పర్యటనలు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ డేటాను టీడీపీ చౌర్యం చేసి, ఎలా దొరికిపోయిందో ప్రజలకు తెలుసు. చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఆయన మాటలు నమ్మే పరిస్థితిలేదు. బౌన్సర్లతో, కిరాయి జనంతో, రాజకీయ కూలీలతో లోకేశ్ చేసేది పాదయాత్ర ఎలా అవుతుంది?

ధర్మ ప్రచార పర్యవేక్షణకు ఏడుగురితో కమిటీ..

సనాతన హిందూ ధర్మం ప్రాముఖ్యతను, ప్రాశస్త్యాన్ని నేటి యువతకు తెలియజేయాలనే లక్ష్యంతో ఈనెల 6న అన్నవరంలో ప్రారంభమైన ధర్మ ప్రచార కార్యక్రమం అన్నిచోట్లా కొనసాగుతాయి. ఈ ధర్మ ప్రచార కార్యక్రమాల అమలు పర్యవేక్షణకు ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించాం. అలాగే, ఐదు లక్షలలోపు ఆదాయం ఉండే ఆలయాల నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు ఇప్పటివరకు వంశపారంపర్య ధర్మకర్తలు లేదా అర్చకుల నుంచి 37 దరఖాస్తులు అందాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943



సౌజన్యకు న్యాయం కోసం

దక్షిణ కన్నడ జిల్లాలో విద్యార్థిని సౌజన్య హత్య కేసులో దోషులను శిక్షిం చాలని బెంగళూరులో మహిళా సంఘాల ధర్నా

న్యూస్‌రీల్

భారీగా విదేశీ సిగరెట్లు సీజ్



దొరికిన విదేశీ సిగరెట్లు

దొడ్డబళ్లాపురం: విమానంలో అక్రమంగా తీసు కొచ్చిన విదేశీ సిగరెట్లను కెంపేగౌడ ఎయిర్ పోర్టులో కస్టమ్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేసారు. సోమవారం రాత్రి 10:30 గంటల సమయంలో బ్యాంకాక్ నుంచి బెంగళూరుకు విమానంలో వచ్చిన ఒక ప్రయాణికుడు 48,000 సిగరెట్ ప్యాక్‌లను లగేజీలో తెచ్చాడు. బయటకు వెళ్లడానికి ప్రయత్నిస్తూ కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డాడు. రూ.8.16 లక్షల విలువైన విదేశీ బ్రాండ్ సిగరెట్ పాకెట్లు లభిం చాయి. అతన్ని అరెస్టు చేసి విచారణ చేప ట్టారు.

మైసూరు- చెన్నై మధ్య డిసెంబర్లో శతాబ్ది

మైసూరు: మైసూరు- చెన్నై మధ్య శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలు త్వరలో పరుగులు తీయనుం ది. డిసెంబర్ 20 నుంచి ఈ సేవలు ప్రారం భమవుతాయని సంబంధిత అధికారులు తెలి పారు. రైలు సంఖ్య 12007/12008, ఈ రైలు వారంలో ఆరు రోజుల పాటు రాకపోకలు సాగి స్తుంది. గురువారం అందుబాటులో ఉండదు. మైసూరు-చెన్నై నగరాల ప్రయాణికుల సౌక ర్యార్థం శతాబ్ది సేవలు అందుబాటులోకి తీసు కువస్తున్నట్లు అధికారులు తెలిపారు.

డిప్యూటీ సీఎంకు జరిమానా

శివాజీనగర: నగరంలో కేపీసీసీ కార్యాలయం ముందు అనధికారికంగా బ్యానర్ ఏర్పాటు చేసిన కేసులో కేపీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు బీబీఎంపీ రూ.50 వేలు జరిమానా విధించింది. దేవరాజ అరసు జయంతి సందర్భంగా ఆఫీసు ముందు డీకే ఫోటోతో బ్యానర్‌ను కట్టారు. దీనికి బీబీఎంపీ నుంచి అనుమతి పొందలేదు. వసంతనగర వార్డు రెవిన్యూ అధికారి కేపీసీసీ అధ్యక్షునికి రూ.50 వేలు జరిమానా విధించి, చెల్లించాలని ఆఫీసు సిబ్బందికి నోటీసు ఇచ్చారు.

ఇంట్లోనే గంజాయి సాగు



మొక్కలతో విశ్వనాథ్

మైసూరు: ఇంటి ఆవరణలో మొక్కల మధ్యలో గంజాయి మొక్కలను పెంచుతున్న యువ కున్ని హుణసూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. తట్టెకెరె గ్రామానికి చెందిన విశ్వనాథ్ గంజాయికి అలవాటు పడ్డాడు. దానిని కొనడా నికి డబ్బులు ఎక్కువ ఖర్చవుతాయని భావిం చి విత్తనాలను సంపాదించి ఇంటి ఆవరణలో మొక్కల మధ్య కుండీల్లో పెంచసాగాడు. మొక్కలు ఆరేడు అడుగుల ఎత్తు వరకూ ఎది గాయి. ఆ గంజాయిని మత్తు కోసం ఉపయో గించేవాడు. ఇది తెలిసి పోలీసులు తనిఖీలు చేయగా కొన్ని పెద్ద మొక్కలు కనిపించాయి. వాటిని పీకి తూకం వేయగా సుమారు 6 కిలోలు తూగాయి. నిందితున్ని అరెస్టు చేశారు.


స్కూలు వాహనాల సీజ్

శివాజీనగర: బడి విద్యార్థుల రవాణాకు అనుమతి లేని బస్సులు, వ్యాన్లను ఉపయోగించడంపై రవా ణా శాఖ అధికారుల దాడులు చేసి 15కు పైగా వాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. బెంగళూ రుతో సహా రాష్ట్రంలో తనిఖీలు నిర్వహించారు. అనేక వాహనాల్లో సీసీ కెమెరా, ప్రథమ చికిత్స పెట్టె, కిటికీలకు గ్రిల్ తదితర భద్రతా చర్యలే లేనట్లు గుర్తించారు. మరికొన్ని వాహనాలకు పర్మిట్లే లేవని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల పాఠశాల వాహనాలు సక్రమంగా ఉన్నాయో లేదో గమనించాలని సూచించారు.

దొంగతనం నెపం, డ్రైవర్ ఆత్మహత్య

బనశంకరి: తనపై దొంగతనం నెపం మోపారని కారు డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన బెం గళూరు పులకేశినగర పరిధిలో చోటుచేసుకుంది. కేరళకు చెందిన వర్గీస్ (43) మృతుడు. వివరా లు... ఏడాది క్రితం కేరళ నుంచి వచ్చిన వర్గీస్ పులకేశినగర గ్రీన్ అవెన్యూ అపార్టుమెంట్‌లో ఓ మహిళ వద్ద కారు డ్రైవర్‌గా చేరాడు. అదే అపార్టు మెంట్ టెర్రస్‌లో ఉంటున్నాడు. ఇటీవల ఇంటి యజమాని ఇంటిలో 250 గ్రాముల బంగారు నగలు చోరీ అయ్యాయి. వర్గీస్, మరో పనిమనిషి చోరీ చేశారని ఇంటి యజమానురాలు పోలీసు లకు ఫిర్యాదు చేశారు. ఇటీవల పోలీసులు వర్గీ స్‌ను పిలిపించి విచారణ చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వర్గీస్ తన ఆత్మహత్యకు ఇంటి యజమాని కారణమని డెత్‌నోట్ రాసి తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేప ట్టారు.

మండ్య సలసల



కేఆర్‌ఎస్ డ్యాం నుంచి వెళ్తున్న కావేరి జలాలు

- కావేరి నీటిని వదలరాదని హైవే ముట్టడి
- అడ్డుకున్న పోలీసులు, తోపులాట

మండ్య: జిల్లాలో ప్రముఖ కేఆర్‌ఎస్ జలాశయం నుంచి తమిళనాడు రాష్ట్రానికి కర్ణాటక ప్రభుత్వం కావేరి జలాలను విడుదల చేయడంపై రైతు సం ఘాలు నిరసనబాట పట్టాయి. కొన్నిరోజులుగా మోస్తరుగా సాగిన ధర్నాలు ఉధృతరూపం దాల్చాయి. నీటి విడుదల వ్యతిరేకిస్తూ రాష్ట్ర రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు మంగళవారం మండ్య నగరంలో భారీ ఆందోళన నిర్వహించడంతో ఉద్రిక్తత నెలకొంది. బెంగళూరు -మైసూరు హైవేని ముట్టడించారు.

సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు

జిల్లాలో కరువు పరిస్థితి నెలకొందని, తమ పంట లకే నీరు లేక అల్లాడుతుంటే కావేరి నీటిని వదిలే స్తారా? అని రైతులు ప్రశ్నించారు. జిల్లా నలుమూ లల నుంచి రైతులు, కార్యకర్తలు తరలివచ్చారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివ కుమార్, వ్యవసాయ మంత్రి చలువరాయస్వామికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ముసు ముందు నిరసనలను తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ ఆందోళనతో హైవేపై కొంత సేపు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ముందు జాగ్రత్తగా పెద్ద ఎత్తున మోహరించారు. రైతులు ఎద్దుల బండ్లలో జాతీయ రహదారిలో రావడంతో వారిని అడ్డుకోవడంతో కొంతసేపు తోపులాట జరిగింది. చివరకు రైతులను అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. రైతు నేతలు ఇం దువాళు చంద్రశేఖర్, మంజేష్‌గౌడ, సో.శి. ప్రకాశ్, బన్నూరు నారాయణ సహా వందలాదిగా రైతులు పాల్గొన్నారు.

ఆ రోజు మేకెదాటు అన్నారే: సీటీ రవి

శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ముఖ్య నాయకులు కలిసి మేకెదాటు ప్రాజెక్టును అమల చేయాలని కోరుతూ పాదయాత్రలు చేశారు. కానీ కోర్టు, ట్రిబ్యునల్ చెప్పడానికి ముందే కాంగ్రెస్ ప్రభుత్వం తమిళనాడుకు కావేరి నీటిని వదిలింది, నీటి కోసం పాదయాత్ర చేసిన మీరు ఇప్పుడు నీరు ఎలా విడుదల చేశారని బీజేపీ సీనియర్ నేత సీటీ రవి మండిపడ్డారు. మంగళవారం మండ్య బీజేపీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. శాస నసభ ఎన్నికలకు ముందు డీకే శివకుమార్, సిద్దరా మయ్య వంటివారు నమ్మ నీరు, నమ్మ హక్కు పేరుతో పాదయాత్ర చేశారన్నారు. ఇప్పుడు సుప్రీం కోర్టు ఆదేశాలు రాకముందే తమిళనాడుకు కావేరి నీటిని ఎలా వదిలారని, ఇది రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ద్రోహమని ఆరోపించారు. కావేరి అనేది కర్ణాటక స్వాభిమానం మాత్రమే కాదని, మం డ్య, మైసూరు, బెంగళూరు నగర ప్రజల జీవనాడి అన్నారు. కావేరి లేక పోతే బెంగళూరు మహా నగర ప్రజలకు తాగడానికి చుక్క నీరు దొరకదని అన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ మెప్పు పొందడానికి, స్టాలిన్ మద్దతు కోసం కావేరి నీటిని వదిలారని దుయ్యబ ట్టారు.



ఎద్దుల బండితో వస్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



రైతులు రాకుండా హైవేని బంద్ చేసిన పోలీసులు

కాలేజీ ఫెస్టివల్‌కు ముందు.. ప్రిన్సిపాల్ ఆత్మహత్య



ప్రిన్సిపాల్ నాగరాజు (ఫైల్)



విలపిస్తున్న ప్రిన్సిపాల్ సతీమణి

- బాగల్‌కోట జిల్లాలో విషాదం

యశవంతపుర: ఏం కష్టం వచ్చిందో కానీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కాలేజీ ఆవరణలో ఉరి వేసు కున్నారు. ఈ దారుణం బాగలకోట జిల్లా హునగుం ద పట్టణంలో జరిగింది. హునగుంద డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ నాగరాజు ముదగల్ (50) మంగళవారం తెల్లవారుజామున కాలేజీ ఆవరణలోని క్యాంటీన్ మెట్లకు తాడు కట్టి ఉరి వేసుకొన్న స్థితిలో శవమై తేలాడు.



సంఘటన జరిగిన క్యాంటీన్

అర్ధరాత్రి కళాశాలకు వెళ్లి

మంగళవారం కాలేజీ ఆవరణలో జరిగే జనపద జాతర హొన్న సంభ్రమ ఏర్పాట్లలో ఆయన తల మునకలయ్యారు. మరికొన్ని గంటల్లో వేడుకలు జరగాల్సి ఉంది. సోమవారం రాత్రి వరకూ ఏర్పాట్లు, అతిథుల ఆహ్వానంలో గడిపారు. అర్ధ రాత్రి 1 గంటకు బైక్ వేసుకుని ఇంటి నుంచి కాలేజీకి వచ్చారని ఆయన భార్య తెలిపారు. మళ్లీ 5 గం టలకు ఇంటికి తిరిగివచ్చి మొహం కడుక్కుని తిరిగి కాలేజీకి వెళ్లిపోయారని, ఇంతలోనే చనిపోయారని తెలిసిందని ఆమె విలపించారు. కాగా, ఆయన వద్ద ఎలాంటి డెత్‌నోట్ లభించలేదు. కళాశాలలో పని ఒత్తిడి ఉన్నట్లు బాధపడేవాడని సమాచారం. ఆత్మహత్యగా భావిస్తున్నారు. పట్టణ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ ఘోరంతో కాలేజ్ ఫెస్టివల్‌ను రద్దు చేశారు.

రాష్ట్రంలో సగానికి పైగా అనావృష్టి

- త్వరలో కరువు పరిశీలన
- రెవెన్యూ మంత్రి వెల్లడి

బనశంకరి: రాష్ట్రంలో 50 శాతానికి పైగా ప్రాంతంలో అనావృష్టి నెలకొంది. రానున్న రోజుల్లో వర్షం కురిసే సూచనలు లేవు, దీంతో పశువులకు మేత, జలాశయాల నీటి సేకరణ స్థితిగతులను సేకరిస్తు న్నామని రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టులో వర్షాలు పెద్దగా కురవలేదు, దీనిపై త్వరలో మం త్రుల సమావేశంలో చర్చిస్తాం. రాష్ట్రంలో 50 శాతా నికి పైగా వర్షం కొరత ఉందని అన్నారు. సెప్టెంబరు సాధారణ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. 140కి పైగా గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సర ఫరా చేస్తున్నామని, కరువు తాలూకాలుగా ప్రకటిం చాలనే డిమాండ్లు ఉన్నాయి. రాష్ట్రంలో ఆలమట్టి



జలాశయం మాత్రమే 100 శాతం భర్తీ అయ్యిందని తెలిపారు. కేంద్రం నిబంధనల ప్రకారం కరువు ప్రక టనకు పంటల సమీక్ష చేయాలన్నారు. పొలాలకు వెళ్లి నమూనాలను సేకరించాలని అధికారులకు సూచించామని, 120 తాలూకాల్లో పంట సమీక్ష చేసి 10 రోజుల్లోగా నివేదిక అందించాలని అధికారులకు సూచించామన్నారు. దీని ఆధారంగా కరువు ప్రకటన ప్రక్రియ చేపడతామని చెప్పారు.

ఆ రైతులకు ఓటీఎస్ పరిష్కారం

- సీఎం సిద్దు హామీ

శివాజీనగర: బళ్లారిలో కర్ణాటక గ్రామీణ బ్యాంకు నుండి పంట రుణాలు పొంది వెనుతిరిగి చెల్లిం చలేని పరిస్థితికి దారితీసిన రైతులకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద పరిష్కరించేందుకు సీఎం సిద్దరామయ్య హామీ ఇచ్చారు. రైతుల విష యమై మంగళవారం బెంగళూరులో సీఎంను ఎమ్మెల్యేలు బీ.ఆర్.పాటిల్ , దర్శన్ పుట్టణ్ణయ్య, రైతులు కలిసి చర్చించారు. ఓటీఎస్ ద్వారా పరి ష్కారం చేయాలని బ్యాంకులతో చర్చించాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశిస్తానని సీఎం చెప్పారు.

రూ. 30 వేలకు 30 లక్షలు కట్టాలట

బళ్లారి జిల్లాలో కర్ణాటక గ్రామీణ బ్యాంకు నుంచి రైతులు పంట రుణాలు పొందారు, అయితే తీవ్ర నష్టాల వల్ల సకాలంలో చెల్లించలేకపోయారు. వడ్డీలు, నోటీసు ఖర్చులు కలిపి రూ.30 వేల రుణా నికి రూ.30 లక్షలు చెల్లించాలని వేధిస్తున్నారని రైతులు వాపోయారు. దీనిపై 8 నెలల నుంచి ఆం దోళనలు చేస్తున్నట్లు తెలిపారు.

ఈశాలో నాగుల పంచమి



నాగపూజ చేస్తున్న దృశ్యం

చిక్కబళ్లాపురం: ఆవలగుర్కి సమీపంలోని ఈశా కేంద్రంలో సోమవారం సాయంత్రం నాగుల పంచమి సందర్భంగా నాగారాధన, నాగమం డల పూజలు చేశారు. ఆధ్యాత్మిక గురువు జగ్గి వాసుదేవ్ ఆధ్వర్యంలో ఉడుపి నుంచి వచ్చిన అర్చకులు నాగమండల పూజ చేశారు. కార్యక్ర మంలో మంత్రులు కేహెచ్ మునియప్ప, సుధా కర్, టీబీ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రమంతటా ధర్నాలు తప్పవు

తుమకూరు: కావేరి జలాశయం పరిధిలో వర్షాలు పడక ఇక్కడి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కూడా ప్రభుత్వం వారి బాధలను పట్టించుకోకుండా తమిళనాడుకు నీరు విడుదల చేసిందని, దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని రైతు సంఘం, హసిరుసేనె రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కోడిహళ్లి చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన తుమ కూరు నగరంలో జిల్లా రైతులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ...ఈ ఏడాది సరిగా వర్షాలు పడక జలాశయాల్లో నీరు లేదని, ఇక్కడి నీటి సమస్యను పట్టించుకోకుండా తమిళనా డుకు నీటిని వదలడం ఏమిటని ధ్వజమెత్తారు.

యువతిపై పడిన కరెంటు స్తంభం



స్కూటర్‌పై కుప్పకూలిన విద్యుత్ స్తంభం, ఆస్పత్రిలో స్ట్రెచర్‌లో తరలింపు

- తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలు

బనశంకరి: విద్యుత్ స్తంభం కూలిపడడంతో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన బెంగళూరు సుద్దగుంటెపాళ్య పరిధిలో జరిగిం ది. క్రైస్ట్ కాలేజీలో పీయూసీ చదువుతున్న ప్రియా (18) మంగళవారం మధ్యాహ్నం కాలేజీ ముగిం చుకుని స్కూటర్‌లో ఇంటికి బయలుదేరింది. రోడ్డు పక్కన విద్యుత్ స్తంభానికి కట్టిన కేబుల్ క్యాంటర్‌కు తగిలినప్పటికీ డ్రైవర్ వేగంగా వెళ్లిపో యాడు. దీంతో గట్టిగా లాగినట్లు కావడంతో కరెం టు స్తంభం విరిగి పడిపోయింది. అదే సమయం లో వస్తున్న ప్రియా మీద పడిపోవడంతో ఆమె తీవ్రంగా గాయపడింది, కరెంటు వైర్లు తాకి ఆమెకు షాక్ కూడా కొట్టింది. స్థానికులు ఆమెను కాపాడి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా నగరంలో కరెంటు వైర్లకు కుప్పలు కుప్పలుగా ప్రైవేటువారు కేబుళ్లను కట్టడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నా యని, పాలికె అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

సర్వే సూపర్‌వైజర్ ఇంటిలో సోదాలు





సర్వే సూపర్‌వైజర్ శ్రీనివాసమూర్తి, సోదాలు చేస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: అక్ర మాస్తులు కూడబె ట్టారనే ఆరోపణపై కృ ష్ణరాజపురం తాలూకా కార్యాలయం సర్వే సూపర్‌వైజర్ ఇంటిలో లోకాయుక్త అధికా రులు సోదాలు చేశారు. మంగళవారం తెల్లవారుజామున బెంగళూరు నగరంతో పాటు తుమకూరులోని పలు ప్రాంతాల్లో సర్వే సూపర్‌వైజర్ కేటీ శ్రీనివాసమూర్తికి సంబంధించిన ఇళ్లల్లో సోదాలు చేశారు. శ్రీనివాసమూర్తి ఐదు లిక్కర్ దుకాణాలకు అనుమతి తీసుకున్నట్లు ఆరోప ణలు ఉన్నాయి. దీంతో అధికారులు 14 ప్రాంతాల్లో సోదాలు చేశారు. భార్య పేరుపై ఉన్న హోటళ్లు, బోర్డింగ్ హౌజ్‌లో తనిఖీలు చేశారు. పూర్తి వివ రాలు తెలియాల్సి ఉంది.

ఆపరేషన్ హస్తం నా పని: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎస్ఎన్ నారాయణస్వామి

కేజీఎఫ్: ఆపరేషన్ హస్తం చేసి బీజేపీలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖు లను కాంగ్రెస్‌లోకి తీసుకు రావాలని పార్టీ హైక మాండ్ నాకు టాస్క్ ఇచ్చిందని, తాను ఆ ప్రయ త్నంలో ఉన్నానని బంగారుపేట ఎమ్మెల్యే ఎస్ ఎన్ నారాయణస్వామి తెలిపారు. మంగళవారం బంగా రుపేట తాలూకాలోని డీకే హళ్లి జీపీ అధ్యక్ష, ఉపా ధ్యక్షుల పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పలువురు ప్రము ఖులు గతంలో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి వెళ్లారు. వారితో తాను ఇప్పటికే చర్చలు జరుపుతున్నాన న్నారు. వారిని తిరిగి పార్టీలోకి తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. లోక్‌సభ సభ్యుడు ఎస్.మునిస్వామి తరచుగా తనపై ఆరోపణలు చేస్తూ మానసిక రోగిలా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సభ్యుల సహకారంతో జీపీలో అభివృద్ధి పనులను నిర్వహించాలని సూచించారు.



త్వరలో వర మహాలక్ష్మి పండుగ రానుంది. దీంతో మంగళవారం బెంగళూరు మల్లేశ్వరంలో లక్ష్మీదేవి విగ్రహాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

చంద్రయాన్ విజయానికి పూజలు



మైసూరు పంచముఖి ఆంజనేయ ఆలయంలో యాగం నిర్వహణ

మైసూరు: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చంద్రుని మీదకు పం పిన విక్రం ల్యాండర్ విజయవంతం కావాలని రాష్ట్రంలో పలుచోట్ల ఆలయాల్లో పూజలు, యాగాలు ప్రారంభించారు. మైసూరు జిల్లా బ్రాహ్మణుల సంఘం, అర్చకుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఇరి వ్స్ రోడ్డులో ఉన్న ప్రఖ్యాత శ్రీ పంచముఖి అంజనేయస్వామి ఆలయంలో సర్వసిద్ధి యాగం నిర్వహించారు. ల్యాండర్ సక్రమంగా చంద్రుని మీద దిగాలని పూజలు చేశారు.

నంజనగూడులో..

దక్షిణ కాశీగా పేరు పొందిన మైసూరు జిల్లాలోని నంజనగూడులో శ్రీనం జుండేశ్వరస్వామి ఆలయంలో స్థానిక కళాకారులు చంద్రయాన్ రాకెట్ బొ మ్మను ఉంచి పూజలు చేశారు. ఒక ఆర్ట్ స్టూడియో చిత్రకళా బృందానికి చెం దిన విద్యార్థులు దీనిని రూపొందించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు దీనిని ఆసక్తిగా చూశారు.

స్వదేశీ దర్శన్‌కు హంపీ ఎంపిక



హొసపేటె: కేంద్ర స్వదేశీ దర్శన్ 2.0కు హంపీ ఎంపికైంది. ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా భాసిల్లు తున్న హంపీని స్వదేశీ దర్శన్‌గా ప్రక టించడంపై పర్యాటకులకు ఎంతో ఆనందం కలిగించింది. రాష్ట్రంలో మైసూరుకు దక్కని ఈ స్వదేశీ దర్శన్ 2.0కు హంపీ ఎంపికవడంతో రానున్న రోజుల్లో హంపీ మరింత అభివృద్ధి చెందేందుకు అనుకూలం అవుతుంది.

క్లుప్తంగా

చంద్రయాన్‌పై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

హొసపేటె: చంద్రయాన్ ఉపగ్రహం సురక్షితంగా ల్యాండింగ్ కావడంపై మంగళవారం నగర మహిళా థియోసాఫికల్ కాలేజీ విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. యావత్ దేశ ప్రజల్లో చంద్రయాన్ ల్యాండింగ్ కుతూహలం రేకెత్తించిందన్నారు. ఎట్టకేలకు చంద్రయాన్ చంద్రమండలంలోకి అడుగు పెట్టడం యావత్ దేశ ప్రజలకు ఎంతో సంతోషం కలిగించిందన్నారు.

యోగా పోటీల్లో ప్రతిభ



పతకాలను అందుకొన్న విద్యార్థులు

కంప్లి: పట్టణంలోని యక్ష యోగా సంస్థ విద్యార్థులు గంగావతి కర్ణాటక యోగాసన క్రీడా సంస్థ, సంగాపుర జైన్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో కలబుర్గి విభాగ స్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వైఎస్. యోగేష్ ప్రథమ స్థానంతో రెండు బంగారు పతకాలు, ఎస్.నవ్య ద్వితీయస్థానంతో వెండి పతకం, ఎస్.పూజ తృతీయ స్థానంతో కాంస్య పతకాలను సాధించారు.

గణేష్‌కు శ్రావణ పూజలు



గణపతికి వెన్నతో అలంకరణ

బళ్లారిఅర్బన్: నగరంలోని 20వ వార్డు గణేష్ కాలనీలో వెలసిన వరసిద్ధి వినాయక ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా గణపతికి వెన్నతో అలంకరణ పూజలను నిర్వహించినట్లు దేవస్థాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య తెలిపారు.

అడవి జంతువుల దాడులు అరికట్టండి



అడవి జంతువుల దాడిలో దెబ్బ తిన్న మొక్కజొన్న పంట

కంప్లి: కూడ్లిగి తాలూకా అమరాపురలో రెండు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట ఏపుగా పెరిగి కంకి, గింజ దశకు చేరుకోగా ఎలుగుబంట్లు దాడి జరిపి పంటను ధ్వంసం చేశాయి. ఎలుగుబంట్లు, అడవి పందులు దాడి చేసి ఇలా పంటలను నాశనం చేయడంపై పలువురు రైతులు సందిగ్ధంలో ఉన్నారు. ఈనేపథ్యంలో అటవీ అధికారులు అడవి జంతువుల దాడులను అరికట్టి తమ పంటలను కాపాడాలని బాధిత రైతు మహిళ పరమేశ్వరమ్మ డిమాండ్ చేశారు.

హాస్టళ్లలో సౌకర్యాలపై ఆరా



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

హొసపేటె: విజయనగర జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో సౌకర్యాలపై మంగళవారం జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు హాస్టల్ వార్డెన్లను ఆరా తీశారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి కొరత కలగకుండా అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు గదుల్లో కాటేజ్ వ్యవస్థ, మంచినీరు, విద్యుత్‌తో పాటు అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో సౌకర్యాలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించండి

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో నీటి గేజ్‌ను కాపాడి చివరి ఆయకట్టుకు నీరందించాలని కాలువ పోరాట సమితి నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం సిరివార–అరకేర రోడ్డుపై ఆందోళన చేపట్టిన అధ్యక్షుడు శంకర్‌గౌడ మాట్లాడారు. 69వ మైలు వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించాలన్నారు. ఆయకట్టు చివరి భూములకు నీరందాలంటే గేజ్‌ను నిర్వహించాలన్నారు. ఈ విషయంలో ఇంజినీర్లు సక్రమంగా కాలువపై నీటి నిర్వహణ చేయాలని కోరుతూ జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకో చేపట్టడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురయ్యారు.

వాడీవేడిగా సిటీ కార్పొరేషన్ సమావేశం



పాల్గొన్న మేయర్ త్రివేణి, కమిషనర్ రుద్రేష్, సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న అధికార పార్టీ కార్పొరేటర్లు



మాట్లాడుతున్న విపక్ష కార్పొరేటర్ ఇబ్రహీంబాబు, సభ్యులు

- సమస్యలపై గళమెత్తిన అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు
- అధికారులపై విపక్ష కార్పొరేటర్ ఇబ్రహీంబాబు గరం

సాక్షి, బళ్లారి: జెడ్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సిటీ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో నగర సమస్యలపై వాడీవేడిగా చర్చ జరిగింది. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం 12.30 గంటలైనా ప్రారంభం కాకపోవడంతో ఎవరి రాక కోసం సమావేశం ఆలస్యంగా ప్రారంభిస్తున్నారని, మేయర్, ఉపమేయర్, కార్పొరేటర్లు వచ్చినా ఎందుకు సమావేశం ప్రారంభించడం లేదని ప్రతిపక్ష బీజేపీ కార్పొరేటర్ ఇబ్రహీంబాబు కమిషనర్‌పై మండిపడ్డారు. అనంతరం నగర సమస్యలపై ఒక్కసారిగా ప్రతిపక్ష సభ్యులు గళం విప్పడంతో సమావేశం అర్ధగంటకు పైగా బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు, అధికారుల వాదోపవాదాల మధ్య రసాభాసగా సాగింది. నగర సమస్యలపై చర్చించేందుకు తమను అనుమతించకపోతే సమావేశం నుంచి వాకౌట్ చేస్తామని బీజేపీ కార్పొరేటర్లు తేల్చిచెప్పారు. ప్రతిపక్ష కార్పొరేటర్లు హనుమంతప్ప, కే.ఎస్ అశోక్, కల్పన వెంకటరామిరెడ్డి, గోవిందరాజులు తదితరులు సమస్యలపై చర్చించారు.

నిధుల విడుదలలో వివక్ష వద్దు

నగరంలో మంచినీటి సమస్యపై ముఖ్యంగా వార్డులో అభివృద్ధి పనులకు నిధుల విడుదలలో అధికార, విపక్ష కార్పొరేటర్లు గెలిచిన వార్డుల్లో తారతమ్యం చేస్తున్నారన్నారు. అన్ని వార్డులకు సమానంగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్పొరేటర్ గాదెప్ప మాట్లాడుతూ ఎక్కడా తారతమ్యత చూపలేదని, అందరికీ సమానంగా నిధులు విడుదల చేశారని గుర్తు చేశారు. మంచినీటి సమస్య తీర్చడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ వివేక్(విక్కీ) మాట్లాడుతూ నగరంలో వీధికుక్కల స్వైర విహారం నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నగర కమిషనర్ రుద్రేష్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సుదీర్ఘంగా సమాధానం ఇస్తూనే ముందుగా పొందుపరిచిన అజెండాలోని అన్ని పనులకు సభ్యులతో పాస్..పాస్ అంటూ ఆమోద ముద్ర వేయించుకున్నారు.

అభివృద్ధిలో రాజకీయాలకు చోటు లేదు

కాగా ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాట్లాడుతూ నగరాభివృద్ధిలో రాజకీయాలు చేయనన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో వెనుకడుగు వేసే ప్రశ్నే లేదన్నారు. నగరం చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల పరిధిని కార్పొరేషన్‌లోకి చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాము కూడా కార్పొరేషన్ ఆస్తులను కాపాడటానికి మీకు పూర్తిగా సహకారం అందిస్తామని బీజేపీ కార్పొరేటర్లు మద్దతు తెలిపారు. 24 గంటల పాటు నగరంలో నిరంతరాయంగా నీరు సరఫరా చేసే ప్రక్రియను ప్రారంభించామని, దశలవారీగా అన్ని వార్డులకు నిరంతర నీటి సరఫరా అందజేస్తామన్నారు. దాదాపు మూడు గంటలకు పైగా జరిగిన కార్పొరేషన్ సమావేశం ప్రారంభంలో అధికార, విపక్ష సభ్యులు ఆగ్రహంగా మాట్లాడినా చివరకు శాంతించి నగర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో మేయర్ త్రివేణి, ఉపమేయర్, కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సిటీ ఎమ్మెల్యే కార్యాలయం ప్రారంభం

నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అధికారిక కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఆయన మంగళవారం సిటీ కార్పొరేషన్‌లో ఎమ్మెల్యేకు కేటాయించిన కార్యాలయంలో పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మేయర్ త్రివేణి, ఉపమేయర్‌తో పాటు కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నగర సమస్యలపై నేరుగా వచ్చి తనను కలిసి తెలియజేయవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కాకినాడ రైలును పునరుద్ధరించరూ

రాయచూరు రూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ నుంచి రాయచూరుకు గతంలో నడిపి నిలిపేసిన రైలు(నెం–07245–07246)ను పునరుద్ధరించాలని దక్షిణ మధ్య రైల్వే బోర్డు మాజీ సలహాదారుడు బాబూరావ్ విన్నవించారు. ఆయన ఈమేరకు మంగళవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈనెల 19న సికింద్రాబాద్‌లోని రైల్వే సీటీఓ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. మాన్వి, సింధనూరు, గంగావతి,శషాపుర, యాదగిరి ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు అధికంగా నివాసం ఉంటున్నారని, వారి ప్రయాణానికి అనుకూలమయ్యేలా రైలు సేవలను పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం విశాఖపట్నం నుంచి మహబూబ్ నగర్ వరకు నడుస్తున్న రైలు(08585–08586)ను రాయచూరు వరకు పొడిగించాలని కోరామన్నారు. గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, గుడివాడ, ద్రాక్షారామం, కాకినాడ వాసులు అధికంగా ఉన్నారని వారికి అనుకూలమయ్యే విధంగా రైలును నడపాలని తెలిపారు.



వినతిపత్రం సమర్పించిన బాబూరావ్

లోకాయుక్తకు ఫిర్యాదుల వెల్లువ

సిరుగుప్ప: నగరంలో మంగళవారం తాలూకా కార్యాలయ సభాంగణంలో లోకాయుక్త సీఐ సంగమేశ్ తాలూకా ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. కొన్నేళ్లుగా కాలువ నీటితో సాగు చేస్తు పంటలు పండించుకొనేవారిమని, కానీ ఇటీవల పక్కన ఉన్న పొలం రైతులు నరసప్ప, బజారప్ప తమ పొలానికి సాగునీరు వదలడం లేదని, సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం దొరకలేదని ఇటిగెహాళ్ గ్రామస్తురాలు లింగమ్మ విన్నవించారు. హచ్చొళ్లి సముదాయ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల కొరత నివారించాలని, సరిహద్దు ప్రాంత ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని రాజకుమార్ తెలిపారు. బీ.ఎం.సూగూరు గ్రామంలో మంచినీటి చెరువు మరమ్మతు పనులు చేసి నీటిని నింపాలని కోరారు. నగరంలోని డ్రైవర్స్ కాలనీలో సరిగా మంచినీరు సరఫరా కావడం లేదని, సంబంధితులపై చర్యలు చేపట్టాలని స్థానికులు నాగయ్యస్వామి, వీరేశప్ప ఫిర్యాదు చేశారు. అనేక సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆయా శాఖల నుంచి సమాచారం తెలుసుకొని సమస్యలను పరిష్కరిస్తామని లోకాయుక్త సీఐ సంగమేశ్ తెలిపారు. ఈసందర్భంగా గ్రేడ్–2 తహసీల్దార్ రత్నమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న లోకాయుక్త సీఐ సంగమేశ్

పోలీస్ కన్నుమూత

లేపాక్షి: ఏపీలో పుట్టపర్తి జిల్లా లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న జి.అంబాజి (53) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకు బీపీ, షుగర్ ఎక్కువ కావడంతో గత నాలుగు నెలలుగా వైద్యం చేయించుకున్నారు. ఆరోగ్యం విషమించడంతో అనంతపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. అంబాజీకి భార్యతో పాటు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని బంధువులు సొంతూరైన కలబుర్గికి తీసికెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

వర్షాలు లేక విద్యుత్ కోతలు: మంత్రి

హుబ్లీ: విద్యుత్ కోతలపై బీజేపీ నేత సీటీ రవి చేసిన ఆరోపణలపై ధార్వాడలో మంత్రి శివరాజ్ తంగడిగి మండిపడ్డారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. వర్షాలు లేని కారణంగా ఏ డ్యాం పూర్తిగా నిండలేదన్నారు. విద్యుత్ కోత తాత్కాలికం, దీనికి ప్రభుత్వాన్ని నిందించడం తగదన్నారు. విపక్ష నాయకులు తమ ప్రభుత్వ పాలనపై ఒకటి రెండేళ్ల సహనంతో వేచిచూడాలని ఆయన అన్నారు.

రక్షణ కోరిన ప్రేమజంట

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా చిరతగుండు గ్రామానికి చెందిన ప్రేమికులు కొట్రేష్, రాధిక గత ఏడేళ్లుగా ప్రేమించుకొన్నారు. కానీ రాధిక తమ తల్లిదండ్రులు వేరే అబ్బాయితో ఇష్టం లేని పెళ్లి చేశారని, ప్రస్తుతం తాను పెళ్లాడిన అబ్బాయికి చట్టం ప్రకారం విడాకులు ఇచ్చి ప్రేమించిన అబ్బాయిని పెళ్లి చేసుకొంటానని, అప్పటి వరకు తమకు రక్షణ కల్పించాలని ప్రియురాలు ఎస్పీ హరిబాబుకు విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ గ్రామంలో ఎంతో మంది ప్రేమికులు హత్యకు గురైన నేపథ్యంలో ప్రేమికులిద్దరిని పోలీసు బందోబస్తుతో స్వగ్రామానికి పంపించారు.



ఎస్పీకి వినతిపత్రం సమర్పించిన ప్రేమికులు

మెడికల్ కాలేజీ ఏర్పాటుకు నివేదిక ఇవ్వండి

- అధికారులకు జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి ఆదేశాలు

హొసపేటె: నూతన విజయనగర జిల్లాకు వైద్య కళాశాల మంజూరు కావాలన్నదే ప్రజలు, ప్రజాప్రతినిధుల కోరిక అని జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి కేపీ మోహన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రగతి సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లా ఆస్పత్రి, మాతా శిశు ఆస్పత్రిలో ఎన్ని పడకలున్నాయి. వైద్య కళాశాలకు ఎన్ని పడకలకు అనుమతి పొందవచ్చో సమాచారం ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. దీనిపై వైద్యారోగ్య శాఖ నియమించిన నోడల్ అధికారి నివేదిక ఇవ్వాలన్నారు. ముందుగా వైద్య కళాశాల ఏర్పాటుకు ఇక్కడి ఆరోగ్య వసతులపై నివేదిక రూపొందించాలన్నారు. జిల్లాలోని 5 నియోజకవర్గాల శాఖలు ఆయా తాలూకాకు అభివృద్ధి కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టాలన్నారు. శాఖల వారీగా నిర్దేశించిన భౌతిక లక్ష్యాలు, సాధించిన విజయాలతో సహా ప్రస్తుత నివేదిక గణాంకాల గురించి జిల్లా స్థాయిలో వివిధ శాఖల అధికారుల నుంచి సమాచారం రాబట్టారు. శాఖకు సంబంధించి జిల్లా, తాలూకా స్థాయి అధికారుల నుంచి సమాచారాన్ని సేకరించారు. ప్రతి నెల సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి కేపీ మోహన్‌రాజ్

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి

హుబ్లీ: ధార్వాడ తేజస్వి నగర వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు వ్యక్తి మృతి చెందగా, ఆయనతో ఉన్న ఇద్దరు చిన్నారులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వేగంగా వచ్చిన బైక్ తండ్రి, పిల్లలు ఉన్న బైక్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడి లక్ష్మేశ్వరకు చెందిన ప్రస్తుతం ధార్వాడ సంగొళ్లి రాయణ్ణ నగర్‌లో నివసిస్తున్న చెన్నబసవ శివప్ప ఉల్లాలి చికిత్స ఫలించక మృతి చెందాడు. మార్కొపోలో కంపెనీ ఉద్యోగి అయిన చెన్నబసప్ప రెండు కళ్లను ఆయన కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలోను దానం చేశారు. ప్రమాదంలో గాయపడిన ఏడేళ్ల అథర్వ, నాలుగేళ్ల అపూర్వ చికిత్స పొందుతున్నారు. ఇదే ప్రమాదంలో మరో ఇద్దరు బైకిస్టులు గాయపడ్డారు. ఘటనపై ధార్వాడ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పూజిస్తూ..ఆడుకుంటూ..ఆనందిస్తూ..

- పంచమి పర్వదినాన కుట్టని తేళ్లు
- ఇదో అనుభూతి అంటున్న యువత
- ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఆచారం
- అంతటా నాగపంచమి.. కందుకూరులో భక్తిశ్రద్ధలతో తేళ్ల పంచమి

రాయచూరు రూరల్: దేశవ్యాప్తంగా మంగళవారం భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నాగ పంచమి వేడుకలు జరుపుకుంటే జిల్లా సరిహద్దులోని ఓ గ్రామ ప్రజలు అందరికీ భిన్నంగా తేళ్ల పంచమిని జరుపుకున్నారు. మంగళవారం సాయంత్రం రాష్ట్రంలోని యాదగిరి జిల్లా గురుమఠకల్ తాలూకా కందుకూరు గ్రామ సమీపంలోని కొండమ్మవ్వ అమ్మవారి సన్నిధిలో తేళ్ల పంచమి సంద ర్భంగా భక్తులు కొండమ్మవ్వను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత కొండపై ఆలయ పరిసరాల్లోని ఏ చిన్న రాయిని తొలగించినా వాటి కింద తేళ్లు కనిపించాయి. తేళ్లను పట్టుకోవడానికి చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహాన్ని కనబరిచారు.

ఒంటిపై తేళ్లను పాకించుకుని సంబరం

ఈ తేళ్లను చేతితో తాకినా, పట్టుకున్నా, శరీరంపై పాకించినా అవి కుట్టనే కుట్టవు. అమ్మవారి మహిమతో తేళ్లు ఎలాంటి హాని చేయవని భక్తుల విశ్వాసం. విద్యావంతులు వాతావరణ పరిస్థితులు, వనమూలికల కారణంగా ఆ తేళ్లు కుట్టలేవన్నారు. పంచమి సందర్భంగా భక్తులు పట్టుకున్న తేళ్లను తమ ముఖం, మెడ, నాలుకపై పాకించుకుంటూ ఆనందపడ్డారు. ప్రతి శ్రావణ మాసంలో పంచమి రోజున పూజలు చేయడంతో తమకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందన్న నమ్మకంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులను తీర్చుకున్నారు.

తేళ్లను తాకితే మంచి జరుగుతుంది

కొండమ్మవ్వ గుట్టపై పూజలు చేసే క్రమంలో తేలును తాకితే తమకు మేలు జరుగుతుందని, పట్టుకున్నా కరవవని భక్తుల ప్రగాఢ నమ్మకం. నాగ పంచమి రోజు నాగులకు నైవేద్యంగా సమర్పించే పాలు, నువ్వులు,బె బె ల్లం తదితర పదార్థాలను తేళ్ల పంచమి రోజు ఆ గుట్టపై ఉంచి పూజలు చేస్తారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు ఈ ఆలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు.



చేతిలో తేలుతో ఆడుతున్న యువతి



తేలును పట్టుకున్న యువకుడు



చిన్నారి మోచేతిపై పాకుతున్న తేలు



తేలును పట్టుకున్న బాలికలు



మహిళ చేతిపై పాకుతున్న తేలు

భక్తిశ్రద్ధలతో మల్నాడు దుర్గమ్మ పూజలు



ఒడిబియ్యంతో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆలయంలో భజన, భక్తి గీతాలను ఆలపిస్తున్న భక్తులు

బళ్లారిఅర్బన్: మిల్లర్‌పేట్ మల్నాడు దుర్గమ్మ ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో అమ్మవారికి విశేష అలంకరణ పూజలను నిర్వహించినట్లు దేవస్థాన అర్చకులు తెలిపారు. శ్రావణమాసంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో భక్తులు ఒడిబియ్యం సమర్పించవచ్చని, ఆ బియ్యంతో ప్రసాదం తయారు చేసి భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. కాగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయంలో భక్తిగీతాలను ఆలపించి భజనలు, మహామంగళ హారతి, ప్రసాదం పంపిణీ జరిపారు.

మాజీ మంత్రి శ్రీరంగదేవరాయలు కన్నుమూత



శ్రీరంగదేవరాయలు(ఫైల్)

గంగావతి: పట్టణంలోని తమ నివాసంలో ప్రముఖ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి శ్రీరంగదేవరాయలు(87) వయోసహజ అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన రెండు సార్లు వరుసగా కనకగిరి, మూడు సార్లు వరుసగా గంగావతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కలిపి మొత్తం సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది కొప్పళ జిల్లాలో రికార్డు సృష్టించారు. ఆయనను సరళ, సజ్జన వ్యక్తిగా ఉత్తమ ప్రజా సేవ అందించిన నేతగా ప్రజలు కొనియాడుతున్నారు. ఆయన వీరప్ప మొయిలీ మంత్రివర్గంలో అనతికాలం పని చేశారు. ఆయన రైతులు, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉంటూ వారితో మమేకమై 25 ఏళ్ల ప్రజాసేవకు అంకితం అయ్యారు. ఆయన మృతిపై పలువురు ప్రముఖ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీలకు అతీతంగా సంతాపాన్ని తెలియజేశారు. ఆయన అంత్యక్రియలు బుధవారం స్వగ్రామమైన ఆనెగుందిలో క్షత్రియ సాంప్రదాయం ప్రకారం నిర్వహించనున్నారు. ఆయన విజయనగర సామ్రాజ్య శ్రీకృష్ణదేవరాయల వంశస్తులు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె, అపార సంఖ్యలో బంధువులు ఉన్నారు.

ఆరుగురు బాలకార్మికులకు విముక్తి

కంప్లి: కురుగోడు పట్టణంలో కార్మిక శాఖ అధికారులు దాడులు జరిపి నలుగురు బాల, ఇద్దరు కిషోర కార్మికులను వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించారు. బాదనహట్టి రోడ్డులోని తాలూకా కార్యాలయం ఎదుట, తేరు వీధి, కంప్లి రోడ్డులోని గ్యారేజీలు, బేకరీలు, హోటళ్లు, మెకానిక్‌షెడ్లు, కిరాణి అంగళ్లపై దాడి జరిపి వాటిలో పని చేస్తున్న బాలకార్మికులకు రక్షణ కల్పించినట్లు జిల్లా బాలకార్మిక యోజనాధికారి మౌనేష్ తెలిపారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తి అదృశ్యం

హుబ్లీ: పని మీద బయటకు వెళ్లిన వ్యక్తి పార్కింగ్ స్థలంలో బైక్‌ను నిలిపి కనిపించకుండా పోయిన ఘటన నగరంలో వెలుగు చూసింది. పాత హుబ్లీ శివసోమేశ్వర నగరకు చెందిన అశోక కసాపకడ్లి(39) అనే వ్యక్తి ఈ నెల 12న ఉదయం డ్యూటీకి వెళ్లి వస్తానని బయటకు వెళ్లాడు. ఇక్కడి కొప్పికర రోడ్డులోని పార్కింగ్ స్థలంలో అశోక్ బైక్ నిలిపి వెళ్లారు. అయితే ఇంటికి మాత్రం రాలేదని కుటుంబ సభ్యులు హుబ్లీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కలుషిత నీరు తాగి పలువురికి అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: యాదగిరి జిల్లా గురుమఠకల్ తాలూకా గాజరకోటె గ్రామంలో కలుషిత నీరు తాగి పలువురు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం గాజరకోటె గ్రామానికి చెందిన 15 మందికి పైగా ప్రజలకు వాంతులు, విరేచనాలు కావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. గ్రామంలోని మంచినీటి ట్యాంకును శుభ్రం చేయక పోవడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడినట్లు అధికారులు గుర్తించారు. దీంతో స్థానిక వైద్యాధికారులు గ్రామాన్ని సందర్శించి మంచినీటి వాడకంపై ప్రజల్లో చైతన్యం తెచ్చారు. అయితే ఎవరికీ ప్రాణ హాని లేదని, అందరూ క్రమంగా కోలుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

రాయచూరు రూరల్: తాలూకాలోని మిట్టి మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని రత్న రాయచూరుకర్ రాష్ట్ర స్థాయి గ్రామీణ ఉపాధ్యాయిని రత్న అవార్డు అందుకున్నారు. ఈ నెల 20న కొప్పళ జిల్లా కుష్టిగి తాలూకా హనుమసాగరలో గుబ్బి వీరన్న, పి.బి. దుత్తరిగి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విద్యారంగంలో అమోఘ సేవలు అందించిన ఉపాధ్యాయులను గుర్తించి అవార్డుతో అభినందించారు. ఈసందర్భంగా కరిసిద్ధేశ్వర మఠాధిపతి విజయ మహంత శివయోగి, యరనాళ హిరేమఠం శివప్రసాద్ స్వామీజీ, కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, సంస్థ అధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి శ్రీదేవి తదితరులున్నారు.

త్వరలో రైల్వే పైవంతెన నిర్మాణానికి శ్రీకారం



ఎంపీ కరడి సంగణ్ణ

గంగావతి: హులిగి–మునిరాబాద్ మధ్య 79వ రైల్వే గేట్ వద్ద పైవంతెన నిర్మాణానికి రూ.29.57 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ తెలిపారు. అలాగే రూ.3 కోట్లను వంతెన నిర్మాణానికి అవసరమైన భూస్వాధీనానికి కూడా విడుదల చేసిందన్నారు. ఈ నిధులకు రాష్ట్ర వాటా నిధులను కలిపి త్వరలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ఆయన తెలిపారు.